THE BOOK WAS DRENCHED

UNIVERSAL
LIBRARY
OU_206208
UNIVERSAL
LIBRARY

OUP—556—13-7-71—4,000.

OSMANIA UNIVERSITY LIBRARY

Call No. T294/553B Accession No. T2615

Author శతకూ పా చార్యులు.

Title భారతీయ నాటకములు.

This book should be returned on or before the date last marked below.

భారతీయ నాగరికత,

అహింసా తత్వము.

రెండవ భాగము.



కోమాండూరి శతకోపాచార్యులు,
కాకినాడ.

ప్రకాశకుడు:
కొ. శతకోపాచార్యులు,
వకీలు, కాకినాడ
(సర్వస్వాస్యములు రచయిత)

కాకినాడ ముద్రిత,
191'.

వెల 12 అణాలు.

కాకినాడముద్రాక్షరశాల,
కాకినాడ.



ఉపోద్ఘాతము.



ఈ ప్రపంచమునం దిప్పుడు జీవయాత్రసలుపు మనకర్తవ్యమేమి? ఒంటిపాదమునడచు ధర్మమును మాపుమాపెదమా, అహింసమాటయే తలపక హింసను ప్రబలనిచ్చెదమా? లేక, ధర్మమును నాలుగుపాదములమీద నడపెదమా, హింసనుమాన్పి, అహింసావ్యాప్తికి ప్రోద్బలపెదమా? రాజ్యము అహింసాసిద్ధాంతమును ఆశ్రయించుకోవలెనన్న, సంఘములో అహింసను వ్యాపకముచేయవలె. సంఘముచే నిర్ణయింపబడ్డ సిద్ధాంతములను ప్రవర్తనపద్ధతులను ఆచరణకు వచ్చునట్లు నిర్బంధించునదే శాసనము, రాజ్యము. ఈసిద్ధాంతములును పద్ధతులును బహుజనుల కనుకూలమైనప్పుడు రాజశాసనముగ మారును. అట్టిధర్మములు, సిద్ధాంతములు, విధానములు కొందరు వ్యక్తులచే సమర్థింపబడి అవలంబింపబడుచుండవలె. ఇట్టి అవలంబకులే మార్గదర్శులు, నేతలు, నాయకులు, ధర్మసంస్థాపకులు అగుదురు. కావున అహింసాధర్మబీజములను నాటుటకు తగిన క్షేత్రము వ్యక్తిజీవనము. వ్యక్తిజీవనమునందు ఈబీజము మొలకెత్తవలె నన్న బాల్య ప్రాపన కౌమార, వార్ధక్యములందు అహింసా విషయములనే వ్యాపకము చేయుచుండవలె.

చిన్నప్పుడు చీమలను, కప్పలను, పొండలను చంపవలదనియు, ఎదిగినకొలది కేవలము హింసావలంబనము కావింపకుండుటయే కాక అహింసా సూత్రములను పాటించవలెననియు. రానురాను అపకారికి నుపకారము నెపమెన్నకచేయుచుండవలెననియు, విద్య వినయమునకు కారణ భూతము గావలెననియు, కష్టను చంపి, కష్టమును పెంపొందించుచుండవలె ననియు,

సర్వేఽపి సుఖినః సంతు, సర్వే సంతు నిరామయాః
సర్వే భద్రాణి పశ్యంతు, మాకశ్చిత్ దుఃఖ మాప్నుయాత్.

అను స్వస్తివాక్యములను కేవలము పౌరాణికుల ముఖము నుండియే కాక, పౌరుల జీవనమందుకూడ విరాజిల్లుచుండవలెనని యు, వేరుగ చెప్పనక్కరలేదు. ఇట్టి మహాదాదర్శములతో గూడిన మార్పులు ఒక్క నాడు- ఒక్కముహూర్తమునందు- నాత్మాత్తుగ పుట్టుకొని వచ్చునవి కావు.

ఇట్టి ప్రవర్తనములకు పురోగాములేర్పడి, మార్గమును సిద్ధపఱచి, సంఘపుదృష్టిని నూతనపంథకై ప్రేరిప్పి, వ్యక్తి, సంఘము, రాజ్యాంగముల యొక్క ఆదర్శములను మార్ప యత్నింపవలెను. ఇట్టి మహాకార్య మునకు ఇంచుక సహాయభూతముగ నుండగలందులకుగాను ఈచిన్న పొత్తము ఆంధ్రరాష్ట్రకాంగ్రెసుకమిటీవారిచే సంకల్పింపబడెను.

జనుల యాదరణ పూర్ణముగ వచ్చుచో, ఈ సంకల్పము ఇచ్ఛగ మారి, యత్నరూపము దాల్చి, జయము నందగలదు.

భో॥ పట్టాభిసీతారామయ్య.

పీఠిక.

భారతీయసంస్కృతిలో అహింసాతత్వపు పరిణామమును గూర్చిన యీరచన మొదటిభాగము 4 నెలల క్రిందట ప్రచురితము. ఈరెండవ భాగము ఈకాలపు మనజాతీయ జీవితమునకు సంబంధించినది. కాని, విదేశజాతుల సంస్కృతి గూర్చియు ప్రస్తుతపరిస్థితినిబట్టి కొంతవరకు ఇప్పటి మహాయుద్ధము గూర్చియును చర్చజరిగినది. అయినను, పుస్తక పుశీర్షిక నట్లేయుంచినాను. గత మార్చిలోనే యీభాగమును వ్రాసి యుంటిని; కాని తగుకాకితము దొరకకయు కారణాంతరాలవల్లను ముద్రణలో ఆలస్యమయినది. లోకమంతటను తీవ్రసంచలనము జరుగుచున్నది; రోజురోజును గొప్పమార్పులగుచున్నవి. అచ్చులోనుండగా కొన్ని అత్యావశ్యకమగు సవరణలజేసితిని; కాని విశేషమగు మార్పుకు వీలుకాలేదు. కనుకను, ఇట్టి క్రాంతిసమయంలో ప్రచురించుటవల్లను, ఇందులో చాల లోపము లేర్పడినవి. కొంత పునరావృత్తియు కల్గినది. పాఠకులు సదయులై మన్నించి, విషయమునే గ్రహింపగోరెద.

ఈపుస్తకంలోని కొన్నిభావములు చర్చాస్పదములు; వాటిని గూర్చి భేదాభిప్రాయముండుట సహజము. తగుసూచనలతో పాఠకులు పంపు విమర్శలన్నిటిని కృతజ్ఞతతో స్వీకరింతును. ఇందలి యుపోద్ఘాత వాక్యములను 1 వ భాగపు ఉపోద్ఘాతశేషముగ శ్రీ డా॥ పట్టాభిగారు బందరునుండి 17-3-41 తేదీని నాకుపంపిరి. కాని మొదటిభాగ మప్పటికే ముద్రితమైనది; వారు మరునాడే ప్రభుత్వము కతిధులై నిర్బంధితులై నారు. కనుక ఆభాగమున్నచో దీని యుపోద్ఘాతముగ చేర్చినాను.

కాకినాడ,
31-7-41.

కొ. శ.

రెండవ భాగము.

విషయ సూచిక.

అధ్యాయం.	విషయం.		పుట.
1.	ప్రస్తావన	...	1
2.	పాశ్చాత్యసంస్కృతి ప్రారంభము	...	3
3.	ఇప్పటిపాశ్చాత్యసంస్కృతి	...	6
4.	పరాధీనత ఫలము	...	18
5.	మొదటి ప్రజాధోరణి	...	25
6.	జాతీయోద్యమ వికాసము	...	28
7.	విప్లవ పక్షము	...	32
8.	మొదటి ప్రపంచయుద్ధము	...	36
9.	మహాత్మాగాంధి	...	40
10.	రాజకీయరంగము	...	46
11.	ఆర్థికరంగము— 1. ఖద్దరు	...	52
12.	,, 2. గ్రామపరిశ్రమలు	...	63
13.	,, 3. ఇతరవిషయములు	...	67
14.	నైతికరంగము— మద్యనిషేధము	...	70
15.	భాషారంగము	...	76
16.	సాంఘికరంగము- మతభేద సమన్య	...	85
17.	,, కులభేదములు	...	95
18.	,, హరిజనోద్ధరణ	...	98
19.	ధార్మికరంగము 1. దేవాలయములు	...	105
20.	,, 2. స్త్రీలు	...	114
21.	,, 2. మతసూత్రములు	...	121

		పుట.
22.	విద్యావిధానము ...	135
23.	వర్ణసంఘర్షము 1. సామ్యవాదము ...	140
24.	,, 2. సంస్థానాములు ...	149
25	వ్యక్తిసాధన- ఆహార నియమములు ...	158
26.	,, ఉచిత వ్యాయామము ...	165
27.	,, బ్రహ్మచర్యము ...	169
28.	,, నీతిప్రవర్తనము, సత్యము. ...	175
29.	,, త్రికరణ పరిశుద్ధి ...	178
30.	శస్త్రవిసర్జనయత్నము ...	180
31.	యూరపియుల శాంతియత్నము ...	186
32.	అహింసాయుద్ధము ...	191
33.	సత్యాగ్రహ సూత్రములు ...	202
34.	అహింసాపాలసపు పరీక్ష ...	205
35.	జాతిద్వేషపు ప్రాబల్యము ...	211
36.	నేటి ప్రపంచయుద్ధము ...	214
37.	ఇప్పటి సత్యాగ్రహము ...	221
38.	సమన్వయము ...	225-248

భారతీయ నాగరికత, అహింసా తత్వము.

రెండవ భాగము.

1. ప్రస్తావన.

మనదేశపు ప్రాచీన సంస్కృతి యెట్టిదో, దానిలో దరిమిలాను పరిణామము లెట్లుగల్గెనో, చూచియున్నాము. లోకమంతటను ఆదిమ జనులు చాలవరకు పశుతుల్యులై హింసాపరులై భీరువులై యుండిరి. మనదేశంలో వేదకాలపు ఆర్యజనులలో విశ్వప్రేమభావ మంకురించినది; బౌద్ధయుగములో వికసించి వృద్ధియైనది. దీని ఫలితము దక్షిణపు ఆంధ్ర ద్రవిడములకును సోకినది. మరియు అహింసాధర్మము క్రీ పూ. 3వ శతాబ్దినుండి క్రీ. శ. 6వ శతాబ్దివరకు ఆసియాఖండపు ఇతరదేశాలకును వ్యాపించినది. అంతట ఆప్రాంతాలలో అహింసాసూత్రపు ఆధారముతోనే క్రైస్తవ మహమ్మదీయాదిమతము లుత్పన్నమై, ఇతరఖండములకును వ్యాపించినవి. మన దక్షిణదేశంలో శివభక్తులును, ఆళ్వారులును, ఆపిమ్మట శంకర రామానుజ మధ్వులును దేశకాలోచితమగు బోధలతో లోకకల్యాణము చేసిరి. ఈలోగా ఉత్తరప్రాంతములో ప్రేమభావము చెడి, సాంఘికరాజకీయాలలో కలుషతయేర్పడినది. అప్పుడే ముస్లిము సంస్కృతితో గట్టి సంఘర్షము కల్గినది. రాజకీయవిరోధములవల్ల ధార్మికకలహము మరింత హెచ్చినది. ఈ బాధలు తగ్గించి జనులలో ప్రేమగల్గించుటకు రాజకీయముగ అక్బరు ఇత్యాదులును ధార్మికముగ కబీరు నానకు వగైరాలును తీవ్రకృషిచేసిరి; భాగవత తత్వముద్వారా జనులలో ప్రేమ భావమును పునరుద్ధరించుటకు పూనుకొనిరి. కాని, అది జనసామాన్యములో పూర్తిగ వ్యాపించలేదు. రాజులలోను ఆయాసంఘములమధ్యను ప్రాంతీయులమధ్యను కలతలు పెరిగినవి. ఈస్థితిలో పాశ్చాత్యజాతులవారు మనదేశమునకువచ్చి వ్యాపారమును రాజ్యమును స్థాపింపదొడగిరి. బ్రిటి

షువారు రాజ్యాధికారము స్థాపించిరి. పిమ్మటగూడ, రామమోహన దయానందాదులు సంస్కృతిలో నేర్పడిన వికృతినిపోగొట్టి శుద్ధిపరుప జూచినారు. అందులో కొత్తపరిస్థితి కలిగినది. ఈ ఆధునిక జీవితపు సమస్యలను వాటి పరిష్కారసాధనములను మన మిప్పుడు పరిశీలింతము. 1857-58 సంవత్సరం సిపాయీ యుద్ధము సమాప్తమగుటతో మనకాధుని కయుగ మారంభించినదనుకోవచ్చును. అప్పటితో బ్రిటిషుసామ్రాజ్య మిక్కడ గట్టిగనాటుకొన్నది. అంతట గొప్ప పరిణామము కల్గినట్లు తేలినది. ముఖ్యముగా రెండు కొత్తపరిస్థితులు వచ్చినవి.

1. మనదేశమిప్పుడు పరాధీనమైయున్నది. భిన్నసంస్కృతిగల విదేశపువారు మనల పాలించుచున్నారు. అందువల్ల మనసంస్కృతి వికాసములో మార్పులుగల్గి సంఘర్షణనేర్పడినది. 2 అంతర్జాతీయ సంబంధమిప్పుడు చాలహెచ్చినది. రైళ్ళు, స్టీమరులు, తంతి, విమానములు' సినిమా, రేడియో వగైరాలేర్పడి, దూరదేశాలతో రాకపోకలును భావప్రచారమును చాలత్వరగను సులభంగాను సాగుచున్నవి.

ఈరెంటికిని కొంత సంబంధమున్నది. ఆర్థికాది విషయములందు మనఅంతర్జాతీయ సంబంధము బ్రిటిషువారిద్వారానే (వారి రాజసీతి కిలోబడి) జరుగుచున్నది. ఈరెంటిప్రభావము మనజాతీయ జీవితపు అన్ని శాఖలకును ప్రసరించినది. ఆర్థిక సాంఘిక రాజకీయములకు సహజముగనుండు పరస్పరసంబంధమిప్పుడు చాలహెచ్చినది. కనుక వాటినన్నిటిని అంతర్జాతీయస్థితినిగూడ చర్చింపవలెను. అహింసాసమస్య అసలునైతికమైనను గహనమైనది. కనుక అన్నిశాఖల విశాలవిమర్శ అవసరమైనది.

ఈ సంఘటనవల్ల మనజాతీయ జీవితముకు క్లిష్టస్థితి కల్గినది. ప్రముఖమగు ఇతరదేశాలలో నిప్పుడున్న ఉద్రేకము యాంత్రికసంస్థలు మనదేశీయులస్థితిని అయోమయము చేయుచున్నవి. ఇప్పటి యీరెండు సంస్కృతుల మంచిచెడ్డలను కనిపెట్టి, ఆఫలితమును బట్టి మన సంస్కృతిని బాగుచేసుకోవలె.

2. పాశ్చాత్యసంస్కృతి ప్రారంభము.

పాశ్చాత్యనాగరికత యూరపులో జనించినది. అక్కడి జనులా కారమున తెల్లగ నుందురు. వీరి నాగరికత యిప్పు డన్నిఖండములకును వ్యాపించినది. వీరిలో నొకశాఖయగు బ్రిటిషువారిద్వారా దాని ప్రభావము మనకు గట్టిగ తగులుచున్నది. ఈ సంస్కృతిస్వరూపము గ్రహించుటకై దీని యుత్పత్తి పరిణామముల బరీక్షింపవలె.

యూరపులోను ఆదిమజనుల సంస్కృతి ఇక్కడివలె హింసాప్రధానమే. మన వేదమతము బౌద్ధధర్మమువంటి ప్రేమమయమగు మతము యూరపీయనులలో స్వతఃజనింపలేదు. వారి కాగ్నేయదిశను, హిందూ బౌద్ధనిద్వాంసులు అహింసాధర్మప్రచారము చేసియుండిన పశ్చిమాసియాలోని యూదదేశములో ఏసుక్రీస్తుద్వారా నవ్యమతము కల్గినది. ఇదియు అహింసాప్రధానము; ఇదిక్రమముగ యూరపుకు వ్యాపించినది. కాని,త్వరలోనే దీనిపరిశుద్ధత కొంతచెడినది. ఆయూప్రాంతపు సంప్రదాయములు మూఢాచారములుదీనిలో జేరినవి. గ్రీకు రోమనుల సంస్కృతి చాల ఉన్నతము. కాని అది భౌతికప్రధానము; దానితో సంబంధము వల్లను, యూరపులో క్రైస్తవసంస్కృతికొక ప్రత్యేకత గల్గినది. ఈ క్రైస్తవపీఠపు ముఖ్యాధికారి రోమువాసియగు 'పోపు'. ఈయన యేర్పరచిన మఠములద్వారాను, సన్యాసులగు మత బోధకులద్వారాను యూరపులోను కొంచముగ ధార్మికత గల్గినది. హన్నులు వాండలులు మొదలగు సంచారిజాతుల క్రూరత తగ్గి, ఆయా దేశములలో కొంత శాంతి గల్గినది. కొంతవిద్యాప్రచారము జరిగినది. కాని సామాన్యజనుల స్థితి అంధకారమయముగనుండినది. పోపు అనుయాయులలో చాలమంది మూఢభక్తివలన చాల ఆస్తులను ఈ 'కాతలికు' పీఠమకు దఖలుపర్చిరి ఈ రీతిగ 'పోపు'ను ఆయాప్రాంతాల బిషప్పు లిత్యాదులును, విలాసులు, కొంతవరకు అధికారమత్తులు, ధనకాంక్షయుతులు నయిరి.

ఈ స్థితిలో అరేబియాలో నుదయించిన ముస్లిముమతమును అరబ్బులు, తురుష్కులు, పశ్చిమముగ ఉత్తరాఫ్రికా అంతటను, యూరపు టర్కీలోను, ఇంకను పశ్చిమముగను వ్యాపింపజేసిరి. ఈ ముస్లిములీరులు ధార్మికావేశముతోబాటు, విజ్ఞానమందును ప్రీతిగలవారు; కనుక భారతీయుల తత్వజ్ఞానమును, విజ్ఞానమును, శిల్పకళలనుగూడ తాము బాగుగ నేర్చుకొని, తాము జయించిన యూరపీయను జాతులకును బోధించిరి; చాలచోట్లవిశ్వవిద్యాలయములు స్థాపించిరి. వీరుజనులలో స్వేచ్ఛాసక్తిని పరిశోధనాశనుగూడ వ్యాపింపజేసిరి. ఈ రీతిగ నేర్పడిన విజ్ఞానపు పునాదిపైన కొందరు క్రైస్తవులు మూఢభక్తిని విడనాడి, స్వతంత్రాలోచనపరులై, మానవులకు భావస్వాతంత్ర్యముకలదని, వారు కాతలికు పీఠముకు రాజులకుకూడ దాసులుకానక్కరలేదనియు, గ్రహించిరి; ఇట్లు కొందరు యూరపీయనులు జనులకు స్వతంత్రజ్ఞానము బోధింపసాగిరి. పోపు చలాయించు సంప్రదాయాధికారములు నిరాధారములని ప్రజలకు చూపుటకు సంస్కర్తలు బైబిలు మున్నగు మతగ్రంథములను జర్మను, ఇంగ్లీషు మొదలగు ఆయా వాడుకభాషలలోనికి తర్జుమాచేసిరి. అప్పుడు అన్నుకూటములును అవలుకు వచ్చినవి. జనులలో విద్యయు, స్వాతంత్ర్యాకాంక్షయు హెచ్చినవి. అంతట పశ్చిమాయులనేకులు స్వతంత్రముగ భారత, చీనాదేశములతో వ్యాపారముచేసి లాభముకొందుటకు దూరసముద్రప్రాంతములకు బయలుదేరి, విశేషానుభవమును ద్రవ్యమును సంపాదించిరి. మధ్యతరగతిజనులకు స్వేచ్ఛహెచ్చినది.

ఈ స్థితిలో రాజుల నిరంకుశపాలనను తొలగించుట కింగ్లండు ఫ్రాంసులలోను, తీవ్రయత్నము జరిగి, కొంత రక్తపాతమైనమీదట ప్రజాయత్తపద్ధతి యేర్పడినది. బ్రిటనులో రాజవంశము విచ్ఛిన్నమైనది. జర్మనీనుండి తెచ్చుకొన్న జార్జివంశరాజులు బ్రిటిషుపార్లమెంటు చెప్పినట్లే నడుచుకొనుచున్నారు. ఫ్రాంసులో విప్లవముకలిగి, రిపబ్లికు యేర్పడినది, మధ్యవర్గపు ప్రవాసియూరపీయనులు ఆయాప్రాంతముల విశేషములను.

జనుల తత్వములను గ్రహించి, తమ దేశీయులకు తెలుపుచు, విజ్ఞానవృద్ధికి తోడ్పడిరి. త్వరలోనే వీరు జ్ఞాతప్రపంచమంతటికి వెళ్లుటేగాక, అమెరికాలో ప్రవేశించి, తమ నాగరికత నక్కడ వ్యాపింపజేసినారు.

అయితే ఆపాశ్చాత్యుల సంస్కృతి భౌతికప్రధానము; వారికి స్వతంత్రమగు ధర్మబీజము లేదు. మరియు మనదేశములోనుండినరీతి గ్రామపంచాయితీసంఘములు, వృత్తినియమపద్ధతియు, వారిలో లేవు. అందువలన వారిసంస్కృతిలో ధార్మికనీతి ప్రధానము కాలేదు. గ్రామక్షేమముకన్న వ్యక్తిలాభముకు ప్రాముఖ్యమేర్పడినది. మరియు వ్యక్తిస్వాతంత్ర్యమును వ్యక్తిలాభమును చాల ముఖ్యములను భావమేర్పడినది. వీరు ఉత్సాహపరులై స్వేచ్ఛాపరులై, ఎవరికిష్టమగువృత్తిని వారవలంబించు రివాజు ఏర్పడినది. అందువల్ల మనలోనుండిన ఆనువంశికవృత్తికుల భేదములనుబట్టి భోజనవివాహాదులసంబంధము మానుకొనుట, ఇట్టి చీలిక లేర్పడలేదు. కొంత కులీనతగారవమున్నను, అది ముఖ్యముగ ధనాఢ్యతనుబట్టియుండునదేగాని, కులవిభేదములు అందునుబట్టి ద్వేషములుండుటయులేదు. ద్రవ్యముకుమాత్రం పూజ్యత్వప్రాముఖ్యము హెచ్చు.

ఇంకొకసంగతి: మనదేశమం దార్యులు ద్రావిడులు ఆదిమములు కొంతవరకు మొదటనే కలసిపోయిరి. కాని అందుకిష్టపడనివారు తమ సంస్కృతిని నిల్పుకొని వేరుగ్రామములలో నివసించుచుండిరి. వారిప్రత్యేకతకు భంగముచేయుటకు వారిజాతిని నశింపజేయుటకు తక్కినప్రబలురు పూనుకోలేదు. పాశ్చాత్యదేశములందో ఆర్యజాతులనబడిన కెల్టులు, టూటనులు, లాటినులు వగైరాలు ఆయాప్రాంతీయుల ప్రత్యేకతను నిలువనీయక తమలో కలుపుకొనివేసిరి. లేదా ఆదిమవాసులను నాశముచేసి యూరపుఆర్యులు అమెరికాలోను చాలవరకిట్టినీతినే అవలంబించిరి. ఇందువలన వారిసంఘము బలపడినవి. కాని, వారియాత్మలందు కాఠిన్యము స్వార్థపరతగూడ ఏర్పడినవి. వీటిప్రభావము ఇప్పటిలోకజీవితముపైనను బాగుగ ముద్రితమైనదని చూడగలము.

3. ఇప్పటి పాశ్చాత్యసంస్కృతి.

17 వ శతాబ్దమునుండి పశ్చిమయూరపువాసులు వ్యక్తి వికాసము ఉత్సాహముగల్గి, ద్రవ్యార్జనకై విదేశములకు వ్యాపింపసాగిరి. అంతకుపూర్వము ఖండాంతరములలో కష్టస్థితిలోను వ్యాపారవస్తువులను సంస్కృతిని ప్రపంచమునకు వెదజల్లిన ఆసియావాసులప్రగతి తగ్గుటయు, పాశ్చాత్యులవిజృంభణ మారంభించుటయు, ఇట్లొకసారియే జరిగినవి.

మన భారతదేశమందు అంతఃకలహములు హెచ్చి, సంస్కృతి కలుషితమై వికృతినొందియుండగా, ఫ్రెంచి, బ్రిటిషు, డచ్చి వగైరాలు ప్రగతిపరులైరి; వారి జ్ఞానాపేక్షకు ద్రవ్యాపేక్ష తోడైనది. వారు ధీరులుసాహసులునై, నవ్యావిష్కారముల సాయముతో ఖండాంతరములందును వ్యాపించియున్నారు.

అక్కడ వారు తామార్జించిన భౌతికసంపత్తుతో బాటు తమ అనుభవవిజ్ఞానమును స్వదేశీయులకు తెలియునట్లు స్వభాషలో గ్రంథస్థము చేసినారు. ఇట్లు నవ్యవాఙ్మయ మేర్పర్చి గ్రంథములు యూరపు అమెరికాలలో విశ్వవిద్యాలయములను, పరిశోధనశాలలను స్థాపించినారు; వ్యాపారవృద్ధిద్వారా ఆదేశాల ఆర్థికసంపత్తు హెచ్చినది. ఈదేశమునుండి చాలధనము చేరినది. ధనికులగు మధ్యవర్గమునకు అధికారము గల్గినది. వారు మఱప్రాచ్యుల శిల్పశక్తి జూచి తమదేశములలోని జనుల కున్నత శిల్పము నేర్పిరి; ఉపయుక్తమగు చౌకవస్తువులను బహుళంగా సృజించు పద్ధతులను కనిపెట్టినారు; ప్రకృతిశక్తుల రహస్యముల గనిపెట్టి దీర్ఘ కృషి చేసిరి. అవసరముకొద్ది కొత్తఆవిష్కారముల చేసిరి. దీర్ఘప్రయాణమునకు వస్తూత్పత్తికి వీలగుకొత్తవైజ్ఞానికపద్ధతులు గనిపెట్టబడి, కంపసు ఆవిరియంత్రము వాస్తుయంత్రములు, మిల్లులు, చుర్మిణి, విద్యుచ్ఛక్తి, మోటారు, విమానములు, గ్రామఫోను, సినీమా, శస్త్రచికిత్సాయు

ధములు, ఫిరంగులు, జలాంతర్గాములు, ఇట్లు అద్భుతమైన భౌతికావిష్కారములు దినదినము వృద్ధియైనవి.

ముఖ్యమైన కొన్ని యావిష్కారముల వివర మిక్రింద నీయబడినది.

వస్తువు.	ఆవిష్కర్తపేరు	దేశము.	సాలు(క్రీ.శ)
ఆవిరియంత్రము.	వాటు	ఇంగ్లండు	1765
స్టీమరు	ఫుల్టను	అమెరికా	1807
రైలు	స్టీఫెన్సను	ఇంగ్లండు	1829
విద్యుత్తంత్రి	మార్సు	అమెరికా	1835
ఫొటోగ్రఫీ	డాగరు, నీప్జ	ఫ్రాంసు	1837
టెలిఫోను	బెల్	అమెరికా	1875
గనులలోవాడుభద్రదీపం	డేవీ	ఇంగ్లండు	1815
ఫోనోగ్రాఫు	ఎడిసను	అమెరికా	1876
చలనచిత్రము	,,	,,	1893
వైర్లెసు(వాయువార్త)	మార్కొని	ఇటలీ	1895
(జగదీశవసుగారును అప్పుడే దీనిని కనిపెట్టినారు)			
నూలువడుకుమరయంత్రం	హార్గ్రీవ్సు	ఇంగ్లండు	1764
కుట్టుయంత్రము	థిమనరు	ఫ్రాంసు	1830
డైనమో(విద్యుజ్జనకములు)	ఫారడే	ఇంగ్లండు	1831
ఎక్సురేయంత్రము	రోంట్గెను	జర్మనీ	1895
రేడియం	కరీసతి	ఫ్రాంసు	1903
విమానము	రైటుసోదరులు	అమెరికా	,,
,,	జెపెలిను	జర్మనీ	1098
టెలివిజను(పరోక్షదృష్టి యంత్రము)	బైర్డు	ఇంగ్లండు	1926
మోటారు	డీసెలు	జర్మనీ	1893

ఎలెక్ట్రీను(పరమాణు భాగము)	థాంప్సను	ఇంగ్లండు	1897
బైసికిలు	మాక్మిలను	స్కాట్లండు	1840
ధర్మామీటరు (ఉష్ణమాపకయంత్రం)	ఫారన్‌హీటు	ఫ్రాంసు	1721
దుర్భిణి	గలీలియో		1593
ఉక్కుతయారుయంత్రం	బెస్సెమరు	ఇంగ్లండు	1858
అగ్గిపెట్టె(భాస్వరం)	సారియా	ఫ్రాంసు	1831
కైపురైటరు	పోల్సు	ఇంగ్లండు	1873

ఇట్లీచిత్రవిచిత్రమగు యంత్రాలద్వారా నరుల బాహ్యశక్తి యనన్యశ్రమముగ హెచ్చినది. దిక్సూచితో స్టీమర్లతో దీర్ఘప్రయాణములు సుకరమైనవి. పూర్వమింగ్లండునుండి యోడలపైన ఆఫ్రికానుచుట్టి యీ దేశము చేరుటకారు నెలలుపట్టేది. ఇప్పుడో నూత్నగత్రవిద్యన సూయెజుకాలువద్వారా పెట్రోలుయింజనులు విద్యచ్ఛక్తి సౌకర్యముగలమహానౌకలలో మూడు వారాలలోను,విమానాలలో రెండు రోజులలోను,సుఖముగ జేరవచ్చు. వార్తలు రేడియోలో గంటలోనే లోకమంతట వినవచ్చును. భూతలమంతయుపరిశోధితమై, అమెరికా, ఆస్ట్రేలియాయనగా రాలువెల్లడియై పాశ్చాత్యులవశమైనవి. ఇప్పుడు విమానాలద్వారా లోకమంతయు నొక వారంలో చుట్టిరావచ్చును. గొప్ప వంతెనలు కట్టినారు; అగాధపులోతులగనులనుండి తెచ్చినలోహములతో మహాయంత్రములను ఏబది అరువది అంతస్తుల ఉక్కుమేడలను నిర్మించినారు. రైళ్ళమీదను మోటారులలోను గంటకేబది అరువది మైళ్ళ చొప్పున పోవచ్చును.

పూర్వపు హిందూభారతీయులు ప్రేమపరులై ఉత్తమసంస్కృతిని ధర్మమును యోగశక్తిని ఉపకారకములగు కళాశిల్పములను మాత్రమే స్వదేశములోను దేశాంతరములలోను వ్యాపింపజేసిరి; స్వదేశము కావల తమ భౌతికాధిపత్యమును స్థాపింపబూనలేదు; అన్యదేశముల

బీడించలేదు. ఇక ముస్లిములాయుధధారులై దాడిచేసి విదేశములందు రాజ్యములను తామునమ్మిన ధర్మమును స్థాపించిరి, నిజమే; కాని, అట్టి వారు తరుచు తాము పాలించు ఆ కొత్త దేశములందే వసించుచు, క్రమంగా ఆదేశీయులుగ నుండిపోయి, వారు తమవంశీయులుసహా అక్కడి సామాన్యులతో కలిసి వారి కష్టసుఖములందు పాల్గొనిరి. వారు తమమతవ్యాప్తికై ఆయాప్రాంతీయులను పట్టుదలతో తొందర జేసినను, మొత్తముమీద ఆయా దేశవాసులను వారివృత్తులను బాగు చేసిరి ఆదేశీయుల క్షేమమే తమ క్షేమమని వారెంచినట్లు తోచును. పాశ్చాత్యులో అట్లుకాక ఇటీవల కొత్తపద్ధతి పెట్టినారు. ఇందు కొంత రోమకసంప్రదాయమున్నది. వారు అమెరికా, ఆస్ట్రేలియాదులై రాలలో వలసకుచేరి, అక్కడి దేశవాసులను గణచి, వీలైనచోట్ల కూపుమాపి, సర్వాధికారం వహించినారు. తమకన్న చాలమెచ్చుమంది ప్రజలున్న చోట్ల వారిని నశింపచేయలేక అణచి, తమదాసులుగ జేసి, వారిని అక్కడి ప్రకృతిసంపదనుగూడ తమసొత్తుగ నెంచి, స్వలాభము కుపయోగించుకొన్నారు. భారతదేశపు జనులు బ్రిటిషువారికన్న చాలరెట్లు మెచ్చుమంది; ఇక్కడచిరకాలపు నాగరికశిల్పములున్నవి, పాశ్చాత్యులిక్కడ యుక్తితో ప్రాబల్యమొంది, మనశ్రమను, సంపత్తును వారిలాభముకు వినియోగించుకొన్నారు. వారిక్కడ స్థిరవాసులగుట కిక్కడి మైదానముల యుష్ణస్థితి సరిపడదట; వారికిస్వదేశభక్తి, సహకారము, సంఘటనముకార్యపరతవంటి మంచిగుణము లున్నవి; కాని స్వలాభము భౌతికబలముఅధికారమునే వారిముఖ్యోద్దేశములు. వారి సంస్కృతిలో నిజమైన ధార్మికతయు లేదు. జనుల నిగ్రహమును నైతికశక్తిని వృద్ధిచేయుటకు బదులు, వారు తమసుగుణములను, విజ్ఞానమును తత్వశాస్త్రమును రాజనీతినిగూడ తమ భౌతికప్రాబల్యముకే వినియోగించినారు ప్రకృతిశక్తులను వశపర్చుకొన్నందుకు వారు గర్వించి అహంకారులైనారేగాని, నైతికత్వవృద్ధికి, ఆత్మవికాసముకు, ఇంద్రియనిగ్రహముకు, హృదయనిర్మ

లతకు ఎట్టి కృషినిచేయలేదు. వారు మతధర్మమునుగూడ స్వలాభమునకే వినియోగించుచున్నారు. వారి కళలలో బాహ్యసౌందర్యమే ముఖ్యము. శిల్పములోను స్థైర్యము సర్వోపయోగముకన్న తత్కాలలాభము, ఇంద్రియాకర్షణము స్వార్థమునే ముఖ్యోద్దేశములు. విలాసమే వారి కెక్కువ ప్రధానము. అందరిశ్రేయస్సును నైతికోన్నతినికోరుట ప్రాచ్యుల యాదర్శము. ఇట్లు దృక్పథములోను భేదమున్నది. నరులు కర్మఫలమను భవింపవలె. హింసవల్ల పాపము దోషముగల్గి ఆఫలము హింసకుడు నను భవించునని ప్రాచ్యులు. 'క్రీస్తును నమ్మితేచాలు, ఆయన నమ్మినవారి పాపముల హరించును, కనుకపాపభయములేద'ని పాశ్చాత్యక్రైస్తవులు.

ఇక యూరపీయుల వ్యాపారవృద్ధిని దాని ఫలితములను పరీక్షింతము. 15 వది మొదలు 18 వరకు శతాబ్దులలో వెనిసునగ్రకులు దక్షిణ యూరపీయనులు భారతదేశము, చీనా ఈరెంటినుండి బట్టలు, మిరియము, పరిమళవస్తువులు వగైరా చక్కని సరకులను ఆసియాయెరు మధ్యధరా సముద్రములద్వారా తెచ్చి, చాల లాభము గడించేవారు. వీరికి పోటీగ అట్లాంటికుసముద్రముద్వారా భూమినిచుట్టి చీనాను భారతదేశమును చేరి, వ్యాపారలాభమును రాబట్టుటకే కొలంబసు పశ్చిమముగ బయలుదేరెను. అయితే మధ్యను అమెరికాఖండము తగిలెను.† పిమ్మట వాస్కోడగామావగైరాలు దక్షిణాఫ్రికాను చుట్టి మన దేశము చేరి, ఈదేశముతో సముద్రవ్యాపార మారంభించిరి. ఈలాభకారి వ్యాపారముతో క్రమంగా బ్రిటిష్, ఫ్రెంచి, డచ్చి, పోర్చుగీసువారి కంపెనీలమధ్య పోటీతగిలినది. భారతదేశముతో వ్యాపారము ఆకంపెనీలకు

† అప్పు డక్కడివారిని ఇండియనులనియే భావించిరి. ఇప్పటికిని వెస్ట్ ఇండీస్, రెడ్ ఇండియను' వగైరాపేర్లు నిల్వియున్నవి. (అయితే చారిత్రిక కాలమునకు చాలపూర్వమే భారతీయులలో కొందరు అమెరికాకు వెళ్ళి అక్కడ తమ పూర్వసంస్కృతిని వ్యాపింపజేసిరని అదే ఇప్పుడక్కడ 'మయ' సంస్కృతి యనబడినదని ఒకవాదమున్నది. 1910 సంవత్సరం జూను మాడరన్ రివ్యూలో శ్రీ చమన్‌లాలుగారి వ్యాసమునుచూడుడు.

వారి దేశమునకును లాభకారి. ఈపోటీ అరాజ్యాలమధ్య యుద్ధముల కొకకారణమైనది. వారి ప్రభుత్వము లాకంపెనీలకు మద్దతుచేసిరి. ఇట్లు ఆయాదేశాలమధ్యను తీవ్రయుద్ధము సాగినది. దూరసముద్రములపైన శత్రునిరోధము లేకుండ రాకపోకలు సాగించువారికే ఖండాంతరవ్యాపారము సామ్రాజ్యమును నిల్చును, గనుక నౌకాబలము కెక్కువప్రాధాన్య మేర్పడినది. అందలో ఇంగ్లీషువారిది పైచేయియైనది. క్రమించి, డచ్చివారికి రాలస్థానే బ్రిటిషుప్రాబల్యము హెచ్చినది.† 19 వ శతాబ్దిలో వ్యాపారముతోబాటు రాజకీయాధికారమువచ్చి, తద్ద్వారానుమనదేశము నుండి కోట్లకొలది రూపాయలసొమ్మును అమూల్యరత్నాలును బ్రిటిషు వారికి చేరినవి. వారాసొమ్మును కేవలవిలాసాలకుకాక, మనదేశంలో స్వతంత్రంగా పరిశ్రమలస్థాపనకే వాడినారు.

అప్పుడే ఇంగ్లండులో ఆవిరియంత్రము మరసూలుయంత్రము, మర మగ్గములు నిర్మితమైనవి. గనులనుండి నేలబొగ్గుతోలోహపుపొడిని కరగించి పెద్దయింజనులును, యంత్రములనుజేయనేర్చిరి. వాటితో మిల్లులు కట్టి, అందు బట్టలను, నూలునుఒహళోత్పత్తిచేయుట ప్రహించిరి; అందుకు సొమ్ము పెట్టుబడికావలెను. సకాలంలో మనదేశమునుండి వచ్చిన సొమ్మే చాలవరకంకకు పట్టుబడిగ ఉపయోగించినది. ఆమిల్లులసరుకులు మొదట బాగుగ లేక వ్యాపించలేదు. మనదేశపు బట్టలసరుకులు ఇంగ్లండుకు రాకుండ అక్కడి ప్రభుత్వమువారు పన్నులద్వారాను నిషేధాజ్ఞలద్వారాను నిరోధించినారు అమీదటనే ఇంగ్లండులో మిల్లులు ప్రబలినవి; ఈమిల్లులవల్ల ఇంగ్లండులో గృహపరిశ్రమలు దెబ్బతిన్నందున, మిల్లుల నాపుచేయించుమని అప్పుడక్కడి చేనేతనాండ్రు వనకు వారు కోరిరి.

---

† అప్పుడు మనదేశీయులిక్కడ నిర్మించిన నౌకలను బ్రిటిషువారు యూరపు ప్రాంతపు వ్యాపారంలోను యుద్ధంలోను ఉపయోగించుకొన్నారు

కాని శ్రీమంతులు ప్రబలురునగు మిల్లుయజమానులు పాలకుల నుండి తమమిల్లులకు రక్షణలాభమును పొందినారు. తమగృహపరిశ్ర మలునశించుకొలది బ్రిటనులోను చాలమంది నిర్వ్యాపారు లేర్పడినారు. పారిశ్రామికులు వ్యయప్రయాసలతోను విజ్ఞానసహాయంతోను పరి శోధనలు చేయించి కొత్తయంత్రాలతో మిల్లుపరిశ్రమ భాగుచేయించిన మీదటనే సాధగు సన్నబట్టలను వాటివలె తక్కిన ఫాక్టరీసరుకులను సమృద్ధిగ తయారుచేసి చౌకగ అమ్మగల్గిరి. వాటిద్వారా బ్రిటిషువారు ప్రబలులటజూచి, ఫ్రెంచి జర్మను అమెరికను వస్తరాలును ఇట్లే ఫాక్టరీల పరిశ్రమ లారంభించిరి. అయితే ముందారంభించి స్థిరాభ్యాసబల్యము గల్గి బ్రిటిషువారికి సౌకర్యములుపెంచ్చు. వారు తమసరుకు లుత్పత్తి కాగానే, వాటిని తమమహానగరాలలో మనదేశంలోను చీనావస్తరాల లోనుదింపి, మననేతబట్టలపోటీ చంపి, వాటికన్న చౌకగ అమ్మించిరి

ఈయాత్రికోత్పత్తికి కొద్దిమంది పనివాండ్లుంటే చాలును. కనుక కార్మికుల జీతపుఖర్చు తగ్గి సరుకులు చౌకయగును. మనదేశపు మధ్యలో రైల్లురోడ్లువేసిమీదట ఆవిలాయతీ సరుకులు రేవ్రలనుండి అన్నిప్రాంతాలకు తెచ్చి దుకాణములలోపెట్టి, పల్లెటూళ్లవీధులలోను త్రిప్పియు, వర్తకులమ్మసాగిరి. ఆయాగ్రామముల నాటుసరుకులకు చలా మణిపోయినది. అంతవరకు ప్రతిగ్రామములోను జీవనాధారమైన వడు కుట, నేత ఇత్యాదులు నశించినవి. ఎగుమతులు లేవుసరిగదా, మనదేశం లోను వాటిఅమ్మకము పోయినది. ఇట్లు, జనసమ్మర్దముగల యీప్రాచ్య దేశాలలో ఆబ్రిటిషుసరుకులు అమ్ముడై, బ్రిటిషుమిల్లుదార్లకు వచ్చు లాభంవల్ల కొందరు కోటీశ్వరులై ప్రబలులైనారు. వాటిపోటీవల్ల వృత్తిపోయినవారు మిల్లులలో కూలీలైనారు, వాటితో లోహపరిశ్రమ మరికొన్ని సహాయపరిశ్రమలు నేర్పడినవి. ఇంగ్లండులో పత్తిపండదు, దూదిబట్టలు కట్టరు. కనుక, విదేశాలనుండి దూదితెచ్చి మిల్లుబట్టలు చేసి పంపుదురు ఇదివిదేశాలనుండిలాభములాగుటకేచేయువ్యాపారము.

సరఫరాచేయుటకు జనుల రాకపోకలకు నౌకలవ్యాపారము సాయపడినది. ఇప్పుడు మోటారు యింజనులతోను విద్యుద్దీపాదులతోను ఉక్కునౌకల నడుపుచున్నారు. ఈనౌకానిర్మాణము బ్రిటనులో గొప్పవ్యాపారము. వీటిమూలముగ గనులపరిశ్రమ లోహయంత్రములపని వృద్ధియైనవి. వీటియన్నిటిలో లక్షలకొలది కూలీలు పనిచేయుచుండ ఇట్లే మిల్లుపరిశ్రమ వల్లనెన్నియో అనుబంధపరిశ్రమ లేర్పడినవి బాంకులు ఇన్స్యూరెన్సులును వీటికి సహకారులు, బ్రిటనులోనే పరిశ్రమలధికంగా నుండినప్పు డాసరుకులకు విదేశములంతటను చలామణిజరిగి, వాటికి నిశ్చితలాభములు, కొత్త కంపెనీల కార్మికులకు పనియు, ఉండెను. కనుక అప్పుడు ఇంగ్లండులో నిరుద్యోగబాధ లేదు. జర్మనీ అమెరికావగైరాలలోను ఫాక్టరీలు స్థాపించగ స్థితిమారినది. యంత్రవస్తువులు బహుళోత్పత్తి చేసినప్పుడే చౌకగ అమ్మును; అప్పుడే లాభమువచ్చును. కనుక పోటీపడి బహుళోత్పత్తి హెచ్చించిరి. ఈపోటీసూత్రము బట్టలమిల్లులకేగాక, ఫాక్టరీపద్ధతికంతకు వర్తించును. బ్రిటిషువారు ఇంచుమించు తామే ప్రాబల్యంసంపాదించి లాభము రాబట్టుచున్నారు.

ఈలోగా వీరితో జర్మనీ జపానుల పరిశ్రమల పోటీకల్గింది. ఈదేశములన్నిటిలో ఈధనాఢ్యులకు తమరాజ్యపుపాలనలో పలుకుబడి యుండును. అమెరికా బ్రిటనువంటి ప్రజాతంత్రక రాజ్యములలోను పాలనలో వీరిదే పలుకుబడి. కార్మికులకు ఓటుహక్కులున్నను, వారు చాలవరకు తమయంత్రయజమానులమీదనే ఆధారపడక తప్పదు. లేని యెడల యజమానులు వారి నేదోరీతిని బాధింపవచ్చు, ప్రజాభిప్రాయపు వార్తాపత్రికల వశపర్చుకోవచ్చు, మరియు కంపెనీలకు హెచ్చు లాభమున్నప్పు డీపనివాండ్రకు మంచిజీతము సౌకర్యములు ముట్టును. ఆప్రజలు యజమానుల దాసులే. కనుక 'కార్మిక' ప్రభుత్వపురోజులలోను బ్రిటిషుపార్లమెంటు బ్రిటిషువ్యాపారస్థుల లాభమునకు వ్యతిరేకించలేదు. ఇట్లు ప్రతినాగరికరాజ్యమును తమదేశపు ఫాక్టరీలలో బట్టలు,

ఇనుపవస్తువులు, చెప్పులు, కాగితములు, పెన్సళ్ళు, ఆటవస్తువులుకూడ చేసి, ఆసరుకులవ్యాపారమునంతటను సాగించుటకు విశ్వప్రయత్నముల జేసినవి. తుదకు వీరిననుసరించి ప్రాచ్యదేశాలలోను యాంత్రికపరిశ్రమ తలయెత్తినది. ఈదేశములపైన తామే రాజకీయాధికారము సంపాదించుట కాయాపాశ్చాత్య రాజ్యముల మధ్య 19 వ శతాబ్దిలో పోటీ తీవ్ర యుద్ధములునుజరిగినవి ఈయధికారకాంక్షనే సామ్రాజ్యతత్వమందుము. తుదకు సామ్రాజ్యముగల బ్రిటిషు ఫ్రెంచిరాజ్యములపైన అట్టిసమపాయములేని జర్మనీ, ఇటలీ, జపానుల కసూయగల్గినది. అమెరికా సంయుక్తదేశము బహువిశాలము, వారికి తక్కిన అమెరికనురాష్ట్రములపైన అపారప్రాబల్యమున్నది. మరియు స్వజాతీయులగు సంయుక్తదేశీయులకు ఈరీతినే ఆంగ్లేయులును తమసామ్రాజ్యములో సౌకర్యముల జేయుచు, వారిప్రేమాభిమానముల సంపాదనకే ప్రయత్నింతురు. కాని, యాంత్రికవిజ్ఞానములోను నిర్మించు శక్తిలోను వారినందరిని జర్మనులు తలదన్నిరి. అమెరికను సహాయముగల ఆంగ్లఫ్రెంచి పక్షమునకును జర్మను పక్షమునకును తమయాంత్రిక వస్తువుల విక్రయమునకు తద్ద్వారా ధనప్రాబల్యముల సంపాదనకునే పోటీ హెచ్చినది;ఆయారాజ్యములు సేనాబలము కొత్తరకపుయంత్రములను వస్తువులను హెచ్చించియు, తమకధీనదేశముల సారములాగియు, హెచ్చుధనము ఆయుధములు కూర్చినవి, తమయోధశక్తిని దీక్షతో హెచ్చించినవి. పోటీరాజ్యములను తమ అధీనజాతులను అణచియు హింసించియు నే తమప్రాబల్యమునుయాంత్రికశక్తిని కాపాడుకోగలమని వారికితెలియును. కనుక యాంత్రికవృద్ధికై శస్త్రాదిరూపమగు హింసాశక్తిని, హింసాతత్వమును హెచ్చింతురు. ఫ్రాన్సు జర్మనీవగైరా కొన్నిదేశములందు కార్మికాది సామాన్యజనులకు సైనికత్వమును కొన్ని యేండ్లు నిర్బంధముగ నేర్పుదురు. ఇంగ్లండులో వ్యాపారసాకలలో లక్ష లక్షలది నావికులై, అవసరమైనప్పుడు యుద్ధసాధనములుగ మార్చి, నౌకాయోధులుగ బనిచేయుదురు. గొప్పగొప్ప లోహయంత్రములను రసా

యనవస్తువులను ఆయుధసామగ్రిని తయారుచేయ వీలుగ సిద్ధపర్చుచుండు విమానములకు నిప్పే మారణహోమపుపద్ధతుల గనిపెట్టుటకై అక్కడి గొప్పవై జ్ఞానికులు తమ యావచ్ఛక్తిని వినియోగించుచున్నారు. అందుకు వారిప్రభుత్వములు, యంత్రయజమానులును సాలీనా విశేషద్రవ్యమును విజ్ఞానశాలలకు అమర్చి, సాయపడుచున్నారు. ఇట్లు వారి అందరి ప్రయత్నముతో కొత్తమారణయంత్రము లేర్పడినవి. వాటిని హెచ్చు సామ్యమును ఆ యా ప్రభుత్వములు తమయుద్ధశాఖకు కొని రహస్యముగ వృద్ధిచేయుచున్నవి. వ్యక్తులకంపెనీలును ఈవ్యాపారముచాలలాభకరమని కనిపెట్టినవి; కొత్తకొత్తయుధములతో ఆయాజాతులమధ్యహింసాబుద్ధివిపరీతముగ హెచ్చుచున్నది. ఇందు కాయాపత్రికల విషప్రచారము అయుధనిర్మాతల అసత్యబోధలునుతోడై, హింసావేశమును పెంచుచున్నవి.

విజ్ఞానముద్వారా గల్గిన ఈయస్మదీయశక్తులను పరస్పరవినాశములకు 'నాగరిక' ప్రముఖులే యుపయోగించుట శోచనీయము. మానసికంగాను తమదేశపు పద్ధతులు చర్యలు న్యాయములని తమ ప్రత్యర్థులవి అన్యాయములని వారు తమచరిత్రలలోను రాజనీతిగ్రంథాలలోను

---

† హింసాచర్యల కుపయోగింప కొన్ని నవ్యావిష్కారముల వివరమిక్రింద తెలుపబడినది.

వస్తువు	ఆవిష్కర్త	దేశము	సంవత్సరము
రివాల్వరు	కోల్టు	అమెరికా	1837
డైనమైటు	నోబెలు	స్వీడను	1867
విషజ్వరక్రిమి	జెన్నరు	జర్మనీ	1880
నవ్యవిమానము	జెప్పలిను	,,	1908
మరతుపాకీ	లూయీ		1912
టాంకు	స్వింటను	ఇంగ్లండు	1914
విషవాయువు			1915ముమారు
జలాంతర్గామి			

వ్యాపారాదులకని మొదట ఆవిష్కృతమైన విమానాదులను కొత్తమార్పులతో నిప్పుడు యుద్ధరంగమందు దారుణ హింసాచర్యలకు వాడుచున్నారు.

బోధించిప్రచారంచేయుట మామూలైనది. స్వజాతిగర్వమును పరద్వేషమును విపరీతంగా ప్రబలినవి. ఇట్లీసంస్కృతి సామ్రాజ్యతత్వమునకు హింసాధోరణికి కారణమగును; ఈసంగతి యూరపు అమెరికాలకు జపానుకును (ఇటీవల కొద్దిగా సోవియటు రష్యాకునుగూడ) తప్పలేదు. జనులు ముందుగా భౌతిక నిగ్రహమును జ్ఞానముతోబాటు నీతిని వృద్ధిచేయక, సౌమ్యత నేర్చుకోక, అహంకారముతో ఇతరులపీడించి స్వలాభము పొందుటనే కోరినందు కిట్టిఫలితము గల్గినది. జపాను తన మిల్లుసరకులు వగైరాల విడుదలకు (ఆయుధాలకు వలయుముడిదినుసులు చౌకగ కొనుటకును) పాశ్చాత్యరాజ్యాలతో పోటీపడినది;జపాను నడ్డగింపుచు పాశ్చాత్యులు హెచ్చుసుంకముల వేసిరి; జపాను తనయోధబలమును హింసాతత్వమును హెచ్చించినది, అయితే బలీయములైన రష్యా, బ్రిటను అమెరికాలతో వెంటనే పోరుకుజంకి, జపాను పీటితో సంఘర్షము తగ్గింపుకొని, ఆసియాలో తన కంనుబాటులోనున్న చీనాసామ్రాజ్యపు కొరియా మంచూరియా ఆగ్నేయమంగోలియా ఉత్తరచీనాలను క్రమక్రమంగా జబర్దస్తీతో అక్రమించినది. ఇట్లు చీనులతో జపానీయులు యుద్ధము సాగించుటకు ముఖ్యకారణము తమ యాంత్రికపరిశ్రమల వ్యాప్తికోరుదురాశయే. బ్రిటిషు వారిదేశములో చేసినట్లే తాము చీనాలో చేయదలచినాను ఇదియంతయు యాంత్రికసంస్కృతి సంఘర్ష ఫలితమే.

ఆహారవస్తువులనుగూడ అమెరికావగైరాలలో ట్రాక్టర్లు, రసాయనపు ఎరువులు వాడి యాంత్రికంగా బహుళోత్పత్తి జేసినారు. ఒక్కొక్క కోటీశ్వరుడో చిన్నసమితియో లక్షలకొలది యెకరములభూములను వశపర్చుకొని యంత్రసహాయముతో హెచ్చుపంట పండించి చౌకగనే అమ్మి లాభము రాబట్టును. వీరితో చిన్నభూస్వాములు రయితులు పోటీ చేయలేక తమ భూములను వీరికమ్మికొందురు; ఆపెద్ద కమతములలో కూలీలుగచేరుగతిగల్గును. ఎందరో మామూలువ్యవసాయదారులుతూగ లేక నష్టపోయి నిరుద్యోగులు నిరాధారులునై, అన్నము బట్టలేక అల్లా

డుచున్నారు; ఈకోటీశ్వరులు తమ సరకులను వాడికీయరు. తాము స్వలాభదృష్టితోనే సరుకు లుత్పత్తిచేతురు. సరుకుల హెచ్చువల్ల ధర తగ్గగా, మరల ధరపెరుగుటకై కొంత నిలవపంటను సరకులను తగుల బెట్టుటో లేక సముద్రములో పోయుటోకలదు. ఇట్లొకమూల హెచ్చు దినుసులు నిలవయై తగినంత కొనువారులేక నాశముచేయబడుటయు, ప్రక్కనే లక్షల కొలది బీదలు అన్నముబట్ట లేక మాడిచచ్చుటయు, ఈయాంత్రిక సంస్కృతియొక్క హింసాతత్వమునకు దాని విషఫలితమునకు నిదర్శనములు.

వేలకొలది మనుష్యులస్థానే ఈకార్ఖానాలమూలంగా అయిదారు గురిచేతనే పనిచేయించి పనివాండ్రకయే జీతాలఖర్చు తగ్గించుటే యాంత్రికపద్ధతి ముఖ్యసిద్ధాంతము. కనుక యంత్రములసంఖ్యను నవ్యముగా చేయుకొలది పనివాండ్రసంఖ్య తగ్గును, నిరుద్యోగతయు, బాధయు హెచ్చును. ధనాఢ్యులకు బీదలపైన సహజంగా ఉండవలసిన దాక్షిణ్యము ప్రేమభావము ఈయాంత్రికతవల్ల నశించి, హింసావృత్తి యేర్పడినది. కార్మికులకును ఆత్మవిశ్వాసము స్వతంత్రత పోయినవి. యాంత్రికతవలని అంతర్జాతీయ ఫలనులు మున్ముందు చర్చింపబడును.

బ్రిటిషువారి పాశ్చాత్య సంస్కృతిలో సుగుణములు నున్నవి. కాని దానితో మనకుగల్గిన సంఘర్షములో గుణములకన్న అవగుణములే పరాధీనులగు మనకధికంగా అబ్బినవని ముందు తెలియును.

4. పరాధీనత ఫలము.

18, 19 వ శతాబ్దులలో మనదేశంలో కేంద్రరాజ్యము విచ్ఛిన్నమై, ఆయూప్రాంతీయులమధ్యను, సాంఘికంగా ఆయాజాతులమధ్యను, కలతలు హెచ్చినవి. ఆసమయములలోనే పాశ్చాత్యవర్తకులు ప్రవేశించి, క్రమంగా వ్యాపారసదుపాయములను రాజ్యాధికారముకు వినియోగించసాగిరి. ఆఫ్రికా, అమెరికా, ఆస్ట్రేలియాలలోవలెగాక, భారత చీనాలలో ఉన్నతమగు ప్రాచీననాగరికత యుండెను; కనుక ఇక్కడ ఆంగ్లాదులు వేరుపద్ధతులవలంబించిరి; ఇక్కడి దేశీయరాజులను సామంతులను మంచిమాట చేసుకొని, వారిలోగల కలహములు వృద్ధిచేసిరి; బ్రిటిషువారొకపక్షము, ఫ్రెంచిమా రొకపక్షము వహించుచు, దేశీయ రాజుల దివ్యసేనలసాయముతోనే తమ అధికారమును ప్రాబల్యమును హెచ్చించుకొనిరి. ఈసందర్భమున ఫిరంగులమొదలగు నవ్యాయుధములే గాక, కూటనీతి, మిత్రభేదము మొదలగు కొత్తపద్ధతులకూడ వినియోగించిరి. క్రైస్తవమతప్రచారమును, మద్యము నందించుటయు సేనలును (Bible, Bottle and Brigade) పాశ్చాత్యులసామ్రాజ్యసాధనము లనువార్త యీదేశములోను నిజమయినది. నయమునను భయమునను చిత్రవిచిత్రమగు ఆకర్షణలద్వారాను తమ మతము సంస్కృతి, వస్తువులు, తమజాతి, ఇక్కడినాటికన్న ఉత్తమములను భావము నిక్కడిజనులకు కల్గించిరి. అప్పటి ప్రతిముఖ్యయుద్ధములోను ఈదేశపు నాయకులలో పరస్పరద్వేషమేర్పడి, అహింసాఫలముగ భారతీయుల యోధశక్తివ్యర్థమై ఆంగ్లేయులకు జయము కల్గెనని, చరిత్రలవల్ల స్పష్టమైనది. ఈశోకకథను వివరించుట యనవసరము.

ఇట్లు తమ కధీనమగుచున్నప్రాంతాలలో బ్రిటిషువారిదేశీయుల పరిశ్రమలకు బదులు, తమ వస్తువుల వ్యాపింపజేయుటకు అన్ని సాధనములను వినియోగించినారు. అందువల్ల ఇక్కడి జనులకు కార్యపరత

ఆత్మగౌరవము నశించినవి. ఆర్థికముగ, ఆధ్యాత్మికముగ, సంస్కృతిలో గూడ పరాధీనతగల్గి, ఇవి రాజకీయపరాధీనతను దృఢపర్చినవి.

బ్రిటిషువా రీదేశములో నవలంబించిన పాలనపద్ధతులవల్ల, ఆను వంశికముగు వఱుకుట నేత, కమ్మరం, వడ్రం, వగైరా గ్రామవృత్తుల న్నియు క్షీణించినవి. లక్షలకొలది గ్రామములు హీనదశబట్టినవి. బ్రిటిషువారి రాజ్యమునకు వ్యాపారమునకు కేంద్రములైన కలకత్తా, బొంబాయి, మద్రాసువంటి కొద్దినగరములు వృద్ధికివచ్చినవి. ఇక్కడి మన 'నాగరికులు' దేశశాంతికి, పాలనకు, వ్యాపారమునకు, భాషకుగూడ, బ్రిటిషువారిపై నాధారపడుచు, వారు దుభాషులు, బోధకులు, పాశ్చాత్యానుసారులునై, పరిముఖులు ప్రజానాయకులు ననిపించుకొన్నారు. ఆంగ్లవిశ్వవిద్యాలయము, హైకోర్టులు, పాలకవర్గములు నేర్పడి, వాటి శాఖోపశాఖలద్వారా, పాశ్చాత్యపద్ధతు లీదేశములో జల్లాజిల్లాలంతట కును వ్యాపించినవి. క్రైస్తవమతవ్యాప్తికి ద్రవ్యాది సహాయ మీయబడినది. ధర్మభ్రష్టులకు కుటుంబపుసొత్తు చెందదని హిందూధర్మశాస్త్రం లో నియమమున్నది. దానిని తొలగించి పతితుడికి మతాంతరముజేరిన వానికిగూడ ఆస్తిహక్కులు పోకుండ చట్టమేర్పడినది †. జనులాయుధ ముల ధరించుట నేరమని ఇంకొకచట్టము, ఆబ్కారీ ఉప్పునిబంధనలును చేయబడినవి. జాతీయరక్షణ మానుకొని రాజులందరూ సామంతులో జమీందార్లో అయినారు. ఇదివరలోని స్వతంత్రవృత్తులు క్షీణించగా, ధైర్యముచెడి, ఆంగ్లవిద్య నెట్లో నేర్చుకొని, విదేశప్రభుత్వము క్రిందనో, బ్రిటిషు కంపెనీలలోనో, చిల్లరయుద్యోగాలకై మధ్యవర్గపువారాశించినాను. సామాన్యజనులు కూలిదొరికితే చాలునని పాకులాడు చున్నారు. శాంతియు ప్రయాణాది సౌకర్యమును విదేశవస్తువుల ద్వారా

† ఇండియన్ ఆర్మ్స్ఆక్టు (1870) ఇండియన్ యూనివర్సిటీస్ ఆక్టు (1860) కాస్టుడిజబిలిటీసుఆక్టు (1856).

సమృద్ధియు సౌకర్యములును గల్గినవని మొదట దేశము సంతృప్తమైనట్లు తోచినది.*

దేశీయులందరు పరవశులై సములైనారు, కనుక పూర్వముం డినరీతి ప్రాంతీయ వైషమ్యములు ఆయారాజుల నబాబులమధ్య అసూయలు అణగినవి. నిరాయుధులము అనాధులముఅయినను, మరాటీదండు భగ్గులువగైరాల బాధపోయి, ఒకరీతి శాంతికల్గినది దేశమందన్నివర్గములవారికిని సమానముగ న్యాయసౌకర్యము లేర్పడినట్లును, బాధలు తగ్గి సౌఖ్యము కల్గినట్లును, కనిపించినది. అయితే కొన్నిదశలు గడువగనే, ఈశాంతిసౌఖ్యములు బాహ్యములేనని, ఈసమత్వమునేది దాస్యపుదే యనియు, తేలినది. బాధ, పీడితనము, నిరాశ, వైకల్యమును, దారిద్ర్యమును, వ్యాపించినవి. నిర్వ్యాపారతవల్ల, జీవించుటకు మనలో పరస్పర స్పర్ధ కలహము హెచ్చినవి.

ఒకదేశము నింకొకదేశపువారు నిరంకుశంగా పాలించుట ప్రకృతి విరుద్ధము అది హింసాకార్యము, అనర్థకరము. మనుష్యులు పశుపక్షులును ఎన్నిసౌకర్యములున్నను బంధంలోబడినప్పుడు వ్యధగల్గి, క్రమంగా నీరసించును, మంచియాహారాదులు లేకున్నను స్వేచ్ఛతో తిరుగునప్పుడే హృదయవికాసముగల్గి శుభోత్సాహముతో వర్ధిల్లును; కనుక స్వతంత్రత స్వర్గలోకమందురు; ఇది వ్యక్తులకెట్లో జాతికినట్లే అవసరము. పరాధీనజాతి హింసావశమై, తనలోనే విచ్ఛిన్నమై, క్షీణింపకమానదు. ఇందుకన్ని దేశముల చరిత్రయు నిదర్శనమే కనుకనే, అనాగరిక జనులును స్వేచ్ఛకై శక్తికొలది పోరుదురు. పాశ్చాత్యదేశములు చిన్నవియు స్వాతంత్ర్యరక్షణకెంతో త్యాగము, ఆత్మార్పణము చేయుచున్నవి. అయితే, పెంపుడు చిలుకవలె పరాధీనులై జనించిన ఇప్పటిహిందవులలో చాలమంది స్వాతంత్ర్యపు ఘనతకు గ్రహింపక నిరాశులైనారు. నరులు ప్రకృతిలో

* తంతిరగైరాల 'సౌకర్యము' లన్నియు లోకములకు ఆధునికములు. అట్టివి ఇప్పుడు నాగరికరాజ్యములన్నిటిలోను అక్కడిప్రభుత్వపు అజమాయిషీని నిర్మితమైనవి.

జంతువులనుండి పరిణమించినవారు;ఆజంతుస్వభావమును, హింసాబుద్ధియు సమయము దొరికినప్పుడు ప్రకోపించును. కనుక నరులు స్వలాభముకై పశుతత్వము చూపుట మామూలైనది. బ్రిటిషువారు మనపై సాగించుపాలనము ఎట్టిరీతిదో సూక్ష్మపరీక్షపైన విశదమగును.

ఇప్పుడు మనచట్టముల నియమములు, పన్నుపద్ధతియు చాల వరకు బ్రిటిషుప్రభుత్వము నిర్మించినవి. వాటిపైన మనప్రజలకు పూర్తి హక్కులేమిలేదు సర్కారుసిబ్బందియంతటి జీతములు వగైరా ఖర్చులకగు సొమ్ము పన్నులద్వారా మనలనుండియే వసూలుచేయబడును. ఆనియమములు చట్టములు జరులకిష్టము కాకున్నను బాధకమైనను మన మనుసరించితీరవలెను; వారు విధించినపన్ను లిచ్చితీరవలెను. వీటిఖర్చును విధానమును బ్రిటిషుప్రభుత్వపు యిష్టమే. ఇప్పుడున్న కోర్టులను ఉద్యోగుల ఆజ్ఞను వ్యతిరేకించినను, పోలీసువారు నేరముమోపి దండింపగలరు. కోర్టులు శిక్షించును. కల్లుపాకల నిరోధకులకు జరిగిన లాఠీప్రయోగములు కోర్టుశిక్షలు నింగుకు నిదర్శనములు. పోలీసుచర్యను గూడ ధిక్కరించితిమా, వెంటనే ఘటాలములువచ్చి తుపాకుల ప్రయోగించి యణచివేతురు ఇట్లీదేశములోబ్రిటిషుపాలన తుదకు హింసాభారముపైనే జరుగుచున్నది. స్వతంత్రదేశాలలోను పోలీసులుసేనలు ఉండుమాట నిజమే. కాని వారు పైయధికారులుగూడ అక్కడి ప్రజాప్రతినిధులకు లోబడి, ఆప్రతినిధులుచేయు చట్టప్రకారమే అమలుజరుపవలె; మరియు స్వతంత్రదేశాలలో నిరంకుశులైనను పాలకులుప్రజాభిప్రాయముకు చాల వరకు లోబడుచుందురు. ఆపాలకులకు స్వకీయప్రజలపైన ప్రేమయునుండును. విదేశపాలకులకట్టి బాధ్యతయు మనపై ప్రేమయునుండవు. బ్రిటిషుపాలకవర్గముకు మనమొరవినబడదు. సామ్రాజ్యతత్వమే అసలు హింసాభూయిష్టము. కనుక భారతజాతియంతయు పరోక్షహింసకు లోబడినది. ఇప్పుడేర్పడిన శాంతిఅనేది నిస్తేజతను తామసత్వమును ప్రజలచైతన్యహీనతను తెల్పును

ఈసామ్రాజ్యపద్ధతి ఆర్థికముగను బాధకమే. నరులదేహములకు రక్తమెట్టిదో, దేశపుఆర్థికక్షేమములకు ద్రవ్యమట్టిది. మనదేశపు ద్రవ్యమీ 200 ఏండ్లనుండి నిరంతర మింగ్లండుకు పోవుచున్నది. రక్తస్రావమువల్ల నరుడు నీరసించి నిశ్చేష్టుడగును. అట్లే పూర్వం లోకమంతటికి ప్రముఖమైన మనదేశమిప్పుడు నాగరికదేశాలన్నిటిలో వెనుకబడి దరిద్రమై అజ్ఞానమర్దశలో నున్నది. అయినను, ఇక్కడివైస్రాయి, గవర్నర్లు, జిల్లాకలెక్టర్లు వగైరా పెద్దయుద్యోగులకు బ్రిటిషుసైనికులకు మరియొక్కడను చెల్లించని హెచ్చుజీతములను పెద్దబత్తాలను ఇచ్చుచున్నారు. ఈగొప్పయుద్యోగులు తరుచు విదేశీయులు. ఆసొమ్మును హెచ్చుగవిదేశములకు పోవును † బ్రిటిషువారీదేశమునకు వచ్చినతరువాత ఈదేశపాలనకని ప్రభుత్వము మొత్తం సుమారు వేయికోట్లరూపాయలు ఋణము చేసినది; అందు చాలభాగము బ్రిటిషువారి రాజ్యవ్యాప్తికి వారి లాభమునకు చేయబడినదే కాని దానిని తీర్చుబాధ్యతమాత్రం మనదట. అందుపైన వడ్డీనగైరాలు మనము చెల్లించుపన్నులనుండి యిత్తురు. ప్రత్యేకసముపాయములతో బ్రిటిషుకంపెనీలు తమ పరిశ్రమలవృద్ధిచేయించి ఇక్కడ పోటీగ అమ్మకములవల్ల, మనజాతీయపరిశ్రమ లణగినవి. ఇటీవల బ్రిటీషువారీదేశమందును చాలకంపెనీ లేర్పర్చి, దేశీయపరిశ్రమలతో పోటీ చేయుచున్నారు. జాతీయప్రభుత్వముంటే అది స్వదేశీయవ్యాపారమును రక్షించును. ప్రత్యక్షమగు రక్తపాతమునకన్న పరోక్షమగు ఆర్థికశోషణమే ఎక్కువహింసాకరము. ఇది జలగవలె పైకి తెలియకుండనే జనులసారమును పీల్చి సంక్షయమును క్రుంగజేయును.

భారతీయపాలన విషయంలో బ్రిటిషువారి ఆర్థికనీతికొక్క యుదాహరణము చాలును. పూర్వ మీదేశమందు నౌకాపరిశ్రమ ఉన్నతస్థితిలో నుండేది. బంగాళము, ఆంధ్రదేశము, గుజరాతువగైరాలలో గొప్ప

† ఈపెద్దయుద్యోగులు ప్రభుత్వముకు విశ్వాసముతో సేవచేయుచుని కపెనిబంటు అనే భరాసు వ్రాసియివ్వవలె. అందులో దేశసేవ ప్రజాసేవ చేయుచుని మరతులేదు.

కేవుస్థలములందు గట్టి సముద్రనౌకలు నిర్మించేవారు, ఆయోడలందు దూరదేశాలతో అఖండవ్యాపారము సాగించేవారు. ఇంగ్లీషు ఈస్టిండి యాకంపెనీవారును ఈదేశపునౌకలను ఇంగ్లండువరకు వ్యాపారము కుప యోగించేవారు ఇక్కడి నౌకలెక్కువ ప్రశస్తములని బ్రిటిషు చారి త్రకులును శ్లాఘించినారు. అయితే 19 వ శతాబ్దిలో బ్రిటిషుప్రభుత్వ ము తమదేశమందు పెద్దనౌకల గట్టించనారంభించినారు. అంతట వారు మనపరిశ్రమను నిరుత్సాహపరచినారు. ఈకాలపు నౌకానిర్మాణముకు నౌకాపరిశ్రమవృద్ధికి చాలవిధముల ప్రభుత్వసహాయ ముండవలెను. వ్యాపారవృద్ధికి దేశరక్షణకుగూడ ఇంగ్లండు, ఫ్రాన్సు, జర్మనీ, అమెరికా, జపానువగైరా నాగరికరాజ్యము లన్నియు తమ జాతీయనౌకలను ప్రోత్స హించి వృద్ధిజేసి వాటిపై నే రాజ్యపు కోస్తావ్యాపారం వగైరాలు సాగిం తురు.† కాని మన ప్రభుత్వము బ్రిటిషునౌకలనే ప్రోత్సహించుచున్నారు. ఇట్లు క్రమంగా మన నౌకాపరిశ్రమ క్షీణించినది. ఈకాలపు దీర్ఘమహా నౌకల నిక్కడ నిర్మించుటకు వలయు సౌకర్యములను మన ప్రభుత్వమిం కను చేయలేదు. మనదేశీయవర్తకు లెవరైనను నౌకలుకొనితెచ్చినను, బలీయులగు బ్రిటిషుకంపెనీవారు భారతీయవ్యాపారులపైన కత్తికట్టి ఆపోటీయున్న చోట్ల మాత్రం ఓడకేవులు విపరీతముగ తగ్గించి, మన కంపెనీలకు రవాణాలేకుండజేసి, బాధించుచున్నారు. ఉభయులు పోటీ చేసుకోవలెనని సర్కారువాదము. కాని నౌకానుభవము గల్గి, అర్బుదము లకొలది ద్రవ్యమిదివరకే సంపాదించి లోకమంతటను ఇప్పటికి నట్లు లాభ ముతీయు బ్రిటిషుకంపెనీలతో నిరాధారులగు మనకుకల్లుపోటీ మహాసుర నికి మరిగజ్జుకుమధ్య ద్వంద్వయుద్ధమువంటిది. మననౌకలుతిరుగు భారత ప్రాంతమందుమాత్రం బ్రిటిషుకంపెనీలు తమనౌకలుకొంతకాలం కేవులు లేకుండనే వ్యాపారముకు తిప్పవచ్చు. అంతట,కొద్దిద్రవ్యముతో సాగించు

† ప్రపంచంలో 33 దేశములకు మంచి నౌకావ్యాపారమున్నది. వాటిలో 27 తమతీరవ్యాపారమును విదేశనౌకలురాకుండ అసలే నిషేధించి యున్నవి.

మనకంపెనీ దివాలాతీయును; పొటనే, వారు రేట్లుబాగుగ పెంచ్చించి పెనుకటి నష్టము పూడ్చుకొందురు.* ఇట్లు ఎన్నియో స్వదేశీయ సాకా సంఘములుచెడి, దేశీయులు బాధల పాలైరి. ప్రభుత్వము వారు విదేశపు తపాలు వగైరాల కంట్రాక్టులను బ్రిటిషుకంపెనీలకే గుత్తకిచ్చుచు, తద్ద్వారా ద్రవ్యసహాయము చేయుచున్నారు. ఈసాకానష్టము మన విదేశవ్యాపారము కంతకును నిరోధకము ఇందువల్ల జపానువగైరాలతో జరుగు పోటీలోను మనయెగుమతులకు నష్టముకల్గుచున్నది †

ఇట్లే సామానుల రైల్వే రేట్లువగైరాలలోను దేశీయవర్తకమునకు అన్యాయము గల్గుచున్నది. ఇట్లు మన యితరపరిశ్రమలును చెడినవి.

ఇట్లే ఆంగ్లవిద్య, ఆంగ్లసంస్థలు జనులలో భావదాస్యము తెచ్చి పెట్టినవి. మద్యపానవృద్ధి నీతిని చెడగొట్టినది. జనులకు స్వతంత్రతతో పాటు విచక్షణయు, పరస్పరౌదార్యమును క్రమంగా పోవుచున్నది. దీని ఫలితముగ స్వార్థపరత వర్గసంఘర్షమును, సామాన్యజనులలో అజ్ఞాన వ్యాధులు దైన్యమును పెంచ్చియున్నవి. ప్రభుత్వపు చట్టములేకాక ఉద్యోగుల ఆజ్ఞలు హుకుములుగూడ తరుచు ప్రజాభిప్రాయమునకు వ్యతిరేకముగ నున్నవి. సర్కారు ఉద్యోగులు తాము "పబ్లికుసర్వెంట్లు" (=సంఘపునౌకర్లు) అనుసంగతిని మరచుచు, బ్రిటిషుపాలకులకు సేవ చేయుటే తమ ధర్మమనుకొన్నారు. తమ జీతములు బత్యములు ఈదేశపుసొమ్ము; స్వదేశీయులక్షేమ మూరయుటే యుద్యోగుల ధర్మము కావలె. ఇతరదేశములందట్లే తలతురు. మన ప్రభుత్వపు ప్రేమరాహిత్య మిందులోను స్పష్టమగుచున్నది. మొత్తముమీద ఆర్థికనైతికసాంస్కృతిక రాజకీయరంగముల నాల్గింటిలోను బ్రిటిషువారి ప్రాభవము మనదేశమును బాధించుచున్నది.

---

* 50 ఏండ్లక్రిందట తాతాకంపెనీకి, 32 ఏండ్లక్రిందట చిదంబరం పిళ్ళైగారి స్వదేశీకంపెనీకిని బ్రిటిషుకంపెనీవారితో పోటీకల్ల అట్లు జరిగినది. ఇటీవల సింధియాకంపెనీకి గూడ కొన్నిసారులు బాధగల్గినది.

† ఇప్పటికిని మనతీరవ్యాపారములో నూటికి 25 మాత్రం ఈదేశీయులది. తక్కినదియు విదేశాలతో వ్యాపారమంతయు గూడ, విదేశీయులే సాగించుచున్నారు.

5 మొదటి ప్రజాధోరణి.

సాంఘికంగాను ధార్మికంగాను ప్రేమతత్వము బోధించుటకు 19 వ శతాబ్దిలో రామమోహన రయూనంద రామకృష్ణాదులు మాతృ భాషద్వారా గట్టికృషినిచేసిరి; కాని ఇప్పటిస్థితిలో సాంఘిక కృషివల్లనే తగుఫలముండదని, ఆర్థిక రాజకీయాభివృద్ధిగల్గినప్పుడే జనులసాంఘికనైతిక సంస్కృతి బాగుపడి జనులుతలయెత్తగల్గుదురని కొందరు కనిపెట్టిరి; కొన్నిప్రాంతీయ సంఘముల సంకల్పనిమిత్తంస్థాపించిరి. పిమ్మట దేశమంతటి జాతీయాభివృద్ధికై 1885 లో 'కాంగ్రెసు' ఏర్పడినది. * భారతీయ ప్రముఖులు కలసి తమ రాజకీయాదిబాధలను సాలీనా చర్చించి వాటిపరిహారము గోరుచు కొన్నితీర్మానములను ప్రభుత్వమునకు పంపసాగిరి. ప్రారంభమందు ఆంగ్లవిద్యాధికులగు కొద్దిమంది మాత్ర మీసభలలో కూడి, అప్పటి పాలనలోని కొన్నిలోపములను సవరింపగోరిరి; దేశీయుల కున్నతోద్యోగములు, న్యాయశాఖవిభాగము, ఇట్టివాటిని కావలెనని కోరిరి. కాంగ్రెసు కాయరాష్ట్రములందును శాఖాసభలారంభించినవి. కాంగ్రెసుతోబాటు సంఘసంస్కరణసభలు జరుగుచు, కొన్ని సాంఘిక బాధల నివారణకు తీర్మానములు జప్తుచుండినవి. హిందువులలో వితంతు వివాహము, వర్ణాంతర వివాహము, మితపానము, అంతర్జాతీయ భోజనము, స్త్రీవిద్య, ఇట్టివానిని కోరుచుండిరి. పిమ్మట పారిశ్రామిక సభలును వీటితోసహా జరుపనారంభించిరి. వాటిలో పాశ్చాత్యదేశాలలోవలె మన దేశంలోను యంత్రము లభివృద్ధిచేసి బహుళోత్పత్తి జరిగించి, తద్ద్వారానే దేశీయపరిశ్రమలస్థాపించవలెనని ఉద్దేశించిరి. సభాకార్యమంతయు ఆంగ్ల భాషలో జరుగుచుండెను. విద్యలోను ఆంగ్లపాఠశాలలు హెచ్చింపబూనిరి. ప్రభుత్వమువారును తమ రాజ్యశాఖల నిర్వహణము కవసరమగు

---

* 'కాంగ్రెసు' (ఆంగ్లము) అనగా మహాసభ. అమెరికాలోని సంయుక్తరాజ్యమువారు బ్రిటిషుసామ్రాజ్యపు ఆధిపత్యమునుత్రోసివేసి స్వతంత్రపాలనను స్థాపించుకొన్న సభకీపేరు మొదటవచ్చినది; అక్కడప్రజాపాలక సంస్థ కిప్పటికీ అదేపేరు నిల్చియున్నది.

నుద్యోగులు తయారగునట్లు కొందరు భారతీయుల కాంగ్లవిద్య నేర్పిరి; కొన్ని పెద్దయుద్యోగములు భారతీయులకిచ్చి, ఆదోళకులను తృప్తిపరుప జూచిరి. సామాన్యులలో మాత్రము జాతీయోద్యమము వ్యాపించనియ లేదు. ప్రారంభవిద్య వ్యాప్తికి తగుకృషి జరుగ లేదు. దేశభాషాపత్రికల మీద ప్రత్యేక నిర్బంధము లేర్పరచిరి. ప్రభుత్వముపైన జనుల కసం తృప్తికల్గించుట 'రాజద్రోహ' పు నేరము; బ్రిటిషు సర్కారుపైన తిరు గబాటు అన్నిటిలో గొప్పతప్పుగ నిర్ణయించిరి. సాంఘికంగాను ఒక్కొక్క జాతిపై నింకొకజాతికిద్వేషముగల్గించుట నేరమనియు చట్టము చేసిరి * అయితే యీనిబంధనల నమలుచేయుట కేవలం సర్కారువారి యిష్టము. క్రియలో, ఇక్కడి ప్రభుత్వంపైన యూరపియనులపైన భారతీయులకు కల్గుద్వేషమునణచుటకే తిరుగు ఈచట్టములను ప్రయోగించినారు, ఈచ ట్టములక్రింద కొందరు జాతీయవాదులెక్కువయి దండింపబడిరి. విచార ణ లేకుండనే అనిష్టనాయకుల నిర్బంధించుటకును నిబంధనలుంచినారు. కాని, దేశద్రోహము ప్రజాద్రోహము నేరములసలేదు. యూరపియనుల కిక్కడ ప్రత్యేకాధికారము లీయబడినవి. అప్పుడాంగ్లేయులిప్పటికన్నను భారతీయులను నీచముగ జూచునుండిరి. ప్రజలకు స్థానికసంస్థల కొద్దిపాల నను 1884 లో వైస్రాయియగు రిప్పనుప్రభువుగా రిచ్చిరి. తరువాతవచ్చిన వైస్రాయిలు కేవలం సామ్రాజ్యధోరణి వారే. మరియు మనదేశమం దుండు కొందరాంగ్లేయులు భారతీయులను తృణీకరించుట అవమానించు టతో, పరస్పర హింసాధోరణి వ్యాపించినది. క్రమంగా, ఈదేశీయులలో కరువుబాధయు హెచ్చినది పూర్వకాలమందును కరువులు వచ్చేని, ఆబా ధలవల్ల ఒకప్రాంతమందు పంటలుపోగా, అక్కడజనుల కవసరమైనంత ఆహారము లేకపోయేది. ఆకాలమందు (లోకమంతటను) ఒక ప్రాంతపు పంటలనింకొక ప్రాంతమునకు చేరవేయుట కష్టమయేది. కాని, ఈకాలపు కరువులు వేరు.

---

*ఇండియన్ పీనల్‌కోడ్లు 124 ఏ. 153 ఏ సెక్షనులు. ఈసెక్షనులు 1897 లో పెట్టిరి.

ఇప్పుడు అన్ని దేశాలలోవలె ఇక్కడను రైళ్లువగైరాలవల్ల సర ఫరాసు లోటులేదు. ఒకప్రాంతములో చెడినను ఈదేశములో మొత్త ముమీద మనదేశీయులందరికి చాలునంత పండుచునే యున్నది. నాకలపై దిగుమతికిని పీలున్నది. కాని జనులలో హెచ్చుమంది వృత్తిలేక గర్భ దరిద్రులై నారు; వారికుండినద్రవ్యము పోయినది. వారికిప్పుడు ప్రతి సాలునకరువే వారన్నము, బట్టలేక అల్లాడుచున్నారు. ఇట్టిస్థితిలోను కోట్ల కొలది రూపాయల గింజలు, దూది బట్టలు నిదేశీయులికడనుండి కొని విదేశములకు తెచ్చుకొనుచున్నారు. ఈమాయకరుప్రమనదేశంలోకొందరికి స్థిరవాస మేర్పరచుకొన్నది. తక్కిన నాగరికదేశాలన్నిటిలోను జనులకు వృత్తిగల్పించియో, ద్రవ్యమిచ్చియో, ప్రభుత్వము పోషించును. వారు జనులందరికిని నిర్బంధముగ ఉచితవిద్య జెప్పింతురు. మనదేశమంచు సర్కారువా రట్టిబాధ్యతలు వహింపరు, మద్యపానముచేయుటకు బిచ్చ మెత్తుటకునో ప్రభుత్వము ప్రజలకు స్వాతంత్ర్యము నిచ్చుచున్నారు. పెద్ద వ్యాపారములు తరుమ బ్రిటిషువారే నడుపుచున్నారు. విభజించి పాలిం చుట అనగా పాలితజనులలో విభేదములు కల్పించి, అందుచే దుర్బలు లజేసి, వారినణచి యుంచుట మన బ్రిటిషుసామ్రాజ్యపు నీతి; ఇది కేవలం హింసాపద్ధతి; ఇందువల్ల ఆయాసంఘములమధ్య కలతలు పెరిగినవి. అది పిమ్మట సర్కారుపైనను పరస్పరమును హింసాధోరణిరూప మెత్తినది. అందువల్ల ప్రజల అంతశ్శక్తి క్షీణించుచు, దాస్యము దృఢమగుచున్నది. సంస్థానములలోను ప్రజలబాధలు హెచ్చినవి. ఇట్టిస్థితిలో జనులకు స్వల్పమగు తక్కాలసహాయములవల్ల తగు చికిత్సకలుగదని ధీమంతు లకు స్పష్టమైనది. ప్రభుత్వము ప్రజలలాభముకే పాటుపడినట్లున్నను, క్రియలో అట్లులేదు. అప్పటిమితవాదులగు మన రాజకీయనాయకులు ఉప్పుపన్ను, అడవినిబంధనలు, భూమిపన్నుపద్ధతి వగైరాలమార్పు కోరి. క్రియలో సాలుకొకసారి యట్టితీర్మానముల జేసి అర్జీలపైలెపంపుటే జరి గేది. అట్లుకాక ఇంగ్లండుతో రాజకీయసంబంధము వదలి పోవలెనని కొం దరు విద్యావంతులకు తోచినది. ఇట్లు జాతీయోద్యమ మంకురించినది.

6. జాతీయోద్యమపు వికాసము.

ఇట్లు జనులకు స్వాతంత్ర్య మవసరమని తోచి, 'స్వరాజ్యము' కావలెనని కాంగ్రెసువారు సాలీనా తీర్మానింపసాగిరి. కాని, వారప్పు డుద్దేశించిన స్వరాజ్యము బ్రిటిషుసామ్రాజ్యములోనే ఉపనివేశముల కుండిన 'కలోనియల్' ప్రభుత్వము. అయితే, బ్రిటిషువా రట్లీయలేదు. ఆందోళనకు ప్రతిక్రియగ దమనము సాగించిరి.

ఈశతాబ్దపు ఆరంభమందు వైస్రాయి (=రాజప్రతినిధి) యైన కర్జను ప్రభువు ప్రత్యక్షముగనే భారతీయనాగరకతను విరసించి, పాశ్చాత్యసంస్కృతి నుగ్గడించి, పైపెచ్చు భారతీయుల నిందించెను; బ్రిటిషు పాలకు లట్లు తమధోరణి వెల్లడించిరి; ప్రజాభిప్రాయము ధిక్కరించి వంగవిభజనామలు జేసిరి; ఈదేశంలో హిందూ ముస్లిములమధ్య విభేదములు హెచ్చించుపద్ధతు లవలంబించిరి. కాంగ్రెసులో మితవాదులగు మెహతా, రానడే, బెర్జీ, గోఖలే ఇత్యాది నాయకులు బ్రిటిషుపాలకులు మొత్తంమీద సదుద్దేశయుతులు త్వరలో నీదేశమునకు 'కాలనీల స్వరాజ్య' మిప్పింతురని ఆశపడిరి. దేశములో 'సాంఘికసంస్కరణ'కు వెంటనే కృషిచేయవలెనని రి. వారు నగరజీవితముకే అలవడినవారు. అతివాదులు అనగా జాతీయవాదులు బ్రిటిషుపాలన ఈదేశమునకు మొత్తంమీద బాధకమైనదనిరి. వెంటనే రాజకీయస్వాతంత్ర్యము రావలెనని వీరి సిద్ధాంతము. వీరి ముఖ్యనాయకుడు (శ్రీ) బాలగంగాధర తిలకు. ఈయన గొప్పవిద్వాంసుడు, మహారాష్ట్రుల చారిత్రకకేంద్రమగు పూనాలో కొంతకాలము పాధ్యాయుడై, విద్యాభివృద్ధికై కృషిచేసెను, పిమ్మట కేవలం దేశసేవాపరుడాయెను. కర్మలన్నిటిని వదలవలెను అద్వైతసిద్ధాంతమును తన గీతాభాష్యములో ఖండించి, నరులు నిరంతరంలోకహితకరమైన కర్మల చేయుటవలననే మోక్షమొందగలరని వివరించెను. ఈసిద్ధాంతమును ధర్మముద్ధమెప్పుడును కర్తవ్యమను భావమును, ఆయన రాజకీయములకు నన్వయించెను. "స్వరాజ్యము ప్రజల జన్మహక్కు, సురాజ్యమున్నను స్వరాజ్యమే ముఖ్యము" అని యిప్పటి

నాయకులలో శ్రీ తిలకుగారే మొదట తన యుపన్యాసాలద్వారాను తన ఆంగ్లమరాటీపత్రికలగు, "మరాటాకేసరి" ద్వారాను ధైర్యముతో బోధించిరి; ఈయన మూడుసార్లు రాజద్రోహబోధకై నిర్బంధితుడై స్వాతంత్ర్యయుద్ధమునకు మార్గదర్శకుడైరి. సాంఘిక విషయాలలో మన ప్రాచీన సంప్రదాయముల నుద్ధరింపబూనిరి.

1906 ప్రాంతమందు వంగీయవిద్వాంసుడగు అరవిందఘోషును దేశమాత నారాధించుడని యుద్బోధించి, దేశభక్తినొక తాత్త్విక సిద్ధాంతముగ బోధించెను; ఈయన తనబాల్యము నింగ్లండులో గడిపి, ఆంగ్లభాషాసాహిత్యములలో గొప్ప ప్రతిభ సంపాదించెను. తిలకువలె ఈయనయు, పంజాబునుండి లాలాలజపతిరాయియు, ధర్మయుద్ధము చేయుట విధియని గీతార్థము చెప్పినారు ‡

ఇట్లు మన జాతీయరంగములో నప్పుడు రెండుపక్షము లేర్పడినవి. ఈరెంటి మధ్యను 1906 ఆఖరున శ్రీ దాదాబాయి నౌరోజీ తత్కాలము క్షేత్రములో సమన్వయము చేసెను. ఈయన మనరాజకీయపితామహుడు, గొప్పమేధావి, అత్యల్పసంఖ్యాకమగు పారసీజాతికి చెందియు భారతీయులందరికి ప్రేమాస్పదుడైనాడు; ఈయన ప్రజాప్రేమనే ఆదర్శముగ నుంచుకొని యువకులకు పెద్దలకుగూడ తనకార్యపరత్వముతోను ఉదార భావములతోను ఆదర్శపురుషుడైనాడు. ఈయన బరోడా సంస్థానపు దివానుగనుండి దానిని ప్రజారంజకముగ పాలించి, గొప్ప సంస్కరణలు జేసెను. పిమ్మట ఇంగ్లండుకువెళ్లి, తనప్రేమతత్త్వముతో బ్రిటిషువారి ప్రేమ జూరగొని బ్రిటిషుపార్లమెంటులో సభ్యుడైనాడు, ఆంగ్లేయుల కభిమతుడాయెను; ఉభయజాతులమధ్య సౌహార్దము గల్గింప బూనెను. ఇంగ్లండులో మనదేశపు సమస్యలనుగూర్చి తీవ్రప్రచారము చేసెను; అర్థశాస్త్రమందు ద్రవ్యవ్యాపారసమస్యలందు మంచి జ్ఞానానుభవములుగల వాడు. ఉదారము ప్రశస్తమని శ్లాఘింపబడే బ్రిటిషుపాలన మీదేశము

‡ కాని, లాలాజీముఖ్యముగ సంఘసంస్కర్త, రాజకీయాలలో మితవాది.

నకు ఆర్థికంగా హింసాకరమైనదని, ఇది పరోక్షమైనను ప్రత్యక్షహింస కన్నను భీతికమనియు, శాస్త్రీయహేతువాదముతో నొక గ్రంథములో నిరూపించెను† భారతీయులలో పరస్పరమును, బ్రిటిషువారికి భారతీయులకుమధ్యను మైత్రిబలపర్చుట యీయన యుద్దేశము.

ఈయన 80 ఏండ్ల వృద్ధుడైనను (1906 సం॥లో) 3వ సారి కలకత్తాలో కాంగ్రెసు కధ్యక్షుడై, అందుండి స్వరాజ్యసందేశమును ప్రజలకిచ్చెను; దానికి స్వదేశి, విదేశవస్తు బహిష్కారము, జాతీయవిద్యసాధనములని నిరూపించెను. తరువాత కాంగ్రెసులో రెండుపక్షములవారు 1907 లో సూరతుకాంగ్రెసులో ప్రత్యక్షముగ కలహించిరి. పరస్పరసహనభావమును రెండుపక్షములును చూపలేదు. సర్కారుపద్ధతియు ఈవిభేదము పెరుగుటకు కారణమైనది. సర్కారు 'అతివాది' పక్షీయులపై నసాగించిన అప్పటిదమనచర్యకు మితవాదులు అర్థాంగీకారముజూపిరి. అతివాదులలో చాలమంది ప్రజలలో పరస్పరప్రేమపెంచు నిర్మాణపు కార్యములుచేయుటకుబదులు విదేశీయులపైన క్రోధముచూపి, బ్రిటిషువారిని దూషించి వాచికహింసకు పాలైరి. మితవాదులును ప్రజలలో జీవశక్తిని ధైర్యోత్సాహములను గల్గించలేదు; అతివాదులనుమాత్రము నిందించిరి. వారిలో కొందరు సర్కారునుండి గొప్పగొప్ప యుద్యోగములు పొందిరి.

అప్పుడు మనసంస్కృతిని కాపాడుచునే ఈరెండుపక్షములకు మధ్యగ జాతీయతను పోషించుట కింకొకపక్షమును శ్రీ ఆనీబెసంటు గారు స్థాపించినడిపిరి. ఈమె జీవితమద్భుతము, ఈమె జన్మతః ఐరిషు స్త్రీ; చాలకాల మింగ్లండు అమెరికాలలో వసించి, గొప్పనాయకుల తోను అనేకోద్యమములతోను పరిచయము కల్గించుకొనెను, ఆనువంశికమగు క్రైస్తవమత ప్రచారకులలో నావహించిన మూఢవిశ్వాసముల జూచి, ఆమతము వదలి, 'థాస్సుఫ్రాఫ్లా' ఇత్యాదులతో కలసి నాస్తికతను బోధించెను; అంతట హిందూమతము వగైరాల నభ్యసించి, లోక

† Poverty and Unbritish Rule in India.

మతములన్నియు సర్వమానవసౌభ్రాత్రమునకు ఈశ్వరుని జనకత్వమును బోధించునని నిశ్చయించి, థియాసఫీమతస్థురాలై, పిమ్మట దానికధ్యక్షురాలై, పైసిద్ధాంతములను బోధించదొడగెను. ఈమె తుదకు మనదేశమందే కాశీ అడయారు (మద్రాసు)లలో నివసించు భారతీయ సంస్కృతిలోని విశేషములను వివరించెను; ఈమె రాజకీయరంగమందు ఐరిషు పద్ధతిని 'హోంరూలు' సంఘమును స్థాపించి, తీవ్రప్రచారముచేసి, సర్కారువల్ల నిర్బంధమునూడ అనుభవించెను ఈమె అప్పటి కొందరు యువకులు సాగించు హింసాచర్యలను తీవ్రముగ ఖండించెను.

సుప్రసిద్ధ ఠాకూరువంశీయుడు ఆధునిక కవిసార్వభౌముడు కళాభిజ్ఞుడునగు రవీంద్రుడును అప్పటికే బెంగాలులో కొందరు యువకులును ప్రభుత్వమును సాగించు హింసాచర్యలను తీవ్రముగ నిరసించెను. అంతర్జాతీయతను విశ్వప్రేమను భక్తిని స్వభాషలోను ఆంగ్లములోనుతనయదృక్పథరచనలద్వారా బోధించుచున్నాడు, జాతీయతను స్వరాజ్యాసక్తిని సాధింకోన్నతిని కోరుచు, ఎందుకును ద్వేషభావము చూపుటకిష్టపడక, అట్టిచ్ఛోరణి నరికట్ట యత్నించినాడు. ఈమహనీయుడు బెంగాలులోని బోల్పూరములో శాంతినికేతనమును విశ్వభారతీయను సర్వకళాపరిషత్తును స్థాపించెను* పరిపంచపు ఉన్నత సంస్కృతులను, మతకళాదులను అభ్యసించి, వాటికి సమన్వయముచేయుట కిప్పుడు రవీంద్రుడు తనజీవితమును ధారపోయుచున్నాడు; ఇట్లు అధునిక కాలంలోను కొందరు అహింసకు తాత్వికంగా పీఠముఖ్యమిచ్చినారు. కాని వారందరు నగరజీవితమును విద్యావంతులనే తమదృష్టిలో నుంచుకొన్నారు. అందువలన సామాన్యజనులలో (ముఖ్యంగా స్త్రీలలో యువకులలో) తగు సంచలనము కలుగలేదు. ఈలోగా ద్వేషపూరితమైన విప్లవోద్యమము లోలోపల వ్యాపించుచు, అప్పుడప్పుడు రాజకీయహత్యవంటి వివిధ హింసలద్వారా తలయెత్తుచునేవచ్చినది.

---

* 'యత్రవిశ్వం భవత్యేకనీడం.' అను వేదవాక్యము నీయుపాసంస్థకు మకుటముగ పెట్టుటనుబట్టియే, అయన విశ్వప్రేమాదర్శము స్పష్టము.

7. విప్లవపక్షము.

ఈశతాబ్దిలో పాశ్చాత్యసంపర్కమువలన మన జాతీయజీవితము చెదిరి, చాల మార్పులజెందినది. సాంఘికముగను ఆర్థికముగను స్వార్థపరతపరస్పరద్వేషము హెచ్చినవి. రాజకీయముగ నాయకులసంగతి నూచినాము. మధ్యవర్గములో కొందరు భయస్థులు రాజభక్తులునైనారు. కొద్దిమంది యువకులు హింసావాదులైనారు. వీరిదే విప్లవోద్యమము.

1904 లో యుద్ధమున జపానీయులు రష్యానోడించిరి. ఇందువల్ల బలీయముగు పాశ్చాత్యసామ్రాజ్యమును క్రియాశక్తిగలప్రాచ్యులోడింప వచ్చునని ఈదేశపుయువకుల కుత్సాహము కల్గినది. కొందరనుటట్లు వెల్ల జాతివారు అజేయులనుసంగతి నిజముకాదని తేలినది. అయితే నవ్యవిద్య వల్ల కొందరు భారతీయులకుగల్లు జాతీయభావమును సమన్వయించుటకు బదులు సర్వాధికారతమశక్తితో అణచదొడగిరి. ఇట్టిదమనపద్ధతి యూరపు లోను కొన్నిరాజ్యాలలో జరుగుచుండెను రష్యాలో 'జారు' చక్రవర్తి తన సామ్రాజ్యప్రజల బీడించుచుండెను. (జర్మనీరాజు 'కైజరు' బిరుదుతో మధ్య యూరపులో కొంతవరకిట్లే పాలించెను.) మరియు యాంత్రిక వ్యాపారపు యజమానులగు కొద్దిమందిధనాఢ్యులవల్లను బీదకార్మికులకు బాధకలిగినది. అధికారమత్తులగుసామ్రాజ్యవర్గము పుంజీపతివర్గముతో చేతులు కలిపిరి. ప్రజానాయకులు కొందరిట్టి ప్రభువర్గము నెల్లెడల కడతేర్చదలపెట్టిరి. వారు చాలవరకు యువకులు, ఉద్రిక్తులు, సాహసులు, ప్రభుత్వములు నీతికిలోబడక, భౌతికశక్తితోనే పాలించిరి; ఆ ప్రభుత్వములు విజ్ఞానప్రకారం గొప్పశిరంగులను రివాల్వరులను పోగుచేసి ఆయుధాగారములనింపిరి. వారికి ప్రజాప్రేమ ధార్మికనీతిలేవు. వారిని ఆయుధములతో బహిరంగముగ నెదుర్చుటకు అవకాశము లేనందున, హింసాభావముగల క్రాంతికారులు విజ్ఞానసహాయముతోనే గూఢముగ బాంబులను పిస్తోలు వగైరాలను తయారుచేసి వాటితో నిరంకుశప్రభువులను

కూనీ చేయబూనిరి. ఇట్టి గూఢహత్యలు రష్యా జర్మనీ వగైరాలలో జరుగుచుండెను. స్వదేశములనుండి ప్రవాసితులై యీ క్రాంతికారులు లండను పారిసుపురములందుండుచు కుట్రలు సాగించిరి; ఈవిప్లవతత్వమును ప్రస్తుతించుచు కొన్ని గ్రంథములును జారీఅైనవి. ఈస్థితిలో ఉన్నతవిద్యకై యూరపుకువెళ్ళిన మనదేశపుయువకులు కొందరిచనలజదివి, ఆవిప్లవకారులతో కలుసుకొనిరి; యూరపులోని స్వేచ్ఛాయువులతో బాటు, జాతీయస్వాతంత్ర్యమును హింసాచర్యలతో సాధించు ప్రవృత్తినిగూడ నేర్చుకొనిరి; వీరక్కడిరహస్యపు ఫ్యాక్టరీలలో బాంబులు చేయు పద్ధతులను గ్రహించిరి. స్వదేశముకు మరల రాగానే ఈయువకులు తాము మొదట నుద్దేశించిన వృత్తులుమాని, దేశస్వాతంత్ర్యము సంపాదించుటకే జీవితమ్మంపనిశ్చయించిరి అయితేమనదేశదాస్యముకు కొందరాంగ్లేయులు వారినాశ్రయించు 'రాజభక్తు' లగు మన దేశీయోద్యోగులునే కారకులనుకొని, అట్టివారిని చంపితే స్వరాజ్యము కలుగునని భ్రమించిరి. వీ రీదేశపుయువకులలో చాల రహస్యప్రచారముచేసి, గూఢ సమితులను స్థాపించి, దౌర్జన్యపద్ధతులతో పాలకులను కొందరిని చంపి, మిగిలినవారిని భయపెట్టజూచిరి. వీరు దేశభక్తులు, సాహసులు; సర్కారుకు తమసంగతి తెలిసిన తమకు ఉరితప్పదని వీరికి తెలియును; కనుక దేశముకై సర్వస్వము (ప్రాణముగూడ) అర్పించుటకు వీరు సిద్ధులే; కాని, ఈహింసాపద్ధతి మనదేశపు సంస్కృతికి వ్యతిరిక్తము, వీ రెంతపచారముచేసినను, యుక్తులుపన్ని సమర్థతతో నిర్వహించినను, మనదేశపు జనసామాన్యము వీరిపద్ధతులను హర్షించక వ్యతిరేకులేయుచుని. మరియు వీరిహింసాసిద్ధాంతములును సరికావు; ఇట్లు కొందరిని రహస్యముగ చంపుటవల్ల తిక్కిన సర్కారుఉద్యోగులు భయపడుమరనుటయు వట్టిభ్రమ. వీరిచర్యవల్ల కొద్దిమంది బ్రిటిషుఉద్యోగులు (కొందరు మనదేశపు పోలీసువారుగూడను) ఎట్లో బాంబులు పిస్తోలుదెబ్బలు తగిలి మరణించిరి. గురుచు దైవమునకో పొరబాటునో గురితప్పట ఇతరులు హతులౌటయు

జరిగెను. అహింసాచర్యవల్ల క్రాంతికారులకు దేశమునకుకూడ లాభించక నష్టమేకల్గినది. బ్రిటిషువారు నిదానముగల ధీరులు, చాలయుక్తిపరులు, అనుభవజ్ఞులు. వారు అక్రమత్తులై, పోలీసుసిబ్బంది హెచ్చించి, ఎక్కువసొమ్మ్ము ఖర్చుతో సమర్థులగు భారతీయులనే గూఢచారులుగ పెట్టిరి. విప్లవకారులు దాదాపు అందరూ హిందువులు, సిక్కులు; ఈవిప్లవము బెంగాలు పంజాబులలోనే కొంచమైనను వ్యాపించినది. అక్కడ ముస్లిములు హెచ్చు. బ్రిటిషుప్రభుత్వమువారంతట ముస్లిములను చేరదీసిరి. ఇట్టి కొన్నిచర్యలవల్ల నాంఘికవైషమ్యము చెలరేగి హెచ్చినది. క్రాంతికారుల బట్టుటకు మేధావులగు పోలీసు లేర్పడిరి; వీరిలో చాలమంది ముస్లిములు. పట్టుకొనువారి కున్నతోద్యోగములు బహుమతులు సర్కారువారిచ్చిరి. గూఢచారులు తామును క్రాంతికారులవలె నటించి, నమ్మించి, ఎట్లో వారిబాడలు రహస్యముగ తీసి, బాంబుకార్ఖానాలను జూచి, అంతట రహస్యముగ సర్కారుకు వారి గుట్టు తెల్పుచుండిరి. పోలీసువారు హఠాత్తుగ గూఢముగవచ్చి దాడిచేసి, కొందరు క్రాంతికారులను బాంబులను పట్టుకొనిరి; న్యాయనియమనములు సవరింపబడి, ప్రత్యేకపు కోర్టులు ప్రకార మాయువకుల విచారణజరిగి, కొందరికి ఉరి, మరికొందరికి ద్వీపాంతరవాసమును జరిగినవి. తరువాత, అనుమానమున చాలమంది నరెస్టుచేసి, వారిని పోలీసులు బాధించుచుండిరి; జాతీయసంస్థల నణచివేయుచు, జనులకు భీతిని దిగులును గల్గించుచుండిరి. ఆక్రాంతికారుల ఆదర్శమెట్టిదైనను, వారిచర్యలబట్టి ప్రజలకు వారిపై క్రోధముగల్గెను. ప్రజాసానుభూతి లేక, ఏయుద్యమమును కొనసాగదు. ఆక్రాంతిపరులు తమచర్యల కవసరమగు ద్రవ్యము రహస్యముగ సంపాదింపవలె; అందుకు గూఢముగ శ్రీమంతులను ఆయుధములతో బెదిరించి, హింసించి దోచుకునేవారు. వీటివల్ల ఆయుధమతస్థులకులములు వర్గములు వీటిమధ్యవిరోధములు హెచ్చి, సాంఘికస్థితియు చెడినది. ఇటను మధ్యవర్గపు యువకు లా యుద్యమంలో

చేరుచునే యుండిరి ఇప్పటి బలీయమగు సర్కారును అట్టి హింసాచ
ర్యలతో సాధింప వీలులేదని ఇక్కడి ప్రజాసామాన్యము స్వాతంత్ర్య
సాధనకైనను హింసాపద్ధతిని హర్షించరని దానిఫలితముగ తేలినది.

ఏ వ్యక్తులపైనను మనకు ద్వేషముండకూడను. మరియు, రాజకీ
యపు దోపిడులజూచి, కొందరు మధ్యవర్గపు నిర్వ్యాపారులును ధనికుల
యింట గూఢముగ సాయుధులై జొరబడి దోపిడులు సాగించిరి. బెదరిం
పులుజరిగెను. వీటిలో నేది రాజకీయమో ఏది ఆర్థికమో, తెలియుటయు
కష్టమైనది. ధనాఢ్యవర్గములో కల్లోలము బయలుదేరినది.

ఈస్థితిలో ప్రపంచయుద్ధపు రూపమున లోకమంతటను హింసా
జ్వాల వ్యాపించి, సంఘస్థితిని తారుమారు చేసినది.

8 మొదటి ప్రపంచయుద్ధము.

ఆమహాయుద్ధము 1914 సంవత్సరం జూలైలో ఆరంభించి, 1918 సంవత్సరం నవంబరులో అంతమైనది. పూర్వపుయుద్ధములకన్న నదియెక్కువ భయంకరము, హింసాయుతము. ప్రకృతివిజ్ఞానము వృద్ధియై, కొత్తరీతి శస్త్రాస్త్రములు లేర్పడి, వాడుకకువచ్చినవి. వాటిద్వారా విపరీతమగు వినాశము జరిగినది. ఆయుద్ధపుకారణమును ఆరాజ్యముల యుద్ధాతుర తను సూచించును. యూరపులో ఆస్ట్రియాయువరాజును దాని దక్షిణ ముందలి సర్వియాలో నెవరోచంపిరి. అందుకేదో పరిహారమేర్పర్చుకొని, తేల్చుకోవలసినది. ఆవిషయ మారెండు రాజ్యములకే వదిలియుంచే, అల్లోజరిగియుండవచ్చు. కాని ఆయాపెద్దరాజ్యములు డీకొనుటకు వేరే ప్రబలకారణములుండెను. యూరపులో ముఖ్యజాతులమధ్య యాంత్రిక పరిశ్రమల వృద్ధికి లెద్దాద్వారా ద్రవ్యసామ్రాజ్యబలము కు పోటీ నానాటికి హెచ్చినది. పాలకులు తమదేశపు పరిశ్రమల సరుకుల నితరదేశాలలో అమ్మించి, అవసరమైన ముడిసరుకుల నందుండి తెప్పించునిమిత్తం తమ సామ్రాజ్యమును బలపర్చిరి, తక్కిన విదేశాలలోను ప్రాబల్యమును హెచ్చించుకొనిరి. అందు నౌకలను సేనలను పెంచిరి; ఈపోటీలవల్ల పరస్పరం సంఘర్షము కలతలుపెరగినవి. మరియు నల్లజాతులసారము లాగుటలో శ్వేతజాతులమధ్య పోటీహెచ్చినది. ముఖ్యముగా బ్రిటిషు సామ్రాజ్యము జర్మనీ ఈరెండురాజ్యాలమధ్య స్పర్ధపెరిగినది. 1910 నుండి తగువులేర్పడుచు, దినదినగండముగ నుండెను. ఆధునిక యుగంలో యుద్ధము జరిగితే ఘోరహింసయు అమితనష్టమును తప్పదని గ్రహించి, రాజనీతిజ్ఞులు తత్కాలముకెట్లో సవరించుచువచ్చిరి. కాని, అహంకార ములు, అసహనము, విరోధభావములు క్రమంగా మరింతహెచ్చినవి; రకరకముల మారణసాధనములతో ప్రత్యర్థినణచి విజృంభించు సమయ ముకై ఈపాలకులు వేచియుండిరి. ఇట్టిస్థితిలో శస్త్రనిర్మాతలును స్వలా

భముకై రాజ్యాలమధ్య కలతపెంచిరి. కడుపులో నున్న యీమె కనక మానునా? హింసా తత్వ గర్భితులై హుంకరించు రాజ్యాలమధ్య యుద్ధము రాకమానదు. ఎండిపోయిన కారడ్రలవలె, యూరపుదేశములు దాహ్యస్థితిలోనున్నవి. అప్పు డాఆస్ట్రియా యువరాజు హత్యయను రవ్వ తగిలి భగ్గుమని త్వరలోనే దావానలమైనది. ఆస్ట్రియాను సాధించుటకు రష్యాపభుత్వము సర్వియనులకు తోడైనది. రష్యాపైన విరోధముగల్గి సజాతీయమైన జర్మను ఆస్ట్రియను లేకమైరి.

ఆయూరాజ్యములలో ప్రబలురు తమ రాజ్యరక్షణకు ప్రజాక్షేమ ముకును వెంటనే యుద్ధమవసరమని అసత్యప్రచారములతోను ప్రజల భ్రమపెట్టిరి. ఇట్లు మహాయుద్ధము చెలరేగినది. జర్మనులు సమర్థులు. వారి సేనాబలమును నిర్మాణశక్తియు గొప్పవి. ఇదివరలో క్రైంచి బ్రిటిషురాజ్యములు పరస్పరం విరోధముతో నుండేవి. కాని జర్మనురాజ్యపు ప్రాబల్యము తగ్గించుటకై, ఈరెండు రాజ్యములు మైత్రిచేసుకొన్నవి. జర్మను క్రైంచిరాజ్యములమధ్య పూర్వ విరోధముండెను. 1870-71 సం॥ యుద్ధములో తమవల్ల జర్మనులు రాబట్టిన అల్ససులోరైను జిల్లానురాబట్టుకొనుటకు, తమసామ్రాజ్యబలము హెచ్చించుటకు, క్రైంచిప్రముఖులు నిశ్చయించిరి. జర్మనుల వ్యాపారపుపోటీని సైనికశక్తిని అణచివేసి తమ యాధిక్యము నిల్పుకొనుటకు బ్రిటిషుపాలకులును తరుణమునై వేచి యుండిరి. ఇట్లు ఆంగ్లక్రైంచి ప్రభుత్వములు రష్యాతో చేతులుకలిపిరి. జర్మనులు భౌతికవిజ్ఞానముద్వారా విమానములు, విషవాయువులు వగైరాల సృజించి వాడుటలో దిట్టలు. స్వతంత్రతలేని మరదేశమునుగూడ బ్రిటిషు సామ్రాజ్యము వా రాయుద్ధములో దింపిరి. ఇట్లా ప్రచండయుద్ధములో ముఖ్యరాజ్యములన్నియు చేరినవి. బ్రిటిషువారప్పుడు 'టాంకు'లు సృజించిరి.

శత్రువినాశమే యుద్ధపుటుద్దేశ్యము. అందులో రెండుపక్షాల అస్తులు జనులు నశించుట తప్పదు. ఆయుద్ధములో విపరీతనష్టము కల్గినది. రణరంగముకావలను, నిరాయుధులను, చంపకూడదనే ధర్మయుద్ధ

పునియమముల కిప్పుడు తావేలేదు. ఏదోరీతిని జయించుటే ముఖ్యోద్దేశము, తటస్థులహక్కులు లక్ష్యపెట్టుటలేదు. కొత్తరకపు మరఫిరంగులు, షెల్లులు, జలాంతర్గాములు, విమానపుబాంబులు, ఇత్యాదులను రెండు పక్షములును వాడిరి. నవ్యయంత్రములద్వారా మహాసర్గములను జర్మను లవలీలగ పట్టుకొనిరి. అప్పుడు మనధనమును జనులను బ్రిటిషువా రన్నిరంగములం దుపయోగించిరి; అందుతోషశ్చిమరంగములో జర్మనుల మొదటిఘాటినాపిరి. యూరపులో నిర్బంధశిక్షణ కలదు. ఆసైనికులు కం దకములలోను, శిబిరాలలోను ఏండ్లకొలదిగ సాయుధులై పోరుచుండిరి. వారికై నవ్యాయుధములను, సామగ్రులను తక్కినప్రజలు రాత్రింబవళ్లు తయారుచేయుచుండిరి. ఆమహాయుద్ధములో కోటిజనులు నశించిరి. ఇంక నెందరో వికలాంగులైరి. వారందరు యువకులు నడివయస్సువారు. బ్రిటిషుమిత్రమండలికే ద్రవ్యజనసంపత్తు హెచ్చు. కాని వైజ్ఞానికప్రాబ ల్యము గల్గి, వీరావేశముతో బోరు జర్మనుల రణరంగము దోడించుట దుస్సాధ్యమయినది. జర్మనుల కాహారాదిసామగ్రి పోకుండ మిత్రమండలి తమ నౌకాబలముతో పెద్దబంధము వేసి, తటస్థరాజ్యాల నౌకలనూడ నిరోధించిరి. జర్మనులకు నౌకాబలము చాలదు. కనుక ప్రతిక్రియగ బ్రిటిషు ఫ్రెంచివారల నౌకలను నడుసముద్రములో జలాంతర్గాముల ద్వారా జర్మనులు పొడిచి ముంచుచుండిరి. ఈజలాంతర్గాములను నవ్యా యుధములతో సజనముగ నశింపజేయ బ్రిటిషువా రుద్యమించిరి. ఇక్లెం దరో జనులు కోట్లకొలది సవరనులఆస్తియు నీటిగలసెను. జనులు వినాశ కార్యమగ్నులై, జనపోషకవస్తువుల యుత్పత్తిక్షీణించినది. ధాన్యము, బట్టలు కిరసనువగైరాలధరలు విపరీతముగ పెరిగి, బీదజనులెన్నియో బాధల పాలైరి. యుద్ధారంభమందే అహింసతోబాటు జాతులలో సత్యశీలము లు హతమైనవి† రణరంగములో విషవాయువులకంటెను తీవ్రంగా ద్వేషా

† The first casuality of a war is truth అను ఒక రాజనీతిజ్ఞుని సూక్తి పూర్తిగ యథార్థమైనది.

నలము బయట తంతివార్త ఇత్యాదులప్రచారమును పత్రికలద్వారా లోకమంతటను వ్యాపించినవి. వాజ్మనఃకాయములహింసలు పరస్పరము తోడ్పడునుగదా! శత్రుసాధనములు తగ్గించుటకని వైమానికులాగ్నేయ గోళము లుపయోగించసాగిరి. అమితజననాశనమువల్ల బుద్ధివచ్చియు క్రాంతిగల్గియు రష్యా యుద్ధమును మానుకొన్నది. కాని, అమెరికా ఆలోటుతీర్చినది క్రిమిప్రయోగంవల్ల జలాశయములు చెడినవి. జనులు ఉద్రిక్తులై నున్మత్తులబోలిరి. కొత్త అంటువ్యాధులు చెలరేగినవి. అంతట జర్మనుపక్షము ఆర్థికబాధకు తాళలేక లొంగి రాజీకోరిరి. ఉభయ పక్షములును 1919 లో వర్సాతీవద్ద సంధిచేసుకొనిరి. 'ఇంప్లుయంజా' వ్యాధి అప్పు డున్నదేశాలలోను వ్యాపించి, కోట్లకొలది జనుల బలిగొన్నది (1919 లో ఒక్కభారతదేశములోనే ఈవ్యాధివల్ల సుమారు 70 లక్షల జనులు చచ్చిరి, ఇంకను చాలమంది దుర్బలులైరి. ఆమహా యుద్ధాగ్నివల్ల అపారనష్టము కల్గినది. నిత్యజీవితంలో హింసాతత్వపు పరిష్కారములు ప్రత్యక్షముగ అందు పాల్గొన్నవారికిని పరోక్షముగ లోకమంతటికిని హానికరమని, యుద్ధములో హింసాచర్యలకు మితియుండ దనియు, తేలినది. కాని, ఆగుణపాఠము వ్యర్థమైనది. సామ్రాజ్యతత్వపు హింసాప్రభావ మీదేశంలోను వ్యాపించి, ఇక్కడి ప్రజలదశ అంధకార మయమైనది. అయితే, దానిని ప్రేమతత్వముతో ఎదుర్కొనుటకు మన దేశమాతకు పుత్రరత్నమగు గాంధిమహాత్ముడు నవ్యజ్యోతి వెలిగించి అంగుల కార్యక్రమము నేర్పించినాడు.

9. మహాత్మాగాంధి.

ఇప్పుడు ఘోరహింసతో కలుషితమైన జాతీయజీవితపు పునరుద్ధరణకు దారిచూపిన ప్రవక్త మహాత్మగాంధి. అహింసాసత్యవ్రతము ధార్మికముకేగాక ఆర్థికరాజకీయములకు సాంఘికములకుగూడ వర్తింపదగునని, దానిని తన జీవితవృత్తిలో అమలు జరిపి, వ్యక్తికి జాతికి సమన్వయము చేసి, ఆయన అందరికిని మార్గదర్శకుడైనాడు. ఆయన జీవితవృత్తాంతము లందరును తెలుసుకొని అనుసరింపదగినవి. ఆయాజాతీయసమస్యల పరిష్కారముకు వ్యక్తిప్రవృత్తికి గాంధిగా రవలంబించినపద్ధతులు కార్యక్రమము ఆధునికనాగరికతరక్షణకు నాధారములు. ఆయన సిద్ధాంతములు విచిత్రములుగ తోచినను, నరజాతికి క్షేమకరములు, ముఖ్యంగా భారతజాతీయసంస్కృతి కనుగుణములై యున్నవి. కనుక ఇకముందు ఆయన జీవితసిద్ధాంతముల వివరణద్వారా మన జాతీయజీవితపుసమస్యలను, వాటిపరిష్కారరీతినిగూడ, గ్రహింపగలము. ముందుగా ఆయన జీవితమును మనఃపరిణామమును గమనింతము.

మోహనదాసు కరంచందుగాంధి† గుజరాతీవైశ్యకుటుంబములో పశ్చిమపు కతియవారులోని 'పోర్బందరు'లో 2-10-1869 తేదీని జనించెను. ఈయనతండ్రి (కరంచందు) అక్కడిసంస్థానమునకు దివాను, ధీమంతుడు, ప్రాజ్ఞుడు, అనుభవశాలి. తల్లి పుతలీబాయి మంచి లోకజ్ఞానము ఈశ్వరభక్తియుగల ఉదారురాలు. ఈగుణములన్నియు మన 'గాంధి'కి సంక్రమించినవి. ఈయన బాల్యమందక్కడి బడులలో చదివి, రాజకోటలో మెట్రిక్యులేషను పరీక్షనిచ్చెను. బాల్యమందే తండ్రిమరణించెను. ఉన్నతవిద్య కన్నగా రీయనను బారిస్టరీనిమిత్తమింగ్లండుకంపెను. అక్కడ పరీక్షనిచ్చి వచ్చినను జీవితసమస్య తీరలేదు. బాల్యమందే ఆయనకు 'కస్తూరిబాయి'తో వివాహముచేసిరి. (ఆయనకిప్పుడు నల్గురుకొడుకులు;

† 'గాంధి' అనేది వీరికుటుంబనామము; ఈయన స్వంతపేరు 'మోహనదాసు.'

వీరిలో దేశసేవాపరుడగు దేవదాసు నాల్గవవాడు). గాంధిగారాంగ్లవిద్యా పరీక్షలలో ప్రథమస్థానము నొందలేదు; కుశాగ్రబుద్ధియనిపేరు పొందలేదు. నైతికప్రవర్తనలోనే ఆయన జీవితపువిశేషము. హరిశ్చంద్రచరిత్రను, శ్రవణుని పితృభక్తినితెలుసుకొని, అప్పటినుండి సత్యపాలనకు పితృసేవకు తనబాల్య మర్పించెను. మొదట కొంత విషయాసక్తియుండెను; కొంత దుస్సహవాసము నేర్పడెను. కాని, తనతప్పును వెంటనే గ్రహించి, తండ్రి కితెల్పి, పశ్చాత్తాపమొందెను. మొదటినుండి ఆత్మపరీక్ష చేసుకొనుచు తనలోపములు గ్రహించుచు, సత్ప్రవర్తనను తప్పక రక్షించుచుండెను. విద్యార్థిదశలో ఇతరులతో వ్యర్థముగ తిరుగక, ప్రతిరోజును అప్పుడు రోగియైనతండ్రికుపచారము చేయుచుండెను. బారిస్టరుపరీక్ష కాంగ్లదేశమునకు వెళ్ళినప్పుడును అక్కడి సాంఘికాకర్షణలకు లోబడక నిగ్రహము గల్గియుండెను ఇంగ్లండులో మాంసమహిళామద్యములను స్పృశించలేదు. మొదట తల్లికిచ్చినవాగ్దానమువల్లనే ఈవ్రతముపట్టెను; కాని, తరువాత ఇట్టివ్రతము నిగ్రహమును సాత్వికతేజమును ధార్మికతను వృద్ధిచేయునని గ్రహించి, బహుళాకర్షణలమధ్యను ఋషిజీవిత మవలంబించి, పిమ్మట తపశ్శాలియైనాడు. పాశ్చాత్యసంస్కృతిలోని విలాసిత, స్వార్థపరత, ద్రవ్యకుతాశయము, ఆత్మహానికరములని గ్రహించి, వాటిని విసర్జించెను; కాని ఆంగ్లేయుల మంచి గుణములలవర్చు కొనెను. పరిశుభ్రత, సకాల నియమము, కార్యదీక్ష, సంఘక్షేమపరత, స్వదేశి ఆయన కలవడినవి.

ఇంగ్లండునుండి రాగనే, ఆయనన్యాయవాదియైనాడు; కాని వకీలువృత్తిలో జయమొందుతత్వ మాయనకు లేదు. ద్రవ్యాశ జనాకర్షణ అధికారకాంక్షపోయి, నీతిపరత, శీలరక్షణ, శాంతత, సత్యసంధత, ప్రజాసేవ ప్రవృత్తి ప్రేమపరత ప్రధానమయినవి. అట్టివాడు వకీలు వృత్తిలో ప్రముఖుడు కాకుండుట సహజమే.

ఈస్థితిలో స్వగ్రామవాసి యగు ఒక ముస్లిముకు దక్షిణాఫ్రికాలో నొకవ్యాపారపుకేసుండెను. దానివిచారణలో బ్రిటిషులాయరుకు సాయపడుటకు, వాదితరపున ఆయన 1892 లో దక్షిణాఫ్రికాచేరెను;

అయితే, గుజరాతిలో వ్రాసిన అక్కడి ఉభయపక్షములలెక్క బుక్కులను పత్రలేఖలను పూర్తిగ అవగాహనచేసుకొని, ఆయన ఉభయపక్షములకు క్షేమకరముగా పంచాయతీద్వారా రాజీచేయించెను.

ఆకేసుకొరకు దక్షిణాఫ్రికాకువెళ్ళగనే, అక్కడిభారతీయుల పరిస్థితుల జూచినప్పటినుండి, ఆయనకు కొత్తసంకల్ప మేర్పడినది. అక్కడి హైందవస్థితి మనజాతీయస్థితికి చిన్నప్రతికృతి. అక్కడ గుజరాతీలు, తమిళులు, ఆంధ్రులు, బంగాళీలు, ముస్లిములు, హిందువులు, పారసీలు, వ్యాపారస్థులు, కూలీలు, ఇట్లు అన్నిజాతులు మతముల వర్గముల వారు నున్నారు. (గొప్ప జమిందార్లు రాజులు మాత్రములేరు, అక్కడి అసలుదేశీయులగు ఆదిమవాసులకు నామమాత్రపుములు లేవు. అక్కడికి 18 వ శతాబ్దినుండి వలసవచ్చిన బ్రిటిషువారే అధికారముగల్గి దేశపాలనజేయుచున్నారు. వారిపైన అజమాయిషీగల్గిన లండనులోని బ్రిటిషుప్రభుత్వము వారు దక్షిణాఫ్రికాకు ప్రాంతీయస్వరాజ్య మిచ్చినారు. అనగా, ఆచరణలో అధికారమంతయు అక్కడిశ్వేతజాతీయులదే. దేశీయులకు భారతీయులకు అక్కడి పాలనలో, ఓట్లనిచ్చుటకు, సంఘములోస్వేచ్ఛకు, ఎట్టిహక్కునులేదట! పైగా, అక్కడి భారతీయులను తెల్లజనులు నీచముగ జూతురు. వారిమంచిబండ్లలోమనము వెళ్ళకూడదు. వారు వసించు మంచిప్రాంతములలో మనవారు వసింపకూడదు. స్వేచ్ఛతో వ్యాపారంచేయుటకు ఆస్తిసంపాదనకు ఎన్నియో నిరోధములుపెట్టినారు. భారతీయులలో విద్యకు ఆర్థికక్షేమమునకు ఆప్రభుత్వము తగుసదుపాయము చేయలేదు. సాంఘికంగా, ఇక్కడి ఆదిహిందువులను సవర్ణులు చూచురీతినే యూరపియనులు మనవారిని అస్పృశ్యవర్గముగ నెంచుదురు. గాంధిగారక్కడకు చేరగనే, ఆయనకిట్టియనుభవముగల్గి, అక్కడిభారతీయులందరిస్థితి యిట్లేయున్నదనియు, తెలిసినది. ఆయనహృదయము కరిగి, వారికై సేవాసక్తి కల్గినది. ఆభారతీయులీమస్థితిని పోగొట్టుకొనుటకెట్టికృషిని చేయుటలేదు. తాను 'బారిస్టరు' అయినను, వ్యక్తిహితోదావల్ల స్వలాభమునొందుట కొప్పుకోక, గాంధిగారక్కడి భారతీయసంఘ

మంతటి కష్టములు తనవిగ భావించుకొని, అప్పటినుండి వారిజాతీయ క్షేమముకై తనశక్తినంతను వినియోగించెను.

అక్కడి భారతీయులలో జాతీయ చైతన్యమును, ఐకమత్యమును కల్గించుట అవసరమని గ్రహించి, ఆయన వారికి సమితులేర్పర్చి, హిత బోధచేసి, తమ బాధలు పోవుటకు పత్రికద్వారాను శాసనసభలలోను ఆందోళనచేసెను; తన ప్రవర్తనవల్ల వారికిని సంఘసేవాసక్తిని ఆత్మగౌరవమును గల్గించెను; నైతికతను, పరస్పరప్రేమను కల్గించెను. అధికారులగు తెల్లజాతివారు భారతీయులకు న్యాయము జరిగించక బాధించుచుండిరి. అయినను, ఆయన ప్రజలకు విరోధభావము హింసాప్రవృత్తి కలుగనీయక, భారతీయులు నిగ్రహముగల్గి ఆత్మోన్నతికి కృషిచేయునట్లు కార్యక్రమ మమలుజరిపెను. వారిలో పరస్పరముండిన విభేదములు ద్వేష భావము పోగొట్టి, అన్ని కులములమధ్య సమబుద్ధిగల్గించి, ఐకమత్యము చేకూర్చెను; పరస్పర సమావేశము వీలగునట్లు సామాన్యభాషగ హిందుస్తానీ నేర్పించెను; ధార్మికభావమును ప్రోత్సహించెను. వీరిలో విభేదములు, భయము, అవినీతియు నుండుటవల్లనే శ్వేతజాతీయులు భారతీయులను పశుతుల్యముగ జూచుచున్నారని ఆయనగ్రహించి, ఆత్మగౌరవము, జ్ఞానము దృఢనిశ్చయముగల్గునట్లు బోధించి, నీతిపరులుగ తదీయతుచేసెను. అప్పటికిని యూరపియను అధికారులు వారి కన్యాయము చేయుచున్నందున, ప్రజల మానవత్వమును హక్కులను నిలువబెట్టుట కాయన భారతీయులందరిచేత సాత్వికనిరోధ (Passive resistance) రూపముగ సత్యాగ్రహము చేయించెను. అన్యాయము అవినీతికరము నగు చట్టము నుల్లంఘించుట, సర్కారు ఉద్యోగులెంత దౌర్జన్యముచేసినను, కొట్టినను ప్రతిక్రియ చేయక సహించుట, తమ దృఢవ్రతము వదలక జైలుశిక్ష దెబ్బలనుగూడ శాంతముగ స్వీకరించుట, దీనిముఖ్యలక్షణము.

ఈ రీతిగ గాంధిగారు ఆయన సహచరులు ఇత్యాదులు వేల కొలదిగ ఖైదులోనుండి సకల కష్టములు సహించిరి. వారి ఐకమత్య

ము దినదినము వృద్ధియైనది. ఇది అక్కడి భారతీయులందరిని వీరులుగ జేసినది. ఈ అహింసాయుద్ధము ప్రచండముగ వ్యాపించి, ఇంగ్లండులోను ఈ దేశంలోకూడ ఆందోళన కల్గించెను. అప్పుడు ప్రభుత్వము లొంగి, తమ అక్రమ శాసనములు సవరించుకొని, కొంత న్యాయము చేసినారు.

కాని, పూర్తియైన న్యాయముకు వీలుకాలేదు. అక్కడి భారతీయులు లక్షజనులు మాత్రమే. అది బ్రిటిషుసామ్రాజ్యములో భాగము. ఆ భారతీయుల మాతృభూమియగు మనదేశములో నిక్కడి 35 కోట్ల భారతీయులకు నిజమైన పౌరసత్వము, పాలనహక్కులు లేవు. స్వదేశములోనే గణ్యత గౌరవము లేని వట్టి పరాధీనులకు విదేశాలలో గణ్యత గల్గునా? దక్షిణాఫ్రికాలోనేగాక, తూర్పుఆఫ్రికా, ఫిజీవగైరాలలో నుండు వారికిని ఇక్కడివారికినిగల కష్టముల బోగొట్టి భారతీయాత్మ నుద్ధరించుట కై మాతృదేశపు సేవకే యిక తనశక్తినంతను వినియోగింపవలెనని నిశ్చయించి, గాంధిగారు 1914 సం॥రంలో ఇంగ్లండుద్వారా భారతదేశముకు తిరిగి వచ్చిరి. అక్కడి సేవానుభవ మిక్కడ బాగుగ నుపయోగించినది.

దక్షిణాఫ్రికాలోవలె, ఈ దేశంలోను ఆయన (అహమ్మదాబాదు దగ్గర 'సబర్మతీవద్ద') ఆశ్రమముపెట్టి, అందులో ఆదర్శజీవితముగల సత్యాగ్రహులను తయారుచేసెను. తనసిద్ధాంతము లందరికిని తెల్పుటకు నవజీవన్ (గుజరాతీ,హిందీ) యంగు ఇండియా (ఆంగ్ల) పత్రికలు నడిపెను; దేశమంతను తిరిగి జనుల కష్టములను, జాతీయసమస్యలను స్వయంగా అవగాహన చేసుకొనెను; రైలులో 3 వ తరగతిలోనే తిరుగుచు సామాన్యజనుల ప్రవృత్తిని, ధోరణిని, మనస్తత్వమును, లోపములను గ్రహించెను. దక్షిణాఫ్రికాలోవలె, ఇక్కడను జనులందరిలో పరిశుభ్రత, నీతి, ఐకమత్యము, కార్యపరత, పరస్పరప్రేమ కలుగునట్లు బోధించుచు, అన్నిమతముల ధర్మగ్రంథములసారమును గ్రహించి, భక్తవరుడైనాడు. ఆయన ప్రతిదినమును శ్రద్ధతో ఈశ్వరప్రార్థన జేయును. అహింస, నీతి, సామ్యత, గల్గి ఆయన ఆధ్యాత్మిక ప్రవృత్తితోనే జీవితకార్యముల జేయు

చుండును. కాని ఆయన తన వ్యక్తిమోక్షముకాక, లోకులందరి నిశ్రేయసమును కోరును. కనుక మానవజాతి, ముఖ్యంగా భారతజాతి, ఉన్నతమై తరించుటకే ఆయన తన జీవిత మర్పించుచున్నాడు.

అయితే, జాతీయజీవితము సర్వతోముఖము. ఆర్థికసాంఘికాదులన్నిటిలో నీతిప్రగతి ధర్మబుద్ధిగల్గినప్పుడే జనులకు నిజమగు ఆధ్యాత్మికతయు సిద్ధించును. కనుక వీటిఅన్నిటివ్యాప్తికిని ఆయన కృషిచేయుచున్నారు. మరియు మనదేశమిప్పుడు పరాధీనము; 'రాజకీయస్వాతంత్ర్యముసిద్ధించనందున దేశీయులకు మతవిషయంలోను సరియైన వ్యక్తినికాసమును, జాతీయాభివృద్ధియు లేవు' అని ఆయన అనుభవమువల్ల గ్రహించి, 1919 నుండి ఆర్థికరాజకీయములలోను కృషి నారంభించినాడు. ఆయాజాతీయ సమస్యలన్నిటి పరిష్కారముకును ఆయన అహింసాపద్ధతినే పెట్టినారు. ఈనవ్యపద్ధతి కార్యక్రమములోను గాంధిగారివ్యక్తిలోనుగల మహత్వమును, పటేలు, రాజేంద్రప్రసాదు, నెహ్రూ, చిత్తరంజన్, పట్టాభి, ప్రకాశం, రాజగోపాలాచారి మొదలగు జాతీయనాయకులు (కొంతవరకు ప్రజాసామాన్యమును) గ్రహించినారు. †అహింసాసిద్ధాంతమే అన్ని రంగములందు మోక్షసాధనమని దాని మూర్తరూపమగు నిర్మాణకార్యము సమలుజరుపవలెనని జాతీయమహాసభయు అంగీకరించి, అప్పటినుండి అట్లే అనుసరించుచున్నది. ఆయన పరిశుద్ధతవల్ల ఆయన గుణములన్నియు తక్కిన నాయకులకును జనసామాన్యమునకును వెంటనే ఆదరణీయమైనవి. ఆయన దరిమిలా జీవితమంతయు, అనగా ఆయన నడిపినసత్యాగ్రహములు, నిర్మాణకార్యాంశములు వగైరాలు మన జాతీయజీవితము కంతటికి సర్వస్వముగ నున్నవి. కనుక వాటి చర్చసందర్భములో ఆయన దరిమిలా జీవితమును విశదమగును. 1920 నుండి ఆయన చరిత్రయు మన జాతీయచరిత్రయు మిళితమైనవి.

---

† అహింసాసిద్ధాంతమును కాంగ్రెసుమహాసభ స్వీకృతముగా మొదటిసారి 1920 సంవత్సరం డిసెంబరులో జరిగిన నాగపురసమావేశములో అంగీకరించి తీర్మానించినారు.

10. రాజకీయరంగము.

ఆధ్యాత్మికోన్నతి కాత్మవికాసమే ముఖ్యముగ కావలెను. ఆ యాత్మవికాసముకొరకే పూర్వపుమునులు, రాజర్షులు ఆయాసాధకులు ను తపశ్శక్తిగల్గి కృషిచేయుచుండిరని వింటిమి. కాని, ఆత్మవికాసము స్వతంత్రులకేగాని కలుగదు. పరాధీనజనుల జీవితము సంకుచితమై ఉదారభావములు నశించునని, జీవితము క్షీణించునని యిదివరలోనే చూచియున్నాము. కనుక విదేశీయులపాలనలోనుండుట జాతికంతకును చాల బాధకము. పరపరిపాలన మహాహింసయై, అన్నివిధములను పీడా కరమగును. ఈసంగతిని మనపూర్వులును గ్రహించి, అప్పుడప్పు డు ద్రోహించియే యున్నారు.† ఆధునికజీవితములో పరరాజ్యపాలనము మరింత బాధకమనియు మనము గ్రహించియున్నాము.

అందును బ్రిటిషుసామ్రాజ్యపద్ధతి బహుగూఢమై విచిత్ర మైనది. ప్రత్యక్షహింసలేకుండ మనజనుల నిర్వీర్యస్థితిలోనుంచి స్వాతం త్ర్యబుద్ధిని స్వేచ్ఛాతేజమును క్షీణింపజేసి, తమ విజాతీయసంస్కృతి నిక్కడ వ్యాపింపజేసి, ఆర్థికముగను ఈదేశపుసారమును నొప్పితెలియ కుండనే నొక్కిలాగుచు, ఇక్కడి సంపదను వీలై నంతవరకు తమ లాభ ముకు వినియోగించునట్లు తమ సంస్థలేర్పర్చుట సామ్రాజ్యపద్ధతి. ఇట్లు ప్రజానిశ్రేయసమును జనుల ఆత్మోన్నతినికోరు కార్యకరులందరు రాజ

† సర్వం పరవశం దుఃఖం సర్వమాత్మవశం సుఖం॥ (మనుస్మృతి 4-159.)

వసత్యదసో భ్యేప్యవ మిరజనో యఃపరాధీనవృత్తిః (కాళిదాసు మేఘసందేశం)

పరతంత్రజనముల పాలికవ్యములు చెప్పంగవలవియే శివుఁకుపైన, పంజరములనున్న పక్షులరీతి, గంగిరెద్దులవాడు కావరమదచి మనుతాడుబాడించిన బోడెద్దులట్లు..... నైజదుర్భాగ్యమోనస మదిదక్క వాక్కాయములు రెండు బంధింపబడునా; మగనులో బుట్టిన మంచితలంపు లాచరణమునందు నలవికాకున్న, జన్మఫలంబేమి చచ్చుటేమేలు... పార్థివాయిటువంటిపారతంత్ర్యంబు కటకటా పగవానికైనను కలదు.

(పల్నాటివీరచరిత్రలో 'సందేశము.')

కీయస్వాతంత్ర్యముకై కృషిచేయవలెను. కనుక గాంధిమహాత్ముడును 1919 సంవత్సరం నుండి ఇక్కడి రాజకీయరంగములో ప్రవేశించి స్వాతంత్ర్య సిద్ధికై తీవ్రయత్నము చేయుచున్నాడు. అప్పటికి గాంధిగారు బ్రిటిషు వారిసద్భావమందు నమ్మికగల్గియుండిరి; కనుక మితవాదులవలె ఉప నివేశస్వరాజ్యమే కోరుచుంటిరి. బ్రిటిషువారీదేశమునకు స్వయంనిర్ణయప ద్ధతిని బాధ్యతాయుత ప్రభుత్వ మిత్తునని 1917 సంవత్సరంలో ప్రకటించిరి. కాని; అది యుద్ధకాలపు ఆపత్తు మొక్కవంటిదని పిమ్మట తేలినది. 1919 సంలో అమలుకు తెచ్చినరాజ్యాంగంలో నేర్పర్చిన శాసనసభలకు మంత్రివర్గమునకు నిజమైన రాజ్యాధికారము లేదు. వాటివల్ల కొంతపాలన ఖర్చు ఆడంబరము విస్తరించినవి. మరియు రాష్ట్రములలోమాత్రం ద్వంద్వపాలనవేర కొన్ని శాఖలు మంత్రులకిచ్చిరి; ముఖ్యశాఖలు నిరంకుశుల వశంలో నుంచినాగు,మితవాదినాయకులా యుద్యోగముల కాకృష్టులైరి. ఈలోగా బ్రిటిషుపాలకులు కొత్తనిర్బంధశాసనములు తెచ్చి, ప్రజల కున్న స్వేచ్ఛనుమూడబెరుకసాగిరి. చాలమందికి నిర్బంధశిక్షలు లభించినవి. యుద్ధములో భారతీయులద్రవ్యము జనులు తోడ్పడినందుకుబదు లిట్లు నిరంకుశతను హెచ్చించినారని జాతీయవాములు క్రుద్ధులైరి. మరియు, కాసుత్తోమారకపు రేటు వగైరాలు తమకులాభకరముగమార్చి, సర్కారు బ్రిటిషువర్తకమునకు ప్రోత్సాహమును ఈదేశపు పరిశ్రమలకు వ్యాపారమునకు అపారనష్టమును గల్గించిరి. ఈప్రజాందోళనవల్ల, విప్లవోద్యమమునకు బలముచేకూరినది, అశాంతి పెరిగినది. ఈస్థితిలో గాంధిగారి సూచనప్రకారం కాంగ్రెసువారు అధర్మమునకు సిద్ధపడినప్రభుత్వముతో సహకారమువాని 'అసహకార'ము సాగింపనిశ్చయించిరి. కాని "హింసాతత్వము నిజమైన ప్రజాయత్తపద్ధతికి వ్యతిరిక్తము, అసహాయోగపు తక్కిన కార్యక్రమమునకు నిరోధకము అనియు తీర్మానించినారు.*

* 'The spirit of violance is not only contrary to the growth of a true spirit of democracy, but actually retards the enforcement, if necessary, of the other stages of Non-co-operation.'

నాగపుర కాంగ్రెసు తీర్మానము 1920 సంవత్సరం డిసెంబరు.

ఇట్లు అప్పుడే గాంధిగారి బోధపైన కాంగ్రెసువారు "శాంతన్యాయపద్ధతులద్వారా స్వరాజ్యము సంపాదించుటే కాంగ్రెసు ఉద్దేశము." అనియు తీర్మానించినారు* ఈఅహింసాసూత్రమే అప్పటినుండి మన దేశపు జాతీయకార్యక్రమమంతటికాధారముగ నున్నది. హింసాకరమగు సామ్రాజ్యపద్ధతికి తోడ్పడుట హింసావ్యాప్తికి సాయముచేయుటే; కనుక దానికి నిరోధము తప్పదు. అయితే హింసను హింసతోకాక, అహింసతోనే యెదుర్కొనుట ప్రశస్తమను సూత్రము ప్రతిపాదితము. అప్పటి 'స్వరాజ్య' నిర్వచనముగూర్చి యొకమాట. బ్రిటిషు సామ్రాజ్యాంతర్గత మగుఉపనివేశపద్ధతియని మితవాదులు, సామ్రాజ్యసంబంధము లేనిపూర్ణ స్వాతంత్ర్యమనిఅతీయవాదులును తగువ్యవధుచుండిరిగదా! అహింసావాదియగు గాంధిగారీ రెండుపక్షములను సమన్వయపర్చినారు, అహింసావాది ప్రతిపక్షికి సద్భావన మసలేలేదనడు. సర్వజనాంతర్గతమగు ప్రేమరసము బ్రిటిషువారి హృదయములోను కలదు. కాని, స్వార్థపరతవల్ల ఆవృతమై కలుషితమైనది. మనలో తగినంతప్రేమ, త్యాగము, ఐకమత్యము, విస్తరించినప్పుడు బ్రిటిషువారిలోను ప్రేమతత్వము బయటకు రావచ్చు; అప్పుడు వారు తమంతట స్వరాజ్యమీయవచ్చు; మతము, భాష, ఆర్థిక క్షేమము, వగైరాలలో భిన్నతయున్నను, బ్రిటిషువారు మనకు స్వరాజ్యమిచ్చుట తమకును క్షేమకరమని గ్రహించి అట్లు జరిపితే, ఉపనివేశస్వరాజ్యమునే మన మంగీకరింతుము. అట్లు తటస్థింపకుంటే పూర్ణస్వాతంత్ర్యమే మనలక్ష్యమగును† అనగా, సామ్రాజ్యసంబంధము పోగొట్టు బాధ్యత బ్రిటిషువారిపైనే యుంచబడినది.

---

* The object of the Congress is the attainment of Swaraj by peaceful and legitimate means.

నాగపుర కాంగ్రెసు తీర్మానము.

† I would strive for Swaraj within the Empire but would not hesitate to sever all connection if severance became a necessity through Britain's own fault.

1924 బెల్గాంలో గాంధిగారి కాంగ్రెసుఅధ్యక్షోపన్యాసము.

1919-22 లలో జరిగిన అసహాయోగములో బ్రిటిషువారు 'మాంటెగు చెంస్ఫర్డు' చట్టముప్రకార మేర్పర్చిన కొత్త శాసనసభను కాంగ్రెసువారు బహిష్కరించిరి. కాని, ఈయుద్యమపు బలముతగ్గి 1922 లో కాంగ్రెసులో చీలికగల్గెను. ఒకపక్షము శాసనసభాప్రవేశపు కార్యమును 'స్వరాజ్యపక్షు'మను పేరుతో నారంభించి, లోనుండి ప్రతిఘటన మారంభించిరి. అది త్రికరణశుద్ధమగు అహింసాపద్ధతికాదని గాంధిగారు భావించిరి; ఈశాసనసభలు వ్యర్థములని ప్రతిఘటనచేసి ఆర్థికపుబిల్లుకు క్రూర శాసనములను సభలలో నోడించినను, సర్కారువారు వాటిని చట్టములుగచేసి అమలుజరుపు అధికారము పెట్టుకొని, అట్లు చేసినారు. కనుక ఆశాసనసభలోనికార్యక్రమము వ్యర్థమైనది. ఈకార్యక్రమమువల్ల బ్రిటిషుపాలకులు జాతీయనాయకులలో నిభేదము గల్పించినారు. సాంఘికంగాను ఆయాప్రముఖులమధ్య అసూయాప్రబలినది. అంతట సభాబహిష్కారపుధోరణి మరల యేర్పడినది.

స్వరాజ్యం నిమిత్త మాతురపడు మన దేశముకిట్లు రాష్ట్రాలలో మాత్రం పనికిమాలిన ద్వంద్వప్రభుత్వమునిచ్చి నిజమైన అధికార మంతను ఢిల్లీలో కేంద్రప్రభుత్వముకిచ్చి బ్రిటిషుసర్కారువారు నిరంకుశంగా పాలించుటను చూచినాము. కాని దక్షిణాఫ్రికా, కెనడా, ఆస్ట్రేలియా వంటి తమవలసరాజ్యాలగూర్చి బ్రిటిషుప్రభుత్వపు ధోరణి వేరైనది. వారికిదివరకే చాల యధికారమున్నది. 1926 సంవత్సరంలో సభచేసి, వారింకను కోరిన పాలనాధికారమంతను వారికి బ్రిటిషుప్రభుత్వము ప్రసాదించినది. కాని అక్కడను తెల్లజాతివారిదే అధికారము; ఆవలసజాతులది బ్రిటిషుప్రజలది ఒకటే జాతి, భాష, మతము, నాగరికత; వారికి పరస్పర సంబంధబాంధవ్యము లెన్నియో ఉండును. కనుక, తమవారి కధికారమిచ్చి, మనకు లేకుండ జేసినారు.

మన రాజ్యాంగమును, మన అర్హతను పరిశీలించుటకని తెల్లవారి సంఘమొకటి యేర్పడి భారతీయులహక్కులకు వ్యతిరేకముగ రిపోర్టు చేసి

నది. భారతీయ నాయకులకొక బహుజనాభిప్రాయముంచే అట్లు చేయు టకడ్డములేదని బ్రిటిషువారు సాకుచెప్పినారు. కాని యిదివరలో భారత శాసనసభ్యు, లొకసారియు నెహ్రూకమిటీరిపోర్టులోనొకసారియు, మితవా దులుసహా అన్నిపక్షములవారు బాధ్యతాయుత ప్రభుత్వము నేకగ్రీవ ముగ కోరినారు. కాని వాటినన్నిటిని సర్కారువారు తుడిచిపెట్టినారు. శోషణపద్ధతితో మన దేశమునుండి ఆర్థికంగా సాలీనా కోట్లకొలది సవ రినుల రాబట్టి, వివిధ లాభమొందు సామ్రాజ్యపరులు మన కార్థిక స్వాతంత్ర్య మీయనొల్లరు. తమకు సంబంధించిన సజాతీయులకేగాని భిన్ననాగరికతగల్గి వేరుజాతిగల భారతీయులకు బ్రిటిషువారు బుద్ధిపూ ర్వకముగ ఉపనివేశరాజ్యాంగము నివ్వరని స్పష్టపడినది. మరియు వారికి మనకు తత్వము, జాతి, నాగరికత భేదించినప్పుడు డొమినియను స్వరా జ్యము కర్థములేదు. మనదేశపు ద్రవ్యముసేన ఆర్థికనీతి పీటిని పూర్తిగ మన కొప్పగించిన, బ్రిటిషువాదిసామ్రాజ్యలాభముపోవును. వాటినీయని వలసరాజ్యాంగము మనకు వ్యర్థము. సామ్రాజ్యములో బ్రిటిషువాదితో సమాన ప్రతిపత్తి మనకుంచే బ్రిటిషుసామ్రాజ్య మంతటిలో హెచ్చు జనసంఖ్యగల మనదేశమే బ్రిటనుకన్నను ప్రముఖముగును; అట్టిస్థితికి వారొప్పుకోరు. కనుక సమానప్రతిపత్తి నీయరు. సామ్రాజ్యములో నున్నంతకాలము వారితో మనకు సంఘర్షముండును. ఈ సందర్భము లన్నిటి నాలోచించి పూర్ణస్వాతంత్ర్యమే కాంగ్రెసు ఆశయమని 1929 సం॥లో లాహోరులో జవాహర్లాలు అధ్యక్షతను కాంగ్రెసువారు తీర్మా నించినారు. నేటికిని, ఈయాశయమే భారతీయుల బహుజనాభిప్రాయము

స్వతంత్రమైనను మనదేశము బ్రిటనుతో విరోధపడనక్కరలేదు. ఆ యా దేశపు జాతులు; ప్రభుత్వములు పరస్పర రాంగీకారములతో మైత్రితో నుండవచ్చు. కనుక, స్వాతంత్ర్యోద్యమము అహింసా సిద్ధాంత ముకు అనుకూలమేగాని వ్యతిరేకము కాదు.

అయితే, ఈ స్వరాజ్యమును కేవలం శాంత న్యాయపద్ధతుల తోనే సాధించవలెనను సిద్ధాంతమును చాల ముఖ్యము. మన దేశపు ప్రస్తుతస్థితిలో హింసాపద్ధతి ఉపయుక్తముకాదు; పైగా మన యుద్యోగుల దౌర్జన్యముకును మనలో పరస్పరహింస చెలరేగుటకును కారణమగును; శాంతపద్ధతివల్ల స్వరాజ్యము కొంత ఆలస్యముగ లభించునను కొన్నను ఆ పద్ధతివల్ల మన ఆర్థికశక్తిసంఘటనము బాగుగ దృఢపడుట వల్ల, అది చిరస్థాయియై, లోకమంతటికి క్షేమకరమగును. పూర్ణస్వరాజ్యమును మనము స్వశక్తితో సంపాదించుకోవలెను. పూర్వపు జాతీయవాదులును దానిని తీవ్రకాంక్షతో కోరిరి. కాని, వారు మనకు తగిన ప్రజోపయుక్తమగు కార్యక్రమము పెట్టి అమలుజరుపలేదు. మితవాదులు సర్కారు కర్జీలతోను, అతివాదులు దూషణలతోను సరిపెట్టిరి. ఈరెండును వ్యర్థములే. అందుచే గల్గిన నిరాశవల్లనే విప్లవపక్షీయులై కొందరు యువకులు అధికారులపైన దౌర్జన్యముకు సిద్ధమైరి. వ్యక్తిహింసవల్ల సామ్రాజ్యసంస్థ యెన్నడును పోదు. దానికి సహాయకమగు సహకారమును ప్రజలీయకుండ, తమ అంతశ్శక్తిని వృద్ధిపర్చు కార్యక్రమము సాగించినప్పుడే సామ్రాజ్యబలముపోయి స్వాతంత్ర్యము సిద్ధించునని గాంధిగారు నిరూపించిరి అంతట విప్లవపక్షీయులు నిరాశను క్రోధమును వదలి, పరిణామమొంది, అహింసావాదులై, కొందరు అహింసాసమరమందు యోధులైనారు. ఈ నిర్మాణకార్యక్రమములో జాతీయజీవితపు అన్నిరంగములకు తగు ప్రణాళిక యున్నది. ఇట్లు సంఘమునుద్ధరించుటేగాక సత్యాగ్రహముద్వారా ప్రభ్యర్థిని లొంగదీయుటకును ఈకార్యక్రమము సాధకము.

11. ఆర్థికరంగము.

1. ఖదరు.

ఆర్థికముగ మనదేశమొట్టి దౌర్భాగ్యములో నున్నదో అందరికిని తెలిసినదే. నూరేండ్లక్రిందటివరకు సర్వశక్తి సంపన్నమై తన నన్నబట్ట లకు శిల్పకళలకు దేశదేశములంగును ప్రసిద్ధిగాంచి నాయకమణియైన దేశమిప్పుడు కోట్లకొలది జనుల కొకపూటయు సరిగ తిండి బట్ట దొరకక తల్లడిల్లుచున్నది. జనులలో చాలమందికి వృత్తులులేవు. మనదేశమందిప్పుడు 3/4 వంతు జనులకు వ్యవసాయమే వృత్తియని సర్కారు లెక్కలలో నున్నది కాని, ఇందులో నిజంగా వ్యవసాయవృత్తిగలవారి సంఖ్య మిక్కిలి తక్కువ: ఇందులో నెందరో వృత్తిహీనులు వ్యవసాయ కులపై నాధారపడువారు చేరియున్నారు. మనదేశము వ్యవసాయ ప్రధానమని పరిశ్రమ వస్తువులు విదేశములనుండియే రావలెనను వాదము సరికాదు. ఇదివరలో స్వయంసంపన్నమగుటేగాక, మనదేశ మితరదేశ ములకు రకరకముల సరకులు పంపేదిగదా! ఇప్పుడు రాజకీయ పరా ధీనతతో పాటు విదేశపుసరుకుల దాడివల్లను జనుల రుచిమారుట వల్లను ఆర్థికదౌర్బల్యము గల్గినది. ముఖ్యంగా అన్నము బట్ట గల్గినప్పుడే జనులకు శాంతిస్థిమితము పరస్పరమైత్రి యుంచును. మనదేశపు శీతోష్ణ స్థితి నేల మంచివి, కనుక పంటకు లోటులేదు. జనులకు వాటిని కొను శక్తియు కట్టబట్టలుమాత్రము కావలె; ప్రజలందరిబట్టలకు కావలసినంత ప్రత్తి మనదేశమందున్నది. పూర్వం దానినుండి ఇక్కడ చక్కని ఖదరు వస్త్రములు తయారయేవి. కాని పిమ్మట బ్రిటిషు జపాను మిల్లులలో నుండి వచ్చుబట్టలను జనులుధరించుటవల్ల ఖదరు పరిశ్రమమూలబడినది.

ఇటీవల జాతీయవాదులు మనజనులీదేశపు వస్త్రములనే ధరింప వలెనని గుర్తించిరి. కాని ఆర్థికంగా పాశ్చాత్యులవలె మనవారు ఖదరు వ్యర్థమనియెంచి, ఈదేశమందే మిల్లులుకట్టించి వాటిలో సమృద్ధిగ బట్టలు

తయారుచేసి వాటిని వాడవలెనని కోరిరి. కొందరు శ్రీమంతులు బొం బాయి, అహమ్మదాబాదు వగైరాలలో బట్టలమిల్లులు స్థాపించిరి. వాటిలోనిది ముదుకనూలు. తాతాకంపెనీ వగైరాల మిల్లులలో కొంత వరకు సన్ననూలును తయారైనది. అయితే క్రియలో విదేశవస్త్రములవాడుక అంతగా తగ్గలేదు. మహాయుద్ధ (1914-18) కాలమందుమాత్రం బ్రిటిషుసరకుల దిగుమతితగ్గి, మనదేశపుమిల్లులు వృద్ధియైనవి. కాని యుద్ధాంతమందు మరల పోటీగల్గినది. ఇంతలో చీనాలోని ప్రకృతి సాహ కర్యములుపయోగించి, జపానీయులు తమమిల్లుల చౌకబట్టలతో మనబజా రులు నింపివేయుచున్నారు. ఈవిదేశపుసరకుల పోటీవల్ల మనదేశమందు పరిశ్రమ లేక జీవనాధారము క్షీణించి, సామాన్యులెట్లు బాధపడినారో చూచియున్నాము. ఈఆర్థికహింసనాపి, జనులకన్నమిచ్చుటకు స్వదేశీ కావలెను. శుద్ధస్వదేశీయే చికిత్స.

ఈదేశపు మిల్లులద్వారానే స్వదేశీని సాధింపగలమా? ఒక్కొ క్క మిల్లు స్థాపించుటకు లక్షలకొలది రూపాయలు కావలెను. దీనిని సరిగా నడుపుటకు మరికొన్నిలక్షలు కావలెను. గొప్పశ్రీమంతులే అట్టి మిల్లులుస్థాపింపగల్గుదురు. మనబీదదేశంలో అట్టి పెద్దమిల్లులు నడుపుటకు జనులకు సొమ్ముచాలదు. జాయింటు స్టాకుపద్ధతిని సాగించుటకు తగినంత సంఘటనము సహకారమును కష్టము. మిల్లుయంత్రము లీదేశంలో తయారుకావు. చాలవర కివి ఇంగ్లండు జపాను వగైరాలలో నుండును. ఆదేశీయులు తమతో పోటీగల మనమిల్లుదార్లకు ప్రశస్తమైన కొత్త యంత్రాలీయరు. కేపుసుంకములు ఇత్యాదులవల్ల వాటికికూడ కిమ్మత్తు చాలహెచ్చు. వాటిమరమ్మత్తుకు పనిముట్లకు భాగములకును తరుచు విదేశములపై నాధారపడవలెను. అందువల్లను చాల చిక్కులున్నవి. (ఇది ఇటీవల రాజమహేంద్రవరపేపరుమిల్లు సందర్భంలో అనుభవమైనది.) ఆధునికవిజ్ఞానము పాశ్చాత్యదేశాలలోను జపానులోను చాలవృద్ధియైనది. చాల ఖర్చుతో గొప్పపరిశోధనశాల లేర్పడినవి. ఇట్లు విదేశపు మిల్లు

లలో ఆయాంత్రికపరిశోధనలద్వారా సాలీనా మార్పులు కొత్తసౌకర్యములు, కల్లుచున్నవి. బహుళోత్పత్తి హెచ్చుచున్నది. పరిశ్రమలకు పరస్పర సంబంధమున్నది. యాంత్రిక సంస్కృతి వృద్ధియైనప్పుడే మిల్లులు లాభకారిగ పనిచేయును. అట్టి ప్రశస్తయంత్రముల నాజూకు బట్టలతో మనమిక్కడి మిల్లులద్వారా సర్కారు సహాయములేకుండా పోటీ జేయుట కష్టము. మరియు మనదేశపు ప్రభుత్వపు సానుభూతి బ్రిటిషు పరిశ్రమ వైపే యుండును. (ఆసంగతి యిటీవలజరిగిన 'ఇండో-బ్రిటిషు వ్యాపార సంధిలోను బయటపడినది. తుదకు జపానుతో పోటీలోగూడ మన ప్రభుత్వమిదాదేశముకు తగుసహాయ మిచ్చుటలేదు.) మరియు నాజూకు నూలుతీయుటకు వలయు ప్రశస్తమైన పొడుగుపోచగల ప్రత్తి యీదేశపు నేలలో వృద్ధియగుట అరుదు. ఇంతేకాక ఈమిల్లు యంత్రముల కొనుబడికి నెంతోసొమ్ము విదేశములకు ధారబోయవలెగదా ! ఇట్లు సొమ్మును లంకపైకుబదులు విదేశంలోనే బర్మింగుహాము వగైరాలకు పంపుదుము. సన్ననూలు తీయు మనమిల్లులును చాలవరకు విదేశపు దూదినే వాడుచున్నవి. అనగా ఆబట్టలదూదికి సొమ్ము విదేశముకు పోవును. మిల్లుబట్టలనే వాడుటవలన ప్రత్తి సాగుచేయు మనవ్యవసాయకుల దూదికి ఖర్చుతగ్గినది. అనగా వ్యవసాయకులకు నష్టమైనది. మరియు అందువల్ల ప్రత్తిసాగుమాని హెచ్చుమంది మిర్చి, పొగాకు వగైరా హానికరమగు పంటలవెట్టినారు. పేటికిబదులు ధాన్యాదులు పెట్టినను ఉత్పత్తిహెచ్చి వాటిగిట్టుబాటు తగ్గును. ఖదరునే వాడితే ఈరయితులు పండించు పత్తికి చలామణిగల్గి, వడ్రంగులు వగైరాల శిల్పులకు వ్యవసాయకులకును లాభించును. ఖదరుస్వదేశియని గుర్తించుటయు, సులభము. మిల్లుబట్టలదూదియు, నూలును, విదేశపుగో, స్వదేశపుగో సాధారణంగా విద్యావంతులును గుర్తింపలేరు ఇక అజ్ఞానులందరి సంగతి చెప్పనక్కరలేదు. మరియు యీదేశంలోను -'కర్నాటకు, బ్మాంబాం' వగైరాలు బ్రిటిషువారి మిల్లులున్నవి. వాటిపైన లాభము చాలవరకు

విదేశీయులకు పోవును. మనదేశంలో నూటికి 92 నిరక్షరులు. అట్టిఅజ్ఞానులు భేదముగ్రహించలేక బజారులో వర్తకులపై నాధారపడుదురు. వర్తకులనడిగితే, సహజంగావారు స్వలాభమే ముఖ్యముగ నెంతురు. కొన్ని మల్లుతానులును ముఖ్యంగా రంగుబట్టలును, నేతబట్టలును ఎక్కడివో విద్యావంతులును గ్రహించలేరు.

స్వదేశమిల్లుబట్టలే కొనుమనువారును ఇట్లు క్రియలో తరుచు ఏజపానుబట్టలో కొనుట జరుగును. శీతలదేశపు దృఢగాత్రులు ఫాక్టరీ వాతావరణంలో తయారై విద్యావంతులునగు బ్రిటిషుజపాను కార్మికుల తో సరిగా పోటీచేయుట ఇప్పటిస్థితిలో మనకార్మికులకు సాధ్యమును కాదు. వారికున్నట్లు అవసరమగు ప్రభుత్వపుసాయమును లేదు. ఈస్థితి లో మిల్లులద్వారా బట్టలకు పూర్ణస్వదేశిని సాధించుట కలలోనివార్త. ఖదరుద్వారానే పూర్ణస్వదేశీ సాధ్యము. దానికిచ్చు సామ్మంతయు మన బీదలకే ముట్టును.

స్వదేశీయుద్యమము 1906 సంనుండియు సాగినసంగతి నిజమే. దానిని బ్రిటిషువారిని సాధించు హింసాభావముతో జరిపిరి; మరియు, అప్పుడు మనదేశపు మిల్లుబట్టలపై నాధారపడిరి. మిల్లులు కొన్నిప్రాంతాలలోనే యుండును. వాటిని ద్రవ్యలాభముకొరకే ధనాఢ్యులు నడుపుదురు. తమమిల్లుబట్టలకు స్వదేశీవల్ల గిరాకికలుగగనే, వారుసహజముగ ధరలపెంచించిరి; కొందరు వర్తకులు విదేశిమిల్లుబట్టలును స్వదేశీయని నమ్మించిరి. ఇట్లాయుద్యమము క్షీణించినది. బ్రిటిషువారి మిల్లుబట్టలవ్యాపారము హింసాధారము. ఖదరువల్ల విదేశీబట్టల కిక్కడ బహిష్కారముకల్గునుగనుక విదేశీయులపైన ద్వేషముకల్గదాయని యొక ప్రశ్న, అయితే, ఈవిలాయితీ మిల్లుబట్టలవ్యాపారము మనదేశపుద్రవ్యము నన్యాయముగ రాబట్టుట కక్కడిపుంజీపతులు జరుపుచున్నారుగదా! మరియు, ఇప్పుడు బ్రిటనుజపానుల జాతీయసంపదయు జనుల దామాపారాబడియు ఈదేశపుకన్న చాలపెచ్చు, ఆంగ్లేయులు పుంజీభూతత్వము ధనాధిక్యమువల్ల మత్తులైయున్నారు. అక్కడికార్మికులకు

ఇక్కడియుద్యోగు లనేకులకన్నను హెచ్చు జీతము ఉపపత్తికలవు. నిరు
ద్యోగుల సర్కారుపోషింతురు. ఇక మధ్యవర్గీయుల ఆదాయము ఇక్కడి
పైతరగతివారికన్నను హెచ్చు. మనదేశము నాగరికలోకమంతటిలో
నతిదరిద్రము. అనగా బ్రిటను అతిభోజనపుబాధవల్లను, హిందూదేశ
ము అభోజనమువల్లను బాధనొందుచున్నట్లున్నవి. ఇంగ్లండు జపానుల
నింకను శ్రీమంతముచేయుటకని, మనబీదదేశము నింకను దరిద్రముచే
యుట అహింసాపద్ధతియగునా? అసలు మిల్లులపద్ధతిలో హింసాతత్వ
మిమిడియున్నది. ఆర్థికంగా మిల్లులవృద్ధివల్ల కొద్దిమందిధనికులు మరింత
ధనాఢ్యులౌదురు. కొద్దిమందికార్మికులు నెట్లోజీవింతురు. కాని, అంతకు
సూరురెట్లు బీదల ఏకువఁజుకు, నేతవడ్రంవగై రా వృత్తులు నశించి ఆవృ
త్తుల వారందరును దుర్దశపాలౌదురు. సాధ్యమైనంతవరకు నరులకు బను
లు యంత్రములద్వారా ఉత్పత్తిచేయుట యాంత్రికసిద్ధాంతము. పరిశో
ధనద్వారా కొత్తరకపు యంత్రములు తెచ్చుకొలది పనివాండ్ర అవస
రము తగ్గుచున్నది. వాటివల్ల కొంతశరీరశ్రమ కలసివచ్చేనూట నిజమే.
కాని, మనదేశంలో పనులు తక్కువ, జనసంఖ్య హెచ్చు. జనులదేహశక్తి
పరిశ్రమవల్లనే వృద్ధియగును, అది వినియోగంలేక క్షీణించుచున్నది. కోట్ల
కొలదిజనులు నిరుద్యోగులైనారు; వీరికికొద్దిజీతముకైన పనికావలె.

ఇక సాంఘికఫలము చూడుడు: మిల్లుల కూలీలపేటలు బస్తీలుగ
నేర్పడి, బొత్తిగా కిక్కిరిసి తగుగాలి వెల్తురు జలసమృద్ధాయము లేక, అనా
రోగ్యముతోనుండును. వీరుపనిచేయు కార్ఖానాయంత్రాలు మహాధ్వని
తో నాడులనుద్రేకింపజేసి వేడివల్లను అనారోగ్యకరమై కృత్రిమస్థితిలో
నుండును. ఇట్టిస్థితిలో వారు పగలంతయు పనిచేసి కలుషితవాయుపూరిత
బలుపుపనిచేసి వత్తురు; ఇది అపరిస్థితులవల్ల కలిగేది. స్త్రీలు పురుషులు
సాకారికై పరస్పరమును పిల్లలను విడిచియుండురు, రాత్రులును తమ
ిరుకు కొట్లలో పశుప్రాయులుగ వర్తింతురు. స్త్రీలు పురుషులకన్నను
చాలబాధపడుదురు; మేస్త్రీలువగైరాలకు లోబడవలె. ఈకూలీలు యం

త్రములవలెనాదరు; యజమానులు వీరిని కీలుబొమ్మలవలె నుంతురు. ఇంగ్లండుకన్నను, ఇక్కడి యున్నస్థితిలో కూలీలయవస్థ మరింత దుర్భరము. ఈకూలీలలో వ్యభిచారము త్రాగుడు హెచ్చుగ వ్యాపించి, నైతికముగను ఫాక్టరీలు హానిగల్గించుచున్నవి ఫాక్టరీపద్ధతి అంతర్జాతీయముగను హింసాకరము. ఆయాదేశముల మిల్లుదార్ల మధ్య పోటీవల్ల విరోధములు, యుద్ధములుకూడ కల్గుచున్నవి. మరియు మిల్లుయజమానులు చౌకగ సరుకు లుత్పత్తిచేయుటకై తమ కార్మికులకు జీతమును సౌకర్యములను వీలైనంతతక్కువగనే చేయుదురు. కార్మికులు సహింపలేక మిల్లుదార్లను సమ్మెలద్వారా నిర్బంధముగ సాధింపజూతురు. దౌర్జన్యము జరుగును. ఇట్లు వర్గసంఘర్షమును అంతువల్ల హింసాతత్వమును వ్యాపించును. పెట్టుబడిదార్లు తమలాభద్రవ్యమును స్వలాభముకును, అధికారములకును కొంతసర్వ్యసనములకును ఖర్చు చేయుదురు. కనుక మిల్లుల పద్ధతి సర్వవిధముల సంఘర్షముకు హింసకు కారణము. కనుక నిజమైనప్రజాభిమానులు అహింసాపరులును ఖదరునేకొనవలెను.

ఖదరు కట్టిబాధ లుండవు. తకిలీకి చర్కాకు పెట్టుబడి నామమాత్రము, ప్రతివారికి అందుబాటైనది, కనుక స్వగృహములోనేయుంచి పిల్లలు పెద్దలుగూడ పరిశుద్ధపరిసరములో వీలువెంబడిని స్వేచ్ఛతో పని చేయుచు, వడికి నేసుకోవచ్చు. అట్లు తయారుచేయుబట్ట ఆపనివారి స్వంతమగును. దానిని తామే ధరింపవచ్చు, లేదా అమ్మి సొమ్ము చేసుకోవచ్చు. మరియు ఖదరు కొనుట కిచ్చుసొమ్మంతయు దానిని తయారుచేయుబీదప్రజలకే ముట్టును. అనగా, ఖదరుకెక్కువ సొమ్మిచ్చినను దానిద్వారా బీదలను పోషించి ధర్మము చేసినవారమగుదుము.†

యాంత్రికదేశాలలోను రాట్నపుపరిశ్రమ, చేతినేత కొంతవరకు జరుగుచున్నవి. కొట్లకొలది పనిలేక అల్లాడు ఈదేశంలో అట్టి పరిశ్రమ

†శ్రీమంతులు ధనికులను కాక బీదలనే పోషింపవలెనని పూర్వులు చెప్పినారు.
'హరిదాస్ భర కాంతేను, మా ప్రభు చ్చేశ్వరే ధనం.' (మహాభారతం)

అవసరము. ముఖ్యంగా అనాథస్త్రీలు వగైరాలు స్వతంత్రంగా యింట నుండియే ప్రాణమానముల గాపాడుకొనుట కందరికీ అందుబాటు గల పరిశ్రమ దూదిపట్టుల రాట్నపుపరిశ్రమయే.

మరియు మనదేశంలో శీ వంతుకుపైగా జనులకు వ్యవసాయమే జీవనాధారము; కాని, తరచు సాలీనా సుమారు రారునెలలే వ్యవసాయపు పని యుండును. అల్పమును ఈవిశాలదేశంలో ఇందరికి వ్యవసాయవృత్తి చాలదు; ఇంతేకాక, అతివృష్టి అనావృష్టి వగైరా యీతిబాధలవల్లను అకాలపు వానానష్టమువల్లను కొందరికి నష్టము వచ్చుచునేయుండును.* చాయలసీమవంటి కొన్నిప్రాంతాల్లో జలవసతి చాలతక్కువగుటవల్ల క్షామదేవత స్థిరముగ వసించుచున్నది. కనుక మనవ్యవసాయదారులకు వీలైన ఉపపరిశ్రమగూడ ఉండుట చాలఅవసరము. అందుకు అన్నివిధములను తగినది ఏకుట రాట్నపుపరిశ్రమ నేయుటే. ఇందువల్ల వారు పండించు ప్రత్తికి చలామణీయు హెచ్చును. దీనిని జనులు నేర్చుకొనుటయు సులభము. ఆబాలగోపాలమును ఎక్కువశ్రమలేకుండ యీపని చేయగలరు. అద్దకం వగైరాలకును ప్రోత్సాహము కల్గును.

వడకుట, నేయుట మృదువైన దేహపరిశ్రమను గల్గించి, ఆరోగ్యహేతువగును. ఇది శరీరముకు బాధలేకుండునట్లు మితమైన పరిశ్రమనిచ్చునది. నాడులను స్థిమితపర్చి, వాటి ఉద్రేకమును పోగొట్టును. నిద్రహముగల్గించును. ఉదయము, సాయంకాలము కొంచంకాలం వడికితే విశ్రాంతికాలముకు సద్వినియోగమగును. యంత్రాలలోవలె బడలిక ఆకులతవల్ల అనారోగ్యముండదు. హితమగు వ్యాయామము దేహారోగ్యము కవసరమని వైద్యశాస్త్రము చెప్పుచున్నది.

అట్టిస్త్రీలకు బాలురకు నీరసులకు అనువై ఇంటనే ప్రతివారు చేయదగు ఉత్పాదక పరిశ్రమ నూలు వడకుటే.

---

* కరువులున్నచోట ప్రస్తుతం ప్రభుత్వము నిరుద్యోగులచేత రాళ్ళు కొట్టుట వగైరా బండపనులు చేయించి జీతము లిచ్చుచున్నారు. అవి వ్యర్థములు. వాటికన్న దూది వడికించుట మంచిది.

ప్రతిదినమును సంధ్యావేళలందు నూలువడకుట ఆధ్యాత్మిక ముగను చాలప్రశస్తము. గీత మొదలగు ధార్మికగ్రంథాలలో బోధించిన ఏకాగ్రత కర్మపరత్వము విశ్వప్రేమభావము ఇందువల్ల కల్గును. అనగా నూలువడకుటవల్ల త్రికరణములద్వారాను ఆత్మనికాసము ఆత్మసాక్షాత్కారమును గల్గును. ముఖ్యంగా నూలువడకువారికి ఖదరుధారులకు సమత్వబుద్ధియు, ప్రేమయు, బీదలపైన సానుభూతియు కల్గునుండును. మరియు ఖదరులో మిల్లుపరిశ్రమలో నున్నంత వ్యాపార లాభతత్పరత మోసపు ప్రవృత్తియు నుండవు. ఖదరుకల్తీ తెలియుటయు సులభము. ఈరీతిగా ఖదరు అహింసకు సత్యమునకు వర్ధకము, ధార్మికతకు చిహ్నము.

ఇంకొకసంగతి: మనగ్రామములలో నిప్పుడు సోమరితనము పెరిగి పురుషకారము నశించినది. నిరాశవల్ల అదృష్టంవైపు దృష్టితిరిగినది. 'సోమరిమెదడులో దయ్యాలు పనిచేయునని ఇంగ్లీషులో సామెత యున్నది.* అనగా మురాలోచన లేర్పడును. గ్రామాలలో చీట్లాట కక్షలు విపరీతంగా పెరిగినవి. కక్షలతో కోర్టులలో తగువులు పెరుగుచున్నవి. ఇట్లు కాలము శక్తి దుర్వినియోగం కాకుండుటకును మనస్సును సత్కార్యమందు నిలుపుటకును రాట్నపుపరిశ్రమ మంచిసాధనము. ఇదినిగ్రహకరము. దీనివల్ల మనోవికాస మేర్పడును. హస్తపు శిల్పశక్తియు హెచ్చును. గదలు ముద్దరలు డంబెల్సు భౌతికశక్తినే హెచ్చించును. ఇందులోనో జనులందరికీ ఉపయుక్తమగు వస్తూత్పత్తిచేసి మంచికార్యము చేసినామను ఆనందము హృదయతృప్తియు నేర్పడును. ఈబీదల కష్టసుఖములు బోధపడి కర్మపరులందు సానుభూతియు సమత్వబుద్ధియు గల్గును. సామ్యజీవితమును ఉదారభావమును అలవడును. కొంతవరకు నిత్య ఖదరుదారులకు నిట్టిభావము లుండును.

ఖదరుపరిశ్రమ యాంత్రికోత్పత్తివలె ఇతరులను బాధించేదికాదు. ఈరీతిగా జనులలో అహింసాతత్వము వ్యాపించి దృఢపడును. ఇట్లన్నివిధ

* The idle man's brain is the devil's workshop.

ములను ఖదరు క్షేమకరము. అయితే జనులలో చాలమంది ఖదరును గట్టినప్పుడే ఈకర్మశ్రమకు జయముకల్గును కనుక, అహింసాభిలాషులందరును ఖదరు వ్యాప్తిని నియతంగా ప్రోత్సహించవలె.

కాట్నపుకృషి ఆర్థికంగా ఫలప్రదంకాదని కొందరాక్షేపింతురు. కాని, మనదేశమం దీయాక్షేపణ సరికాదు. తక్కిన నాగరికదేశాలన్నిటి కంటె సగటున మనదేశపుజనుల ఆదాయము చాలతక్కువ. శ్రీమంతులు దరిద్రులు కలిపి దామాషాను జనులకు రోజుకు $1\frac{1}{2}$ అణా మాత్రమే ఆదాయము. అనగా ఎందరో కోట్లకొలది జనులకు అంతమాత్రం రాబడియు లేదనిస్పష్టము. బాధలేకుండ రోజు కొనిమిదిగంటలు స్త్రీలు పిల్లలుగూడ వడుకవచ్చును. అందువల్ల రోజుకు 3 అణాలైనను గిట్టును. మరియు, ఏకూలియు లేనప్పుడీపనిచేయుట తప్పక లాభకరము. ముఖ్యంగా స్త్రీ లింటియొద్ద పనికి భంగంలేకుండ ఒక్కడనే 3 అణాలసొప్పున న్యాయసంపాదన చేయుట కింతకన్న సర్వసామాన్యపువృత్తి మరేమున్నది?

'మిల్లుబట్టలకన్న ఖదరుకు కిమ్మతుహెచ్చు కనుక కొనలేమ'నుట పరిపాటియైనది. కాని, ఇట్లనువారు తరుచు వ్యర్థమైన ఖర్చులెన్నియో చేయుటయు, హెచ్చుఖరీదుకు జరీపంచలు పట్టుచీరలుకొనుటయుకలదు. ఇదిగాక ఖదరుధర కొంచెము హెచ్చెనను, ఎక్కువ మన్నికకలది, కనుక మొత్తము మీద గిట్టును. ఖదరును బస్తీలలోని కొట్లలోకొనుటకన్న గ్రామములలో కూలికి నూలుతీయించి, అక్కడనే నేయించితే, తక్కువ కిమ్మతుకు గిట్టును. ఆధరకును కొనలేనివారు పెరళ్ళలో ప్రత్తిమొక్కలు మొలపించి ప్రత్తి నిలవయుంచి, ఆదూదితో యింటనే తీరికయైనప్పుడు నూలు తీయించవలెను. అప్పుడు నేతకూలిమాత్రమే తగులును. అది చాల చౌకగగిట్టును. ఇట్లు గట్టినిశ్చయముంచే ధర ఆటంకముకాదు. ఖదరే అహింసకు సూచకమని గ్రహించు ప్రతివాగును ఇట్లేదోరీతిని ఖదరు సంపాదించి కట్టుటే న్యాయము.

మిల్లుబట్ట నాజూకు యింపుగనుండునని, ఖదరు మోటవికృతము, అందము కళలేదు, అని కొందరియాక్షేపణ. ఇప్పుడు మిల్లుబట్టలు తరుచు ఖదరుకన్న సన్ననునుపు అగుమాటనిజమే. కాని, ఇప్పుడు మిల్లుకున్న విశేషప్రోత్సాహంలో దశాంశమైననుండే సన్నని వడుకునూలు తయారగును. పూర్వం 'ఢాకా మూర్షదాబాదు' వగైరాప్రాంతాలలో చేతితోవడికిన నూలుబట్టలు ఖండాంతరములలోను ప్రసిద్ధమై రాజాధిరాజుల దుస్తులైనవి; లోకైకసుందరుల దేహములలంకరించినవి. సన్న బట్టలు పదిగజములబట్టయును పిడికిలిలో నిమిడిపోవునంత సన్నముగనుండేవి. ఔరంగజేబు తనకుమార్తె వక్షస్థలము పైకి కనపడుచున్న దని కోపించెను; "అప్పుడామె ఏమునుస్తు లొకదానిపై నొకటి ధరించితిని; వాటి సన్నదనమట్లున్నది" అని జబాబిచ్చెనట. ఇప్పుడును తగు పోషణయుంటే మరల హస్తకౌశలము బాగుపడి, మంచినూలుతో మిల్లుబట్టలకు తీసిపోనిబట్టలు తయారుకావచ్చును. ఇప్పుడు వడుకువారికి ప్రోత్సాహమును తగు అభ్యాసమునులేకు. ఇవిగాక మనప్రాంతంలో మంచి ప్రత్తిసాగుచేసి, ఇంకను చక్కని నూలుతీయవచ్చును. అట్టిది యిటీవలనే సింధుప్రాంతములో వేయబడుచున్నది. మనప్రాంతములోను పరిశోధన జరుగవలెను. కొత్తమిరాచ ఎర్రిపత్తికన్న జడపత్తి కంబోడియాప్రత్తి ఇందుకు మంచివని తోచును.

రాట్నములలోను పరిశోధనచేసి మంచిరకపు రాట్నములను చేయవచ్చును. ఇటీవల కొన్ని మంచిరకపు రాట్నములేర్పడినవి. కాని ఈ విషయమున నింకను పరిశోధన జరుగవలెను. మరియు కళ చాలవరకు దృక్పథముపైన మనోభావముపైన నిల్చును. కొందరింద్రియాకర్షణనే కోరుదురు. పైకి ఉజ్వలముగ తోచునది నిదానించి చూడగా సుందరము కాకపోవచ్చును. బాహ్యసౌందర్యముకన్న ఆంతరికమే ప్రశస్తము. సరియైనభావములతో చూచితే యాంత్రికములకన్న చేతితోచేసిన వస్తువులే ఇంపగుట అనుభవసిద్ధము. పైకి సుందరమైనదే మంచిది సత్యమని

కొందరందురు. ప్రజాక్షేమకరమైనది ఆత్మవికాసకరమునే సుందరము అని ప్రాజ్ఞులెంచిరి. కనుక పూర్వులు 'సత్యం శివంసుందరం' అని వర్ణించినారు.

ఖదరు శాంతికి విశ్వప్రేమకు సూచకము. హింసాసంస్కృతిగల జర్మనీ జపాను వగైరాలలోను (ఇటీవల కొంతవర కింగ్లండులోను, జనులందరికిని నిర్బంధముగ సైనికశిక్ష పెట్టినారు. అనగా దేశమందు యువకుడగు ప్రతిపౌరుడును కొన్నియేండ్లు యోధుడై హింసాయుధధారణలో తయారై ఆ'మిలటరీ' దుస్తులుంచుకోవలెను. ఇందుకుబులు అహింసాసూత్రములో వడుకుట నేర్చి ఖదరు ధరించుట యోధలక్షణమగును. కనుక అన్నివిధములను అహింసాతత్వమువల్ల ఖదరుకు ప్రాముఖ్యమున్నది. ఖదరు ప్రేమకు త్యాగమునకు ధార్మికతకు సూచకము. నూలువడుకుట యజ్ఞమువంటిది. వడుకునపు డానందము కల్గును. ఇట్లు ఖదరులో ఆధ్యాత్మిక విశేషము నున్నది. అది శాంతిసైనికులదుస్తు.

దీనిప్రాముఖ్యము గమనించియే అహింసావ్రతము కీప్ప డాచార్యుడగు గాంధిమహాత్ముడు 1927 లో అఖిలభారత చరఖాసంఘమును రాజకీయసంబంధంలేకుండ స్థాపించినాడు. ఇది ఖదరు ఉత్పత్తికి విక్రయమునకు ప్రచారమునకు కూడ విశేషంగా కృషిచేయుచున్నది.

---

* గాంధిమహాత్ముని గీతావ్యాఖ్యయగు అనాసక్తి యోగపుటీకను చూడుడు.

12. ఆర్థికరంగము.

2 గ్రామపరిశ్రమలు.

ఇంగ్లండు జర్మనీవంటి ప్రసిద్ధ 'పారిశ్రామిక'దేశాలలో హెచ్చు మంది జనులు నగరవాసులు. మనదేశంలోను ప్రాచీనకాలమునుండి కాశి ఉజ్జయినీపాటలీపుత్రాది మహానగరములు వాటిని చక్కగ వ్యవహరించు వ్యవస్థలును గలవు. కాని మొత్తముమీద గ్రామములందే హెచ్చుమంది జనులుండుట రివాజు. పూర్వము గొప్పధీశక్తిగల ఋషీశ్వరులు దీక్షగల విద్యార్థులు అడవులమధ్య ఆశ్రమములందే వసించుచు మహామేధావులగుచుండిరి. ఇటీవల పాశ్చాత్యసంస్కృతితో సంబంధమున కలకత్తా బొంబాయి మద్రాసు మున్నగు పెద్ద పట్టణములు ప్రముఖములైనవి. కాని యిప్పటికిని నూటికి 90 మంది గ్రామవాసులే. కొద్ది సంఖ్య నగరములున్నను ఏడులక్షల గ్రామములున్నవి. మన విశాలదేశమందిట్లుండుట సహజమే పూర్వమునుండియు వనవాసమునకు వృక్షాది ప్రకృతి సౌందర్యోపాసనకు పరిశుద్ధజలవాయువులకు సూర్యతేజస్సుకు విముక్తతకు స్వేచ్ఛకు మనవారు ప్రాముఖ్యమిచ్చినారు. అట్టి గ్రామములిప్పుడు చెడిపోవుచున్నవి. అందుండు జనులు (వ్యవసాయములతప్ప) వృత్తులుపోగొట్టుకొనుటే గ్రామక్షీణమునకు కారణము. చాలమందినగరములకు జేరుచు, పాశ్చాత్యసంస్కృతిలోలులై, ఎట్లో జీవించుచున్నారు; మిగిలినవారు సోమరులైనారు. పూర్వపు దైనికనిత్యకర్మపద్ధతి చెడినది. కనుకనే ప్రతి గ్రామములోను కాలక్షేపమునకని చీట్లాట చదరంగంవగైరాలు విస్తారముగ వ్యాపించినవి. ఇందువల్ల విలువగలకాలము బుద్ధి దుర్వినియోగపడుచున్నవి. జనుల నిర్మాణశక్తి చెడుచున్నది. నిరాశ హెచ్చినది. కొన్ని చోట్ల జూదము ద్రాగుడు వంటి పెద్ద దురభ్యాసములును వ్యాపించినవి. ప్రతి గ్రామములోను కక్షలు 'పార్టీలు' ఏర్పడి, కలహకారితనము వ్యాజ్యాల వ్యసనము పెరిగి, విరోధములు పరస్పరవినాశము ప్రబలుటకును, చాల వరకు నిర్వ్యాపారతయు, స్వార్థపరతతో అంకురించే అసూయహింసా

భావమునేకారణములు. పూర్వము గ్రామస్థులు సంఘావసరములకు పరస్పరము సహాయము చేసుకొనేవారు. గ్రామములో ఏదైన లోటో కష్టమో కల్గినప్పుడు అందరునుకలసి మైత్రితోసులభముగ గ్రామకార్యములు చక్కబెట్టేవారు. ఇప్పుడాస్థితిపోయి,స్వార్థధోరణి సహకారసంఘములును కలతలు హెచ్చినవి. సహకారముకు సాధనము లనుకున్న పంచాయతీ బోర్డులును కలహకారణమగుచున్నవి.

ఈలోపములనుబోగొట్టి గ్రామసౌభాగ్యము కల్గింపవలెనంటే గ్రామజనుల కందుబాటగు నిర్మాణవృత్తులేర్పడవలె. సామ్యజీవితము నేర్పవలె ఇందుకు ఖదరుపరిశ్రమ చాల ఉపయుక్తమని యిదివరకే చూచియున్నాము దానివల్ల ప్రతిప్రాంతంలోనూ చాలమంది ప్రత్తి పండించు వ్యవసాయదార్లకు, దూదేకులకు, వడుకువారికి, వడ్రంగులకు, కమ్మర్లకు, నేతగాండ్రకు, అద్దకపువానికి మరల వృత్తులేర్పడును. ఇట్టివే బెల్లము, దంపుడుబియ్యము, వంటి అనుబంధపరిశ్రమలు కలవు బెల్లము మనదేశీయులలో వాడుకలోని మంచి ఆహారవస్తువులలో నొకటి. సారవంతమగు భూములన్నిటిలో చెరుకు పండును. దానిని గ్రామములందే గానుగలలోనాడించి బెల్లముచేయుపరిశ్రమ చిరకాలానుగతముగ వచ్చుచున్నది.ఖదరునుగూర్చి లోగడచెప్పిన సంగతులు దీనికిని వర్తించును బెల్లమునుండి చీనా కలకండ వగైరాలు చేయుచుండిరి కాని ఇటీవల జావా వగైరాలలో యూరపియనుధనికులు గొప్పతోటలు, ఫ్యాక్టరీలునేర్పర్చి, అందు 'బీటు'దుంప లుత్పత్తిచేసి, వాటినుండి ఫాక్టరీ పంచదారచేసి, మనదేశములోదింపి చౌకగజనులకంటగట్టుచున్నారు. ఇదిమిల్లుపంచవలె చూచుటకాకర్షకము; కాని, బెల్లము చీనాల చెరుకు పరిమళము ఆరోగ్యము ఈ'ఫాక్టరీ'కిలేదు. అయినను పాశ్చాత్యసంస్కృతి మోహితులై ఇప్పుడు గ్రామజనులును (తమఱేనుము తెలియక) ఫాక్టరీ పంచదారనే వాడుచు, తోటివ్యవసాయదార్లకు తమ ఆరోగ్యముకుకూడ నష్టము గల్గించుచున్నారు. మిఠాయిలు వగైరా తినుబండములకును దీనినే

వానువ్యసన మేర్పడినది. ఇందువల్ల గ్రామములలో బెల్లనుకు చెరుకుకు గిరాకి పోయి, ఆవ్యవసాయదార్లకు బెల్లంవండువారికి ఆవ్యాపారస్తులకు చెరుకు గానుగలు చేయువారికిని వృత్తులు పోయినవి. ఈపంచదారవల్ల దేశీయుల కోట్లకొలది రూపాయలసొమ్ము విదేశాలకు పోవ్రచున్నది. (ఇటీవల కొన్నిపంచదారఫాక్టరీ లీదేశంలో నేర్పడినవి. కాని, వాటి వల్లను కొద్దిమంది శ్రీమంతులే భాగుపడుచున్నారు; మిల్లులవలని నష్టములు వాటికి నున్నవి.)

దేశీయులందరును శుభ్రమగుబెల్లమునే తినుటకు పిండివంటల కును. వాడేమెడల, మరల లక్షలకొలది గ్రామస్థులకు వృత్తులు జీవనోపాధి కల్గును. ఇట్లే దంపుడుబియ్యము చాలమంచిది దంపుట స్త్రీలకు వృత్తిగా నుండెడిది. దానికిబదులు అనారోగ్యకరమగు మిల్లుబియ్యం వాడుటవల్ల జట్టులును వేలకొలది బీదస్త్రీలకు వృత్తినాశమును గల్గినవి. ఫాక్టరీబియ్యము చూచుటకింపేకాని రోగహేతువని ఘనవైద్యులును తెల్పుచున్నారు ఇవిగాక ఆయాగ్రామసౌకర్యమునుబట్టి తేనె, కాగితములు, మంచిచాపలు, తివాచీలు, వగైరా గృహపరిశ్రమలు పునరుద్ధరింపవచ్చును. మరియు పూర్వం గ్రామాలలోని వడ్రంగులు, కమ్మరులు, కుమ్మర్లు, చమారులు ఇత్యాదులు చేయువస్తువుల నిప్పటి నవనాగరికులందరు వాడుట మాని, వారివృత్తులు పోగొట్టినారు. 'కంపెనీ ఫర్నిచరు, విలాయితీ యినుపసామానులు, చీనాప్లేటులు, బాటాకంపెనీ షూలు' ఇప్పుడు చలామణిలో నున్నవి.

ఈరీతిగ ఆయాగ్రామస్థులకు కులవృత్తులు నశించి వారి కొను గోలుశక్తియు పోయినది అందువల్ల ఆనిరుద్యోగులు గింజలు వగైరా లను కొనలేక బిచ్చగాండ్రగుచున్నారు. కనుక గ్రామాలలో వ్యవసాయదార్లకు అపారనష్టము కల్గుచున్నవి. గ్రామస్థుల యితరవస్తువులను తాము కొంటే, వారును తమవస్తువులు కొందురు. అందుకు కొంత

హెచ్చుసొమ్మిచ్చినను అది గ్రామస్థులకే మిగిలి అన్యోన్యసహాయము జరుగును. ఇందులో సహకార సూత్రమున్నది.

వకీళ్ళు డాక్టర్లు వర్తకులు వగైరాలు నాటుసరుకులనే కొనే యెడల, తమఖర్చుసొమ్ము వాటినిచేయు ఆచుట్టుగ్రామస్థులకేచే, వారు అవసరములకు తమచే తప్ప పనిచేయించుకొన్నప్పుడు; ఆసొమ్ముకొంత తమకీయగల్గుదురు. అనగా, ఆఖర్చుసొమ్ము తమకో తమవారికోచేరవచ్చు. కనుక ఇందులో ఇన్సూ రెన్సు (=భీమా) సూత్రమును చేరియున్నది.

ఫాక్టరీపద్ధతిగల దేశాలలోను కుటీరపరిశ్రమల నక్కడి విదేశీయులు ప్రోత్సహించుచున్నారు. మరియు ఈదేశంలో వసించుసహృదయులు యూరపీయనులు సాధారణంగా తమదేశవస్తువులలో యూరపీయను కంపెనీలలోనే కొనుచుందురు. మనభారతీయులు స్వదేశీలలోనైన దేశీయవస్తువులనే వాడి కుటీరపరిశ్రమల ప్రోత్సహించుట దేశమంతటికి శ్రేయస్కరమగును.

మిల్లుపిండి, బిస్కట్లు ఓవల్టెను, జాము, డబ్బాపాలు విలాయతీ వెన్న, మిల్లుమానె ఇట్టి మరికొన్ని ఫాక్టరీ వస్తువులను మనలో చాల మంది తమఆహారముగ ఉపయోగించుచున్నారు. ఇది అనవసరము, అనారోగ్యకరము, జాతీయంగా హానికరము. వీటి కన్న హెచ్చుపుష్టిని ఆరోగ్యమును తాజాయగు గృహవస్తువులే కల్గించును.

13. ఆర్థికరంగం.

3 ఇతరవిషయములు.

అంతర్జాతీయసంబంధంవల్ల ఈకాలపు ఆర్థికజీవనము క్లిష్టమైనది. పూర్వము చాలవరకు సాటాబేరము అనగా వస్తు వినిమయముతో సరుకుల క్రయవిక్రయములు సాగేవి. ఇప్పుడు ద్రవ్యముప్రధానము. నాణెములు, కరెన్సీనోట్లు హుండీలు బాంకుచీటీలు అమలుకువచ్చినవి. వీటి సంబంధమగు ఆర్థికకృత్యములు ప్రభుత్వము నిర్ణయించును. ప్రతిజాతీయప్రభుత్వమును తనదేశపునాణెముల మారకపురేటు సుంకములను, కరెన్సీవిధానమును బాంకునియమములను విదేశములతో వ్యాపార సంధులను తనదేశీయుల వ్యాపారాదులకు క్షేమకరమగునట్లు ప్రజాభిప్రాయప్రకారం నిర్ణయించును. మరియు నాగరిక రాజ్యములన్నియు రక్షణపన్నులు వేసియు సొమ్ము సహాయమిచ్చియు, లాభముకు పూచీపడియు, నౌకాదినపుపాయము లిచ్చియు, తమదేశపు పరిశ్రమలకు వ్యాపారముకు సాయముచేయును. కాని మనదేశమిప్పుడు పరాధీనము. మన పాలకుల జాతీయగుబ్రిటిషువారి ఆర్థికలాభముకు మనక్షేమముకు తరుచు సంఘర్షమున్నది. అట్టిస్థితిలో బ్రిటిషువారు తమదేశీయులకు లాభకరమగునట్లే ఇక్కడి ఆర్థిక విధానమంతను నిర్ణయించుచున్నారు. రూపాయ విలువ షిల్లింగు 4 పెన్నీలనుండి, షిల్లింగు 6 పెన్నీలు చేసినారు. జర్మనీ, జపాను వగైరాలకంటె బ్రిటిషుసరుకుల దిగుమతిపైన తక్కువ పన్ను వేయుచున్నారు. జర్మనీ వగైరాలతోను ముడిసరుకుల విషయములో మనకు లాభసాటి వ్యాపారం లేకుండ, సామ్రాజ్యపు వారికి సగుపాయము లిచ్చినారు. రక్షణ పన్నులు తమ యిష్టము వచ్చినట్లు మార్చుచున్నారు. రూపాయకు బంగారముతో గాక బ్రిటిషు సవరనుతోనే ముడిపెట్టి హెచ్చురేటు మారకము పెట్టినందున, గత పదేండ్లలో 300 కోట్లబంగారము మనదేశమునుండి ఇంగ్లండు ఆమెరికాలకు పోయినది. మన వస్తువ్యాపారము చచ్చినది. దాని పున

రుద్ధరణకు విదేశములలోకి మన నౌకలసంచారముకు తగునదుపాయ ములులేవు. సరికదా మనదేశపు తీరములలోను బ్రిటిషుకంపెనీల హోటీ వల్లను, వాటికి సర్కారువారిచ్చు సహాయములవల్లను మనజాతీయ నిర్మాణము కవకాశములు లేకయు నౌకాది పరిశ్రమవృద్ధి కాకున్నది. రైల్వేలేట్లు, రిజర్వుబాంకు బ్రిటిషుప్రభుత్వమేర్పర్చు నియమము ప్రకా రం అధికారి సంఘపువశములోనున్నవి. అవి బ్రిటిషువ్యాపారముకే లాభ కరములు. మోటార్లు, విమానములువగైరా జాతీయరక్షణ కవసరమగు యంత్రములనిర్మాణవ కు ప్రభుత్వమువా రింతవరకు సదుపాయము చేయలేదు. ఇట్లు రాజకీయమోక్షము కల్గినప్పుడుగాని ఆర్థికకష్టములకు విమోచన సరిగాకలుగదు. ఈలోగా ఖదరువగైరా గృహపరిశ్రమలవల్ల కొంతయుపయోగము కల్గును.

కాని, ఈకాలమందు కలుగు నాగరికావశ్యకత లన్నియు గృహ పరిశ్రమలవల్లనే తీరవు. యాంత్రికపరిశ్రమలవల్ల కొంత హానియున్నదని యిదివరలో గమనించినాము. ఇది ముఖ్యంగా సామాన్యజనులకు దైనిక జీవితము లో నవసరమగు ఆహారము, బట్ట వగైరాలకు వర్తించును. ఇట్టివి కాక, విద్యుచ్ఛక్తి జనకయంత్రములు, వాటిపనిముట్లు, రైళ్ళు, మో టార్లు, కొన్ని లోహవస్తువులు, ముద్రణయంత్రము, ముద్రాపరికరములు ఇట్టివి ఫాక్టరీపద్ధతిపై నేజరుగవలెను. మరియు మనపరాధీనస్థితిలో కాకినాడ మిల్లులు వగైరాలు మనము ప్రస్తుతం స్థాపించుకోకపోతే, విదేశీయులే స్థాపించి, ఆవ్యాపారము (కలకత్తా గోనెసంచివ్యాపారమువలె) వశపర్చు కొందురు. కనుక ఇప్పటిస్థితిలో కొంత ఫాక్టరీల పరిశ్రమ మనకు తప్పని సరియైనది. వీటిని సరియైనమార్గమున జరుపుట, గృహపరిశ్రమలతో టిపిపోటీరాకుండజేయుట, పెట్టుబడి సరఫరావగైరాలకు ఆర్థికనిర్ణయము కార్మికులవసతికి ఆరోగ్యమునకు తగు కట్టుదిట్టము లేర్పర్చుటయు, అవ సరము. ఇట్టి వాటి నన్నిటిని నిర్ణయించుటకు శ్రీ జవాహర్లాలు నెహ్రూ గారి అధ్యక్షతను విజ్ఞులతో గూడిన మహాసమితిని 'నేషనల్' ప్లానింగు

కమిటీ అనుపేరుతో కాంగ్రెసు కార్యసమితివారు స్థాపింపజేసినారు. ఈ సమితివారు ఉపసంఘాలద్వారా చక్కగ విచారణచేసి తగుసియమములతో జాతీయ క్షేమము పెంపొందించు సూచనలతో ప్రణాళికతయారు చేయుచున్నారు. అధ్యక్షుడిప్పుడు అహింసా యుద్ధములో జైలులో నున్నందున ఆపని నిల్చినది. కాని త్వరలోనే ఈరిపోర్టు వెలువడుట మనపరిశ్రమాములకు లాభకరము.

కార్మికుల సౌకర్యములు, పెట్టుబడిలో సహకారము, జాతీయోన్నతిసాధనములు, స్త్రీల యభ్యున్నతి, యంత్రములపరిశ్రమకు కుటీరపరిశ్రమలతో సమన్వయము, ఇట్టివాటిని జాగ్రతతో పరిశీలించి 28 ఉప సంఘములు తమ విడివిడి రిపోర్టులు పూర్తిచేసియున్నవి. జాతీయప్రభుత్వమేర్పడినప్పుడే వీటిని సరిగా అమలుజరుప వీలగును. ఇవి దేశీయరాజ్యములకును చాల లాభకరములు.

14. నైతికరంగము—మద్యనిషేధము.

భారతసంస్కృతికి నైతికంగా చాల హానిచేసినది మద్యపానము. కల్లుసారాయ మొదలైన విదేహమునకు మత్తుకల్గించువస్తువులనే మద్య మందుము. నల్లమందు భంగువగైరాలు నిట్టివే. ఏటి దుష్ఫలితములను ఈదుశాచారము పోగొట్టుమార్గమును ఇప్పుడు పరిశీలింతము.

త్రాగుడు కూడదని, మద్యములు వట్టితామసవస్తువులని, హిందూధర్మశాస్త్రాలలో చెప్పినారు. బౌద్ధమస్లిం గ్రంథాలలోను మద్యపానము నిషేధించినారు, కనుక మతప్రధానులనబడు భారతీయులు మద్యవస్తువుల ముట్టకూడదు. త్రాగుడు అధార్మికము, అవినీతికార్యము అని యిటీవలివరకు జనులు భావించేవారు. చీనులకు నల్లమందువలె, ఈదేశీయులకు కల్లుసారాలు పాశ్చాత్యుల సంబంధంవల్ల విశేషంగా పెరిగి, మనజాతిని నిర్వీర్యులుగ జేసినది; జనుల పరస్పరప్రేమభావము నిది నశింపజేసి, కలతలు హెచ్చించి, అంతశ్శక్తివృద్ధి కాటంకమై, నైతికంగాను రాజకీయంగాను పరవశులుగ జేసినది.

త్రాగుబోతులు మైకములో నున్నప్పుడు, ఒళ్ళు మనస్సువశము తప్పునని అందరికి తెలిసినదే; మత్తుతగ్గినప్పుడును వారు క్రూరులగుదురు. ఉచితజ్ఞత విచక్షణనశించి త్రాగిన కూలిజనులు వగైరాలు సాయంకాలమింటికివచ్చినప్పుడు తమపిల్లలను భార్యను వేధించి హింసింతురు, నిర్దయులై కుటుంబపోషణ మానుదురు. తరుచు మద్యముకు వశులైనప్పుడే చోరీ మానహరణము, దొమ్మి, కూనీగూడ జరుపుటమామూలని తెలిసినదే. మానవసహజమగు దాక్షిణ్యము ప్రేమ ఈమత్తతలో నశించును గనుకనే అప్పుడు పశుతత్వము విజృంభించును. అట్టివారి వీర్యమును, తద్ద్వారా సంతానమును చెడును.

అమెరికా యూరపులలోగూడ ఘనవైద్యులు ఆర్థికనిపుణులును మద్యపానము హానికరమని నిర్ణయించినారు. దానిని సాధ్యమైనంతవరకు తగ్గించుట కక్కడి సంఘతత్వజ్ఞులు విశేషకృషిచేయుచున్నారు.

కాని, ఆశీతలదేశములకన్న మనఉష్ణదేశమందు దాని దుష్పలిత ములు చాలరెట్లుహెచ్చు. ముఖ్యముగ మూలమాదిగలు, శెట్టిగలు, చాకళ్ళు మొదలగు శ్రమికజాతులు త్రాగుడుకులోనై యిళ్ళు వొళ్ళు గుల్లచేసుకొని, నిరాశులు పీడకివారునై హింసాచర్యలకు సిద్ధపడి, కొందరు సంఘమంతటిని బాధించుచున్నారు. మరియు అంటుజాడ్యమువలె నీమరభ్యాసము తక్కినవారికిని వ్యాపించుచున్నది. కనుక, దేశములో అహింసను నీతిని మరలనుద్ధరింపదలచువారు ముందుగా మద్యపిశాచ మును పారద్రోలవలెను. త్రాగుడుకు కారణములేవి? కార్మికులు ఫాక్టరీ పనిలో అలసిపోయియు ఇంటిదుర్భరస్థితి మరచుటకును ప్రతిసాయంకాలము త్రాగుదురని చూచియున్నాము. తరుచు నిమ్నజాతీయులు 'అమ్మవార్లు' ప్రీతికిని వివాహాదులలోను అంత్యక్రియలలోను మద్యము సేవింతురు. అది మతకర్తవ్యమట ! వీరితో సంపర్కముండు చాకళ్ళు, సాతానులు వగైరాలలోను ఈమురాచారము కొంతవ్యాపించినది. తామసము, అయోగ్యము పాపకరము శాస్త్రనిషిద్ధమునగు మద్యమును దేవతలు కోరుదురనుభూత వట్టిభ్రమయని వారికున్నతజాతివారు బోధించవలెను, నిరోధించియైనను దీనిని రూపమాపవలెను. మద్యపానము మతముకు వ్యతిరిక్తమని పూర్వము త్రాగుబోతులను సంఘమునుండి బహిష్కరించేవారు, సురాపానము పంచమహాపాతకములలో నొకటి గదా ! మనపూర్వికులలో కొద్దిమంది కొకరీతి మద్యపానముండినది, నిజమే. అదిస్వల్పము, ఇప్పు డట్లుకాదు. ఈనవనాగరికత వ్యాప్తివల్ల పూర్వపుకులపు కట్టుబాట్లు, ఆంక్షలు, ఆహారనియమములు సడలినవి. సంఘబహిష్కారపు భయముపోయినది. 'అగ్రవర్ణ'ముల వారిలో పాశ్చాత్యసంస్కృతి ప్రభావమున విదేశమద్యము వ్యాపించు దుర్గతి గల్గినది.

సర్కారువారిప్పుడు కొన్నికంపెనీపాపులలో పాశ్చాత్యమద్యముల విక్రయముకు వాటినిపొగడుచు అతిశయోక్తి ప్రకటనలకు తావి

చ్చినారు; గవర్నర్లుగూడ మద్యపానము అతిథి సత్కారమునకు సాంఘిక మర్యాదకు చిహ్నముగ నెంచుచున్నారు వారిననుసరించు మనవారు 'తోటివాడు తొడకోసుకొంటే తాను మెడకోసుకొన్నట్లు, నియమరహితంగా మద్యంసేవించి ఆత్మహానిపరులై, విదేశపు 'వైను'కు ముడుపు చెల్లించుచున్నారు, కొందరు పాశ్చాత్యసంపర్కమతోసమ్మోహితులైరి. మద్యనిషేధ మనేది త్రాగుడు కార్యపుస్వాతంత్ర్యమునకు భంగకరము, కనుక మద్యనిషేధము నిరోధమునుకూడ'దన్నారు!

ఇంకలో పాశ్చాత్యుల అభ్యాసము మనకు సరిపడను. వారి సంస్కృతి, ఆదేశపుశీతోష్ణస్థితి, సంప్రదాయమును వేరు. మద్యముకు కాతలికులకైస్తవుల మతోత్సవములలోను వాడుదురు. అక్కడయాంత్రిక సంస్కృతివేరుబారినది; ఆంగ్లేయులవి శీతలదేశములు, అక్కడిజనులలోచాల మంది భాగ్యవంతులు; అమెరికా సంయుక్తరాష్ట్రపు ప్రభుత్వంవారు లోగడ మద్యపానము నసలేనిషేధించిరి. అప్పుడు జనులనీతి, ఆరోగ్యము, కార్మికులకార్యశక్తియు, హెచ్చినవి. అయితే మద్యవ్యాపారముతో కోటీశ్వరులైన పుంజీపతులు సహజంగా ద్రవ్యశక్తిచే కొందరిని లోబర్చుకొని, ఆనిషేధమును రద్దుచేయించిరి. వారిపలుకుబడి చాలహెచ్చు కొందరు రహస్యముగ మద్యమునుతెచ్చి అమ్ముచుండిరి. ఆంగ్లవర్తకులును సముద్రనౌకలద్వారానుకనడాద్వారాను అక్కడసారాయములను రహస్యముగ జొప్పించిరి. వీరియందరిపోరు పడలేక అమెరికను ప్రభుత్వము మద్యనిషేధము రద్దుచేసినాము. కాని అందుకు అక్కడి ధీమంతులు విచారించుచున్నారు అవినీతిహెచ్చినది. ఇక్కడనో మతము, నీతి, ప్రజాభిప్రాయమును, మద్యనిషేధము కనుకూలములు. ఇదివరలో పాశ్చాత్యులవలె కొందరు కొంపరెన్స (మితపానము)కే ప్రచారముచేసిరి. కాని అందువల్ల త్రాగుడు తగ్గలేదు. అదిసహజమే. మద్యాసక్తి మహావ్యసనము. త్రాగుబోతులు మూర్ఖులు; వారికిత్రాగుట కాకర్షణగల్గించి, అంతట ఆయజ్ఞానులు మితపానమే చేయుదురనుట హాస్యాస్పదము.

మరియు, టోకున మద్యవిక్రయమిచ్చుట ప్రభుత్వంవారి లాభన్యాపారము. ఆయాప్రాంతపు అధికారులు సాలీనా మద్యవిక్రయపుహక్కును తాలూకాఉద్యోగులద్వారా వేలంవేయుంతురు. పాటదార్లకు పోటీపెట్టి వీలైనంత హెచ్చుగ సొమ్మురాబట్టుదురు. ఇట్లు హెచ్చుగ పాడి నయిజారాదార్లు కల్లుగడులబెట్టి హెచ్చుగ మద్య మమ్ముకొందురు. చెట్లగీతకు సర్కారుకు వేరుగ రుసుములకలను. ఇట్లు సర్కారుకు మన దేశముమీద 17 కోట్ల రూపాయలు మద్యాదాయమువచ్చును. ఉద్యోగులు తామిచ్చులై నెన్నుప్రకారం గ్రామాలలోను కల్లుఅమ్మకమును కాపాడుదురు. మనమద్రాసురాష్ట్రమునకు కల్లుముజారావల్ల సుమారు 4 కోట్లరూపాయలు రాబడివచ్చును. (అది ఇక్కడిమొత్తపు ఆదాయంలో సుమారు నాల్గువవంతు). ఏటేట హెచ్చురాబడికై సర్కారువారు యత్నించి కల్లుఅమ్మకమును పోటీపెట్టి ప్రోత్సహింతురు ఈఅన్ని కారణాలవల్ల చాలమందిజనులప్పుడు సిగ్గు భయము వదలి, విచ్చలవిడిగ త్రాగుచున్నారు. 1921,1930-32 లలో కాంగ్రెసువారు కల్లుగడులవద్ద జనులను త్రాగవద్దని తాళ్ళుగీయవద్దని నిరోధించగా, అట్టిప్రజాసేవకుల నుద్యోగులనెట్టు చేసి జైలులోనుంచిరి. ఈమద్యాదాయశాఖను ఆయాప్రాంతపు ప్రభుత్వములకిచ్చిరి. 1937 సంవత్సరంలో 7 రాష్ట్రాలలో కాంగ్రెసువారే మంత్రులైరి. వారు మద్యనిషేధం అమలుచేయజూచిరి; అందుకు సర్కారు కల్లుపాటలు మానవలె. అందువల్ల సర్కారురాబడిలో 1/4 వంతు పోవును. కనుక ప్రజలలో విద్యావ్యాప్తి ఆరోగ్యంవగైరాలకు రివిన్యూపోలీసుసిబ్బంది వగైరాఖర్చుకు సొమ్ముచాలదు. ఆ ఆదాయం మరొకరీతిగా భర్తి చేయకతప్పదు. కలెక్టర్లువగైరాల హెచ్చుజీతములు తగ్గించియో, సేనలవిపరీతపుఖర్చు తగ్గించియో, ఎగుమతి దిగుమతుల పైన పన్నుసరిదియో, ప్రజలకులాభకరంగా సొమ్ము మిగల్చవచ్చు. కాని అట్టివాటిపైన అధికారము నీమంత్రులకీయక, కేంద్రప్రభుత్వంవారు తమచేతిలోనే పెట్టుకొన్నారు. అట్టిపనులను తాము చేయమన్నారు.

కనుక చిక్కువచ్చినది. మద్యనిషేధము అహింసావ్యాప్తికి ప్రజాక్షేమముకు చాల అవసరము, అవసరమైతే కొత్తపన్నులువేసి సర్కారురాబడి భర్తీచేసుకోవలెనేగాని విషాన్నమువంటి మద్యాదాయముతో ప్రజాప్రభుత్వము సాగించుట నీతిబాహ్యము; కనుక కాంగ్రెసుప్రాబల్యంగల ప్రతిరాష్ట్రప్రభుత్వమును కొన్నిజిల్లాలలో మద్యనిషేధం పెట్టినారు. ప్రజలతోడ్పాటుతో ఆజిల్లాలలో మద్యనిషేధము సాగినది. కాని కాంగ్రెసు ఇంతలో అధికారము వదలినందున కొత్తజిల్లాలలో పెట్టక ఆయుద్యమముకు భంగం కల్గించినారు ఇప్పుడు మద్యనిషేధపు జిల్లాలలో చాల మార్పుకల్గి క్రౌర్యము హింసనేరములును తగ్గినవి.

తాడి కొబ్బరి యీతచెట్లరసము నిలవయుండి పులిసినప్పుడే మద్యమగును. గీయగనే వచ్చిన రసము వెంటనే మద్యముకాదు. ఆతీయనిరసము ఆరోగ్యకరము. కాని పులిసినది హానికరము. కనుక అదియే నిషేధింపబడినది. యూరపియనులకన్న మనదేశీయులు చాల బీదవారు. కోట్లకొలది జనుల కొకపూటమాత్రం తిండి దొరకుచున్నది. వారికిఅన్న వస్త్రములభించుట కష్టము. ఇట్టి బీదపనివాండ్రలో నే త్రాగుడు హెచ్చు. వారికూలి చాలవరకీత్రాగుడుకు ఖర్చుపడి, వారిభార్యకు పిల్లలకు తిండి యుండదు. ఈదేశమందిప్పుడు జనులు సుమారురువదికోట్లరూపాయలు మద్యముకు ఖర్చుచేయుచున్నారు. త్రాగుడుపోతే ఈసొమ్ము వారికి మిగులును, వారికుటుంబములును సుఖపడును. నీతియుకొనుగోలుశక్తియు హెచ్చి దేశవ్యాపారమును ఆర్థికస్థితియు బాగుపడును జనులలో కలహతత్వము తామసత్వముపోయి సాత్వికబలము అంతశ్శక్తి హెచ్చును. త్రాగుడు మానవలెనని జనులలో తీవ్రప్రచారముజరుగుట అవసరము

నల్లమందును ప్రజలకు చాలహానికరము. దీనిని ప్రభుత్వమే తయారుచేయించి దుకాణదారులకమ్మి చాల లాభముదీయుదురు. (దీని వల్ల సర్కారుకు సాలుకు సుమారు 30 లక్షలరూపాయలు లాభముండును, ఇదికొద్దిమందికి వ్యసనమును ఔషధరూపముగ గుణకరమగును. కాని

చాలమంది పడుచువారు దీని నలవర్చుకొని చెడుచున్నారు. కొందరు (ముఖ్యంగా కార్మిక స్త్రీలు ఫ్యాక్టరీలకు పోవునపుడు)ఇంటివద్ద తమపిల్లలు లేవకుండుటకు నల్లమందనిత్తురు. ఇందువల్ల మత్తునిద్ర కలుగును, కాని నాడులలో ఆరోగ్యముచెడును. బుద్ధిమందగించును. ఇది కేవలం తామస వస్తువు. కనుక దీనినిగూడ బహిష్కరించవలెను. జాతీయశక్తి హెచ్చించి స్వాతంత్ర్యం సంపాదించుటకును మద్యనిషేధమవసరమే ఇందుకొక చిన్నయుదాహరణ. ఇప్పుడు సాగుచున్న మహాయుద్ధములో బలీయమగు ఫ్రాంసురాజ్యము జర్మనుదాడికి తాళక కూలుట ఆశ్చర్యముకల్గించినది. ఇందుకు, జర్మనుల కాయుధశక్తిహెచ్చు, వారిసేనానిర్వాహపుయుక్తి గొప్పది, అని యేమో కారణములుచెప్పినారు. అవి కావచ్చు;కాని ఫ్రెంచి సైనికబలమును అద్భుతమందురు. ఈ 20 వ శతాబ్దిలో (ముఖ్యంగా ఈ 20 ఏండ్లలో) ఫ్రాంసులో భోగపరత స్త్రీలలోలత మద్య వ్యసనము విపరీతముగ హెచ్చినవి. ఫ్రాంసు రకరకముల వైనుసారాయముల యుత్పత్తికేగాక కొత్తరకముల దిగుమతికిని ప్రసిద్ధము. భోగలాలసనగర ములన్నిటిలో పారిసుపురమగ్రగణ్యమని పేరొందినది. జర్మనులకన్న 7 రెట్లు ఎక్కువగ ఫ్రెంచివారు త్రాగుడుకులోనైనారని లెక్కలవల్ల తేలినది; వారు నీతిని అంతశ్శక్తిని నిగ్రహమును నిరోధకబలమును ఇట్లు పోగొట్టుకొన్నారు. ఇదినిర్వీర్యతగ తమలో కలహశీలతగ పరిణమించి, ఫ్రెంచివారి పతనమునకు తోడ్పడినది. కనుక జాతీయోద్ధరణకోరువారు మద్యనిషేధము సాగింపవలె.

15. భాషారంగము.

సంఘమంతటిలో ఐకమత్యము పరస్పరక్షేమ యుండుటకు ప్రతి దేశపు జనులకు సామాన్యభాషయుండవలె. విభేదము కలతలుగల్గుటకు భాషాభేదమునొక కారణము. ఆయాప్రాంతీయులమధ్య సంస్కృతినమన్వ యముకు జాతీయవాజ్మయవృద్ధికినిగూడ సామాన్యభాషయుపకరించును. పూర్వం సంస్కృతమో ప్రాకృతమో భారతభూమి ఉత్తరమధ్యదేశము లంతటా సామాన్యభాషగా నుండేది. పూర్వపు ఆంధ్రరాజులును ప్రాకృ తంలో వ్యవహరించిరి. దక్షిణదేశములోను ఒకే ద్రావిడభాష యుం డేది. అక్కడను విద్యావంతులకు సంస్కృతజ్ఞాన ముండేది. తరువాత 10 వ శతాబ్దినుండి ఇతర విభేదములతో బాటు ఆప్రాంతాలలో భాషా భేదములు హెచ్చినవి. ఆయాప్రాంతములమధ్య అన్యోన్యత తగ్గి అప్పు డే క్రమంగా శాఖలు స్వతంత్రభాషలుగ మార్పులుపొంది, అందుండి తూర్పుదిశను బంగాళీ ఓడ్రములును పడమటికొనను మరాటీ గుజరాతీ సింధీలు నేర్పడినవి. ఉత్తర మధ్యప్రాంతపుది హిందీ. అప్పటికే మూల ద్రావిడపుశాఖలు తెలుగు, అరవం, కన్నడం, మళయాళం తుళు అను ప్రత్యేకభాషలైనవి. కానిపిమ్మటను దేశంలో దాదాపు అన్నిప్రాం తాలలోను ఆర్యావర్తపు ముఖ్యభాషయగు హిందీ తెలిసియుండెడిది. ముస్లిములపాలనలో పారసీ రాజభాష, ముస్లిములకు అరబ్బీ ధార్మిక భాషయైనవి. అందువల్ల హిందీభాషలో పారసీ అరబ్బీల పదములు చేరి వ్యవహారంలో నాగరికభాషకు హిందూస్థానియని పేరువచ్చినది దీని ఉపశాఖయే నిజాంరాజ్యములో "దక్ఖని" యనబడును.* తరువాత బ్రిటిషుపాలన మారంభించినపుడు ఆయాప్రాంతములమధ్య విభేదము హెచ్చినది. హిందూస్తానీకి రాజాదరణపోయి, అది క్షీణదశపట్టినది. విదేశీయమగు ఇంగ్లీషు రాజభాషయైనది. ఇది యీదేశీయులకు కేవలం

---

* ఈ 'దక్ఖని' వికృతినే మహారాష్ట్రపుముస్లిములు తమలో మాటాడుచుందురు.

కొత్తది. అయితే బ్రిటిషురాజనీతిప్రకారం పరిపాలనమంతయు దూర వ్యాపారమును ఇంగ్లీషులోనే యున్నందున దానియందే విద్యావంతులకును విద్యార్థులకును శ్రద్ధ కలిగినది.

దేశమంతటను ఉన్నతపాఠశాలలలో ముఖ్యముగ ఇంగ్లీషును నేర్పుచున్నారు. సర్కారువారు చాలసొమ్ము ఖర్చుపరచి అన్నిపాఠశాలలలోను ఇంగ్లీషు 'స్కూళ్ళు' 'కాలేజీ'లు యూనివర్సిటీలు స్థాపించినారు. తంతితపాలు, వార్తాపత్రికలు వగైరాలకు ఆంగ్లంలోనే సమపాయము లెక్కువగ ఏర్పడినవి. కచేరీలన్నిటిలో ఆంగ్లముకే ప్రాముఖ్యము; ఆంగ్లభాషలో బరీక్షనిచ్చువారికే సర్కారులోను బ్రిటిషుకంపెనీలలోను ఉద్యోగములు.†ఇట్లు ఆర్థికముగ కలిగిన విలువవల్ల మనోబాధకు హెచ్చువ్యయప్రయాసలకు ఓర్చి చాలమంది ఆంగ్లభాషనేర్చుచున్నారు. పూర్వపు సామాన్యానుబంధము శిథిలమై, తమిళులు, ఆంధ్రులు, బంగాళీలు, గుజరాతీలు, అని ఆయాభాషికులు వేర్వేరుజాతులనుకొనుటయు కలదు. సామాన్యభాష లేనందున ఆయాప్రాంతీయులమధ్య వ్యవహారములును సానుభూతియు తగ్గి, ప్రాంతీయతత్వమును అంతులేని పోటు సంఘర్షమును వృద్ధియైనవి. ఇది అహింసావ్యాప్తి కడ్డము; ఇటీవల 1935 సంవత్సరపు చట్టంప్రకారం రాష్ట్రీయస్వాతంత్ర్య మనగా ప్రాంతీయప్రభుత్వముల కధికారమును ప్రత్యేకతయు హెచ్చినవి. అన్నిప్రాంతములమీదను బ్రిటిషుప్రభుత్వపు అధికారము మరింత బలపడెను. ఈదేశీయులకుమాత్రం కేంద్రాధికారము ఏకత్వబుద్ధి క్షీణించినవి.

ఇట్టిస్థితిలో జాతీయమైత్రిని అహింసాపూర్వకమగు పరస్పరప్రేమను హెచ్చించి ఆయాప్రాంతాలమధ్య వ్యతిరేకభావము పోగొట్టుటకు,

† భారతీయవ్యాపారస్థులును సౌకర్యముకని వారిననుసరించి ఆంగ్లమందే వ్యవహరించుచున్నారు. ఇటీవలిపరకు లోకలు బోర్డు మునిసిపాలిటీలన్నిటిలో ఇంగ్లీషు ద్వారానే వ్యవహారము.

మరల హిందూస్తానీ సామాన్యభాషగ పునరుద్ధరించుటయవసరమైనది.* గాంధిగారి సూచనపై న దీనినికాంగ్రెసు నిర్మాణకార్యములో భాగముగ అంగీకరించినారు. ఇట్లు సంస్కృతిరంగములో అహింసావృద్ధికి నిది సహకారకము. అయితే "ఇంగ్లీషునే సామాన్యభాషగ ఎంచుకోకూడదా!" అని కొందరిప్రశ్న. "ఇంగ్లీషు ప్రపంచమంతటిలో ఎక్కువవ్యాప్తికల ముఖ్యభాష. దానిసహాయముతోలోకమంతటను వ్యాపారము చేయవచ్చు; అందులోని ఆధునిక వాఙ్మయము గొప్పది. ఇప్పటి ప్రభుత్వమెట్లును దానిని నేర్పుచునే యున్నారు. ప్రస్తుతమది ఆయాప్రాంతీయప్రముఖుల సమావేశము కుపయోగించుచున్నది. అది పాశ్చాత్యసంస్కృతిని విశాల భావములను హెచ్చింపజేయును. కనుకనే, రామమోహనరాయలును ఇంగ్లీషువ్యాప్తికి తోడ్పడెను," అని వారివాదము. ఇంసులో కొంతసార మున్నది.

మనది ఒకేదేశము, ఒకేజాతి; రష్యాలో, అమెరికా సంయుక్త దేశంలో ఎన్నియో ప్రాంతీయభాష లున్నను, తమ దేశీయములలోనే ఒకటి సామాన్యభాషగ అన్నిప్రాంతాలవారును వాడుచున్నారు. మనకు నట్లేకావలెను. (ఆంగ్ల అమెరికనుమైత్రి కింగ్లీషు వాడుకయు కారణము.)

ఈవిషయంలో దూరమాలోచించవలెను. బ్రిటిషుప్రభుత్వము విదేశీయము. అది యీదేశంలో శాశ్వతంగా ఉండేకల్పంలో ఇంగ్లీషునే మనసామాన్యభాషగ నుంచుటలో ఆర్థికమున్నది. కాని, ఆ యాధిపత్యము ఆర్థికంగాను, నైతికంగాను రాజకీయంగాను, మొత్తముమీద మనకెంతయో అనర్థకరముగదా; ఇప్పటి పాశ్చాత్యసంస్కృతియు లోపభూయిష్టమని గ్రహించియున్నాము. దానికై స్వసంస్కృతిని వదలుటనేల

---

* స్పెయినులో బాస్కు-బార్సిలోనా కోటలోనియా వగైరా ప్రాంతీయులు తమ ప్రత్యేకసంస్కృతిరక్షణకనికలహించిరి. ఇటీవలి అంతర్యుద్ధమునాటికివారు వికమత్యహీనులైరి; ఎవరికివారు తమప్రాంతపు స్వార్థమునే చూచుకొనిరి. ఫ్రాంకోనాయకత్వంతోను జర్మను, ఇటలీల సాయంతోను విద్రోహులు వారిని విడివిడిగా జయించివేసిరి. వీళ్ళేరు ప్రాంతీయభాషలనే పృష్ఠిచేసి సామాన్యభాష నశ్రద్ధజేసి, వారు విభేదపరులైరి.

విడచిపాము చేయుటవంటిది. ఆంగ్లము నేర్చుకొని అందలిమంచి గ్రంథములను మనదేశభాషలలోకి తర్జుమాచేసి ఇప్పటివిజ్ఞానమును స్వభాషలలో తెలుపవచ్చు; కాని విజాతీయమగు విదేశభాష మనకు సామాన్యభాష కానేరదు. అమెరికా (సంయుక్తరాష్ట్రం) కెనడా, రష్యాలవంటి గొప్ప దేశాలలో ఆయాప్రాంతాలలో వేర్వేరుభాషలున్నవి. అందులో తమలో హెచ్చువాడుకయున్న స్వదేశీయభాషనే వారు తమ సామాన్య భాషగ జేసుకున్నారు లోకమందెవరికిని విజాతీయభాష సామాన్యభాష కాలేదు. మరియు ఇంగ్లీషు చాల క్లిష్టభాష. 150 ఏండ్లనుండి సర్కారు ఆలంబంతో తీవ్రప్రచారం జరిగినను, ఇప్పటికి మనదేశంలో మొత్తం జనసంఖ్యలో నూటికొక్కరు మాత్రమే ఇంగ్లీషు మాటాడనేర్చినవారు. అక్షరపదవాక్య నిర్మాణమును మనభాషలలో వేటికిని కలియదు. ఇది మనస్త్రీలలోను గ్రామములలోను వ్యాపించుట దుర్ఘటము. అంకుకు యత్నించి జనులను బాధపెట్టిరను, అది అంతగాసాగదు. కనుక ఇంగ్లీషునే ఆమోదించితే విద్యాధికులకు విద్యాహీనులకు మధ్యను, నగరవాసులకు గ్రామవాసులకును, విభేదము హెచ్చును. కొంతవరకు స్త్రీ, పురుషుల మధ్య వైకల్యముగల్గును. హిందీ యిదివరకే మొత్తంమీద యీదేశీయులలో దాదాపు సగంమందికి స్వభాష † కే వంతుల జనముకది యిప్పటికి కొంతవరకు బోధపడును. ఇందుకు మరాఠీ, గుజరాతీ, బెంగాలీ వగైరాలకు హిందీతోగల సన్నిహితసంబంధమే కారణము. తమిళుకు దీనిని నేర్చుట కొంచంకష్టము. మనకును అది ఇంగ్లీషుకన్న చాల సులభము. ప్రాచీనహిందీభాషలో ధార్మికమగు సంస్కృతివర్ధకము, హిందూ ముస్లిము సమన్వయకరము అగు గొప్పవాఙ్మయమున్నది; వైద్యజ్యోతి పాదిగ్రంథములు నున్నవి.

---

† 1931 సంవత్సరం జనాభానుబట్టి హిందూస్తానీ సుమారు 14 కోట్లు బంగాళీ 5.3 కోట్లు, ఆంధ్రము 2 6 కోట్లు మరాఠీ, తమిళం రెండేసికోట్లు, కన్నడం, గుజరాతీ, మళయాళం, ఓడ్రం చేరి ఒకకోటి మాటాడుచున్నారు.

తులసీదాసు కబీరు సూరదాసు మున్నగువారి పూర్వహిందీవాఙ్మయము దేశమంతట ప్రసిద్ధము. అధునికహిందీవాఙ్మయమింకను బాగుగ వృద్ధికాలేదు. హిందీకేంద్రము మనమాతృభూమి మధ్యభాగమందున్నది. దానికి పాశ్చాత్యసంస్కృతితో సంబంధము కొంత యాలస్యంగా గల్గినది. ఇప్పుడు హిందీవాఙ్మయము చాల వేగముగ వృద్ధినొందుచున్నది. హిందీ-హిందూస్తానీలో ఇప్పుడు ప్రచురితమగునన్ని గ్రంథములు వార్తాపత్రికలును మాసపత్రికలును మరి యేదేశీయభాషలోను లేవు. కొద్దియేండ్లలోనే దాని ఆధునికవాఙ్మయమును దేశమంతటిలో ప్రాముఖ్యము పొందగలము. హిందూస్తానీ మనదేశపు ముస్లిములకు వ్యాపారస్థులకు యిదివరకే సామాన్యభాష దీనివ్యాప్తివల్ల అన్నిప్రాంతాల వ్యాపారము ఆచారములు భావములు నగరాలలోను సంస్కృతిలోను కొంతసమన్వయము జరుగును. ఆర్య ద్రావిడ సంస్కృతులు రెండును చాలకాలముక్రిందనే మిశ్రితములైనవికదా. కాని, ఇటీవల ఈ రెంటిని ఎట్లో మరల విడదీసి ద్రావిడుల కార్యసంపర్కము పోగొట్టగలెనని కొంతబోధ జరుగుచున్నది. † (ఇది తలక్రిందుల హిట్లరిజం అనవచ్చును) అయినను పరస్పరద్వేషహేతువగు యీ హింసాప్రచారము అంతగా వ్యాపించుటలేదు. ఆర్యూపాతీయులమధ్యముఖ్యంగా ఉత్తరదక్షిణాల మధ్య అన్యోన్యతయేర్పడుటకు హిందూస్తానీని జనులలో బాగుగ వ్యాపింపజేయుటే చికిత్స. విభేదధోరణిగల 'ద్రావిడ'సిద్ధాంతపువారు హిందూస్తానివ్యాప్తిని నిరోధించుటసహజమే. కాని యిటీవల తమిళులలోను చాలమంది హిందీనేర్చుకొని అందు ప్రవీణులగుచున్నారు.

హిందూస్తానీప్రచారంవల్ల ప్రస్తుతం కొందరు ముస్లిములుతమకు నష్టమని యనుమానించినారు. ఇది పొరబాటు. ముస్లిములలో కొన్ని

† ఈపత్రికకు ధర్మనిరాసకుడగు శ్రీ ఇ. వి. రామస్వామినాయకరుగారు నాయకుడు.

ప్రాంతీయులవారు దానినే స్వభాషకు బదులుగ వాడుచున్నారు * (పంజాబులోని గ్రామీణుడైనను ఒక ముస్లిము కాకినాడకో గుంటూరుకో వచ్చిన, అత డిక్కడిముస్లిములతో హిందూస్తానీలో చనువుతో మాట్లాడి వారియాదరమునుబొందును.) హిందువులును హిందూస్తానీని సామాన్యభాషగ నేర్చినయెడల, తమలోను సంఘటనమేర్పడును. హిందూముస్లిముసంఘములమధ్యను మైత్రిగల్గును. ఇందులో కొన్నిసమస్యలేర్పడినవి †

ఇప్పుడు, కొందరు హిందువులు ముస్లిములు గూడ ఈభాషాసమస్యను తమతము మతముతో ముడిపెట్టుచున్నారు. ముస్లిములు పారసీ అరబ్బీ పదములనే తరుచు హెచ్చుగ వాడుచు, పారసీలిపిలోనే వ్రాయుచు, ఈమిశ్రితభాషను 'ఉర్దు' అని, ఈలిపినిగూడ 'ఉర్దు' యనుచున్నారు. ఉర్దు ప్రత్యేకభాషకాక పశ్చిమహిందీకి ఉపశాఖయని భాషాపరిశోధకుడగు కీ శే. సర్. అబ్రహాంగ్రియర్సనుగారు Linguistic Survey of India లో స్పష్టపర్చినారు. ఇట్లే హిందువులలో కొందరు సంస్కృతపదములు హెచ్చుగ వాడుచు, దేవనాగరిలిపిలోనే వ్రాయుచున్నారు. తరుచు సంస్కృతముకును దేవనాగరికిని వాడు సంప్రదాయమున్నది. కనుక చాలమంది హిందువు లీనాగరిలిపి పవిత్రలిపియన్నారు దీనిద్వారా హిందువులు వారిమతమును తమపైని జొప్పించి బాధింతురని కొందరు ముస్లిములు భ్రమించినారు. ఈరీతిగ హిందూముస్లిములమధ్య కొంత అనవసరమైన క్రోధమేర్పడుచున్నది. ఉభయులు సహనబుద్ధిగల్గి ఉదారులైతే,

* గుజరాతు, బెంగాలు, ఆంధ్రం ఈప్రాంతముల ముస్లిముల కీప్రాంతీయభాషలే అగలు స్వభాషలు. కాని వారిప్పుడు హిందూస్తానియే స్వభాషయనుట పరిపాటియైనది.

† ప్రస్తుతము ముస్లిములలో కొందరు హిందూస్తానికి సామాన్యభాషకన్న హెచ్చుగ మాతృభాష స్థానమిచ్చినారు. కొందరు హిందువులు దానిని సామాన్యభాషగను నుంచకూడదన్నారు. ఈ అతిదృష్టి అనాదృష్టి మాని, అందరూ దానిని సామాన్యభాషగ నెంచదలెను; ప్రాంతీయభాష నెవరును అశ్రద్ధ చేయకూడదు.

ఈసంఘర్షము కవసరమేలేదు. మామూల్, తయార్, జహర్, సబర్, సలహా, ఖజానా, వగైరా, వంటి వందలకొలది పారసీ అరబ్బీ పదములు హిందీలోనేగాక మనమిగతా దేశభాషలలోను(బళప్పుకొద్దిమార్పుతో) వాడుకలోనున్నవి. వాటినితొలగించి ఆస్థానే అంగకుబదులు క్లిష్టమా సంస్కృతపదములబెట్టుట న్యాయముకాదు. క్లిష్టమైన అరబ్బీ పారసీపద ములు జొప్పించుటయు సబబుకాదు. 'హిందూస్తానీ' ఉర్దు, హిందీ, వేరు భాషలుకావు. మనతెలుగులోకొందఱు అచ్చతెలుగుమాటలనుకొందరు సంస్కృతపదములను, (నిజాంప్రాంతస్థులు పారసీలక్షణను) హెచ్చుగ వాడుదురు. ఇట్లే భారతములో నన్నయ తిక్కనగార్ల రచనలలోను, వీటికి అచ్చతెనుగు పోత్తములతోను, చాలభేదమున్నది. అట్లని, అవి వేర్వేరుభాషలందురా? ఇంగ్లీషు 'ఆంగ్లోసాక్సను' భాష; ట్యూటనికు తెగలోనిది. కాని, జాన్సనుమిల్టనుల మహాకావ్యములలో నూటికి 70 కి పైగా పదములు 'లాటిను'నుండి వచ్చినవే. వాటివల్ల ఆంగ్లవాఙ్మ యమును భాషయు వృద్ధియైనవేగాని చెడలేదు. ఇట్లే ఈదేశపువారు సంస్కృతపదములను నాగరీలిపిని నిరసించుట (ముస్లిములకును) సబబు కాదు. అవి యీదేశపువి. లిపికినిభాషకును మతముతో సంబంధములేదు. చీనాలోను రష్యాలోను, ముస్లిములు ఆయాప్రాంతపు భాషను లిపిని తమ నిత్యవ్యవహారములకు వాడుచున్నారు. ఈవప్పుడో క్రైస్తవులు నట్లే. పంజాబులో కొందరు హిందువులును ఉర్దులిపిని వాడుదురు. ముస్తఫాకె మాలు పాషాగారి సలహాపైన అరబ్బీ, పారసీమాటలను ఆలిపిని సీదాగా తప్పించి టర్కీవారు రోమకాక్షరములను అచ్చటి పూర్వపుటర్కిష్ పద ములను పెట్టుకొన్నారు. ఇంతవరకు కొందరు హిందువులు ఉర్దూలోను, ఇట్లే ముస్లిములు హిందీలోను, విద్వాంసులై మంచిగ్రంథముల రచించి నారు ఇప్పుడిక్కడి ముస్లిములందరికి మాతృభూమి యీదేశమేగదా!

పేరిపూర్వికులలో హెచ్చుమంది అసలు హిందువులే* వారు షాహాను మొగలుపాలకుల కాలంలో 'ఇస్లాం' మతస్థులైరి † ఇప్పటికిని బెంగాలు దక్షిణప్రాంతం గుజరాతువగైరాల ముస్లిములలో చాలమందికి ఆప్రాంతీయభాషలేగాని, హిందూస్థానీ యేమియు తెలియదు. ముస్లిములలోను అధికజనులకు ఉర్దులిపి తెలియదు. అట్టిస్థితిలో భారతీయముస్లిములు దేశీయములగు సంస్కృతపదములు విజాతీయమనుకొనుట, నాగరిలిపికి జంకుటము, సవ్యముగాదు. ఐనను నిర్బంధముగ నాగరిని ముస్లిములపైన చొప్పించుటహింసాకార్యమగును, కనుక వారికందలి న్యాయము తోచువరకు ఎవరికితోచిన లిపిని వారు వాడుటేమంచిది. సౌకర్యదృష్టినే చూచిన, ఉర్దూకన్న నాగరి యెక్కువస్పష్టము, వైజ్ఞానికము, చాలమందికి తెలిసినది, ఈదేశపుఇతరప్రాంతములలిపికి సంబంధించినది. కనుకఅందరికి మంచిది. కేవలం ప్రాతసౌకర్యపు దృష్టితోనే చూచితే, ఈరెంటికన్నను రోమకలిపి (అనగాఇంగ్లీషుప్రాత చిన్నఅక్షరములు) ప్రాతకు అచ్చుకు, టైపు టిలిగ్రాం వగైరాలకును, సులభము. దానిద్వారా బాలురకక్షరములు త్వరలో నేర్పవచ్చును; కాని అందులోను లోపములున్నవి.) ఆ విజాతీయ లిపినిభారతీయులలో ఏపక్షమును సామాన్యలిపిగ స్వీకరించుట కొప్పుకోలేదు.) సైనికులు బ్రిటిషు ఉద్యోగులు మిషనరీలు ఈలిపి ద్వారా హిందూస్తానీ నేర్చుచున్నారు.

ఇక భాష. వాడుకలోనున్న దేశ్యపదములను సంస్కృతపారసీ శబ్దములను ఒకప్పుడు పారిభాషికములకు ఆంగ్లపదములనుకూడ వాడుకొనుకరము. జనులలో అహింసాపద్ధతి సామరస్యమునుంటే హిందూస్తాని కొద్దికాలంలోనే పూర్తిగ సామాన్యభాషయగును. ఈసామాన్య

* ముస్లింలీగు ముఖ్యనాయకులు ఉర్దూవాదులుగాని జనాబుజిన్నా, అబ్దుల్లా హరూన్, సికందర్ హయత్ ఖాన్, ఫజ్లుల్ హక్కుగారల అసలు పూర్వికులుహిందువులే అని స్పష్టము.

† ఇప్పుడు చాలమంది నిమ్నజాతిహిందువులు క్రైస్తవులగుచున్నట్లు ముస్లిములకు పారసీలిపి ధార్మికమైతే, క్రైస్తవులకు ఆంగ్ల (రోమక) లిపి ధార్మికమయువాదము వచ్చును.

భాషకును ఆయాప్రాంతపు మాతృభాషకును సంఘర్షముకూడదు. సామాన్యభాషావ్యాప్తికి అహింసాసిద్ధాంతమే ముఖ్యసూత్రముగదా! బాలుర విద్యాబోధ యంతయు మాతృభాషలో జరుగవలె. మాతృభాష స్థానంలో హిందీని చొప్పించకూడదు. ఇప్పుడు జనులు చాలవర కసలే నిరక్షరులు; వారి కందరకు ముందుగ మాతృభాషనే నేర్పవలెను. విద్యావంతులే (అందును కొందరుమాత్రం) హిందీ నేర్చుకొందురు. వారు హిందీనుండి మాతృభాషకు, అందుండి హిందీకి, మంచిగ్రంథములను వ్యాసములను తర్జుమాచేయవచ్చును. మనప్రాంతీయసంస్కృతిని విశేష భావములను తెలుపుచు హిందీలో స్వతంత్ర గ్రంథములను రచింపవచ్చును. ఇట్లే ఆయాప్రాంతములసంస్కృతి సమన్వితమగును. గాంధిమహాత్ముచు స్థాపించిన దక్షిణభారత హిందీప్రచారసభవారు మదరాసు రాష్ట్రమంతటకు హిందీ వ్యాప్తినిమిత్తము 1918 నుండి కృషిచేయుచున్నారు. దీనిద్వారా హిందీనేర్చుకొని యిప్పటికి సుమారు $1\frac{1}{2}$ లక్ష మందిహిందీపరీక్షలకువెళ్ళినారు ముఖ్యంగా గ్రామస్థులకును స్త్రీలకును ఇంగ్లీషుకన్న హిందీపై నే యెక్కువ ప్రేమకలదు. ఆంధ్రసంస్కృతముల సంబంధము చిరకాలపుది. క్రీ.పూ. అశోకునికాలమునుండి ఆంధ్రప్రాకృతముల కనోన్యతగల్గినది. కనుక తెలుగుభాషలోను వాఙ్మయంలోను వేలకొలది సంస్కృతప్రాకృతతద్భవ శబ్దములున్నవి. మరియు మనప్రాంతము కొంతకాలం దక్కనులోని ముస్లిముల యాధిపత్యంలోనుండేది. ఆంధ్రులలో 80 లక్షలమంది యిప్పుడు నిజాంరాజ్యపు ప్రజలు; వారిలో చాలమందికి హిందూస్థానీ తెలిసియున్నది. కనుక వేలకొలది హిందూస్తానీమాటలును మనవాడుకలో చేరి మిశ్రితములైనవి. ఇప్పుడు ఆంధ్రులకు హిందీ తెలియుట సులభము. ఆంధ్రప్రాంతంలో తురకలు, బొందిలీలు, ఇటీవల వ్యాపారనిమిత్తం వచ్చిన మార్వాడీలు, ఇట్టికొందరు హిందీహిందూస్తానీ తమగృహభాషగ వాడుచున్నారు. మనపూర్వసంస్కృతి సంబంధములబట్టియు ఆంధ్రులు ఉత్తరదక్షిణవాసులమధ్య మైత్రికి, ఈరీతిగ జాతీయసంస్కృతి సమన్వయముచేసి వృద్ధిచేయుటకును, తగినవారు.

16. సాంఘికరంగము-మతభేదసమస్య.

మనదేశంలో అనేకజాతులు అనేకమతములు నున్నవిగదా* 10 వశతాబ్దికిపూర్వం విదేశాలనుండి తండాలుగావచ్చిన ఆర్యజాతుల వారు హిందువులలో మిశ్రితులైరి; ముస్లిములల్లు కలిసిపోలేదు. కాలక్రమమున కొందరు ముఖ్యంగా నిమ్నజాతిహిందువులు ముస్లిం మతస్థులైరి; ఇటీవల పంచములలో కొందరు క్రైస్తవులగుచున్నారు. మరియు పార్సీలువగైరా లున్నారు.

ఏకేశ్వరభక్తిని, సర్వమానవప్రేమను, అన్నిమతములు బోధించును; కనుక ముఖ్యమతము లన్నిటిసిద్ధాంతములోకరీతివే; కాని, దరిమిలాను ఆచారములు కర్మకాండయుభేదించి, వీటికే జనులు ప్రాముఖ్యమిచ్చి తమతమ ప్రాబల్యముకై కలహించుటకలదు, ఆయాసంఘము లమధ్య కొన్నివిభేదములేర్పడి, సాంఘికమైత్రికి జాతీయైక్యముకు భంగం కల్గించుచున్నవి బ్రిటిషువారువాడు భేదనీతివల్ల యీయంతఃకలహములు విస్తరించుచున్నట్లు గట్టి సూచనలున్నవి. మనలో విభేదములు చెలరేగు సంతకాలమే మనదేశములపైన పరులు తమసామ్రాజ్యముసాగించిలాభ మొందుదురు. అది చిరకాలం సాగుచున్నమిత్తం వారిక్కడిజనులలో భేదపద్ధతినుపయోగించి, మనజాతీయతను దుర్బలముచేసి, తమయాధిపత్యము

---

* మతమునుబట్టి ఈదేశంలో 1931 సంఘు జనాభాలెక్కప్రకారం

హిందువులు సుమారు		24 కోట్లు
ముస్లిములు	,,	8 ,,
ఆటవికులు	,,	88 లక్షలు
క్రైస్తవులు	,,	68 ,,
సిక్కులు	,,	43 ,,
జైనులు	,,	14 ,,
పార్సీలు	,,	1 ,,

ప్రపంచమంతటిలో ముస్లింమతస్థులు దమారమి 21 కోట్లు.

నన్నివిధములను బలపర్చుకోజూచుట సహజమే. ఇది ఒకశతాబ్దినుండియు వారిరాజనీతిలో భాగము. కాని, అందుకు మన మాంగ్లేయులపైన కోపపడుట అశక్త దుర్జనత్వమే యగును. వాఁ భేదనీతి ఫలించకుండ మనలో పరస్పరవిరోధపుధోరణి మానుకొని మైత్రి వృద్ధిజేసుకొనుటే చికిత్స. కలహకారణమగు ప్రవృత్తులు మారనిలెను. కొంతకాలము బ్రిటిషువారు క్రైస్తవులకు ప్రత్యేకసదుపాయములిచ్చి తమకధీనులుగ జేసుకొనిరి. కాని, సంఖ్యయు విద్యయు హెచ్చినకొలది, క్రైస్తవులు తాము భారతీయులము, కనుక, జాతీయక్షేమమే తమక్షేమమునని ఇప్పుడిప్పుడు గ్రహించినారు. పారసీలలోను చాలమంది జాతీయవాదులే. సంఖ్య కొద్దియైనను తమ స్వశక్తివల్లను పరస్పరప్రేమవల్ల భారతజాతిలో అన్నిరంగములందును ఏసంఘపువారైనను ఉన్నతస్థితికి రావచ్చుననుటకు పారసీసంఘపుచరిత్ర నిదర్శనము. ఈకొద్దిసంఘంలో ఎందరో జాతీయ నాయకులు వ్యాపారప్రముఖులు, విద్వాంసులునయినారు ఆంగ్లోఇండియనులు మిశ్రితజాతి. వారినిబ్రిటిషుసర్కారువారు టిలిగ్రాఫ్‌రైట్‌లోనున్న గుమాటి కొన్నిముఖ్యోద్యోగములనిచ్చి బుజ్జగించుట మామూలైనది. ఆ సంఘపుసంఖ్యయు చాల తక్కువ. వారిలోను తాము భారతీయక్షేమము కోరవలెననుజ్ఞాన మిటీవలనే కల్గుచున్నది.

ఇక హిందూముస్లిములమధ్యనున్న సమస్యప్రధానమైనది. తాము అధికారముకువచ్చినకొత్తలో బ్రిటిషువారు ముస్లిమ్ ప్రముఖులకుజాకి, తమరాజ్యాధికారము నిరాతంకమగుటకు హిందువులనుకొంతవరకభిమానించిరట. కాని, ఇటీవల హిందూప్రముఖులు జాతీయవాదులగుటజూచి ముస్లింప్రముఖులను చేరదీసినారు హిందువులు ముస్లిములు మన దేశమం దన్నిప్రాంతాలలోనున్నారు. ఈశాన్యవాయవ్య భాగాలలో ముస్లిములు తక్కినచోట్ల హిందువులును హెచ్చుసంఖ్యలోనున్నారు. మొత్తంమీద హిందువులు ముస్లిములకు మూడురెట్లున్నారు. కనుక వారు సంఖ్యాబలముతో తమ్మునుబాధింతురని, తమసంస్కృతిని ధార్మిక

సాంఘికరాజకీయరూపమైన హక్కులను నశింపజేతురని, కొందరుముస్లిం నాయకులనుచున్నారు. ఇట్టి భయముకల్గుటకు తగు ఆధారములేదు; వారికి సోదరహిందువులపైన నిజమైన మిత్రభావముండవలె. ఈకాలపు జనులసౌఖ్యము ఆర్థికరాజకీయములబట్టియుండును; అది మతమునుబట్టి మారదు. ఉ॥ రయితులు సాలీలు ఏమతపువారైనను ఒకే ఆర్థికస్థితిలో నున్నారు, వారిసమస్యలూ కేకీతివి. టర్కీ, ఈజిప్టు, అరేబియా, పర్షియా వగైరా విదేశాలలోను ముస్లిం మతస్థు డాదులున్నారు. ప్రపంచమందలి దేశములన్నిటిలో మనదేశమందే హెచ్చుమందిముస్లిములున్నారు. ఉత్తరపు కొన్నిప్రాంతాలలో ముస్లిములే బలీయులు. జాతీయప్రభుత్వము ముస్లిములకు బాధకరమనుట భ్రమజనితమే, కాని యథార్థముకాదు.

కేంద్రప్రభుత్వములో జాతీయసిద్ధాంతపరిహారం ముస్లిములకన్న హిందువులు హెచ్చుమందియగుట సహజమే. కాని వారిచే పరిష్కరింపబడు ముఖ్యసమస్యలు భారతజాతికంతకు సంబంధించును; కనుక, అవి అందరికి నొకేకీతిగ వర్తించును; ముస్లిములను హిందువులు బాధించుట వారితో కలతలుపడుట హిందువులకు భారతజాతి మొత్తమునకుకూడ లాభకరముకాదు. పరస్పరప్రేమ సహకారముతోనే ఏజాతియు బాగుపడును. అల్పసంఖ్యావర్గము ప్రత్యేకజాతియని, వారిని అధికసంఖ్యాధికులు బాధింతురని, కనుక జాతీయప్రజాతంత్రత కూడదని చెప్పెడువాదము హిట్లరు యూరపులోను తెచ్చిపెట్టి, దానితో యూరపురాజకీయాలలో భీభత్సంగల్గించినాడు. దానితరంగములే జిన్నాగారివాదములో కనబడుచున్నవి. ఇవి ఈదేశంలో బ్రిటిషుపాలకుల భేదనీతికి సహకారిగనున్నవి. చీనా, రష్యా వగైరాలలో ముస్లిములు అల్పసంఖ్యావర్గమైనను, అక్కడ ఇట్టి విభేదములు లేవు. అట్లే ఈజిప్టులో ముస్లిములు తమ్ము బాధించుచున్నారని అక్కడి క్రైస్తవు లాందోళన చేయుటలేదు.

బ్రిటిషుసామ్రాజ్యంలో దక్షిణతూర్పుఆఫ్రికాలు వగైరాలలో అక్కడితెల్లవారు భారతీయులను చిక్కులుపెట్టునంగతి తెలిసినదే. కాని,

అక్కడి జాతీయప్రభుత్వపుపాలన కెవ్వరు నాటంకముచెప్పుట లేదు. ఈదేశంలో బ్రిటిషువారు మిక్కిలి కొద్దిమంది. (వారు సగటున ఇక్కడి జనాభాలో వేయింటి కైదుగురే యుందురు.) కాని, ప్రభుత్వపుమద్దతు చూచుకొని వారు ఉద్ధతులై భారతీయుల న్యాయతప్పుటకలదు. ఇట్టిఅన్యాయములను సర్కారు పోగొట్టలేదు. కాని భారతీయులమధ్య నుండు సాంఘికవిభేదములను, వాటిని ఆంగ్లేయులు గోరంత కొండంతలు చేసి తమ ఆధిపత్యముకు సాకుగపెట్టుదురు. ముఖ్యంగా యిటీవల ప్రభుత్వం వా రవలంబించు కొన్నిపద్ధతులవల్ల ఆంగ్ల పత్రికల ధోరణివల్లను ఈవిభేదములు హెచ్చినవి.† సాంఘికన్యాయము కావలసినదే; కాని, ఆవేరున ద్వేషము పోత్సహించుటవల్ల ప్రజలలో పరస్పరం హింసాతత్వ మధికమైనది.

మతసాంఘికభేదమున్నంతనే ప్రత్యేకజాతులగు, వానిని విడదీసి నప్పుడే రక్షితమగునని యిటీవల జనాబ్ జిన్నాప్రభృతులనుచున్నారు. ఇప్పు డీదేశంలోని ముస్లిములు దాదాపు అందరు భారతీయులే మతమన నది వ్యక్తుల ఆత్మసాధనకు సంబంధించినది. అంశలభేదముబట్టి రాజకీయములలో ప్రత్యేకపుహక్కు లేర్పర్చుట న్యాయముకాదు. నాగరిక దేశములలో నెక్కడను అట్టియేర్పాటులేదు. శాసనసభలలో ముఖ్యంగా ఆర్థిక రాజకీయసమస్యలు చర్చకువచ్చును. ఐనను బ్రిటిషుప్రభుత్వము వా రీదేశమందు మతమును కులమునుబట్టియే ఉద్యోగములు పంచుచ శాసనసభ్యుల నియోజనగూడ అట్లే చేయనారంభించిరి.

ఎన్నికలలోను, వాటినిబట్టియే ప్రతినిధులసంఖ్యను నిర్ణయించి నారు. 1908 సం॥పు మింటోమోర్లే సంస్కరణల నుండియు అందుకు నియోజక వర్గమును మత కులములను బట్టియే ప్రత్యేకించిరి; పర

† లార్డ మన వైస్రాయియైన డఫరినుప్రభువుగారు ఈభేదములారంభించినారు. సర్కారునూచనపైన సర్ సయ్యద్ అహమ్మదుఖానుగారు ముస్లిముల దృష్టిని తోటిహిందువులకు వ్యతిరిక్తముగను బ్రిటిషువారి కిష్టముగను తిప్పినారు.

స్పరవివాదముల రేపుటకు కారకులైరి; ఇట్లు విషవ్యాప్తిపూర్తియైనది. † ఇప్పుడుకొన్ని ప్రాంతములందు లోకలుబోర్డులలో మునిసిపాలిటీలలో గూడ మతమునుబట్టి ప్రత్యేకనియోజకవర్గము లేర్పర్చుచున్నారు ‡ సమిష్టినియోజకవర్గములే ప్రజలలో శాంతిని ఆయామతస్థులమధ్య మైత్రిని గల్గించునని సింధులోని అశాంతికేంద్రమగు సుక్కూరులో నిటీవల జరిగిన ఎన్నికల ఫలమువల్ల స్పష్టమైనది.

భారతజాతిలోను ఆయాప్రాంతములోను ఉద్యోగస్థులకు శాసనసభలకు జాతీయపక్షపాతముంటేనే, వారికార్యములు ప్రజలందరికీ క్షేమకరములగును. బ్రిటిషువారి యీవిభేదపద్ధతులవల్ల తమతమ కులములకే లాభముచేయు ధోరణియు ఇతరులపైన ద్వేషమును, బలపడును. ఇట్టి ద్వేషాగ్ని కాహారమిచ్చినకొలది, అదిమరింత వృద్ధియై హింసాతత్వము ప్రబలినది.

హిందువులలోను ముస్లిములలోను కులతత్వముకలవారే నాయకులనిపించుకొందురు. అట్టివారికే పెద్దయుద్యోగములు లభించుచున్నవి. అన్నిజాతులలోను జమీందార్లు ధనాఢ్యులు విదేశవ్యాపారముచేయువారు నీ కులకక్షలలో నాయకులగుటను చూచుచున్నాము. ఇట్టిఘోరణిలో, అట్టియెన్నికలోటరులు మూర్ఖతత్వపువారినే యెన్నుకొనజూతురు. కులనాయకుల ప్రచారమును అల్లేయుండును. వారు జాతీయసమస్యలనువిడచి, రయితుల సమస్యనదలి, ఇతరకులములతో పోటీగ తమకులముకెక్కువ హక్కుల నిప్పించజూచుట సహజము. యథార్థముకు

† ఇట్లు హిందూ ముస్లిములమధ్య కలతలు హెచ్చించు బ్రిటిషుపద్ధతి కాకతాళీయముకాక, బుద్ధిపూర్వకమే అని కర్జను, మింటో, మార్లే, ఆస్క్విత్, మాన్టేగ్యూవాండ్ల ప్రచురితమైన స్వంత తీ త్తరములవల్ల స్పష్టమైనది.

‡ ఇటీవల ఫజ్లుల్‌హక్‌గారి ప్రధానత్వంలో బెంగాలుప్రభుత్వంవారు కలకత్తా కార్పొరేషనులోను ప్రత్యేకనియోజకవర్గ మేర్పర్చి, ముస్లింసభ్యులసంఖ్యగూడ హెచ్చించినందుకు బెంగాలులో సాంఘికద్వేషము బ్రబలినది.

జాతీయవాదులు ప్రతినిధులగుటవల్ల ముస్లిములకు హిందువులకు జీవిత పద్ధతుల కాటంకముకల్గను, వారిపని నిల్చిపోదు ముస్లిములలో జాతీయ దృష్టి ఇంకను బాగుగ వ్యాపించవలెను. చాలమంది జనులలో అజ్ఞాన మును సాంఘికతత్వమును భయమును హెచ్చుగనున్నవి.

ఈ అజ్ఞానభయములవల్ల దౌర్జన్యతత్వము కొందరిలో ప్రబలినది. ఇందువల్ల హిందూమహాసభ ముస్లింలీగు తామే ఆయాజాతినాయకుల మని, జాతీయోద్ధరణ కుపయోగించుకోవలసిన శక్తినంతను పరస్పరం డీకొనుటకునియోగించుచున్నారు. మసీదులయెదుట సంగీతము, గోవధ, వ్యక్తులమధ్య కలహాములు, ప్రబలమతకలహాములుగ చూపినారు. పర స్పరహత్యలకు, కొంపలంటించి దుకాణములుదోచుకొని ఆస్తులు నాశన ముచేయుటకు, ఉభయసంఘములలోని దుష్టులు తయారగుచున్నారు. కాని, న్యాయవ్యవస్థాపనవారు సింధు ఢిల్లీలలో హెచ్చుమంది ముస్లిములు ఉత్తరదేశపు 'అహరార్' పక్షీయులు జమయత్-ఉల్-ఉలేమా-హింద్ వారుచాలమంది 'షియా'లు, మోమినులు ఉదారభావులైనారు,* ఇంతే కాక కాంగ్రెసులో ముస్లిములున్నారు కనుక ముస్లిములందరు సాంఘిక తత్వపువారనుట కేవలంతప్పు. ముస్లిములీగు నాయకుల ప్రచండ ప్రచా రము వల్లను, జనాబుజిన్నాగారికి లీగుకు ప్రభుత్వముయిచ్చిన ప్రాము ఖ్యమువల్లను, ఇట్టిభ్రమకల్గినది మరియు, 1937 లో దేశమంతటను జరి గిన 'అసెంబ్లీ' యెన్నికలలో ఏరాష్ట్రమందును ముస్లింలీగు పక్షమునకు అధికసంఖ్య రాలేదు† కేవలం ముస్లింలీగుద్వారా ఏర్పడిన ప్రభుత్వము లేదు. అయితే హిందువులకన్ననుముస్లిములలో హెచ్చుమంది చదువులేని

---

* అఖిలభారత షియా మహాసభవారు జిన్నాగారి ముస్లింలీగు సిద్ధాంతములకు సాంఘిక ద్వేషధోరణికి వ్యతిరేకులైనారు; మనదేశపు షియాలు మోమినులు కలిపిన, ముస్లిములలో సగముకన్న హెచ్చుమంది యగుదురు.

†అన్నిరాష్ట్రములలో కలిపి మొత్తం 482 ముస్లిం స్థానముల యెన్నికలలో 108 మాత్రమే ముస్లిం లీగు సభ్యులు గెల్చినారు.

వారు. వారిలో కొందరు పూర్వశతాబ్దులలో హిందూనిమ్నజాతుల వారై బాధితులై ముస్లిములైనవారి సంతతికావచ్చు. హిందూమతము హీనమని ముస్లింబోధకులు, ముస్లింమతము క్షుద్రమని హిందూబోధకులును, ఎంచుటమానవలెను. హిందూమతగ్రంథములను ముస్లిములును ముస్లింమత గ్రంథములను హిందువులును సానుభూతితో చదివి అందలి మంచిని గ్రహించితే, పరస్పరమైత్రి హెచ్చును. హిందువులపండుగలకు ఉత్సవములకు ముస్లిములు, ముస్లిం వాటిలో హిందువులును వెళ్ళి పాల్గొనటయు పరస్పరమైత్రి గల్గించును. తమమతస్థులే పూర్వాధికారముకు మరల రావలెనని కొందరు తలచుటయు తప్పు; ఇదియు స్వార్థపరతవల్ల మూర్ఖతవల్ల కల్గును.

ఇప్పటిపాఠశాల బోధనవిషయములును విభేదములను హెచ్చించును మనదేశపు చరిత్రలో పూర్వం నబాబులు సుల్తానులు తమ హిందూప్రజలను హిందూరాజులు ముస్లింప్రజలను తగుమ హింసించుచుండినట్లు, కొందరాంగ్ల చారిత్రకులు వ్రాసినారు. అట్టిపుస్తకములను నేటికిని విద్యార్థులకు పాఠ్యముగజేసినారు. కొద్దిమంది ముస్లిములును హిందూరాజులును ఎన్నడోజరిగించిన అత్యాచారముల కెక్కువ ప్రాముఖ్యమిచ్చినారు. (అట్టిచర్యలు ఇంగ్లండు జర్మనీవగైరాలలోను చాలజరిగినవి) వాటిలోకొన్ని తప్పుసంగతులును నేర్పుచున్నారు. హైదరాలీ టిప్పుసుల్తానువంటి వీరులు వట్టిమతమూర్ఖులై హిందువుల బీడించినట్లు,అక్బరువంటి ఉదారమహనీయులు స్వార్థపరులు క్రూరులు వంచకులునైనట్లును, ఇట్టి చరిత్రవ్రాతలు వట్టిఅసత్యములు హైదరుటిప్పూలు శ్రీరంగపట్టణపురంగనాథదేవాలయమును పునర్నిర్మాణము చేసి పోషించి; భద్రాచలదేవాలయము నిజాంసర్కారు ఆదాయపుసొమ్ముకుండియే కట్టబడి, అసర్కారు ఖజానాసొమ్ముతో పూజాపునస్కారములు జరుగుచున్నవి. పూర్వపుముస్లిం ప్రభుప్రలెందరో హిందూదేవాలయములకు ధర్మసత్రాలకు పండితులకు నీనాము లిచ్చినారు.

ఉత్తరదేశపు రాజులు చాలవరకు సంస్కృత, హిందీ, బంగాళీ వాఙ్మయముల వృద్ధిజేసినారు. మొగలుచక్రవర్తులు, నవాబులు, ఉపనిషత్తులను భారతపురాణాదులను మహాకావ్యములను పారసీలోనికి మన దేశభాషలలోనికి తర్జుమాచేయించినారు. చాలమంది హిందూవీరులను తమమంత్రులుగను సేనానులుగను పెట్టుకొని గౌరవించినారు. ఇట్లే శివాజీ మున్నగు చాలమంది హిందూరాజులును అనాథులగు ముస్లిములను ముఖ్యంగా స్త్రీలను రక్షించినారు; మసీదుమాన్యములను ఫకీరులవసతులను ఇచ్చినారు. కొందరు పైగంబరుల గౌరవించినారు. పారసీగ్రంథములను ప్రోత్సహించినారు. దాదాపు హిందూముస్లిం రాజులందరును తమప్రజలనందరిని అభేదముతో పోషించి కాపాడిరి.

ఇట్టిస్థితిలో అసత్యమైన విభేదప్రవాతలు సత్యమైనను ద్వేషకథలు ఉభయులమధ్య వైరము పెంచును; బ్రిటిష్‌పాలనను బలపర్చును. ఆయాసంఘాలకుకలిపి సమిష్టివిద్యపెట్టుటవల్లను పరస్పరసహనము మైత్రి యువృద్ధియగును. ప్రేమ ఖిలాత్యాగభావమును ఇందుకు సహకారి. 1931 మార్చిలో కాన్పరంలో హిందూముస్లిముల జగడముకల్గి కొన్నివందల జనులు మరణించిరి. అప్పుడు కాంగ్రెసులో యువకనాయకుడగు గణేశ శంకరవిద్యార్థి ముస్లింసోదరుల రక్షింపబోయి, తానే కత్తిదెబ్బకు గురియై మరణించి ఆదర్శమగు ఆత్మార్పణచేసెను. అంతట ఉభయపక్షములు పశ్చాత్తాపమొందిరి. ఇట్టివీరులు అరుదుగనున్నారు. విదేశాలలోనుఅనేక మతములవారున్నారు. ఇంగ్లండు అమెరికాలలో యూదులు, కాతలిక్కులు, ప్రొటస్టాంటులు, ప్రిస్బిటీరియనులు, శుద్ధనాస్తికులు ముస్లిములు వగైరాలున్నారు. ఇంకు కొంద రల్పసంఖ్యాకులు. కాని, వీరిపార్లమెంటులో గాని మరియెక్కడ గాని వీరికి వేర్వేరు ప్రతినిధిత్వము మతమును కులమునుబట్టి ప్రత్యేకనియోజకతలు ఉద్యోగాలు పెట్టలేదు. అక్కడ ఆర్థికరాజకీయములబట్టియే ఎన్నికవిభజనలు, ప్రతినిధిపద్ధతి, అర్హతను బట్టియే ఉద్యోగములును ఏర్పడి అమలులోనున్నవి. రష్యాలో చాలమ

తములవారున్నారు. అమెరికాసంయుక్తరాష్ట్రములలోను వివిధజాతులు మతములున్నవి. అందుచాలమంది ఆంగ్లేయులేగాక ఐరిషులు, జర్మనులు, ఫ్రెంచివారు, ఇటాలియనులు ఇత్యాదులున్నారు. స్వభాషను మాటాడుకొందురు కాని, వారికి ప్రత్యేకప్రతినిధ్యము వగైరాలు లేవు ఇట్లు సమిష్టి నిర్మాణకపద్ధతి ఔదార్యము అన్యోన్యతకుసహకారి. సవర్ణహిందువులు తమలోని అవర్ణజాతిపైన అస్పృశ్యతకుపాటించి అకులమును హీనస్థితిలోనుంచుటవల్ల వారుక్రైస్తవమున్లిమతములలోజేరుటో లేక (అంబేడ్కరుపక్షమువలె) ముస్లిములలో జిన్నాబోలు విభేదకారులకుప్రతిగాములసహాయపడుటోజరుగుచున్నది ఇట్లుఅస్పృశ్యతహిందుముస్లిం విరోధముకు పోషకమైనది* ఇట్లే హిందూవితంతువుల కిచ్చు నిరాదరణయు అంతట స్త్రీలహారించుటయు బెంగాలు వగైరాలలో తరుచు సాంఘికకలహాములకు కారణములైనవి కనుక హిందువులు తమలో విభేదములతొలగించుటయుపరస్పరమైత్రికి కారణమగును.

హిందూముస్లిములమధ్యనున్నదనే మతాచారభేదము చాలవరకు బాహ్యమే. మతభేదముతో సంస్కృతిభేదమునున్నదని ఉభయసంఘములు ప్రత్యేకజాతులుగ నెంచవలెనని ఈరెండుసంఘములు ఏకరాజ్యంలో కలసిమెలసియుండుటకు వీలుండదని చెప్పుటయు వారిలో పరస్పరద్వేషము రేపుటకు బ్రిటిషుపాలకుల చిరాధికారముకు కారణమగుచున్నది. కాని నిజంగా అట్టివ్యత్యాసము కవసరములేదు. మతసంస్కృతిభేదముల పేరట గోవధపేరనో మసీదువద్ద సంగీతపుపేరనో కొట్లాటలు జరుగుటకు కొద్దిమంది ప్రోత్సాహమే కారణము అసలు తగువు రాజకీయాధికారం పంచుకొనుటకు కొందరపద్ధతులవల్ల కల్గుచున్నది. ఇప్పటి బాధ రాజకీయపువాటాలకే గాని, ఆర్థికమతసంబంధిపుది కాదని ఇటీవల జనాబు

---

* ఇటీవల గాంధిమహాత్ముడు ఇందుకుగూర్చి హెచ్చరించినాడు.

I regard untouchability as the root cause of our downfall and of Hindu Muslim discord.

(హరిజనపత్రిక 25-5-40.)

జిన్నాగారే మైసూరులో బయటపెట్టినారు.* అసలు అధికారము బ్రిటిషువారి హస్తాలలోనే ఉండగ ఈతగుప్పడుట అవివేకము.

జనాబు జిన్నాగారు తమవశమగు ముస్లింలీగులో భిన్నరాజ్యతయగు 'పాకిస్తాను'కు అనుకూలంగా తీర్మానించినారు. సంఘీభావమే బలము కదా! ఇట్లు భారతదేశమునంతను జాతిని ముక్కలుగ విడదీయుటవల్ల అన్నిటిలోను అల్పసంఖ్యాకుల రక్షణసమస్య కు, హిందూముస్లిముల సిక్కులమధ్య విరోధములును మరింతపెరుగును. ఈచిన్నరాజ్యాలు ఆర్థిక సైనికరక్షణకు విదేశీయులపైనే నాధారపడవలెను. ఇట్టి విషపు 'సీక్రము' అన్నిసంఘములకు బాధకము, ఆచరణలో అసాధ్యమునని ముస్లింలీగులో ప్రముఖులు ముస్లింప్రధానరాష్ట్రముల ప్రధానులైన సికిందరు ఫజ్లుల్ హక్కుగార్లును భావించినారు. సింధుప్రధానియు నిరసించినాడు ముస్లిం సంఘబలముకని ముస్లింలీగువైరా లేవ్వడినట్లే, హిందూసంఘక్షేమము కని హిందూమహాసభయేవ్వడి పనిచేయుచున్నది. దానిముఖ్యనాయకులు శ్రీసావరకరు, మూంజీ, పరమానందుగారలు. ఆర్యసమాజమును హిందూసంఘపు లోపములు పోగొట్టుట కుద్దేశించినదే. కాని తరుచు ఈసంఘములకు ముస్లిములీగుకు వ్యతిరేకభావము సంఘర్షము గల్గుచున్నవి. రాజకీయంగా కాంగ్రెసు ఆశయముల నిరోధించుటలోమాత్రం ఈసాంఘికనాయకులుకలియుచుండిరి. హిందూసంఘములలోని అస్పృశ్యతాని వారణ కులతత్వధోరణి పోగొట్టుట, స్త్రీలనుద్ధరించుట, వివాహాదుల దుర్వ్యయములు పోగొట్టుట, ఇట్టికార్యముల నీసాంఘికసభలు పరిష్కరించుటకు శ్రద్ధవహించి, శుద్ధరాజకీయములకు కాంగ్రెసుకే విడుచుట శ్రేయస్కరము. ముస్లింసమితులు నిట్లే చేయుదురు.

---

* The real causes of our communal troubles are neither economic nor religious, but lie in the sharing of the powers which are likely to be given to Indians in the framing of the new constitution. (Jannab Jinnah's talk at Mysore on 25-5-1941.

(27-5-41 వ తేదీ హిందూపత్రిక చూడుడు)

17. సాంఘికరంగం.

2. కులభేదము.

హిందువులలో చాలాకులభేదము లున్నవి. ముఖ్యమైన నాలుగు వర్ణాలమధ్య సాధారణంగా వివాహములు భోజనములును లేవు. అట్లు వివాహములు మామూలుపద్ధతితో చేసినను ఇప్పటి హిందూ లా ప్రకారం అవి చెల్లవు. కాని, పూర్వ మట్లు భోజనములు కొన్ని వివాహములుగూడ జరిగినట్లు మన పూర్వగ్రంథములలో నెన్నియో నిదర్శనాలున్నవి. అనులోమవివాహములు చెల్లునని శాస్త్రములో చెప్పినను ఇప్పు డవి ఆచరణలో లేనందున చెల్లవని కోర్టులలో తీర్పుచేసినారు † వర్ణాంతరాలలో పెండ్లియాడేవారు తాము ముఖ్యమతాలలో వేటికిని చెందమని ప్రకటించితే "సివిలు వివాహపుచట్టము' (1872) కింద పెండ్లి చేసుకోవచ్చు. తాము హిందువులమే కామని ప్రకటించుట చాలమంది కిష్టముండదు. ఆర్యసమాజసిద్ధాంతప్రకారం చేయువివాహములు చెల్లుట కొక చట్ట మిటీవల చేసినారు.

ఇట్లు కాక, చాతుర్వర్ణ్యపుమధ్య సాంప్రదాయ హిందువులు చేసుకొన్నను అట్టి వివాహము చెల్లుననుచట్ట ముండుటే మంచిదని కొందరు విద్వాంసుల భావము. అట్టి చట్టమున్నను ఇప్పటిస్థితిలో వర్ణాంతరవివాహము లంతగా జరుగవు. అవి యితంతు వివాహపు చట్టంవలె నుండును. కాని, అందువల్ల ఆటంకము ద్వేషము తొలగి పరస్పరమైత్రి యేర్పడునని కొందరి యూహ.

ఇప్పుడు వర్ణాలలో ప్రతివానిలో అవాంతరశాఖ లెన్నియో కలవు. వేర్వేరుశాఖలవారును సాధారణంగా శాఖాంతరవివాహాలు, (కొందరు భోజనాలుకూడా) చేయుట లేదు. ఈచాతుర్వర్ణ్యము అవాంతరకులములు అసలు ఎట్లేర్పడెనో శిసలుగ తెలియదు. వృత్తిభేదముబట్టి

† 58 లా పీక్లీ 693 పుట తీర్పు చూడుడు. అనులోమవివాహము లిప్పుడు చెల్లునని లాగడచెప్పిన ఇం. లా. రి. 52 మద్రాసు 160 తీర్పును దీనిలో రద్దుచేసినారు.

ఏర్పడెనని అనువంశికంగా కులవృత్తిలో నేర్పు తమవంశీయులకు నిల్చుటకు వివాహనియమము పెట్టినారని కొందరి యూహ. దీనిలో కొంతసత్య ముండవచ్చు. మరియు, కేవలం సమీపబంధువులమధ్యను గాని, భూత్తిగా తత్వముకలియని భిన్నజాతులమధ్యగాని వివాహములు చేయుట మంచిది కాదని, అట్టివివాహములు సాధారణంగా సుఖకరమునుకావనియు, సంఘ శాస్త్రజ్ఞుల అభిప్రాయము. సపిండులమధ్య వివాహముకూడదని కేవలం భిన్నజాతీయులతోనుకూడదని శాస్త్రము విధించుటలో కొంత వైజ్ఞానిక సూత్రముకలదంచురు కొన్ని అడవిజాతులలోను ఇట్టినియమము లున్నవి. శాఖాంతరవివాహము చెల్లదని యిదివరలోని కోర్టుతీర్పుల ఆక్షేపణ కోర్టులలో రద్దు అయిపోయినది పరిశుద్ధి ఇత్యాదుల రక్షణకని ఆయా కులములవారు కొన్ని ప్రత్యేకాచారములు పెట్టుకొన్నారు ముఖ్యంగా కొందరి కాహారనియమము లున్నవి. అవి సరిగాజరిగించు స్థితిలో పరస్పర భోజనము లేకుండుటలో అర్థ మున్నది కాని, యిటీవల అసలు ఉద్దేశము పోయి, రసముపోయిన చెరుకువలె మట్టియాచారములు, కులవిభేదములు మిగిలినవి; వాటిప్రస్తుతఫలము కులకక్షలు. ఇప్పుడు అనువంశిక వృత్తిపద్ధతులును అంతగా లేవు అసలు కులభేదములు సదుద్దేశముతో నేర్పర్చబడి పూర్వకాలంలో సంఘమునకు కొంతలాభము చేసినట్లే కన బడును. ప్రస్తుతకాలంలో ఆసూత్రములు ఆచరణలో లేవు.

ఆయాశాఖలమధ్య జాతులమధ్య పరస్పరసమావేశముల కవకాశములు హెచ్చినవి. ఆచారసూత్రములు సంఘస్థితినిబట్టి మారు చుండును. ఇప్పుడు భావసాంకర్యము కల్గుటేగాక, బాహ్యాచరణయు వ్యక్తమైనది "వర్ణాశ్రమధర్మ"మును జాగ్రత్తతో ఆచరించుట శాస్త్రీయం గానడుచుట ఇప్పుడు అరుదు. ఆశ్రమపద్ధతి అసలే చెడిపోయినది. వర్ణపద్ధతియు శిథిలమైనది. కులకలహములుపెరిగినవి. బ్రాహ్మణబ్రాహ్మణేతరులమధ్య తగువులు రాజకీయరంగము కెక్కినవి. అప్పటి శాఖాకాలుష్యమును పోలేదు. ఏకాలపుహారైనను న్యాయమైనవృత్తి చేయువారు బ్రాహ్మణు

లైనను, శూద్రులైనను సమానగౌరవముకే పాత్రులు కావలె. ఉపశాఖలకు వృత్తిభేదమో ప్రాంతభేదమో కారణము కావచ్చు. నీచవృత్తి యనగా ఆర్థికంగా నష్టకరం, పరిశుద్ధిహీనత, అనుట తప్పు. మోసము దగా అన్యాయముసాగించు వృత్తులే నీచవృత్తులని భావించవలెను.

అప్పుడు సాంఘికవిషమ్యము కొంతతగ్గును. ఇందుకు ఔదార్యబుద్ధికావలెను. వెలనాడు ద్రావిడమొదలైనవి అసలు ప్రాంతభేదములు; కాని, ఇప్పుడు అన్ని తెగలవారన్ని ప్రాంతాలలో వ్యాపించినారు. ఇంకొకసంగతి: ఇటీవలదేశంలో ఆర్థికదుస్థితియేర్పడి, వృత్తులు ఉద్యోగములు తగ్గి వాటికపేక్షపడు నిర్వ్యాపారులసంఖ్య చాలపెచ్చుగనున్నది. అట్టిస్థితిలో కొందరు స్వబంధువులకు అంతట స్వశాఖీయులకు అంతట స్వకులపువారికి ఉద్యోగాది సహాయమొనరింప యత్నించుచున్నారు. అట్టి స్వలాభకరతవల్లను కులద్వేషము ప్రబలుచున్నది. అర్హులగువారికే ఉద్యోగములిచ్చుట న్యాయము. అన్నిసంఘాలకును సమానావకాశముండుట న్యాయమని, సర్కారును కులసూత్రప్రణాళికపెట్టి పంచిపెట్టుచున్నారు. ఇట్టినాటిచే తత్ఫలముకు కొందరికి సహాయముకల్గినను, విద్య వ్యాపించి అర్హులసంఖ్య అన్నికులాలలోను పెచ్చినమీదట దీని లాభమెవరికిని లేక ద్వేషభావముమాత్రం మిగిలినది. ఇట్టి జి. ఓ. లవల్లను సాక్ష్యము దస్తావేజులు వగైరాలలో జాతికులముల వివరములీయవలెననియు జనాభాలెక్కలలోను పేటికి ప్రాముఖ్య మిచ్చియు, సర్కారును కులవిభేదములు స్థిరముగనిల్చుటకు కొంతకారకులైనారు. పేటిలో నిట్టి వివరము లిచ్చుట మానితే కులవిభేదపు ప్రాముఖ్యము తగ్గును. విద్య ఔదార్యము పెచ్చి జనుల ఆర్థికస్థితికూడ బాగుపడినప్పుడు కుల విభేదములద్వేషము అణగంటును.

18. సాంఘికరంగము.

3. హరిజనోద్ధరణ.

సాంఘికసమస్యలలో మరొకటి దిక్కులేని హరిజనులది. ఇది చాల ప్రధానము. అహింసాభిమానులందరును దీనికై గట్టిగ శ్రద్ధ వహింపవలె సవర్ణులు, మస్లిములుగూడ ఎందరో బీదలు నిరాధారులు నున్నమాట నిజమే. కానివారిలో మధ్యవర్గపు కొంచంస్థితివంతులు, కొద్దిమంది లక్షాధికారులు, గొప్పభూస్వాములు, రాజులు నబాబులు నున్నారు. కాని హరిజనులుమాత్రం దాదాపు అందరు శుద్ధ దరిద్రులు, అసహాయులు; మరియు వారిని సవర్ణులు అంటక దూరంగా ఉంచుటవల్లను వారిస్థితి చాల హెచ్చినది. సవర్ణులయిండ్లలో తిగుటకు వ్యాపారాదులు చేయుటకు వారికి సమానావకాశములు లేవు పెట్టుబడికి అసలేసామ్మే లేదు; మనదేశమంతటను వారు వేరుగ గూడెములలో వసింతురు. వడకుట, నేత, చెప్పులుకుట్టుట, పుల్లలమ్ముట, వడ్రము, ఇత్యాదికులవృత్తులద్వారా వీరు సవర్ణులతోడ్పాటుతో జీవనంచేసేవారు. ఎందరో ఇది వరలో క్రైస్తవమున్లిం మతస్థులుకాగా ఇప్పటికి మిగిలియున్న హరిజనులును హిందూసంఘమంతటిలో దాదాపు $\frac{1}{4}$ వంతు ఉందురు. ఇట్టి మహాకులము మనకు దూరులై రోగగ్రస్తులై తిండిలేని అనాథులు దిక్కులేనివారుగ నుండ హిందూసంఘమంతయు భారతజాతియును ఇప్పుడు హీనస్థితికి వచ్చుటలో ఆశ్చర్యము లేదు.

ఈ ఆదిహింసువులకు అస్పృశ్యత అనేది ఎప్పు డేరీతిగ వచ్చినదో తెలియదు. వారే ఆర్యసంస్కృతితో కలియుట కష్టపడక, వేరుపడి, తుదకు ఆర్యసంస్కృతియే ప్రబలమై అందువల్లతామే బహిష్కృతస్థితికి వచ్చినారని యొకయూహ; మొదట గోభక్షణ మద్యపానమువంటి దురభ్యాసములు అపరిశుభ్రతవల్లనిట్లు బహిష్కృతులైనారని మరికొందరియూహ; బ్రాహ్మణస్త్రీకి శూద్రులవల్ల జనించిన మిశ్రితులకు చండాలురను పేరు

మనుస్మృతిలో జెప్పినారు. వీరా సంకరజాతివారేనని ఇటీవల కొందరు 'సనాతను'ల వాదన. వారిశరీరమస్తిష్కనిర్మాణము ముఖరూపమునుబట్టియు జాతిశాస్త్రసిద్ధాంతమునుబట్టియు ఇన్నికోట్లమందియు బ్రాహ్మణస్త్రీల సంతానపువారనుట నమ్మశక్యులు లేదని లోకతత్వజ్ఞులందరి యభిప్రాయము.

కారణమేదైనను, ప్రస్తుతనాగరికస్థితిలో అస్పృశ్యతాపద్ధతి అన్యాయమని అందరు నంగీకరింపవలె. అమెరికాలో నీగ్రోలను, తూర్పుదక్షిణాఫ్రికాలలో కొంతవర కీదేశములోను భారతీయులను శ్వేతజాతీయులు సాంఘికసహవాసమునకు అనర్హులుగ నెంచుచున్నారు, నిజమే. కాని, అది అన్యాయము, పాపకార్యము జాతిగర్వజనితము నని మనము చెప్పుచుంటిమిగదా! అట్టి స్థితిలో స్వజాతీయులగు ఈ భారతీయులను స్వదేశంలోనే అంతకన్ను హీనపర్చుట మనసంస్కృతిపైన గొప్పకుచ్చు. ఇట్టి స్థితివల్ల అవర్ణులకు సవర్ణులకు మధ్యలోలోన ద్వేషాగ్ని చెలరేగుట సహజము. ఈ దుస్థితి తమగతియని హరిజనులుసహించి బాధలనుభవించుచుండు సంగతి నిజమే కాని, ఇది బ్రిటిషుపాలనలో మనకుకలిగిన శాంతివలె, నిరాశ, పీడితదనము, చైతన్యక్షీణత వల్ల కలిగినది. ఈహింసాభావమును పరస్పర మైత్రిద్వారా తొలగించుకుంటే, తుదకు వక్రమార్గమున పైకుబికి రెండు సంఘములకు జాతీయతకు గూడ చాల హానికలుగును. ఇట్టి యాచార మిదివరలో నున్నను దేశకాలస్థితిలో మార్పుకుబట్టి ఆచారములు నుండవలెను; మేధావులగు పెద్దలేర్పర్చు నిర్ణయము వేదప్రమాణమువంటిది† అట్లెన్నియో పూర్వాచారములు క్రమముగ మారినవి, మారుచున్నవి. హిందూమతములకు ముఖ్యప్రమాణమైన వేదములందును, ప్రస్థానత్రయములలోను ఈ యస్పృశ్యతపద్ధతిని చెప్పలేదు. చండాలురను దూరముంచుమని మనుస్మృతిలోనున్నమాట నిజము. అయితే బ్రాహ్మణ

† దేశకాలనిమిత్తానాం భేదైర్ధర్మో విభిద్యతే (మ. భా)
సమయాశ్చాపి సాధూనాం ప్రమాణం వేదవద్భవేత్.
(ఆదిత్యపురాణ వచనం)

స్త్రీకి శూద్రునివల్లజనించిన చండాలుడన్నారు. ఆదిహిందువుల ప్రత్యేక జాతివారు లట్టివారని చెప్పలేము. పూర్వమొకప్పుడు శ్రోత్రియబ్రాహ్మణులును గోమాంసంతినేవారు; ఇప్పటికిని అన్యమతస్థులు గోమాంసము తిందురు ధారాళముగ వారిని చెరువులు ముట్టనీయకుండుటయు, వారిని ధర్మికి రానీయకుండుటయులేదు. క్రైస్తవులోతులు పతితులు; అట్టివారికి ప్రాయశ్చిత్తముద్వారా శుద్ధిచెప్పబడినది. మద్యపానమిప్పుడు కొందరుసవర్ణులలోను కలదు. మఱికొన్ని స్మృతివిధులును ఇప్పుడాచరణలో లేవు.

ముఖ్యముగ, పరిశుభ్రతలేక ఏదోరీతి అశుచిలో నున్నవారికే సాంప్రదాయికముగ అస్పృశ్యతయుండును,శుద్ధి కలిగినమీదట వారందరును స్పృశ్యులగుదురు. ఇప్పటి హరిజనులకును దురాచారములు మాన్పించి, శెట్టిగ, మేదర, ఎరుకలవంటి శూద్రజాతులతో సమముగ చూచుటకభ్యంతరము కనబడదు† వారిని జంతువులవలె జూచుటవల్ల ఉభయులకు పశుత్వము గల్గుచున్నది. మానవులందరి హృదయమంచును భగవంతుడున్నాడు, 'తత్వమసి, సర్వంఖల్విదం బ్రహ్మ, సర్వ వ్యాపీ సర్వ భూతాంతరాత్మా, మొదలగు వేదవాక్యము లీజనులకును వర్తించును గదా. అట్టి యుదాత్తమతపు వారము, మనలో ¼ వ వంతు జనులకుమానవత్వమునే నిరాకరించుహరికి ఈశ్వరుడు సద్గతినిచ్చునా?

హిందూసవర్ణ సంఘములో కులభేదములెన్నియో ఉన్నవి; వారిలో చాలమంది పరస్పరభోజనములు వివాహములు చేయుటలేదు, నిజమే; కాని, ఈసమస్యవేరు ఒకజాతిని అసలే సంఘబాహ్యులుగ జేసి, అట్లు శాశ్వతముగ నుంచుట, మనయిండ్లకు చెరువులు నూతులు వగైరాలకు రానీయకుంచుట, వారినెన్నడును స్పృశించకూడదనుట వట్టివర్ణసమస్యకాదు. ఇది మహాపాపము, ఇది పరోక్షహింసయైనను హరిజను

† కేరళంలో చాకలి, శెట్టిగ, ఎరుక వగైరాలు అస్పృశ్యులే, మనప్రాంతాలలో అట్లులేదు. ఇక్కడఉన్నంత తీవ్రత ఉత్తరరాష్ట్రాలలోలేదు. కనుక, ఈ ఆచార మన్ని ప్రాంతాలలో ఒకేరీతిగలేదు.

లందరి ఆత్మవికాసమునకు, సాంఘికోన్నతికి, ఆర్థికక్షేమమునకుకూడ భంగ కరమని నిష్పక్షపాతులకు స్పష్టము. మాన్యులగు హిందువులందరు హరి జనులను జంతువులకన్న హీనులు లేక పశుతుల్యులుగ చూచినప్పుడు, అట్టిభావమే క్రమముగ ఆజాతిలోగల్గును; ఇది మనశ్శాస్త్ర సిద్ధాంత ము. అట్టిస్థితిలో ఆదిహిందువులకున్నదనే పశుతత్వమునకు, హింసాభావ మునకు, అపరిశుద్ధతకు, దురాచారములకుసవర్ణహిందువులును బాధ్యులు. కనుక, వారిదురాచారములుపోగొట్టి, శంకరరామానుజాదులు బోధించి నట్లు పరిశుద్ధమగు ధార్మికబోధచేయుంది, వారి నష్టవృత్తులను జీవనాధా రములను మరల నిర్మింపజేయుట సవర్ణుల బాధ్యత. పంచముల విషయం లోనేగాక, మతాంతరీయులను ఫ్లేచ్ఛులని హూణులని సంఘసమావేశ ములకనర్హులని మధ్యకాలపు హిందూగ్రంథాలలోవ్రాసినారు. అడ్డబొట్టు వారి మొగముచూచిన భ్రష్టతగల్గునని కొన్ని వైష్ణవగ్రంథాలలోను, నిలువుబొట్టువారు కంటబడితే పతితులౌదుమని శైవాగమములలోను గూడ, వచనములుకలవు ఇట్లేకొన్ని ముస్లిము క్రైస్తవగ్రంథములలోను తమమతస్థులుకానివారు కాఫరులు హీథెనులు, నీచులు, వారితో సాం గత్యముకూడదు అని వ్రాయబడినది. మొత్తంమీద ఆకాలమం దన్ని దేశాలలోను ఇట్టిమూర్ఖత అసహనము నుండెను. ఆధునిక నాగరికతలో పరస్పర సంపర్కము చాల హెచ్చినది. విశ్వమానవులందరు సోదరుల వంటివారు; అందరు నీశ్వరుని పిల్లలే; సిద్ధాంతభావముల సమానత్వము గ్రహించుటే అందరికిని వృద్ధికారణము. అదే ముఖ్యనూతనమల్నిటిఅసలు సిద్ధాంతమునని యిదివరకే చూచియున్నాము. ఇప్పుడున్న విభేదములు బాహ్యచిహ్నములకే సంబంధించినవికదా, ఇప్పుడు క్రైస్తవులు ముస్లి ములు చాలమంది సవర్ణహిందువులు తాకుచు సాంఘికసాంగత్యం కల్గి యేయున్నారు ఇల్లు హిందూమతస్థులు క్షౌరివారిని తమపేటలకు గృహా ములకు బడులకు చెరువులు వగైరాలకు రానిచ్చునప్పుడు, తమమతస్థు లేయగు హరిజనుల విషయంలో పట్టుపట్టుట అన్యాయము, అవివేకము.

ఇప్పటి బోర్డు పాఠశాలలు నూతులు ఇత్యాదులు దేశంలోని ఆయాప్రాంతీయులకు ప్రయాణికులవంటి యితరులకు అనగా లోకులందరికి ఉపయోగపడవలసినవే. ఇట్టి సార్వజనికములు జీవితావశ్యకములు అగువాటిని హరిజనులుమాత్రము వాడకోకుండజేయుట కేవలం అధర్మము. సంఘమంతటిలో వారే యెక్కువబీదలు, మూఢులు, నిరాధారులగు అసహాయులు. వారికే యిట్టివాటి అవసరము హెచ్చు. ఈ బహిష్కారము కెట్టి కారణము మనము చెప్పినను ఇదిన్యాయముకాదు. ఈచర్యను సమర్థించుచుట మనము చేయు అన్యాయముకుతోడు అవమానమునుచేర్చుటే అన్నమాట. ఇందువల్ల ఈవిధి హిందూజాతిలో మనపైన హింసాభావమును సవర్ణులకు వారిపైన అవజ్ఞ క్రోధమును వృద్ధియగుచున్నవి.

అవర్ణులకు ప్రత్యేకపు గుడులను నూతులు వగైరాలను ఏర్పర్చుమని, కనుక సార్వజనికములనుండి వారిని తప్పించినను వారికి బాధలేదని, కొందరు 'సనాతను'లనుచున్నారు. కాని, ఇది వాదంనిమిత్తం చెప్పుమాటలే, క్రియలో జరిగేనికావు మన బీదదేశంలో చాల గ్రామములలో తగినన్ని పాఠశాలలు జలాశయములు ఆరోగ్యసౌకర్యములు అసలేలేవు, కొత్తవెన్నియో కావలెను, అందుకుసర్కారుకు బోర్డులకు తగుసొమ్ములేదు. అట్టిస్థితిలో హరిజనులకు కావలసినన్ని ప్రత్యేకంగా ఎట్లు నిర్మింతురు? ఇంకనెన్నియో నిర్మాణకార్యములకును సొమ్ముకావలెను. మరియు, ఈపృథక్త్వకతవలన మరింత మనస్సులు భేదించి, విరోధములు పెరిగి, చిక్కులుకల్గును, అవర్ణులు సంఘదూషణలగుటవల్ల, వీరి ఆరోగ్యాదుల నితరులెవరును సాధారణంగా పరిశీలించుటలేదు అవర్ణుల అద్భుతశిల్పశక్తి యిప్పుడు వ్యర్థమగుచున్నది. మరియు పట్టణాదులలో పాకీపని, వీధుల శుభ్రపర్చుట, గ్రామములకావలి, సరిహద్దుల నిర్ధారణ, ఊళ్ళు కోటలు వగైరాలలో శ్రమపడుట, తోళ్ళు చెప్పులుకుట్టుట, వాటిని నేటికిని తరుచు హిందువులలో అవర్ణులే చేయుచున్నారు. కొన్నిచోట్ల నేటికిని వడుకుట నేయుటకలదు. ఇవి సంఘమంతటికి అత్యవసరమైనవి.

వారిశిల్పశక్తికి తగు ఉపయోగము కల్గించవలెను. వీరికి జలవసతి విద్య వగైరాలులేక, అశుభ్రత మూఢత్వమువల్ల, తరుచు వీరిగూడెములలో అంటువ్యాధులు, జాతరలు' జీవహింస, చోరీవగైరాలు జరుగుచు, పిమ్మట త్వరలోనే అవి సవర్ణసంఘములున్న ప్రాంతాలకు వ్యాపించి, అందరిని బాధించుచున్నవి. దేహములో పాదములు వ్యాధిగ్రస్తమైన ప్పుడు, మొదట పాదముకే బాధగనున్నను, క్రమంగా ఆవ్యాధి లోలోన దేహమంతటిలో వ్యాపించి, అంగమంతయు వికలమై, నీరసించి, ప్రమాదించునుగదా! ఆర్థికంగాను అంతే. బొత్తిగా తిండిగడుచుటకు వేరుమార్గము లేనప్పుడు వారిలో కొందరు చోరీలకు బందిపోట్లపనులకు తగువులలో సైమరచి కూసీలకుగూడ సిద్ధమగుట సహజము. హరిజనుల నిట్టి నిరాధారపు తెగింపు స్థితిలోనుండుట తక్కిన సంఘమంతటి వారి ఆస్తికి ప్రాణముకును హానికరము. హరిజనులకిప్పుడు జలవసతి, బడులు వగైరాలు ఏర్పడినగాని శుభ్రత జ్ఞానము కలుగదు. ప్రత్యేకవసతులేర్పర్చుట సాధ్యము, ప్రశస్తముకూడ కాదు. కనుక, మనముసహనముకల్గి ఇప్పుడు గ్రామములోనున్న సామాన్యసౌకర్యములు హరిజనులును ఉపయోగించుకొనునట్లు ప్రోత్సహించవలెను; వారి ప్రేమాభిమానములను కృతజ్ఞతను సంపాదింపవలెను.

ఇట్లుఅస్పృశ్యతాచరణఅహింసాతత్వమునకు వేరుపురుగువంటిది. ఇందువల్లసంఘమంతటిలోపరస్పరహింస తప్పదు* అనుకు మనమందరమును కొంచమో అధికమో బాధ్యులము. ఇట్లు మానవత్వము నవమానించి అణచుమనము యూరపియనులవల్ల అట్టిఅవమానముకేలోనగుట,మనకీశ్వరుడిచ్చిన శిక్షయని గాంధిమహాత్ముడు చెప్పియున్నాడు. పశ్చాత్తాపము నొంది మనముఅసంఘము నుద్ధరించనియెడల హిందూమతము క్షీణించు

* The existence of untouchability among Hindus is a denial of the doctrine of Ahimsa on which we pride ourselves. We are responsible for the evils among the untouchables.

(యంగు ఇండియా. 18-8-1926)

నని, మనదేశమునకు మోక్షముకలుగదని ఆయన దృఢవిశ్వాసము.* ఇతరజనుల మానవత్వము చెరుపువారు తమమానవత్వమును పోగొట్టు కొందురు.

అయితే గ్రామాలలోని హరిజనులింకు నిమిత్తమాందోళనచేయు చున్నారా,అని ప్రశ్న; చిరకాలము పంజరములోనున్న పక్షి స్వేచ్ఛకు భయపడునట్లు,హరిజనులలో కొందరిప్పుడు అస్పృశ్యత పోవలెనని ఆందోళనచేయకుండుమాట నిజమే కాని వారిలో స్తబ్ధమై క్షీణించు మానవత్వ ముకు పునరుద్ధరణమిచ్చు బాధ్యత సవర్ణులది చెరువులు, బావులు, గ్రామాలలోని వీధులలోకికూడ హరిజనులను స్వేచ్ఛతో గ్రామస్థులందరు రానిచ్చి, ప్రోత్సహించి,వారికి ప్రేమాస్పదులు కావలె. వీటిబహిష్కార ముకు చట్టము శాస్త్రాధారముకూడ లేకున్నను, ఆచారబలమున అట్లు జరుగుచున్నది. ఇది సంఘమంతటి క్షేమముకు వ్యతిరిక్తముగదా! వ్యవ హారబాధలేకుండుటకై, అట్టి సార్వజనికస్థలములకు కులజాతిభేదముల బట్టి ఎవరిని రాకుండ ఆటంకపర్చుట నేరమగునని ఇటీవల అయిదారాష్ట్ర ములలో చట్టముకూడ చేసినారు. కాని, ఆచట్టమునైనను, ప్రజాభిప్రా యము బలీయమై, అమలులో నుంచవలెను. కనుక, దేశమందన్నిప్రాం తాలలోనున్న హరిజనులకు సవర్ణులకు మధ్యసహృదయత పరస్పర సహా యబుద్ధిగల్గి అహింసాభావము బలపడినప్పుడే, సాంఘికముగ ఆర్థికముగ కూడ హరిజనోద్ధరణసాగి కార్యకారియగును. ఇట్లే హరిజనోద్ధరణ బాగుగ సాగినప్పుడే అహింసాతత్వము జనులలో వ్యాపించినట్లుచ వచ్చును.

---

*I consider untouchability to be a heinous crime againg humanity (YOUNG INDIA 8—12—1920). This untouchability is a curse that is eating into the vitals of Hindusim...unless we take due precautions and remove this curse from our midst, Hinduism itself is in danger of destruction.

(యంగు ఇండియా. 20-10-21)

19. ధార్మికరంగము.

1 దేవాలయములు.

చాలకాలమునుండి మనధార్మికజీవనములో దేవాలయములకు ముఖ్యస్థాన మేర్పడినది.

ముస్లిముల మసీదులు, క్రైస్తవుల చర్చిలుగూడ సార్వజనిక ములు. వాటిలోని కందరునువచ్చి అక్కడి ప్రార్థనలో పాల్గొనవచ్చును. మసీదులో నబాబుకు ఫకీరుకు, కులీనునికి భ్రష్టునికిగూడ, ఒకేస్థాన మర్యాద. క్రైస్తవులలో ప్రొటస్టంటు కాతలికు మొదలగు శాఖాభేద ములున్నవి. కాని ఎవరినీ బహిష్కరింపరు. వాటిలో తరుచు సమిష్టి ప్రార్థనలు జరుగును.

వేదకాలమందు దేవాలయము లెట్లుండెనో తెలియదు. ప్రాచీన స్మృతులు భారతరామాయణములు, వీటిలోను దేవాలయములలో విగ్ర హములనుంచినట్లు మూర్తిపూజ చేసినట్లు వర్ణింపలేదు. బౌద్ధయుగపు దరిమిలాకాలములో బుద్ధునివిగ్రహముల పూజయుండేది. దానిస్థానే వ్యాపించిన పౌరాణిక హిందూయుగంలో దేశమంతటను చాల దేవాల యములు వాటిలో విగ్రహారాధనయు వెలసినవి. ద్రావిడులలో విగ్ర హారాధన అనాదిగనున్నది. ఈప్రాంతమందు అభ్భుత శిల్పములతో గొప్ప ప్రాచీనదేవాలయములు నేటికి నిలిచియున్నవి. ఆటవికులు ఆది మజనులు రాయి రప్పలు పూజించుటయు అతిపూర్వికము. ఈ సంస్కృ తులన్నిటిసమన్వయంలోను విగ్రహారాధన విస్తరించియుండునని సంఘ శాస్త్రజ్ఞుల అభిప్రాయము. దేవాలయములు పూర్వం జనులందరిసమిష్టి ప్రార్థనలకేగాక, విద్యాపాఠశాలలుగను, మతబోధకు ధార్మికోపన్యాస ములకు, సాంఘికసమావేశములకును, వాడుకలోనుండెను. మరియు చాల వైష్ణవాలయాలలో భక్తులందరిసమిష్టిభోజనాలును జరిగేవి.

వీటిలో నిట్లు సామ్యసిద్ధాంత మములులో నుండేదని కొందరి భావము. అట్టి దేవాలయప్రసాదము స్వీకరించుటపుడు కులవిభేదము దృష్టిదోషముకూడ నేటికిని గమనింపరు. ఇట్టి సార్వజనికకార్యము లకు వీలుగ విశాలమండపములున్నవి. దేవాలయములకు మఠసంస్థలకు జనులిచ్చేద్రవ్యంవల్ల సార్వజనికంగా ప్రజోపయోగము జరిగేది. ఇప్పు డీస్థితి పోయినది. దేవాలయాధికారులును వాటినిద్రవ్యార్జనకు ప్రాబల్యముకు వినియోగించుచున్నారు ధర్మకర్తలు స్వాములవార్లు ఇప్పుడు హిందూ మతసంస్థలలో పరిశుద్ధమతప్రచారము చేయుట విద్యాబోధ ఇట్టివి క్షీణించినవి వాటిద్వారా కొద్దిమందిలాభగౌరవములుపొందుచున్నారు. బీదభక్తులకు పోషణలేకున్నది. కాశి, తిరుపతి, శ్రీరంగం, జగన్నాథం, మొదలగుపోట్ల ప్రసిద్ధదేవాలయముల కొఱకో భూవసతు లుండుటే గాక, వాటికి నేటికిని భక్తులవల్ల నిరంతరంధనప్రవాహము చేరుచున్నది. ఆద్రవ్యములో సగమైనను ధార్మికప్రచారముకు జనులదురాచార ముల నివారణకు ఉత్తమ విద్యావ్యాప్తికిని వినియోగించుట అవసరము. ఆలయాలలో విగ్రహారాధనద్రవ్యసంచయము హిందూముస్లిములమధ్య పోరులకు కారణమైనదని ఇదివరలో చూచియున్నాము. మధ్యకాలంలో కబీరు నానకు ఇత్యాదులేగాక 19వ శతాబ్ది రామమోహనదయానందా దులును మూర్తిపూజను మాన్పింపజూచిరి. నిజమైనభక్తికి ఈశ్వర ప్రార్థనకు విగ్రహారాధన యవసరంకాదని, అదిమంచిదికాదనియు, బుద్ధి మంతు లంగీకరింతురు. పురాణములలోను దేవుడు విగ్రహాలలోనే లేడు సర్వవ్యాపి, అంతఃశుద్ధిలోనుచరాచరములన్నిటిలోను ఉన్నాడని, ఆత్మాం తర్గతుడగు ఈశ్వరుని సేవించుటే ప్రశస్తమని, హిందూమతశాఖ లన్నిటి సిద్ధాంతము *

---

* శివమాత్మన్యపశ్యంతి ప్రతిమాసునయోగినః
అత్మస్థం యే నపశ్యంతి తీర్థేమార్గంతి తే శివం (శివపురాణము.)
సర్వస్యైవజనస్యాస్య విష్ణురభ్యంతరేస్థితః।
తంపరిత్యజ్య యే యాంతి బహిర్విష్ణుం నరాధమాః॥ (యోగవాసిష్ఠము.)

అయితే ప్రాజ్ఞుల కక్కరలేదు, కాని, మూఢజనులు ప్రారంభ స్థితిలో భక్తిపుట్టుకు విగ్రహారాధన ముపయోగించునని కొందరి భావము ఇది నిజమే కావచ్చు ఇదివరలో రాయిరప్పలు పూజించి వాటిలోనే దేవు డున్నాడనుకొను మన్యపుజనులకు నిమ్నజాతీయులకు అజ్ఞానులగు మూఢులకు దేవాలయాలలో విగ్రహము లుంచి పూజించుట దేవునంపు మనస్సు లగ్నము చేయుట కుపయోగింపవచ్చు. కాని చాలమంది మూఢులు ఏండ్లకొలదిగ గుళ్ళకు వెళ్లుచున్నారు. వారికి వాటి విగ్రహాలలోనే దేవు డున్నాడను భ్రమ వదలుటలేదు. పైపెచ్చు శిలల ప్రాణప్రతిష్ఠ ఆడంబరపు పూజావిధానము సంప్రోక్షణచర్య ఇట్టి వాటివల్ల పామరుల మూర్ఖభావము మరింత బలపడుచున్నది. ఆలయములలో పూజాసమయమందైనను, ఈశ్వరుడు సర్వవ్యాపి విగ్రహము వట్టిచిహ్నమె అని పామరులకు బోధ జరుగుటలేదు. అట్లుగాక జనులకు పరిశుద్ధజ్ఞానభక్తులు విస్తరింపజేయునట్లుగ దేవాలయాలలో కార్యక్రమమును మార్చుట బోధించుట అవసరము. అప్పుడే హిందూసంస్కృతి సరిగా వ్యాపించును.

ఈసందర్భంలో హరిజనుల కాలయప్రవేశపుప్రశంస కల్గును. ఇప్పుడు మామూలు దేవాలయములలోకి హరిజనుల రానిచ్చుటలేదని తెలిసినదే. బళులు, చెరువులు, నూతులు వగైరాలకు రానిచ్చు సందర్భముగూర్చి చెప్పిన యంశములు దేవాలయప్రవేశమునకును వర్తించును. దీనినిగూర్చి అదనంగా రెండుమూడు విషయములు మాత్రం చర్చించవలెను. ఆధ్యాత్మికోన్నతి ఆత్మవికాసమునే నిజమైన అభివృద్ధికి సూచకము. కనుక, వారికి మతబోధ ధార్మికజ్ఞానము కల్గింపక కేవలం తక్కిన సంస్కరణవల్లనే హరిజనుల నుద్ధరించుట సాధ్యముకాదు. పూర్వం శంకరరామానుజాదులు సమత్వబుద్ధి గల్గి హరిజనులలోను మతబోధ చేసి శిష్యవర్గము కల్గియుండినట్లు వారిలోని జ్ఞానులను గౌరవించినట్లును లోగడ గమనించియున్నాము. కాని, ఇప్పుడు హిందూధర్మప్రచారకు

ట్లు చేయుటలేదు. వారి గూడెములలోకి సవర్ణులు వెళ్ళుటే దుర్లభము. అట్టిస్థితిలో వారికి హిందూమతాచారములు బోధపడుటకు సమిష్టిప్రార్థనసమయమందు వారిని సవర్ణులతో కలుపుటే సులభమార్గము. అనగా, హరిజనులకు దేవాలయప్రవేశమిచ్చేయెడల వారికి సత్సహవాసము, ధార్మికబోధయు జరుగును. జ్ఞానము శౌచనియమాలు నలవడును.

అయితే, సవర్ణులప్రతికూలత హెచ్చుగనున్నది. మూఢులకు ధార్మికబోధ చేయవలసిన ధార్మికప్రవరులు 'సనాతనధర్మ'పరులు నీసూచనను వెంటనే నిరసించుట మామూలైనది. కాని, వారీసమస్యను నిదానముతో నాలోచించుచున్నారా యని సందేహము.

హరిజనుల నాలయములకు రానిచ్చితే, వారికి భక్తిప్రేమలు, సద్భావము, అహింసాభావమును కలుగును. ప్రస్తుతము వారు తమ గూడెములలో జరిగించు అమ్మవారిపూజలు, జాతరలు, జంతుబలులు, మద్యపానములు అధార్మికములని, హిందూమతవ్యతిరిక్తమని వారికి బోధపడును. జంతుబలి మద్యపానంవల్ల అమ్మవారికి ప్రీతికల్గునని హరిజనులు ఇత్యాదులకు భ్రమకలదు. ఈదురాచారములకు ధార్మికాధారము లేదని, అట్టిదుశ్చర్యను దేవుడు హర్షింపడని, వారికి దేవాలయసంపర్కంవల్లబోధపడును. కనుక, అహింసావ్యాప్తికిని అదిసాధకము. మరియు ఆలయాలలోవిగ్రహాలుంచిపూజించుట పామరులకుసుబోధకొరకుగదా! ఇప్పుడు హిందూమతస్థులందరిలో అతిపామరులు ఆదిహిందువులే. కనుక మూర్తిపూజగల దేవాలయాలవల్ల వారికే మఖ్యోపయోగముండును. జ్ఞానుల కీసుఖ మవసరమేలేదు. హరిజనులను రానిచ్చినప్పుడు దేవాలయాలలోనికి హెచ్చుమంది మూఢులువచ్చుట, వాటినల్లవారికినిజమైన లాభమును, కల్గును. ఇప్పుడుమూములు ఆలయాలకు చాలమంది వెళ్ళుటే లేదు. తీర్థక్షేత్రములకును మూఢభక్తితోనే జనులు వెళ్ళుచున్నారు

తక్కిన హిందువులతో సరియగు ధార్మికసంపర్కములేనందున అజ్ఞానమువల్ల హరిజనులు సులభముగ క్రైస్తవ ముస్లింప్రచారకులకు

లోబడి, లక్షలకొలది జనులు సాలీనా అన్యమతస్థులగుచున్నారు. ఇందువల్ల మనదేశంలో ఇతరమతస్థులు వృద్ధియగుచుంటే హిందూమతస్థుల సంఖ్య తగ్గుటతప్పదు. సవర్ణులిట్లు తమ్మువమానించి మూఢస్థితిలో నుంచినప్పుడు, వారితరమతముల కాకర్షణలగుట సహజమే కనుక స్థితిగతులిట్లే యుంటే కొంతకాలముకిట్లే యూరేకుకోట్లవారు అన్యమతస్థులు కావచ్చు. అప్పుడు, ఆర్యధర్మము కావాసమనుకొను భారతదేశంలోనే హిందూమతస్థుల సంఖ్యాబలముతగ్గి, ఇతరమతస్థులందరి మొత్తపుసంఖ్య హిందూసంఖ్యకన్న హెచ్చువచ్చు', ఇందువల్ల హిందువులకు ఆలంబనముతగ్గి నైతికపతనమును కల్గును; అప్పుడు సవర్ణులలోను మేదర,ఎరుక, చాకలి, గొల్లవగైరా నిమ్నజాతీయులకు హిందూధర్మమందు నమ్మకముతగ్గి, వారును కొందరు విమతస్థులగుదురు. ఈరీతిగ హిందూధర్మము క్షీణదశపట్టును *

మరియు, ఇదిప్రజాయత్తయుగము: సాంఘిక రాజకీయాదులకు సంబంధముహెచ్చు, వీటిలో సంఖ్యాబలమును బట్టియే ముఖ్యనిర్ణయములు జరుగును. శాసనసభలలోను మంత్రివర్గములలోను అధికారులలోను అన్యమతస్థులే హెచ్చుమంది యుందురు. నాఁజనుల బహిష్కరించుటవల్లనే సనాతనధర్మము రక్షితమగునను వాదపుపాండిత్య మిట్లు మూలచ్ఛేదియని దూరదృష్టితో నిమర్శించుసప్పుడు విశదపడును. మరియు, హిందువులసంఖ్యఇప్పుడు హెచ్చైచెనను, ఈవిభేదమువల్ల వారిస్థితి దుర్బలమని గ్రహించుటవల్ల ఇటు జిన్నావగైరాలును అటు విదేశప్రభుత్వమును మనల లక్ష్యపెట్టక మనన్యాయమైన స్వాతంత్ర్యమీయక తృణీకరించుచున్నారు ధార్మికైక్యమును భావశుద్ధియునే తక్కినరంగములలో

* హిందూధర్మరాజ్యమనబడు తిరువాన్కూరులో క్రైస్తవుల ముస్లిములసంఖ్య చాలహెచ్చి కొద్దికాలము కింకను చాలమంది హరిజనాదులు క్రైస్తవులగుదురు అనుస్థితి గల్గింది. అప్పుడు దివానుగారి సూచనచైన అక్కడ పల్లికుదేవాలయములన్నిటిలో హరిజనులు వచ్చునట్లు మహారాజుగారేర్పర్చినారు. ఈయేర్పాటువల్ల వారు మతాంతరీయుల గుటనిలచి, అక్కడిహిందూధర్మముకు స్థైర్య మేర్పడినది.

ను విజయముకు పునాదియని చరిత్రవల్ల తెలియుచున్నది హాజనుల రాకవల్ల దేవాలయంలోని విగ్రహము మైలపడునని కొందరివాదము. ఇది అగ్నికి చెదపట్టునన్నట్లున్నది భగవంతుడు సర్వశక్తుడు పవిత్రత కంతకు ఆధారుడు, దీనరక్షకుడు. దేవాంశ తక్కిన చిదచిత్తులలోకంటే విగ్రహశిలలో హెచ్చుగనున్నదనుటయు అసంగతము, దేవాలయపు వాతావరణమును పరిశుద్ధముగ నుంచుటకు మనపూర్వులు నియమము లేర్పర్చిరి. అశౌచములోనివారు పతితులు ఆలయములోకి రాకూడదని నియమమున్నది. కాని, అదిఆదిహిందూజాతి కుద్దిష్టమనికనబడదు శౌచ నియమము కావలసినదే మ్లిష్టులును ప్రార్థనవేళలందు మసీదులలో ముందుగ హస్తపాదముల ప్రక్షాళనచేయనివారిని లోనికిరానీయరు. పతితులు వికలురుత్రాగుబోతులు రాకూడదని ఆగమములలో జెప్పినారు*

---

* పతితః పాతకీవాపి కుష్ఠ్యపస్మారరోగవాన్
కాణోవాం ధశ్చమూకశ్చ బధిరోవాంగహీనకః;
పరస్త్రీగమనాసక్తః.....
శాంతిహోమంతథాచరేత్॥ (ఈశ్వరసంహిత 19 అ. 136-141.)

ఏవిధమైన అంగవైకల్యమున్నవారును పతితులు, పాతకులు, పరస్త్రీగమనముకిష్టులును ఆలయములో ప్రవేశింపకూడదు. అట్టిది ప్రమాదమున తటస్థించితే, శుద్ధికి హోమాదులుచేయవలెని అర్థము.

చండాలశ్వపచాద్యాస్తు.....తథైవప్రతిలోమాద్యాః.....
.....సహస్రకలశైః స్నానముత్సవంచసమాచరేత్॥
(ఈ. సం॥ 19 అ. 171-175,)

చండాలశ్వపచాబ్రాహ్మణ్యాశ్చ.....పరిహోమంతథాచరేత్
(పురుషోత్తమసంహిత 30—38, 44)

మహాపాతకుల వివరం—

స్వర్ణస్తేయీ, సురాపాయీ, బ్రహ్మహా, గురుతల్పగః
మహాపాతకినస్త్వేతే తత్సంయోగీచ పంచమః॥

కనుక జారచోరులు త్రాగుబోతులు వారిసంపర్కముగలవారుకూడ ముఖ్యమైన మహాపాతకులు; వారికేగాక పట్టిపాతకులకును దేవాలయప్రవేశము కూడదని ఆగమప్రమాణము.

కాని, ఇప్పుడుసాధారణంగా ఎందరో దొంగలు, దొరలు, తాగుబోతులు దురాచారులు రోగులును దేవాలయములకు వచ్చుట కాటంకము లేకున్నది. మరియు, పెద్దఆలయములనుగూడభౌతికంగాను నైతికంగాను పరిశుద్ధముగ నుంచుట అరుదైనది కొందరుస్వభిచార వృత్తిగల భోగస్త్రీల యాట పాటలజూచుటకు విలాసములకును ఆలయముల కేగుటకలదు. ఇట్టియాకర్షణ లుండవలెనని, భోగము మేళముల నాలయాలలో మాన్పించుటకు కొందరుధర్మకర్తలిష్టపడుటలేదు. ఇట్టివిషయములలోశుద్ధిచేయుటమానిరి; నిరాధారమైధార్మికపిపాసగలజాతికిప్రవేశము నిషేధించుట ధర్మమేనా? సవర్ణుల వీధులంచుండు దేవాలయములు వారికొరకే యేర్పడినవనియు నొకవాదము. కాని,అట్టినియమముకెట్టి నిదర్శనమును లేదు. గొప్పదేవాలయముల స్థాపనకు నడుపుటకు సంబంధించిన శిలాశాసనము లెన్నియో ప్రకటితమైనవి. వాటిదాతలుగాని అధికారులుగాని మరియెవరు గాని తమధర్మములు ఆలయప్రతిష్ఠలు సవర్ణులకొరకే యని లిఖింపలేదు. భక్తులందరికనియే ఉదాహరణలున్నవి. బదరికాశ్రమము మొదలు రామేశ్వరంవరకు ఏప్రాంతపువారైనను హిందూమతస్థులు హిందూదేవాలయములలో ప్రవేశించి స్వామినిసేవించుట కలదు. కనుక, తమప్రక్కనైలుదూరంలోనే యున్న గూడెపుఅవర్ణులకట్టి యాలయములోకి రాపీలులేదనుట భావ్యముకాదు. ఒకప్పుడు, దురదృష్టమున హిందూ ముస్లిములమధ్య కలతలుకల్గినప్పుడు ముస్లిములు హిందూదేవాలయముల మూట్టడించి పాడుచేయ బూనుట మాని తటస్థించుటకలదు. ఇది శోచనీయము. కాని, అట్టిస్థితిలో మంచిభౌతికశక్తిగల కార్మికులగు హరిజన జాతి సహాయముంటే, హిందువులు తమయాలయముల రక్షించు కొనుటసులభము. ఆలయములు తమవి, వాటిలో తాము నారాధింపవచ్చునను భావమున్నప్పుడే, హరిజనులుత్సాహముతో యావచ్ఛక్తిని వినియోగించి కాపాడుదురు. హిందూసంఘమన్నివిధములను సంఘటితమై

బలపడును. కనుక స్వలాభముకైనను మందిరప్రవేశము మంచిదనియే విమర్శపైన తేలును.

'హరిజనులు హిందువులేకారు, కనుక వారు దేవాలయములకు రాకూడదు' అను వాదమును కలదు. కాని, ఇదియు సబబైనదికాదు. హరిజనుల ఆచారములు ప్రార్థనలు వగైరాలు హిందూపద్ధతినే జరుగును. హిందూమతస్థులగు చాలమ్మ మున్నగువారు వారిమతచర్యలలోపాల్గొందురు. వారి వివాహాది సంస్కారములు శూద్రజాతీయులలోవలె జరుగును వారిలోకొందరు సవర్ణుల శిష్యులు వైష్ణవదాసరులు శైవభక్తులుకలరు. కొందరు సవర్ణుల వివాహాముల సందర్భమున హరిజన కుటుంబమునకు ముందుగా వివాహము జరిగిచు సంప్రదాయమున్నది శూద్రులలోజరుపు గ్రామదేవతల యుత్సవాలలో వీరునుపాల్గొందురు. వివాహము, దత్తత, సమిష్టి కుటుంబపద్ధతి, వారసత్వము ఇత్యాదులు మనహిందూ ధర్మశాస్త్రప్రకారమే వారికిని జరుగుచున్నవి. హిందూదేవతలపేర్లును వారిలో చాలమంది కుండుచున్నవి. మరియు, కొన్ని కోర్టులలో ఈవిషయము చర్చింపబడి, వీరుహిందువులేలని శూద్రులలో శాఖయని శాస్త్రచర్చచైన కోర్టులలో స్థిరపడినది*(ఇటీవలనే, హిందూదేవాలయముల ధర్మకర్తలనెన్నుకొనుతెంగల వైష్ణవమతపువోటరులలో వీరుచేరుదురా అనుప్రశ్నవచ్చి, కొందఱు మాదిగవారికట్టి వోటుహక్కుకలదని మద్రాసుహైకోర్టువారు తీర్పునిచ్చినారు.† ఇట్లన్నివిధములను వారు హిందువులే. వారిని దేవాలయములకు రానిచ్చి ధర్మముబోధించి యుద్ధరించుటే సబబుగ తోచును.

---

* ఇం. లా. రి. 33 మద్రాసు 842; 39 లాపీక్లీ 439=66 మ. లా. జ 548 ఇం. లా. రి. 52 మద్రాసు 160=28 లాపీక్లీ 674. ఇం. లా. రి. 51 కలకత్తా 488 ఇం. లా. రి. 10 లాహోరు 872, ఇం లా.రి. 31 కలకత్తా (ప్రీవీ కౌంసిలు.)॥

† 47 లాపీక్లీ 480=1938 (1) మ. లా. జ. 530=1938 మ. పీ. నో. 376.

(తిరువల్లిక్కేణి పార్థసారథిస్వామి కోవిల ఎన్నికకేసు.)

అయితే చాల తరములనుండియున్న మామూలు నొక్కసారిగ మార్చుటకు చాలమందిసవర్ణులొప్పుకొనుట లేదనుసంగతి నిజమే. హరిజనులరానిచ్చిన మతముచెడుననుభావమింకనువారికి కలదు. 'కాలానుసారముగ ఆచారములు మారవలె, బుద్ధిమంతులట్లు నిర్ణయించి అమలుజరుపుటకలదు' అని, శాస్త్రములలోచెప్పియున్నారు. ఇట్టికార్యములు సాధ్యమైనంతవరకు ప్రజాభిప్రాయం సుముఖపర్చి చేయుచుటన్యాయము. అదే అహింసాపద్ధతి. కనుకనే సవర్ణులలో హెచ్చుమంది అంగీకరించినట్లు వోటు ద్వారాతేలినచోట్లనే పబ్లికుదేవాలయములలోకి హరిజనులను రానీయవలె; లేదా ప్రజాభిప్రాయము సుముఖమైనదని తమకు తోచినప్పుడు ధర్మకర్తలట్లు జరిగించవచ్చునని కాంగ్రెసు అధికారములో మనరాష్ట్రములో చట్టముచేయబడినది. ఇది పరస్పరమైత్రినిబాదనే అమలుజరుగదగిన ధార్మికసంస్కరణ. కనుక ఉదారులగు హిందూధర్మక్షేమపరులు దాని విషయమై వెంటనే శ్రద్ధవహించవలసియున్నది. ఏది క్షేమకరమో సరిగా విమర్శజరిగి ప్రచారము జరుగవలె లోకసంగ్రహమును మానవత్వరక్షణమునుకోరి ఉదారబుద్ధితోకలిసి దీనోద్ధరణకై కృషిచేయుట అవసరము.

'తీర్థస్థలములలో గుడులలోనే దేవదర్శనమగునని పామరులు తలతురు. ధీమంతులు ఆత్మలోనే దేవుని దర్శింతురు† దేవత మృచ్ఛిలల ద్వారాకాక ఉదారులగు సాధువులద్వారానే లోకులను పవిత్రపరచును', అని పురాణముచెప్పుచున్నది ‡ అందరు సద్బుద్ధిని భద్రతను పొంది తరించవలెననియే శాస్త్రము *

---

† అప్సు దేవా మనుష్యేషు, దివిదేవామనీషిణాం
బాలానాం కాష్టలోష్టేషు బుధ స్యాత్మనిదేవతా (అగ్నిపురాణం)

‡ నహ్యమ్మయాని తీర్థాని, నదేవామృచ్ఛి లా
మయాః, తేపునంత్యురు కాలేనదర్శనాదే వసాధవః (భాగవతం)

* సర్వస్తరతు దుర్గాణి, సర్వోభద్రాణి పశ్యతు
సర్వస్సద్బుద్ధి మాప్నోతు, సర్వస్సర్వత్ర నందతు.

ధార్మికరంగము.

2. స్త్రీలు.

ధార్మికసమస్యల చర్చలో గమనించేవిషయములలో నొకటి స్త్రీలస్థితి. మొత్తంమీద 'నాగరికలోకం'లో పూర్వకాలమందు స్త్రీల స్థితి హీనంగా ఉండినది. అనాగరిక జనులలలోనే స్త్రీలకెక్కువ స్వాతంత్ర్యముండేదని చెప్పవచ్చు. ఇందునుబట్టి నిసర్గజీవితంలోకంటె కృత్రిమ సాంఘికజీవితంలో బలీయుడగు పురుషుడు స్త్రీలపైన తన యధికారము హెచ్చించుకొన్నాడని తేలును. అన్నిదేశాలలోను సాధారణంగా పురుషులే స్మృతికర్తలు పురాణనిర్మాతలు, కనుక వారు (స్వార్థపరులై) సంఘనిబంధనలు తమకనుకూలంగా చేసుకొన్నారనియు కొందరిభావన. కాని మనదేశంలో వేదకాలమందు విదేశాలలోకంటె స్త్రీలకెక్కువవిద్య సాంఘికస్వాతంత్ర్యము, ధర్మపాలన ఆస్తి హక్కులు నుండేవి. దరిమిలాను కొంతస్వేచ్ఛ, ధార్మికత, తగ్గినను, మధ్యయుగంలోను మనదేశపు స్త్రీలకే యూరపుస్త్రీలకన్న స్థితి బాగుండేది. తరువాత స్థితి తారుమారైనది.

పాశ్చాత్యనాగరికతలో స్త్రీలకు విద్య, సాంఘికస్థితి, ఆర్థికస్థితి, ఇవ్వబడి, వీరు వృద్ధికి వచ్చినారు. మనదేశంలో అందుకు భిన్నమైనది. స్త్రీలలో అజ్ఞానము మూఢత్వము చాలహెచ్చినవి. పురుషులలో నూటికి 12 అయినను చదువుకొన్నవారు; స్త్రీలలోనో, ఇద్దరు మాత్రమే అక్షరాస్యులు. చాలప్రాంతాలలో పురుషులకన్న స్త్రీ లెక్కువమంది మరణించుచున్నారు (తక్కిననాగరికదేశాలలో స్త్రీల సంఖ్య హెచ్చు, మన దేశంలో పురుషులసంఖ్యయే హెచ్చగుట కిదియు కారణముకావచ్చు.) స్త్రీలు ధార్మికంగాను వెనుకబడినారు.

స్త్రీ పురుషునకర్ధాంగియను ఆర్యోక్తిలోని అంతరర్థమును మన వారంతగా గమనించుటలేదు. కుటుంబజీవితములో దంపతులిద్దరు పర

స్వరసహాయులు కాకతప్పదు. సంతానమునకు తల్లిదండ్రులిద్దరి గుణగణములు నేర్పడును. ధార్మికంగాను ఆర్థికంగానుగూడ స్త్రీల యున్నతినిబట్టి సంఘపు వృద్ధియుండును. స్త్రీల యుత్సాహసహాయములులేకుండ ఏమహోద్యమమును నెరవేరదు. స్త్రీలు హీనస్థితిలోనుండు ఆభాగముకే కాక జాతీయ దేహమంతకు పక్షవాతము కలిగినట్లుండవలెను. అందును అహింసాధారమగు సంస్కృతిలో స్త్రీల క్షేమముకు ప్రత్యేకశ్రద్ధ కావలెను. అహింసావ్యాప్తి స్త్రీలపైన ఎక్కువగ ఆధారపడును. అయితే, నీరసస్థితిలోనున్న దుర్బలులవృద్ధి కితరుల సహాయము కావలె; అట్లే, పరతంత్రలైన అబలల నున్నతికితెచ్చు బాధ్యతను పురుషులు వహింపకతప్పదు. అందును భారతీయ స్త్రీలు పురుషులకెప్పుడును విధేయులైయున్నారు. కనుక మనపురుషులు స్త్రీలనుద్ధరించినప్పుడే తామును వృద్ధికాగలరు. స్త్రీలు ప్రగతికి సంస్కరణకు వ్యతిరిక్తులైనందున, పురుషులును తమ సంస్కరణభావము లాచరణలో పెట్టలేకున్నారు. సహజముగా ప్రేమస్వరూపలైనను సంసారములో తామహింసకులోనైనందున, చాలమంది స్త్రీల మూఢ మనస్సులో ప్రతిహింసాభావమేర్పడి, సౌమ్యత చెడుచున్నది; ఇంటిలో వ్యతిరేకతవల్ల నిర్మాణకార్యముకును వృద్ధిలేకున్నది.

స్త్రీల శరీరారోగ్యముగూర్చి ప్రత్యేకశ్రద్ధకావలెను. పురుషుల వలెకాక స్త్రీలు గర్భప్రసవాది శ్రమలను బడవలెగదా. ఉన్నత కుటుంబస్త్రీలు సాధారణంగా బయటతిరుగుటలేదు. ఇంటకొందరికి గృహకృత్యములుండును, కాని, ఆదేహపరిశ్రమ సమముగ నియతముగ నుండదు, చాలమంది స్థితిమంతుల కసలేలేదు. కనుక, ఇంటనే యుండు స్త్రీలు ఏదోయొకవేళ రోజును నూలువడుకుటవంటి పరిశ్రమ చేయవలెను. అందువల్ల వారికి దేహారోగ్యము మనోవికాసము నిశ్చయముగ గల్గును. దానిఫలితము సంతానముకును గల్గును.

స్త్రీల విద్యారోగ్యములు సరిలేకుండుటకు అతిబాల్యవివాహపద్ధతి కొంతవరకు కారణము. జ్ఞానవంతులును సనాతనధర్మముపేర

వివాహములు బొమ్మలపెండ్లివలే చేయుచున్నారు. కాని, కన్య ఋతుమతియైన మీదట 3 ఏండ్లవరకు తండ్రి యింట కనిపెట్టియుండి, ఆపైన వివాహమాడదగునని ప్రాచీనధర్మశాస్త్రవచనము లున్నవి *

ప్రజాభిప్రాయము సరిగ లేనందువల్లనే శారదా చట్టమున్నను చిన్నపిల్లలకు పెండిండ్లుజరుగుచున్నవి. సంస్కృతంలోని వివాహమంత్రములు గృహ్యసూత్రప్రక్రియయు ఆవివాహపద్ధతి వయస్సువచ్చినవారికే ఉద్దేశించినదని సూచించును † శారదాచట్టము నిర్బంధకరమని వ్యక్తి స్వాతంత్ర్యము నడ్డగించునని కొందరి యాక్షేపణ. కాని వివాహమెవరికి? వధూవరులకే; అది తమకుధార్మికజ్ఞానముకల్గి యుక్తవయస్సు వచ్చినమీదటజరుగవలె. తగుసంబంధమును సకాలమున నిర్ణయించుకొనుటకు, ఆవివాహ మంత్రాల ప్రమాణాదులభావము గ్రహించి, విచక్షణతో నడువవలె. ఆవధూవరులకు సహజముగనుండు హక్కును అబాల్యవివాహం జగించుటద్వారా తల్లిదండ్రులు హరించుటలేదా ? తల్లిదండ్రులు సదుద్దేశముతోనే చేసినను ఈ బాల్యవివాహముల చర్యవల్ల నిజంగా వధూవరులకు మానసికహింస జరుగును. మరియు బాల్యమందే గర్భము కల్గుట వంటి కారణాల వల్లను ఇది భౌతికహింసకును కారణమగును. 16 ఏండ్లలోపుగనున్న స్త్రీలకు గర్భధారణయుక్తముకాదని మనవైద్యశాస్త్రజ్ఞులును చెప్పినారు. ‡ ఇప్పుడు బాల్యమందే వితంతువులైన స్త్రీలెం

* త్రీణి వర్షాణ్యుదీక్షేత కుమార్యృతుమతీసతీ
ఊర్ధ్వంతు కాలాదేతస్మాత్ విందేత సదృశంపతిం॥ మనుస్మృతి.

† త్రీణి వర్షాణ్యుతిమతీ కాంక్షేత పితృశాసనం।
తతశ్చతుర్థే వర్షేతు విందేత సదృశంపతిం॥ (శోధాయనస్మృతి)

‡ ఊన షోడశవర్షాయాం అప్రాప్తః పంచవింశతిం।
యద్యాధత్తే పుమాన్ గర్భం కుక్షిస్థః స వినశ్యతి॥
జాతోవా నచిరంజీవేత్ జీవేద్వా దుర్బలేంద్రియః।
తస్మా దత్యంత బాలాయాం గర్భాధానం నకారయేత్.

దరో ఆజన్మవైధవ్యములో నున్నారు. ఇట్టిది ఇంకేదేశంలోనులేదు— మరియు ఇప్పటికిని 50 ఏండ్లుదాటినవారును 12 ఏండ్లబాలికను కట్టుకొనుట శోకకరము. ఇదినిజంగా హింసాచర్యయే; గృహస్థతరక్షణకని వర్ణాశ్రమధర్మము పేర ఇట్టిచర్యల జేయుట మరీసంతాపకరము. వీరు వానప్రస్థతకు సన్యాసమునకు పూర్తిగస్వస్తిచెప్పుట యెట్టిఆశ్రమధర్మమో! ఇట్టిచర్యలవల్ల ఆస్త్రీలకొంతోమనోవ్యధయు ఒకప్పుడుహింసయుగల్గును, మరియు ఇట్టి పెండిండ్లవల్ల అవినీతియు వితంతువులసంఖ్యయు హెచ్చినది. అర్ధాంగికి తనకు వయస్సులో విశేషభేదముంటే దేహమనఃపరిణామపు వ్యత్యాసముండి, భావములు భేదించి, కలహమేర్పడి హింసాతత్వమావరించును. ప్రకృతిలోస్త్రీకిదేహవికాసము త్వరలో కల్గుటనిజమే. ఆభేదము సహజమనట్లు సుమారు పదేండ్లులోపు భేదపు సవయస్క వివాహమే ప్రశస్తమని తోచును.

వితంతువివాహము హిందూశాస్త్రసమ్మతము కాదని కొందరందురు, కాని శాస్త్రీయమయినట్లు కొన్నికారికలున్నవి. అదియెట్లైనను విధవావివాహపు చట్టమేర్పడిన 1856 సం॥ నుండి న్యాయశాస్త్ర ప్రశ్న పోయినది. ఇట్టివివాహములింకను ధారాళంగా జరుగుటలేదు. శాస్త్ర ప్రకారంవిధవావివాహముతప్పుకాదని శ్రీ ఈశ్వరచంద్రవిద్యాసాగరులు ఇత్యాదులు నిరూపించియున్నారు, అందుకు ప్రజామోదములేకుండుట వల్ల పురుషుల కీవిషయంలో ఉదారత దయారసము సాహసములేదని, హింసాతత్వముకలదనియు, తెలుపును. భార్యయున్నను, తాముపెద్దలైనను ఎట్టిసబబు లవసరములేకయు పురుషుడెన్ని వివాహములైనచేసుకోవచ్చు; కాని, * స్త్రీలుమాత్రం, వితంతుబాలికలు, పెండ్లిచేసుకొంటే, పెండ్లియాడిన వారిని సంఘము న్యాయపర్చును; ఇట్టివి మనహింసాతత్వపు చిహ్నములుకావా?

---

* వివాహమాధ్యాత్మికము. మనోహృదయములందు పురుషులకు తగినట్లు వికాసము కల్గిన స్త్రీలే సహధర్మచారిణులు కాగలరు.

ఇట్టిదే వితంతువులకుచేయు అనాదరణమును. నిజంగా వితంతువు బ్రహ్మచారిణి సన్యాసినులలె పవిత్రురాలు; నిసర్గముగ సంతతి కనదగిన లక్షలకొలది హిందూస్త్రీలిట్లు వితంతువులై పిల్లలులేకున్నారు; ముస్లిం క్రైస్తవులలో విధవలేగాక విడాకుపొందియు స్త్రీలు మరలవివాహ మాడి బిడ్డల గందురు. హిందువుల జనసంఖ్యకన్న ముస్లింక్రైస్తవజన సంఖ్య ఎక్కువవేగముగ హెచ్చుచున్నది. హిందూస్త్రీల కష్టపరిస్థితు లును ఇందుకు కారణము. * పైనచెప్పిన యంశములన్నియు 'ఉన్నత కుల' స్త్రీల నుద్దేశించినవి. ఇందుకు వ్యతిరేకంగా గొల్లలు, చాకళ్ళు, మాలమాదిగలు ఇత్యాదులలో విశృంఖలతయున్నది. ఎట్టికారణములు లేకయే భార్యభర్త విడిపోయిమారుమనుము కట్టుకొను రివాజువారిలో కలదు. ఇందువల్ల వివాహము విచ్ఛినమైనదో లేదో మనోవర్తి బాధ్యత యున్నదో లేదో, పునర్వివాహ మైనదో, ఇట్టి సందేహములు కోర్టుల లోను తేలుట కష్టమగుచున్నది. వీరిలో జరుగు వివాహము కంట్రాక్టు కన్నను హీనముగనున్నది. లిఖితనిదర్శనమరుదు; ధార్మికబుద్ధియుండదు. ఇట్టిహిందూవివాహములు రిజస్టరుచేయించుటే భావ్యమేమో యనిపించు చున్నది. ఇట్లు హిందువులలోనే కులభేదమునుబట్టి నియమాలలో చాల వ్యత్యాసమున్నది. ఇట్లు కాక, ఏకరూపముగ సంఘమంతటికి సమమైన వివాహనిబంధనలేర్పడవలెను, క్రైస్తవులలోను 'డైవర్సు' (విడాకులు) కు పరస్పరహింసవంటి తగినంత న్యాయకారణములున్నట్లు కోర్టులో రుజువై, దంపతులమధ్యలాలోచీలేనట్లు తేలి కోర్టులో తీర్పుజరిగినప్పుడే

---

*విషమపరిస్థితులలో స్త్రీలకు పునర్వివాహము కావచ్చునని స్మృతి ప్రమాణము లలో నొక శ్లోకము.

నష్టే, మృతే, ప్రవ్రజితే, క్లీబే చ, పతితే పతౌ ।
పంచ స్వాపత్సు నారీణాం పతి రన్యో విధీయతే॥ (పరాశరస్మృతి)

అనగా వితంతువులేకాక. భర్తయున్నప్పుడును కొన్ని కష్టస్థితులలో స్త్రీకి వివా హము 'విధించి'నారు.

వివాహ సంబంధము రద్దగును. స్త్రీకి పురుషునకు గూడ పునర్వివాహము కధికారముండును. వారి స్త్రీపురుషులమధ్య మనలోనున్నంత వ్యత్యాసము, నిర్బంధ దాంపత్యమును, లేదు.

వివాహము, దత్తత, సంస్కారములు, వారసత్వం, సమిష్టికుటుంబస్థితి, మనోవృత్తి ఇట్టి అన్నిటిలోను మొత్తంమీద పురుషులకన్న స్త్రీలహక్కులిప్పుడు చాలతక్కువ. ఇందులో కొన్నికష్టములు కొద్దిగనైన తొలగించుట కిటీవల శాసనసభలద్వారా చట్టముల జేయు యత్నము జరుగుచున్నది జనాభిప్రాయ మనుకూలముగానుంటేనే, ఇట్టిసంస్కరణలు కార్యకారియగును. స్త్రీసంఘపు కష్టములను పురుషులెక్కువ దాక్షిణ్యంతోనివారించుట పురుషులకును మంచిది; అందువల్ల ఉభయత్ర అహింసాభావము హెచ్చును.

బెంగాలు మొదలగు కొన్నిరాష్ట్రాలగ్రామములలో మహమ్మదీయులసంఖ్య హిందువులదానికన్న హెచ్చినది. బెంగాలులో (1881 సం॥ నాటికి ముస్లిములసంఖ్య హిందూసంఖ్యకన్న తక్కువ. 1921 నాటికి మించిపోయినది) అట్టిచోట్ల హిందువుల అనాథస్త్రీయువతులు కొందరు హిందూసంఘంలో బోధపడుచుండగా, వీరిని ముస్లింయువకులు బలవంతముగనో పరస్పరకామమువల్లనో తమదగ్గర దీసినారు. పిమ్మట ఆఅభాగ్య స్త్రీలు ముస్లింకుటుంబములలో నుండుచున్నారు. *

ఇట్లు హిందూస్త్రీలకు జరిగినట్లు తెలిసినప్పుడు అప్రాంతపు హిందువులు ముస్లింసంఘముపైన కోపించి, ముస్లిముల దూషింతురు. అంతట హిందూముస్లింకొట్లాట జరిగి దెబ్బలుతగిలి హిందూముస్లిముల మధ్య (హరిజనులమతం మారినప్పుడువలె) విరోధము హెచ్చుచున్నది.

* అట్టిపతిత స్త్రీలు స్వసంఘము కెట్లో మరలవచ్చిరను తమబంధువులెట్లును సంఘాచారమునుబట్టి అంతఃజేసి అవమానింతురను భయమున వారు ముస్లింసంఘములోనే యుండి పోవుచున్నారు.

ఇ[illegible]కు హిందువులలో స్త్రీలపైన నిరాదరణయు కారణము. హిందూసంస్కృతి శాఖలమధ్య బాగుగ ప్రేమభావ మేర్పడినప్పుడు ఇతరు వల్ల హిందూసంఘము కపాయమునుపోయి పరస్పరమైత్రి యేర్పడి భారతజాతియంతయు బాగుపడును. స్త్రీలకధికారములు కూడదనికొన్నిగ్రంథములలో నున్న సంగతినిజమే; కాని ప్రాచీనగ్రంథాలలో స్త్రీలనాదరింపుమని, అప్పుడే సంఘము బాగుపడునని, లేనియెడల క్షీణించునని, సాధారణంగా పురుషులు అపరాధులు, స్త్రీలు అపరాధినులు కారనియు చెప్పినారు † స్త్రీలకు మృదువగు ప్రేమస్వభావమే సహజము, కర్కశత్వముకాదు. మరియు వారికి లౌకికమగు దురాశలు ఆస్తిసంపాదనవగైరాల సంఘర్షమునుండవు, వారు ప్రకృతిలో అహింసామూర్తినులుగ నుందురు. కాని, మనదేశములో పైనచెప్పిన సందర్భములలో స్త్రీలు పురుషుల భోగవస్తువులనుండి విన్నర్షిజ్ఞానము లేక, తగుధార్మికవికాసము లేకయున్నారు, ఇటీవల నిర్మాణకార్యక్రమాలు ఆచరణలో సహాయము చేసి అహింసను వృద్ధిచేయ, స్త్రీలు గాంధి యుద్యమంలో కొంత తోడ్పడినారు. స్త్రీల నున్నతస్థితికి తెచ్చినప్పుడే అహింసావ్యాప్తి ఇంకనుసులభమగును. భారతస్త్రీల వజ్రసమానత్వమును ఆత్మగౌరవమును దేహమనశ్శక్తులును బాగుపడినప్పుడే జాతికంతకు అభ్యుదయము కల్గును.

---

† నాపరాధోఽస్తి నారీణాం, నరయేవాపరాధ్యతి।
సర్వకార్యాపరాధ్యత్వాత్ నాపరాధ్యంతి చాంగనాః॥

మనుస్మృతిలో "పితా రక్షతికౌమారే.....న స్త్రీ స్వాతంత్ర్యమర్హతి" అను శ్లోకమున్నది. ఇందునుబట్టి స్త్రీలకు స్వతంత్రతలేకుండదని కొందరు నూచింతురు. కాని, స్త్రీల దుర్బలస్థితిని పూజ్యతనుబట్టి, వారిని పురుషులు రక్షించుచుండవలె రక్షణలేకుండ వదలకూడదు అనియే ఈ శ్లోకపు భావమని తోచును. "యత్రనార్యస్తు పూజ్యంతే రమంతే తత్రదేవతాః. (మనుస్మృతి)

ధార్మికరంగము.

3. మతసూత్రములు.

భారతీయులు మతప్రధానులని, మనయాచారవ్యవహారములు మతసూత్రములనుండి వచ్చినవని చెప్పుటకలదు. దీనిలో కొంతసత్యమున్నది. వేదస్మృతి కాలములందు ఎందరో ఋషులు ప్రకృతిని సృష్టిరహస్యములను ఈశ్వరతత్వమును గ్రహించుటకు ఆత్మదర్శనముకు ఏండ్లకొలది తీవ్రతపస్సుచేసి, తమజీవితము నంకుకై ధారపోసి, తమయనుభవములను లోకోపకారముకై గ్రంథస్థముచేసిరి. గ్రీకు రోమకవాఙ్మయము వలెగాక, పూర్వపు సంస్కృతప్రాకృతవాఙ్మయమంతటిలో ధార్మికత ప్రధానభావము. స్మృతులలోని ఆచారకాండలోను తుదకు ఆస్తులపంపకమువంటి లౌకికములలోను మతాచారముల సంబంధమున్నది. వర్ణాశ్రమముల విభజనలోను వారికృత్యముల విధానములలోను స్మృతులలో విధించిన దినచర్యలలో సంస్కారములలో, వారికి సంఘమీయవలసిన మర్యాదలలోగూడ, ధార్మికత,అహింసాసత్యపరత,సంఘక్షేమమును, లోకసంగ్రహమును మనస్సులో నుంచుకొన్నారు. మరియు, వేదకాలంలోనే జ్యామితి (రేఖాగణితము) నభ్యసించి గణితవిద్యనేర్చుటకు కారణము యజ్ఞవేదికలను ధార్మికగృహములను నిర్మించుటలో సరియైన సూత్రము లవలంబించుటకే. ఇట్లే యోగశాస్త్రము ఆయుర్వేదనైద్యము ఇత్యాదులలో ఆత్మశక్తిని ధార్మికతను వృద్ధిచేయుటనే అంత్యాశయంగా ఉంచుకొన్నారు. స్వరసంగీతమును సామవేదగానము నిమిత్తంమొదటనుద్దేశించినారు. బౌద్ధకాలంలో శిల్పకళలను చిత్రలేఖనమును గూడ దశావతారకథలను బుద్ధునిధార్మిక జీవితపుగాథలను వాటినీతులను అందరు సులభంగా గ్రహించవలెనని అపారశ్రమతో వినియోగించినారు. ప్రాతఃకాలం మొదలు రాత్రివరకు దైనికమగు జీవితకార్యాలలో స్నానపానాదివేళలందు ఆరోగ్యచర్యలలోను ఈశ్వరప్రార్థనను

ధార్మికమంత్రముల పఠనమును సంప్రదాయముగ జేసినారు; ధర్మము నుండియేయర్థకామములువచ్చును, కనుక ముందుగ ధర్మమునాచరింపవలె నని సిద్ధాంతము † ఇట్లన్నిటివల్ల పూర్వకుల ధార్మికతవృద్ధియైనవి. వారి జీవితమంతయు యోగమయమై, లోకముకై ఉపయోగపడినది. మత ములో ఈశ్వరభక్తికే ముఖ్యస్థానము. మానవులు కించిజ్ఞులు, అల్ప శక్తియుతులు; మనమహాదర్శము లెట్లు సాధ్యమో మనకు తెలియుట కష్టము. మనయత్నమధ్యమంను మార్గమంధకారమయము కావచ్చు. అట్టిస్థితిలో భగవంతునందే భారముంచి, ఈశ్వరుడు మనహృదయంలో తోపించుప్రకారం నడుచుకోవలెను. గాంధిమహాత్ముని యీ అంతర్వాణి చోదనసిద్ధాంతముప్రపత్తిసూత్రమువ టిదే. అట్టిచోదనము ఉత్తమభక్తు లై అహింసాసత్యయుక్తులైన పరిశుద్ధహృదయులకే తప్పక గల్గును; సర్వ జగన్నియామకుడగు ఏకేశ్వరుడే సకలజీవాధారుడనియు, మాధవసేనకు మానవసేవయే క్రియారూపమనియు, అహింసాసత్యరూపమగు ధర్మమే లోకాధారమనిము దృఢవిశ్వాసముగలవారే ఆస్తికులు. దేశకాల పాత్రానుసారముగ ఒక్కొక్కమతములో నొకొక్కకదానికి ప్రాముఖ్యము వచ్చినది, అరేబియాలో మహమ్మదునాటికక్కడి బెడౌయిను'లలో రాయిరప్పలపూజ మద్యపానము హెచ్చి, వాటివల్ల జనులు మూఢులై కలహపరులైయుండిరి; కనుక ఏకేశ్వరత్వమును విగ్రహవినాశమును, సత్య మతస్థుల భ్రాతృభావమును ప్రాముఖ్యమిచ్చిరి. పాశ్చాత్యదిశను ధార్మికతయేలేని జనులమధ్య జనించిన క్రైస్తవమతములో జనులకు మనస్సు సులభముగ లగ్నమగుటకు క్రీస్తు యీశ్వరపుత్రుడని ఆయనను నమ్మితే మోక్షము గల్గునని చెప్పబడినది. హిందూదేశప్రజలకు వ్యవసాయము పానీయములకు గోవు గోక్షీరమును చాల ముఖ్యములు. కనుక హిందువులు తమసంస్కృతిలో గోజాతికంతకు ఉన్నతస్థానమిచ్చినారు బుద్ధుడవతరించునాటికి విద్వాంసులు దార్శనికచర్చలుయజ్ఞయాగముల

†ధర్మాదర్థశ్చకామశ్చ, సధర్మఃకింనసేవ్యతే. (మ. భా.)

కర్మ కాండయుప్రబలినవి. చంటిపిల్ల తల్లిని వెక్కిరించినట్లు నరులీశ్వరుని స్వరూపస్వభావములలో లోపము లెన్నుచుండిరి. తార్కికవిభేదములు హెచ్చినవి సామాన్యులలో మూర్ఖత జంతుబలి వగైరా మూఢాచారములు అవివేకతియు ప్రబలినవి; కనుక, బుద్ధుడు తార్కికచర్చవద్దని, అహింసకు, నీతికి, సత్ప్రవర్తనకు, ప్రాముఖ్యమిచ్చెను. తరువాత శంకర రామానుజ, రామానంద, నానకు, రామమోహనాదులును దేశకాలోచితముగ లోకశ్రేయమునకై ఆయాసిద్ధాంతములకు ప్రత్యేకతనిచ్చియున్నారని గమనించియున్నాము.

ఇట్లు ప్రతిప్రవక్త బోధించు మతమునకు కొంతప్రత్యేకమగు వ్యక్తిత్వము సంప్రదాయమునున్నవి; కాని ధార్మికత అనేది సర్వమతసారము. ఈసంగతిని గమనింపక ఆయామతములవారు తమప్రత్యేకతకే ప్రాముఖ్యమిచ్చి అన్యమతీయులను నిరసించుచున్నారు. పరస్పరప్రేమకు విశ్వకల్యాణమునకు సమీకరణమునకు యత్నింపక, ఆయా మతప్రచారకులు పోషకులు మతరక్షణకనియే కలహించుట విచిత్రము. ఆయాసంఘముల ముఖ్యమతములన్నిటికి హిందూమతమే తల్లిమతమనవచ్చును. మాయు ఇప్పుడాముఖ్యమతములకు కూడలియు పవిత్రభారతదేశములో నున్నది. మతకలహములవల్ల రాజకీయముగ నేగాక ఆర్థిక సాంఘిక ధార్మికములందును దేశము మోక్షమునొందజాలకున్నది. ఇట్టిమతకలహములకు కారణములు విచిత్రములు. నిజమైనధార్మికతయున్నప్పుడే అహింసాతత్వము వ్యాపించి స్థిరముగ నిల్చును. ధార్మికతలో ముఖ్యమీశ్వరభక్తి. అన్నిమతముల వారునుబయటికిభక్తిప్రదర్శన చేయుచున్నారు; దేవాలయములకు పోవుచున్నారు; ప్రార్థనలు భజనలు జరిగించుచున్నారు; భక్తిపరతయున్నట్లు వేర్వేరువేష భాషలద్వారాను కర్మకాండలద్వారాను ప్రదర్శించుచున్నారు. స్వమతములోని కితరులనెక్కువ చేసిస్వమతస్థులసంఖ్య హెచ్చించుటకు కొన్నిమతములవారు యత్నించుచు, కొందరాసందర్భమున అన్యాయపద్ధతులు నవలంభించుచు, ఇతరమతస్థుల ద్వేషించుచున్నారు. నిజమైన భక్తి

లేకున్నది. యథార్థమునకు ప్రసిద్ధమతములన్నియు మంచివే. ఏమత ములోనున్నను ధార్మికజీవికి మోక్షముగల్గును. కాని, క్రియలో ధార్మికత కుబదులు అధార్మికతయే హెచ్చుచున్నది భగవంతునిభజించి,ఆయన సృ ష్టినిప్రేమించి, దానినభివృద్ధికై యత్నించుటే మత ముద్దేశము. కాని, ఇట్లు విశ్వ ప్రేమకు దాక్షిణ్యమునకు వర్ధకము కావలసిన మతమును చాలమంది దురు పయోగంచేయుచున్నారని ఒప్పుకోకతప్పదు. మధ్యయుగపు యూరపు క్రైస్తవులలో కాతలికులకు ప్రొటస్టంటులకు ఘోరసంఘర్షము జరిగినది; రాజులు మతాచార్యులును క్రూరులై లక్షలకొలది జనుల 'ధార్మికహత్య' లకు కారకులైనారు తరువాత 'క్రైస్తవ'రాజులు ముస్లింరాజులపైన సాగించిన క్రూసేడు (మతయుద్ధము)లలోను లక్షలకొలది హతులైరి; వాటితో పోల్చితే మనదేశంలో పూర్వం మతవిషయంలో మంచిసహన భావముండెను;కాని, ఇప్పుడెట్లున్నది? పూర్వపుమతయుద్ధములకు వెగటు జెంది, యూరపీయనులు దరిమిలాను మతకలహములు వదలినారు. ఇప్పుడు మతకారణములకని పాశ్చాత్యులు కలహించుపద్ధతి లేదు. ఇప్పుడు జరుగుయుద్ధాలకు ఆర్థికములు రాజకీయములునే కారణములు. ఉభయ పక్షములును ముఖ్యంగా క్రైస్తవరాజ్యములే. పైపెచ్చు పాశ్చాత్య లిప్పుడు మతసంస్థలనుగూడ తమ ఆర్థికరాజకీయప్రాబల్యములకు విని యోగించుచున్నారు. ప్రభుత్వమును పుంజీపతులును చాల ద్రవ్యమును క్రైస్తవపీఠములకుమతప్రచారకులకు నిచ్చుచున్నారు. ఇందుకుప్రతిఫల ము; ఆయానదాధిపులు చర్చీలలో సామ్రాజ్యజయముకు ప్రార్థనల జేయించుచు, జనులలో రాజభక్తిని నెలకొల్పుచు, పారిశ్రామికసంస్కృ తిని స్తుతించుచు, ప్రభుత్వమునకు ధనాడ్యవర్గమునకు తోడగుచున్నారు. మరియు ఖండాంతరములకువచ్చు మిషనరీలు యితరదేశీయులను నాగరి కులుగను ధార్మికులుగను చేసెదమనుచున్నారు.

ఇప్పుడు శ్వేతజాతుల ప్రాబల్యముతోబాటు క్రైస్తవమత ప్రచారము లోకమంతటను వ్యాపించియున్నది; అందువల్ల లోకులలో

నిజమైన ధార్మికతమాత్రం కలుగలేదు; ఆఫ్రికా ఆస్ట్రేలియాఖండాల లోని అసలు దేశీయులాటవికులు; వారికి 'నవనాగరికత'ను వారుసేర్పిన సంగతినిజమే అందువల్ల కొందరు వృద్ధియగుటకుబదులు రోగులై క్షీణించి. లోగడచెప్పిన ధార్మికాశయాలను క్రైస్తవప్రచారకులే యాచరింప నవ్వును కొత్తగా మతస్థులగువారికవియెట్లుటకు? ఆ యాదిమజనులలో త్రాగుడు, అనీతి, పిరికితనము, న్యూనభావము, పరాధీనత, వృత్తిహీనత వెనుకటికన్న హెచ్చినవి

ఇక, ప్రాచీనధార్మికతగల మనచీనాభారతములలో విషయుల ప్రచారపు ఫలితము మనకనుభవమే. వారిక్కడ ఆంగ్లపాఠశాలులు వైద్యశాలలు స్థాపించినారు; అందువల్ల కొందరికి విద్యచికిత్సలభించినవి. కాని, ఈమిషనుసంస్థల ప్రవృత్తియు మతప్రచారకుల ధోరణియు తరుచు ధార్మికముగ లేవు. వారు అహింసాసత్యధార్మిక సూత్రములకు బదులు హిందూమతదూషణకు క్రీస్తువ్యక్తిని నమ్మిన మోక్షముగల్గునను సిద్ధాంతమునకునే ప్రాముఖ్యమిచ్చినారు. మరియు, ఈమిషనులు సామ్రాజ్యపాలన వచ్చినమీదట, జనులలో త్రాగుడు, నల్లమంచు, పిరికిదనము, పరస్పర కలహము, వృత్తిహీనతయు ప్రాచ్యదేశాలలో హెచ్చినవని కొందరు గొప్ప చారిత్రకుల అభిప్రాయము; విదేశవస్తువులకు పాశ్చాత్య సాంఘికపద్ధతులకు నిక్కడ ప్రచారము పెరిగినది. మరియు, 'బ్రిటిషుసామ్రాజ్యము అమెరికను సంస్కృతి ఆదరణీయములు, అనిమనకు శ్రేయకరములు',అని పాశ్చాత్యమిషనరీలు బోధించుచు, ప్రాచ్యసంస్కృతిని నిరసించుటయు, మనసాహిత్యంత్రోద్యమమునుప్రతిఘటించుటయు, కలదు ఇట్లు పాశ్చాత్యుల సామ్రాజ్యతత్వము తన 'ధార్మికశాఖ'యగు మతసంస్థలను బలపర్చుటకుమనఆర్థిక, రాజకీయ పరాధీనతకు తోడ్పడుచున్నవి. 'ఏసు క్రీస్తు ఈనాడు అవతరించి తనమతబోధచేసేయెడల క్రైస్తవాధికారులాయనను వెంటనే అరెస్టుచేసి, నిర్దయముగ జైలులోనుంతురని ఒక మహనీయుడన్నాడు. క్రైస్తవమతసంస్థలు జనసామాన్యపునీతిని మన

స్వాతంత్ర్యమును ఐక్యమును క్షీణింపజేసినవని, అమితబోధ నల్లమందువలె మాంద్యజనకమైనదని యెంచి, వ్యవహారములో మతప్రచారకుల ప్రాబల్యమును తొలగించినారు. మనదేశంలో నేటికిని ప్రజలలో హెచ్చు మంది హిందువులు ముస్లిములు. వారి మతసంస్థలకు సర్కారుసాయము లేదు. అయితే, ప్రభుత్వము బ్రిటిషువారది, వారుసాలీనా కొన్ని క్రైస్తవ పీఠములకు సొమ్మిచ్చి పోషింతురు, అట్లు పాశ్చాత్యుల ధార్మిక సంస్థలును దురుపయోగ పడుచున్నవి. పరిశుద్ధమైన క్రైస్తవధార్మికత కీ. శే. ఆండ్రూసుగారు ఘాదర్ ఎల్పినవంటివారి ద్వారా ద్యోతితమైనది, అట్టిమహనీయులకు లోకులందరు కృతజ్ఞులు కావలె. ఇంతవల్ల క్రైస్తవమతపు అసలుసిద్ధాంతములలోను వ్యక్తులలోను లోపములేదనియు వ్యక్తమైనది. నిజముకు ఏమతస్థుడైనను ధార్మికపరుడైతే నిశ్రేయసముకల్గును; మతముమార్పించుట అనవసరము. అన్నిమతముల ముఖ్యసిద్ధాంతము లొకేరీతివిగదా!

ఇక్కడ మనలోను ప్రేమభావమును దాక్షిణ్యమును అంతరిక భక్తికిబదులు బాహ్యాడంబరపు వేషము సంప్రదాయమునే 'సనాతనధర్మ మనువాద మేర్పడినది, ఈస్థితిలో ప్రస్తుతం, ప్రతివిషయంలోను ధార్మికవిషయాలకు ప్రాముఖ్యమిచ్చుటవల్ల సాంఘికసంఘర్షముల్గి జాతీయోన్నతికిని హానికల్గుచున్నదని, కనుక మతదృక్పథముతొలగుటమేలని, ధార్మికతత్వమువల్ల హానియే కల్గుచున్నదని, చాలమంది అసలు మతాచరణనుమానినారు. కొందరు ప్రజాక్షేమపరులగు గీమంతులును నాస్తికులైనారు. ఈమతసంస్థలందేగాక పీటిబోధకు మూలాధారమనే ఈశ్వరనియామకతగూర్చియు, ఈశ్వరుడన్నాడను విషయంలోను నమ్మిక పోయినది. ముఖ్యముగ, ఆధునికవైజ్ఞానికులు మొదట నిట్లే యభిప్రాయపడినారు. 19 వ శతాబ్దిలో జరిగిన భౌతికపరిశోధనలవల్ల ప్రపంచమంతయు కేవలం భౌతికమని, ప్రకృతిశక్తులవల్లనే స్వాభావికముగ విశ్వమేర్పడి అది నియమహీనంగా మారుచున్నదనియు, సృష్టికర్తయే లేనట్లుతోచుననియు,

వైజ్ఞానికులు భావించిరి. కాని తరువాత, ఇటీవలి పరిశోధనలవల్ల, కొత్త దృక్పథ మేర్పడినది. అద్భుతమగు కొత్తదుర్బిణులు సూక్ష్మదర్శినులు వగైరాలతో పరీక్షించగా, సూర్యాదిగోళములు మన భూమికన్న లక్షలకొలది రెట్లుపెద్దని, మహావేగముతో చరించునవి, ఇట్టి మహా తేజో బింబములు లక్షలకొలది మన బ్రహ్మాండము (Galaxy) లో నున్నవి, ఇట్టి బ్రహ్మాండము లింకకెన్నియో ఉన్నట్లుదుర్బిణులు చూపు చున్నవి, వీటికిని గోచరముగాని వింకను కలవు,ఇవియన్నియు ఏదోమహా శక్తిచే నియమితము లైనవి; అమితవేగముతో ఈమహావిశ్వము అన్నివై పులకు వ్యాపించు చున్నది, నిరంతర పరిణామము పొందుచున్నది; ముఖ్యగోళాలలోగల శక్తి తేజస్సు ప్రచండములు. ఇట్లే పరమాణువు నిర్మాణము అతివిచిత్రమైనది వీటిని సంఘటనచేసి నియమించి శక్తినిచ్చు మహాతేజమున్నదని, ఇదియంతయు ఉద్దేశపూర్వకమనియు, భౌతికలోక మును నిజంగా జ్ఞానప్రధానమేయనియు, ఎడింగ్టను, జీన్సు, ఈన్సైనును, థాంప్సను, బోసు మొదలగు లోకవిఖ్యాతులగు వైజ్ఞానికు లిటీవల కనిపెట్టినారు ఈసుహాగోళములే నక్షత్రము లనుచున్నాము. వీటిలో మనకతి సమీపమైనవియు అర్బుదములకొలది మైళ్ళదూరమందున్నవి. కనుక, ఆనక్షత్రకాంతిమనదృష్టికెంతో చిన్నదిగతోచును; కొన్నిటికాంతి మనభూమిని చేరుటకు అతిదూరమువలన కోట్లకొలది యేండ్లుపట్టునట. (కాంతికిరణములు క్షణమునకు 186000 మైళ్ళచొప్పున పోవును.)

ఈవిశ్వగోళములన్నిటిని ఏదోమహాశక్తిగంటకు వేలకొలది మైళ్ళ చొప్పున మహావేగముతో నియమితమార్గములోనుంచి, సంఘర్షములే కుండతిప్పుచున్నది. చంద్రుడు భూమిచుట్టు, భూమ్యాదిగ్రహములు మనసూర్యునిచుట్టు, సూర్యుడు మరికొన్ని నక్షత్రములుసహా బ్రహ్మాండములో (తామాకాశములో దొర్లుచునే) పరస్పరం ఎట్టిసంఘర్షమును లేకుండ ధ్రువతారచుట్టును, విపరీతవేగముతో పరుగెత్తుచున్నవి.*

---

* లోకములు అసంఖ్యాకములని కొన్నిపురాణములును చెప్పుచున్నవి. సంఖ్యా చేద్రజసామపి, విశ్వానాం నకదాచన (దేవీభాగవతం (9-8-7)

ఈ బ్రహ్మాండమును స్థిరముకాక ఎక్కడికో సంచరించుచున్నట్లున్నది. అవినరములు గ్రహించు యంత్రములింకను ఏర్పడలేదు. ఆకాశము, కాలము, పదార్థములనేవి, అనంతములై, పారస్పరికము (Relative) గ నున్నవి. వాటి నన్నిటిని మహాశక్తి సర్వవ్యాప్తియై నను అప్రమేయముగ నున్నది. ఇంతటి మహావిశ్వపు 'ఖాళీ' స్థలముల లోను అణుపదార్థములు దృష్టికందక వ్యాపించియే యున్నవి.

ఇటీవల గొప్ప వైజ్ఞానికులు గొప్పసూక్ష్మదర్శని యంత్రములను సూక్ష్మాణువులగూడ భేదించు వైద్యుతాదిశస్త్రులను కనిపెట్టినారు. ఇంత వరకు అవిశ్లేష్యము లనుకొన్న 'పరమాణువు'లను వీటితో బాగుగ పరీక్షించినారు. అంతట, 'ప్రతి పరమాణువులోను అతిసూక్ష్మమై అగ్రాహ్యమగు వస్తుపులుండుచు, అవి అతివేగముతో తిరుగుచు పరస్పరాకర్షణతో నిబద్ధమైయున్నవి, ఇట్లు అతిసూక్ష్మమనబడు పరమాణువును నియమితమైన గ్రహకుటుంబమువంటిది, మరియు ఈసూక్ష్మశక్తి పదార్థము భౌతికము కాక జ్ఞానరూపమగు శక్తిపుంజమై; వీటినన్నిటిని సమన్వయించి పరమాణువుగ జేయుశక్తియు అస్మద్భశము' అని తేలినది. పరమాణువులోని యీ శక్తిపుంజముల విడిపించి పట్టుటకు వైజ్ఞానికులు లక్షలకొలది యూనిట్లు భౌతికశక్తి నుపయోగించిననుసాధ్యమగుటలేదు. ఇట్లు పరమాణుభాగములను బ్రహ్మాండములనుగూడ బంధించియుంచు మహాతేజశ్శక్తి యెట్టిదో! అది అణోరణీయాన్ మహతోమహీయాన్ అని విశ్వాత్మకమని, మన అందరిహృదయములందుండి జీవులప్రవర్తనను నియమించుచున్నట్లును, మనశాస్త్రజ్ఞులకు ఆధ్యాత్మికశోధకులకు నిదర్శనము దొరికినవి మరియు పరమాణువులు ఘనీభవించిన చేతనశక్తిపుంజములే కనుక ఈవిశ్వము అసలు జ్ఞానశక్తియే; అది ప్రకృతిగ పరిణమించి భౌతికరూపంలో నున్నదనుట సత్యముగ నున్నది. ఈ జ్ఞానప్రపంచమును నైతికసూత్రములగు ప్రేమసత్యములమీదనే వర్ధిల్లుమన్న

దనియు చూచియున్నాము. కనుక విశ్వమంతయు జ్ఞానసీతిప్రధానమే కాని భౌతిక ప్రధానముకాదని తేలినది.

హిందూ ముస్లిములమధ్య అప్పుడప్పుడు జరుగు 'ధార్మికకలహములకు' చెప్పేకారణములు యథార్థంగా ధార్మికములు కావని యిదివరలో చూచియున్నాము. ఈకలహపరులు నిజంగాధార్మికులుకారు. ముస్లిములుబక్రీదులో గోవధచేసినప్పుడు మసీదులయెదుట వాద్యము వాయించినప్పుడు కొట్లాటలు హత్యలుగూడ అక్కడక్కడ జరుగుసంగతి నిజమే. వాటిని ధార్మికకలహములనుట పరిపాటియైనది. కాని, ఇందుకు స్వార్థపరులగు సామాన్యుల మూర్ఖత అజ్ఞానమునే కారణములు.

మనదేశపు సాగుపాలు వగైరా నిత్యజీవితపు అవసరములకు గోజాతి అవసరము. కనుక హిందూస్మృతికర్తలు గోవురక్షణ నొకవిధిగ జేసినారు. ఇదినిజంగా మతవిషయముకాక, ఆర్థికవిషయము. కాని, ధార్మికదృక్పథంవల్ల హెచ్చుశ్రద్ధగల్గును; అహింసామూర్తులగు గోవురక్షణ ధార్మికవిధియన్నారు. ఆరేబియాఅంతటనుఇసుకనేలవల్లవ్యవసాయాదులు లేవు;అక్కడగోప్రశంసలేకుండుటసహజము. కాని,ఇక్కడిముస్లిములకును సాగుకు పాలకు గోజాతి శ్రేయకరము, కనుక, ముస్లిములును గోవు నాదరించి రక్షింపవలెను. మరియు గోవధ ముస్లింమతమున కవసరమును కాదు. హింసువులును ఇదియొక కలహకారణముగనెంచుట యనవసరమని ఇట్లే మసీదులయెదుట వాద్యము వగైరాలవిషయములు కలహకారణములగుటయు కేవలం అనవసరమే.

హిందూమతనాయకులు ముస్లింమతనాయకులుగూడ నిజమైన మతసూత్రములకు ప్రాముఖ్యమిచ్చుటమాని, బాహ్యమగు వేషభాషలకు లౌకికవిషయములకు ప్రాముఖ్యమిచ్చుట విచారకరము. సనాతనధర్మము స్థిరసూత్రములుగల్గి సర్వకాలములకు వర్తించుమతము. దాని ముఖ్యసూత్రములు అహింసాసత్య శౌచాదులని చూచియున్నాము. వాటికిబదులు ఇప్పటి మతసంస్థలు 'సనాతనులు'ను కట్టు బొట్టు, జుట్టు,

యాత్రలు, కుటుంబకృత్యములు, వివాహభేదములు, సాంఘికవ్యవహారములు నే, మతాచరణగ నెంచుచున్నారు; ఇవియన్నియు కాలోచితముగ మారవలసినవి. నీరునిలవయైనప్పుడు నాచుచేరివానకొట్టును; ప్రవాహమేపరిశుద్ధికరము. విశాలబుద్ధితోను, సమదృష్టితోను సాంఘికవిషయములు సరుదుకొని భూతదయగల్గువారికే పవిత్రతయుండుననియు సూక్తి *

దేవాలయాల ధర్మకర్తలును, మఠమతాధిపులును, స్వాములవారును తామగ్రహించు నిశ్శేషద్రవ్యమును అస్తులను ధార్మికప్రచారము కు సామాన్యజనుల క్షేమముకును వినియోగించినప్పుడే ధార్మికతయేర్పడును. అంతకు వారిలో మనఃపరిణామము ఔదార్యమును కావలెను. ఇట్లే 'వర్ణాశ్రమధర్మ సంఘము'లు 'సనాతనధర్మరక్షణసభలు' హిందూమతసూత్రములగు భక్తిసదాచరణ అహింసాసంస్థ, పరిశుద్ధివీటికి ప్రాముఖ్యమీయవలెను. వా రీరీతిగ పామరులనుద్ధరింపవలె. ఇట్లుశుద్ధికి హిందూసంఘటనకు తమశక్తిని వినియోగించవలెను. అన్నికులముల వారును స్వంతలాభపు దృష్టిమాని, సంఘమంతటి క్షేమమునే సాధింప యత్నింపవలె. అప్పుడే హిందూసంఘమును మనమతమును నిజంగాబలపడును.

స్మృతులలో చెప్పినరీతినయితే జీవితంలో $\frac{1}{4}$ వంతు బ్రహ్మచర్యము, $\frac{1}{4}$ గృహస్థాశ్రయకాగా మిగతాసగంజీవితమును వానప్రస్థుడు సన్యాసిగనుండవలె; మనజీవితము నూరేండ్లనుకొన్నను 50 ఏండ్లకు వానప్రస్థాశ్రయారంభింపవలె. కనుక 50 ఏండ్లు వయస్సుమీరినవారందరును† వానప్రస్థులై స్వగృహములువదలి, కుటుంబసంబంధములేకుండ, సంఘసేవాతత్పరులు కావలె ఇక వర్ణవిషయము; బ్రాహ్మణక్షత్రియులు లోకరక్షణకు

---

* యద్రాష్ట్రం తులసీకాష్ఠం, త్రిపుండ్రం భస్మధారణం
యాత్రాస్నానాదిహోమశ్చ, జపోవా దేవదర్శనం
నైతేపువంతి మనుజం, యదాభూతహితే రతిః.

† వానప్రస్థవిధి॥ పుత్రేషుదారాన్నిక్షిప్య వనంగచ్ఛేత్ సహైవవా॥ (మను 6-3)
సన్యాసము కు॥ చతుర్థమాయుషోభాగంత్యక్త్వా సంగాన్ పరివ్రజేత్. (,, 33)

వైశ్యుడు సంపదభివృద్ధికి శూద్రులు సేవకు ముఖ్యంగా కృషిచేయవలె. కాని, ఇప్పుడందరును ద్రవ్యలాభముకు ఉద్యోగసేవావృత్తికిని సిద్ధమైనాము. ఉదారులై అందరును లోకక్షేమముకే తమశక్తిని ద్రవ్యమును వినియోగింపవలె. ఇట్లుమనమెంతవరకు చేయుచున్నామో ప్రతివారును ఆత్మ పరీక్ష చేసుకోవలె. పూర్వపుమహర్షులట్లులోకముకుతమజీవితమర్పించి, రాగద్వేషములువదలి అహింసాపరులై సంచువల్లనే అమృతత్వమొందిరి.† ఏగాంధిమహాత్ముడివంటి కొద్దిమందియో తప్ప ఇప్పుడు మనమట్లు వర్ణాశ్రమధర్మ మాచరించుట లేదని, ఆత్మపరిశోధనచేయు అందరికిని స్పష్టము. బ్రాహ్మణాదులకు స్మృతిలోచెప్పిన వృత్తులను ఆశ్రమములను అమలులో సరిగ పెట్టగల్గువారు ప్రశంసార్హులే. కాని, అట్లుజరుగుటలేదు.

ఇప్పటి బ్రాహ్మణులలోను స్మృతులలోచెప్పినట్లు బ్రహ్మచర్యం సాగించువారు అరుదు; 24 ఏండ్లవరకు వివాహమాడనివారిసంఖ్యయు తక్కువ గృహస్థతమాత్రం దాదాపు అందరును అవలంబించుచున్నారు. అందులోను శాస్త్రనిహితమగు బాధ్యతలుజరుపుట ఈకాలంలో తగ్గిపోయినది. పూర్వమెందరో బ్రహ్మచారులుగనేయుండి, లోకసేవాపరులై ముక్తులైనారు. సంతానము కనకపోతే మహానరకము సంభవించునని చెప్పి, అర్హునికి అనర్హునికిగూడ పెండ్లిజేయు రివాజు ఏర్పడినది; అదిసరికాదనిశాస్త్రనిదర్శనమున్నది. మరియు, కొందరుపిల్లలున్నవారును వృద్ధులైనవారును గృహస్థతనిల్చుటకనిమరల పెండ్లియాడుదురు; ఇట్లుమన వారిప్పుడు గృహస్థతహక్కులకు ప్రాముఖ్యమిచ్చి, తక్కినఆశ్రమాలు వదలినారు. గృహస్థబాధ్యతలు నిర్వర్తించుటకన్నివిధములను అర్హతగల్గినప్పుడే ఆంగ్లేయులు వివాహమాడుట మామూలు. పాశ్చాత్యులలో నెందరో విజ్ఞానసేవకువై ద్యసేవకునుస్త్రీలుపురుషులును కుటుంబసౌఖ్యం మాని, తమ ఉన్నతాశయములు నెరవేర్చుటకు జీవితమంతను అర్పించి

† ఇంద్రియాణాం నిరోధేన రాగద్వేషక్షయేణచ
అహింసయాచ భూతానా మమృతత్వాయకల్పతే (మను 6-60)

ధన్యులై శాశ్వతకీర్తి గాంచినారు. అట్టివారు మనదేశీయులలో శ్రీ ప్రఫుల్లచంద్రరాయివంటివారు చాల అరుదుగనున్నారు.

ఇక వర్ణములసంగతి; ఆయావర్ణములకు విధించినవృత్తులప్రకారం ఇప్పుడు జరుగుటలేదు. అన్నికులములవారు తమకు ఆకర్షకంగాను అందుబాటుగాను ఉండే అన్నివిధాల వృత్తులకు సిద్ధపడుచున్నారు. వ్యవసాయంచేయు బ్రాహ్మణులున్నట్లే ఉపాధ్యాయులగు శూద్రులున్నారు. 'ధార్మికంగా అహింసాయుతంగా జీవింపవలెను; తప్పనిసరియెడల హింసాజీవనంచేయుదురుగాక, కాని ఏసందర్భంలోను స్వవృత్తి (సైకరీ)కి సిద్ధపడకూడదు' అని స్మృతికారులన్నారు† కాని, ఇప్పుడన్నికులాల 'ధార్మికులు' వారును సర్కారుసైకరీకి కంపెనీలలో సేనావృత్తికిని పోటీపడి సిద్ధపడుట విచారకరము. ఏకులపువారైనను యోగ్యులు లోకక్షేమపరులునే ఉత్తములు.

ధర్మతత్వమునుగూర్చియు ముఖ్యమతముల ప్రధానసూత్రముల గూర్చియు లోగడ చర్చించియున్నాము. అహింసాసత్యాస్తేయశౌచనిగ్రహములే ధర్మసారము* ఆచరణలో ధార్మికతలోని కొన్ని ముఖ్యాంశములిక్కడ గమనింతము.

'ఈశ్వరభక్తి, ప్రపత్తి, సర్వజనులకు అంతర్యామియగు భగవంతునందు విశ్వాసముంచుట, జగన్నియామకుడగు ఈశ్వరునిసంకల్పమును నెరవేర్చుచు, ఈశ్వరప్రీతికే కార్యములజేయుట, సకలజనక్షేమము' లోక సంగ్రహము, జీవరక్షణయును, ఆసురతత్వమునకు బదులు దైవీప్రకృతిని వృద్ధిచేయుటయు, ఈశ్వరుని కీప్సములు 2 స్థితప్రజ్ఞతఅనగా నిగ్రహము

---

† అనేకాని సహస్రాణి కుమార బ్రహ్మచారిణాం
దివంగతాని విప్రాణాం అకృత్వా కులసంతతిం (మను 5-159)
ఋతా మృతాభ్యాం జీవేత మృతేన ప్రమృతేనవ
సత్యానృతాభ్యామపివా నశ్వవృత్యా కదాచన. (మను 4-4)

* అహింసాసత్యం, అస్తేయం, శౌచ, మింద్రియనిగ్రహః
ఏతం సామాసికం ధర్మం చాతుర్వర్ణ్యే బ్రవీన్మనుః (మనుస్మృతి)

సర్వసమత్వము 3 అరి షడ్వర్గములను జయించి, తద్ద్వారా ఆత్మను భవమొందుట; అనగా (కామము=ఇంద్రియలోలత) క్రోధము(=హింసాబుద్ధి), లోభము (=అధికద్రవ్యాపేక్ష, పరద్రవ్యాశ) మోహము (అజ్ఞానము, మూర్ఖత) మదము (=మత్తత, తామసత్వము, సాహంకారత), మాత్సర్యము (=ద్వేషాసూయలు) వీటిని నిరసించి యమ నియమాసన ప్రాణాయమాములద్వారాను జ్ఞాన కర్మ భక్తులద్వారాను యోగియై, ఆత్మలోని ఆనందస్వరూపమును గ్రహించుట, అన్నిమతముల సిద్ధాంతాలను పరిశీలించగా భూతదయ అహింసాసత్యములును నిశ్రేయసమునకు సాధనములనితేలును* వేదస్మృతి పురాణాదులును బౌద్ధత్రిపీఠకములునుజండవస్తా బైబిలుకొరానుగూడఅహింసాసత్యములకేముఖ్యమిచ్చినవని లోగడ చూచినాము. మోక్షసాధనకు కొందరు ఆత్మశోషణమును వేదపఠనమును, షడంగాధ్యయనమును బాహ్యవేషాలు భజనలు తర్కచర్చలు వినియోగింతురు. కాని అంతశ్శుద్ధి మంచికార్యాచరణ, దయాపూరితమగు ప్రవర్తన లోకక్షేమ పరతయునే కావలసినవి† మరియు రాజకీయ మోక్షమునకును అంతశ్శుద్ధిభక్తిగల్గి పరిశుద్ధములు అహింసాసత్యాన్వితములనగు ప్రణాళికను సాధనములను ఉపయోగింపవలెను‡ అందువల్ల ఎవరికిని హానిలేకుండబోవును; ప్రజాభిప్రాయము సుముఖమగును! మనస్ఫూర్తిగ మనమట్లుచేసినప్పుడు కార్యమును సమకూడును;

గాంధిమహాత్ముడు జన్మచే వైశ్యుడు; కాని అన్నిమతముల సూత్రములు గ్రహించి నిజమైన జ్ఞానము ధార్మికతను గల్గి, వాటి

---

* ఏవంతుపండితైర్జ్ఞాత్వా సర్వభూతమయం హరిం
క్రియతే సర్వభూతేషు భక్తిరవ్యభిచారిణీ. (విష్ణుపురాణం)

† ఆచారహీనం నపునంతివేదాః యద్యప్యధీతాః సహషడ్భిరంగైః
ఛందాంస్యేనం మృత్యుకాలే త్యజంతి నీడం శకునాఃఫలంగా యిజాతపక్షాః.
(వసిష్ఠస్మృతి)

‡ పఠకఃపాఠకశ్చైవయేచాన్యేశాస్త్రచింతకాః
సర్వేవ్యసనినోమూర్ఖాఃయఃక్రియావాన్సపండితః (మ. భా. 8-814)

నాచరించి ఇతరులకు బోధించుచున్నాడు, సంఘ మంతటిశ్రేయుముకే యత్నించుచున్నాడు. ఆప్రకారం జరుపలేకపోయినను, స్మృతికర్తల భావము గ్రహించి సంఘ శ్రేయమే కర్తవ్యమనుదృష్టితో ప్రతివారును జ్ఞాన, రక్షణ, కృషి, సేవాకార్యములను యథాశక్తిగ కొంతపరకైనను చేసినయెడల, ప్రస్తుతకాలముకు పరిస్థితికితగినట్లు, స్మృతికర్తల యుద్దేశ మును నెరవేర్చినవ్యక్తియే సనాతనధర్మపరులము కాగలము.

మనపూర్వులు వ్యక్తులకై కాక ప్రజలందరికై చేయుదానమును గూడ గొప్పధర్మముగ భావించినారు. వాటిలో రెండువిధము లున్నవి. †ఇష్టములు, పూర్తములు; ఈ రెంటిని శ్రద్ధతో చేయుమని శాస్త్రవిధి. వీటిలో 'ఇష్టము'వల్ల స్వర్గము, 'పూర్తము'వల్ల మోక్షము కల్గునన్నారు‡ కనుక పూర్తమే ఉత్కృష్టమన్నమాట. యజ్ఞసంబంధముగ చేయునని ఇష్టములు. ఇక పూర్తములు చెరువులు, బావులు త్రవ్వించుట, సత్రము లేర్పర్చుట, దేవాలయనిర్మాణము, రోగులకు వైద్యచికిత్స, ఇత్యాదులు.* ఇట్లు ప్రజలందరి సుఖజీవనము కుపయోగించు నిర్మాణముల జేయుట, వాటిని స్థిరముగ సాగింపజేయుటయు ధర్మములలో భాగము, ధార్మికతకు లక్షణము, అని స్మృతికారుల భావము.

ఇట్లన్నివిషయములను పరిశీలించగా ఆధ్యాత్మికంగాను, ఆభ్యుదయికంగాను లోకులందరిశ్రేయమును కోరి అందులో తమొక్కభాగముగ నెంచుకొని సంఘశ్రేయముకై కృషిచేసి తద్వారా మోక్షము సాధింపబూనుటే నిజమగు ధార్మికతసారమని తేలినది. దానిని పరిశుద్ధముగ రక్షించుటకు కృషిచేయవలెను.

---

† శ్రద్ధయేష్టంచ పూర్తంచ నిత్యం కుర్యాత్తద తేంద్రితః॥ (మను 4-226)

‡ ఇష్టేనలభతేస్వర్గం, పూర్తే మోక్షం సమశ్నుతే॥ (విష్ణుపురాణం)

* వాపీకూప తటాగాది దేవతా యతనానిచ
అన్నప్రదాన మారామః, పూర్తమిత్యభిధీయతే॥ (అత్రిసంహిత.)
రోగిణాం పరిచర్యాచ పూర్తమిత్యభి నిర్దిశేత్. (హేమాద్రి దానఖండము.)

20. విద్యా విధానము.

జాతీయసంస్కృతికి విద్యావిధాన మొక ముఖ్యాధారము. కనుకనే, ఇప్పటికి నాగరికదేశాలన్నిటిలోను తమతమ సంస్కృతికి తగినట్లు బాలురందరికిని ఉచితవిద్యగరుపుచుండు ప్రాచీనహిందూ దేశమందు బ్రహ్మచర్యకాలమందు బాలురు విద్య నేర్చుకొనేవారు శిల్పకళలుపరిశ్రమికజాతులపిల్లలకు బాల్యంనుండినే తమతమవృత్తులం దుత్సాహం కల్గించి వాటిలో ప్రజ్ఞ గల్గించేవారు ఈ కులవృత్తిపద్ధతివల్ల స్వగృహములో తల్లిదండ్రులే ప్రేమతో బాలురకు వృత్తివిద్య నేర్పుచుండిరి. ఇట్లు యువకులందరికి విద్యలోను శిల్పంలోను కౌశల ముండేది. ఉపాధ్యాయులగు బ్రాహ్మణులు (ద్రవ్యాశచే కాక) తను ధర్మము నెరవేర్చుటకు శిష్యులకు వేదశాస్త్రములు ఆయుర్వేదదర్శనాదులు నేర్పేవారు.

ఇప్పుడు నాగరికదేశాల సంస్కృతి యాంత్రికము; కనుక, విదేశాలలో పెద్దయంత్రములజేయుట వాటి నుపయోగించుట పారిశ్రామికజ్ఞానమునకు వ్యాపారపద్ధతులు నేర్పుచున్నారు, బాహ్యజ్ఞానమును విశేషముగ నేర్పుచున్నారు. అది ద్రవ్యమును భౌతికాధికారమును సంపాదించుటకును ప్రయాణాదులుచేసి ఇతరప్రాంతాలనుండి సొమ్ము రాబట్టుటకును పనికివచ్చును.

మనదేశపు ప్రస్తుత విద్యాపద్ధతి పైకి ఆకర్షకమై కొంతకాలము దేశమునకు లాభకరమైనట్లు తోచినది. ఇట్లు నూరేండ్లు గడచినమీదట అందలి లోపములు తెలియుచున్నవి. దానిని సంస్కరించి కొత్తవిధానము పెట్టవలెనని చాలధీమంతు లంగీకరించినారు (ఆంగ్లవిద్యావ్యామోహితులు కొందరు మాత్రం సంస్కరణనుప్రతిఘటించుచున్నారు.)

ఇప్పటివిధానములోని ముఖ్యలోపములు:—విద్య పామరులలో వ్యాపించకుండుట. ప్రతివానికిని ఉచితంగా ఆరంభవిద్యనైనను నేర్పవలెను. ఇతర నాగరికదేశాలలో నూటికి సుమారు 95 మంది అనగా దాదాపు

ప్రజలెల్లరుపై మరీవిద్య నభ్యసించిన వారే. ఆదేశాలన్నిటిలోను మాతృ భాషలోనే యావత్తువిద్యనేర్పుచు,మరొక భాషనుగూడ తప్పక నేర్పుచురు మరియు పారిశ్రామికవిద్యకై మంచి సాంకేతికపాఠశాలలు (Technological Schools) వందలకొలదిగ నుండును. మనదేశంలో సర్కారు ఆదాయంలో నుండి చాలతక్కువమొత్తంమాత్రం విద్యనిమిత్త మీయ బడును. అందులోను కొంతభాగము విద్యాశాఖలో గొప్పజీతములు తీసుకొను ఉన్నతోద్యోగులకు పెద్దపెద్దభవనములకు "ఆఫీసర్ల" ప్రయాణపు ఖర్చులకును, ఆడంబరములకును ఖర్చగును.

అందువల్ల నిజంగా గ్రామజనులకు విద్యనేర్పుటకు తగుపాట్లు లేవు. కొన్నిగ్రామాలలో అసలే బడులులేవు; కొన్నిగ్రామాలవి నామమాత్రములు. ఆయుపాధ్యాయులజీతములు. అతిస్వల్పములు. నూటికి 90 మందికిపైగా జనులు విద్యాగ్రంథమే తెలియనివారు. మనదేశీయులు బొత్తిగా బీదవారు. ఇప్పటిపద్ధతిని స్కూళ్లు అన్నిగ్రామములకు పెట్టుటకు అవకాశము లేదు.

ఇప్పుడు బాలురకుచెప్పువిద్య చాలవరకు వారి దైనికజీవితంలో ఉపయోగించనిది, వారిసన్నివేశమునకు గ్రామజీవితమునకు సంబంధించనిది అందువల్ల బాలురకు వారిపోషకులకుగూడ ఆవిద్యయందు శ్రద్ధలేదు. సాధారణంగా బాలురను బలవంతంగా బడికిపంపించి వారిని తిట్టి కొట్టియు విద్యనేర్పుట జరుగుచున్నది. పుస్తకములలోనున్న అంశములను విశేషములను వల్లవేసి యొప్పజెప్పుటే చదువనిపించుకొన్నది. మరియు ఉన్నతవిద్యయంతయు ఆంగ్లములోనే చెప్పుటరివాజు. (ఇటీవల సెకండరీబడులలో కొంతమారింది) చిన్నతనంనుండియు ఇంగ్లీషునేర్పి, అందులో ఉచ్చారణమొదలు గొప్పవాఙ్మయపాండిత్యంవరకు తప్పక బోధింతురు. ఆంగ్లమునవ్రాంతీయభాషలకు సంబంధించనిది,చాలక్లిష్టమైనది. అందులో మంచిప్రజ్ఞకొరకు బాలురెంతెంత కష్టమైన పడుచుందురు. యువకులధీశక్తి, ఆరోగ్యము ఈరీతిగ ఉడిగిపోవుచున్నవి. వారు యంత్ర

ములవలె తయారై తరుచునాకరీలకే పనికివచ్చుచున్నారు. ఇట్టిలోపముల నన్నిటినితీర్చుటకు గాంధిమహాత్ముడు చక్కగ ఆలోచించి డా॥ జకీర్ హుస్సేను మొదలగు కొందరు విద్వాంసులసాయముతో ఒక విద్యాప్రణాళిక తయారుచేసినారు. ఇదే 'వార్ధా విద్యా విధాన'మనబడును. ఇందులో ముఖ్యవిషయములు 1. 'బాలురమనస్సుకు బాధగల్గకుండ రాటము మొదలగువస్తువులవాడుచు వాటి ప్రత్యక్షానుభవంద్వారా దైనికజీవితపు సంగతులద్వారానే విద్యనేర్పుట. వల్లింపజేసి మనస్సును పీడించు పద్ధతి యుండదు. 2. ప్రస్తుతపువిద్యవలె వట్టిసాహిత్యప్రధానముగ కాక, చేతిపరిశ్రమలను నేర్పుదురు. ముఖ్యంగా ఏకులుచేయుట, రాటమూత్రిప్పుట, నూలుతీయుట, నేయుట, చక్కనిపనిముట్లు వస్తువులుచేయుట, అల్లిక, తేనెపట్టుట, గుడ్డపీలికలుతుక్కు వట్టిగడ్డి వగైరాలను ముద్దచేసి వాటినుండి కాగితములు తయారుచేయుట, ఇట్టి చేతిపరిశ్రమలు నేర్పుదురు. ఇందువల్ల కేవలం పుస్తకవిద్య తగ్గును. మనస్సుకు శ్రమపోవును. విద్యార్థులకు నేర్చుకొనుటకు ఉత్సాహముగల్గును. మంచివస్తువులుస్వయంగా తయారుచేయు ఆసక్తియునేర్పునుకల్గును. 3. విద్యార్థులు నూలు, కాగితములు ఇత్యాదులు చేయుటవల్లవారికితృప్తి ఆత్మనిశ్వాసమునుగల్గును. తరువాత జీవితవృత్తి యెట్లని నిరాశపడనక్కరలేదు. చేతినాడులకు పరిశ్రమ అభ్యాసమువల్ల ఆరోగ్యమును శిల్పశక్తియు హెచ్చును. 4. ఈబడులలో తయారగువస్తువులను సహజంగా గ్రామస్థులుకొందురు. తద్వారా పాఠశాలలకు కొంతసొమ్ము చేరును. దానితో విద్యావ్యాప్తి కవకాశము హెచ్చును. ప్రస్తుతంవలెసొమ్ములేక బడులునిల్చిపోవుచిక్కులేకుండగ్రామాలన్నిటిలో ఉచితనిర్బంధవిద్యాపద్ధతి దీనిద్వారా అమలు జరుపవచ్చును. 5. ఇట్లు వస్తువులు తయారుచేసి యిచ్చుటవల్ల గ్రామస్థులకు వారిబడికిని సన్నిహితసంబంధమేర్పడి, పాఠశాలలవిషయమై గ్రామస్థులెక్కువ శ్రద్ధ వహింతురు. ఇందువల్ల ఆవస్తువులద్వారా స్వదేశీయము సిద్ధించును.

ఈవార్ధావిధానములో 7 ఏండ్లు చదువుచెప్పుదురు; ఇందులో దాదాపు సెకండరీవిద్యవరకు చెప్పుదురు. కాని అన్నిటిని దైనికజీవితము కు తగినట్లురుచికరంగా నేర్పుదురు. 6. విద్యనంతను బాలురమాతృభాష ద్వారానే నేర్పుదురు; కనుక సంగతులు సులభంగా బోధపడును, క్లేశ ముతగ్గును. విచక్షణ జ్ఞానమును హెచ్చును. 7. వార్ధావిధానములోనిమ రొకవిశేషము: హిందూస్థానిభాషనుగూడ నేర్పుట. హిందూస్థాని మన దేశపుసామాన్యభాష. దానివల్ల దేశసంచారముకు జ్ఞానాభివృద్ధికిసౌకర్య మేర్పడుటేగాక, జాతీయభావమును ఆయూ ప్రాంతీయులమధ్య మైత్రియు పరస్పరప్రేమయు గల్గును. 'మనదొకేదేశము; మనమొకేభారతజాతి' అనుభావము దృఢపడును. 8 అహింస సాంఘిక మైత్రియు బాలురకు బోధింపబడును.

ఈవిధానములో విశేషద్రవ్యాశ కలుగదు; సౌమ్యత యేర్పడు ను. విలాయతీసరుకులపైన అభిమానముపోవును. ప్రస్తుతప్రభుత్వపు విద్యావిధానపు ముఖ్యఫలము సర్కారునౌకరీకిని కంపెనీల గుమాస్తాగిరీ కిని యువకులనుతయారుచేయుట. కళాశాలలోను యాంత్రికతకేహెచ్చు ప్రాముఖ్యమిత్తురు; దానివల్ల ద్రవ్యాశ, స్వార్థపరత, అహంభావమును పెరుగుచున్నవి. ఇవి హింసాతత్వపులక్షణములు. ఆవిధానముకు అర్బు దములకొలది రూపాయలను బ్రిటనువగైరాలలో ఖర్చుచేయుదురు. మనయితరదేశాలనుండిశోషణపద్ధతినివారుచాలసొమ్మురాబట్టుచున్నారు. గనుకనే, అది వారికిసాధ్యమగుచున్నది. ఆవిధానమంతకు హింసాతత్వము మూలాధారము. బాలురకు సౌమ్యతను ప్రేమభావమును నేర్పి, అహిం సాపరులగు పౌరులగునట్లు చేయనలె. వార్ధావిధానము అహింసాధార ము,అహింసద్వారా నడుపవీలైనది. అహింసావ్యాప్తికి సాధకమును. అది భారతీయసంస్కృతికి, మన జాతీయతత్వముకు తగినది. రహ్యావిధానము

అక్కడిహింసాసంస్కృతికే తగినది. ఈసంగతులను గాంధీగారు వార్ధా విధానపు ప్రారంభసమావేశంలో విశదపర్చినారు.†

దేశభాషలో దివ్యుడు నవ్యవాఙ్మయము వృద్ధిచేయుటయు విద్యాభివృద్ధి కవసరము. దేశభాషలో నిర్మించు వాఙ్మయము కేవలం సామాన్యజనులు మాటాడురీతినే యుండనక్కరలేదు; కాని సామాన్యులకును బోధయగు సులభశైలిలో నుండవలె; భావమును చదువగనే స్ఫురించుచుండవలె; మనస్సుకు బాధగల్గింపకూడదు. మరియు, విషయమును కేవలం శృంగార ప్రధానము హింసాకలహాదుల నుగ్గడించునదియు కాకూడదు. సామ్యజీవితము నాదర్శముగనుంచి, జాతీయనిర్మాణపు ఆవశ్యకతను జనులకు సుహృత్సమ్మితముగనో కాంతా సమ్మితముగనో సూచించునదిగ నుండవలె. అట్టిదే నిజమగు నవ్యవాఙ్మయము. వాఙ్మయరంగంలో నిప్పుడేర్పడిన సంఘర్షమును బోగొట్టి, రెండకక్షులకు సమన్వయము చేయుటయు ముఖ్యావశ్యకము.

---

† We have to make them representatives of our culture, of our civilisation, of the true genius of our nation. Europe is no example to us. It plans its programmes in terms of violance, because it believes in violance. I would be the last man to minimise the achievement of Russia, but the whole structure is based upon violance. If India has resolved to shun violance, this system of education becomes an integral part of the discipline she has to undergo. We are told that England spends millions on education. America also does so; but we forget that all that wealth is obtained through exploitation. They have reduced the art of exploitation to a science and might well give their boys the costly education they give. We cannot, will not, think in terms of exploitation, and we have no alternative but this plan of education, which is based on non-violance.

వర్గసంఘర్షము.

1. సామ్యవాదము.

సామ్యవాదమనగా జనులందరికి సమమైన హక్కులుండవలెనను సిద్ధాంతము మనదేశంలో కులసాంఘికవిభేదములు హెచ్చు. అట్లు కాక, పాశ్చాత్య విభేదములు ముఖ్యంగా ఆర్థికములు. సామ్యవాద మక్కడ జనించినది; కనుక ఇది ఆర్థికభేదములకు సంబంధించినది. పాశ్చాత్యదేశాలలో యాంత్రికపద్ధతి విస్తరించినదిగదా! అంతట, ఫాక్టరీలయజమానులు పెట్టబడిదార్లు ధనాఢ్యులై, సరుకులు చౌకగ తయారుచేసి, పోటీలోగూడ మంచిలాభము రాబట్టుటకని పనివాండ్ర కన్యాయము చేసిరి; వారి మానవత్వమునగూడ గమనించుట కష్టమైనది. అంతట కార్మికపక్షీయులు ప్రత్యేకసంఘము లేర్పర్చినారు. కాని, నిరుద్యోగుల పోటీయున్నదిగదాయని కార్మికులకు హీనమగు జీతములిచ్చుట, తమకు ఏరీతిగనైన అవిధేయులైనవారిని బాధించుట, వారిసంఖ్య తగ్గించి, యంత్రశక్తి హెచ్చించుట, యంత్రయజమానుల మామూలయినది. ఈ బాధలుపోవుట కీకార్మికసంఘములు కట్టుగట్టి, కనీసపుజీతములనిర్ణయము, కార్మికుల వసతులు ఆరోగ్యము సెలవురోజులు, భావస్వాతంత్ర్యము మున్నగుహక్కులకై పోట్లాడి కొంత సఫలులైనారు. కాని, క్రమంగా యూరపులోపుంజీపతులకు కార్మికవర్గముకు పరస్పర విరోధము వృద్ధియైనది, కార్మికులు సమ్మె చేయగనే ఫాక్టరీయజమానులకు సర్కారు ఉద్యోగులు సాయపడి సమ్మెనణచి, నిరుద్యోగులగు ఇతరులను పనిలోపెట్టి, పికెటు చేయువారి నరెస్టుచేసి, శిక్షించుచుండిరి. ఈరెండువర్గాలవారు తమ ప్రత్యేకలాభమే ముఖ్యముగ జూచుకొన, ఉభయులమధ్య సంఘర్షను హెచ్చుచు వచ్చినది. సాధారణంగా పుంజీపతివర్గముకు తమ ప్రభుత్వపు సాయమున్నది పుంజీపతివర్గమును సా

ప్రాబ్యప్రభుత్వముతోసహా నశింపజేయుటే కార్మికులగు సామ్యవాదుల రాజకీయాశయమయినది.

'ఈరెండువర్గములకు సంఘర్షము తప్పదు; పుంజీపతిసంఘమును నశింపజేసి కార్మికులు పాలనాధికారం వహించుటే కర్తవ్య'మనుట సామ్యవాదుల ముఖ్యసిద్ధాంతము; దీని జనకుడు 'కార్ల్‌మార్క్సు' అను జర్మనువిద్వాంసుడు. మొదట జర్మనీప్రాంతమువారి రాలలో వర్గసంఘర్షము హెచ్చినది. సామ్యవాదుల ఆందోళన పెరిగినది; వీరితో మన మిదివర లో చర్చించిన విప్లవోద్యమమునకును సంబంధమేర్పడినది. బ్రిటనుకు విశాలప్రకృతిసంపదగల సామ్రాజ్యలాభము లుండుటవల్ల సంయుక్త రాజ్యమునకు అమెరికాఖండములో వ్యాపారవిషయంలో సర్వాధిపత్యం వల్లను, అక్కడి పుంజీపతులకు ద్రవ్యలాభము విపరీతంగా హెచ్చినది; వారి పెట్టుబడులు లోకమంతటను వ్యాపించినవి. తద్ద్వారా వీనికి నిరంతరం లాభపు ధనప్రవాహము చేరుచుండును. ఈరెంటిలో ప్రజాయత్త రాజ్యాంగమున్నది. కనుక, పాలకవర్గము దూరదృష్టిగల్గి, ఈపుంజీపతుల లాభంలో కొద్దిభాగమువెచ్చించి, కార్మికుల వసతిగృహములు, జీతముల హెచ్చింపు, సెలవుల హెచ్చింపు, జబ్బుకు వార్ధకమునకు ఉపకారభృతి ఇట్టి సౌకర్యములు గల్గించి, మొత్తంమీద తమలాభం నిల్పుకొన్నారు. మరియు బ్రిటనులోని చాలమంది నిరుద్యోగులు, కార్మికులు, కెనడా, దక్షిణాఫ్రికావంటి కాలనీలలోజేరి, సుఖపడవీలైనది. ఇట్లు సంఘర్షమునగ్గి, అక్కడ కార్మికోద్యమమునకు రాజకీయంగా తీవ్రతపోయినది. అమెరికాలోను ఇప్పటికి స్థలనైశాల్యము, అల్పసంఖ్య, లాభాధిక్యమువల్ల ఇట్లేయయినది. ఆంగ్లభాషీకులుకాని తక్కిన యూరపీయనుజాతులలో మాత్రం సంఘర్షముపెరిగినది. అక్కడివారికిట్టి ప్రత్యేకసమపాయములు లేవు. కనుక, సంఘర్షము తప్పలేదు; మొదట తామే అధికారము వహించుటకు రాజ్యాంగపద్ధతిని కార్మికపక్షీయులాందోళనజేసిరను, అడిపాలకుల నిరంకుశతవల్ల వ్యర్థమైనది. సమ్మెలు జరుగుచు భేదింపబడు

చుండెను. ఈలోగా ఆయూరాజ్యాలమధ్య సంఘర్షము కల్గినది. అక్కడి కార్మికులలోను కొంతజాతీయభావ ముండెను, తమ పాలకవర్గము నప్పు డే పరిశ్రమ పోరుద్వారా దుర్బలబరచితే జాతీయప్రాబల్యము ఘనత పోవునని, బలీయులు సాకర్యయుతులు అగు బ్రిటిషుజాతితో పోటీలో నిల్చుటకష్టమని, జర్మనీలో కార్మికవర్గము జంకి సామ్యసిద్ధాంత మమలు పెట్టలేను; తమ పారిశ్రామికు లాంగ్లులతో పోటీలో ఓడితే, పరిశ్రమ క్షీణతవల్ల తమకును నష్టమని గ్రహించిరి. జాతిసంఘర్షము పెరిగినది. ఫ్రెంచివారు జర్మనులపైన కసిదీర్చుకొను యత్నములో నుండిరి. తుదకు 1914-18 సంగల మహాయుద్ధమువచ్చినది. తరువాతపరిస్థితులు తారుమా రైనవి. ఇంచుకు పూర్వం రష్యాలోను చక్రవర్తి పుంజీపతులతోను భూస్వాములతోను కలసి కార్మికకర్షకుల బాధించుచుండెను. వర్గద్వేష ము పెరిగెను. ఆమహాయుద్ధంలో రష్యనుసేనలు జర్మనుసేనల ధాటికిని శ్రామమువల్లను మిడతలవలె లక్షలకొలదిగ చచ్చిరి. మిగిలినవారు పాలకులపైన అసంతృప్తివల్ల ద్వేషయుతులై ఆయుద్ధము వినాశకరము అనవసరమునని యెంచి, చక్రవర్తిపైనే తిరుగబడిరి. ఇట్లు రష్యాలో విప్లవ మేర్పడి, సామ్యవాది ప్రముఖులే రష్యనుసేనలకు నాయకులైరి.

రాజు ప్రభుత్వమంతరించి, కెరెంస్కీక్రింద మధ్యరకపుసామ్య వాదిరాజ్యమువచ్చి, వెంటనే అదియుపోయి, శుద్ధసామ్యవాది ప్రభుత్వము 1917 సం॥ అక్టోబరులో స్థాపితమైనది. ఇది కేవలం ప్రజాస్వామ్యము. రాజకుటుంబము నశించినది. ధనికభూస్వాములు స్థానభ్రష్టులు ప్రవా సితులునై కొందరు ప్రజలకోపాగ్నికి పూర్ణాహుతియయిరి. అంతట రాజ్యాంగపద్ధతులును మారినవి. రష్యాలోని ఈ 'బోల్షివికు' రాజ్యములో ఆస్తిలేనివారికే వోటింగుకు ఉద్యోగాలకు హక్కుకలదు. ఆస్తిపరులకే మన దేశంలో వోటునిచ్చుహక్కు మర్యాద గౌరవము ఉన్నవి. * ఆస్తి

* ఇటీవల (1937 నుండి) మనదేశంలో విద్యావంతులు పరిమితులైన వారికిని వోటుహక్కు నిచ్చినారు.

పరులకు స్వార్థపరతయుండునని యెంచి, రష్యాలో స్వంత ఆస్తిలేనివారినే గౌరవింతురు అక్కడవ్యక్తులుద్రవ్యముభూములు వగైరాలునంపాదించుకోకూడదు. భూములు ఫాక్టరీలు, వ్యాపారస్థానములు, ఆసంస్థలు ఇత్యాదులు సంఘమంతటివి వాటియాజమాన్యముప్రజాసభయగు'సోవియటు'ది

అంతట రష్యనుప్రజలలో మంచి అభివృద్ధిగల్గినది. జనులారోగ్యవంతులైనారు. సామాన్యప్రజలకు సుఖము లోకజ్ఞానము ఆత్మగౌరవము హెచ్చినవి. జనులలో విద్యయు, ప్రాంతీయభాషలతోబాటు సామాన్యభాషయగు రష్యనుభాష అందలివాఙ్మయమును వృద్ధిజెందినవి. ఆయాప్రాంతాలమధ్య మైత్రియేర్పడినది. ఇప్పుడు నిర్వ్యాపారత రష్యాలో మాత్రమే పోయినది. ప్రతివానికి వృత్తిపోషణ సర్కారునుండి తప్పక లభించును. కొత్తపరిశ్రమలు, జలవసతులు, వ్యవసాయాదికార్యములు చాలహెచ్చినవి. అరాజ్యము తమదనుభావ మక్కడి ప్రజలకు గల్గినది. కమ్యూనిజం'అనుపేర నాపద్ధతిని రష్యాలో ప్రతియూర గ్రామసంఘము లక్కడిస్వవస్థను సాగించును. ఇట్లేప్రాంతీయసభలు, వాటిమహాసమితియు నున్నవి ఈపద్ధతిని సోవియటు పద్ధతియందురు. ఇది కొంతవరకు ప్రజలకు లాభకరమైనది; అయితే కొంతహానియు కల్గినది.

ఈ బాల్షివికు ఉద్యమమంతయు సంఘర్షసిద్ధాంతంపైన హింసాతత్వంపైనను ఆధారపడినది. ప్రజానాయకులు హింసద్వారానే అధికారం వహించి, దానిద్వారానే బలీయులై, వేలకొలది రష్యనులజంపించి, ధనికులందరి ఆస్తులను నిర్బంధముగ లాగుకొని, లక్షలకొలది రష్యనులను ప్రవాసితులజేసినారు. కార్మికులు నిరాధారులునేకమయి, ఇతరుల ఆస్తులన్నిటిని బాతాత్తుగ వశపర్చుకొన్నారు. ఇట్టి సిద్ధాంతము దారుణమని ఇతరులకుతోచుట సహజము. మరియు ఇదివరలో రష్యాచక్రవర్తి పశ్చిమయూరపులో చేసిన ఋణములను తీర్చునని బాల్షివికులు నిరాకరించినారు. అంతట ఇంగ్లండు ఫ్రాంసు అమెరికావంటి నాగరికరాజ్య

ములు రష్యాపైన కత్తికట్టి, దానిని సాధింప కంకణముకట్టుకొన్నారు. ప్రవాసితులగు తెల్లరష్యనులు వారినందుకు ప్రేరేపించి కోట్లకొలది సవరనులసొమ్ము వారికిచ్చి పోరుసాగించిరి. అయితే రష్యనునాయకులు పౌరులు తమకొత్తహక్కులరక్షణకై శూరతతో పోరితమరాజ్యమును కాపాడుకోగల్గినారు; కాని దేశమంతటను అపారనష్టము కల్గినది.

ఇంతేగాదు, హింసాపద్ధతితో అధికారముకువచ్చిన బాల్షివికు నాయకులు పుంజీపతితత్వపు ఇతరరాజ్యములతో పోరుటలో కేవలం నియంతృపద్ధతినే రాజ్యము సాగించినారు తరువాత తమలోనే విభేదము లేర్పడినవి. 'ప్రపంచకార్మికులందరు ఏకముకావలెను; ప్రతిదేశంలోను వర్గసంఘర్షమును నిష్లవమునుగల్గించి లోకమంతటను పుంజీపతిత్వమును సామ్రాజ్యపద్ధతిని నశింపజేయవలెన'ని, తీవ్రసామ్యవాదులు నిశ్చయించి యత్నించిరి. ఆయూదేశముల ప్రభుత్వము లంచువల్ల బెదరి తమదేశాలలో సామ్యవాదులను నిర్బయముగ బాధించి వారివాజ్ఞయమును నశింపజేయు చుండిరి; రష్యనులు బాల్షివికుసిద్ధాంతములకు వారిప్రవృత్తికి అపార్థము చేసిరి. లెనిను తరువాత రష్యాలోనే రెండుపక్షములేర్పడినవి. వర్గసంఘర్షమును విదేశాలలో హెచ్చించి విప్లవము గల్గించవలెనని 'ట్రాస్కీ'. అతనిని తరిమి, ఆపక్షమువాని క్రూరశిక్షల పాలుచేసి, 'స్టాలిను' నాయకుడై, పాలనలో కొన్నిమార్పులు చేసినాడు అసలు బాల్షివికువాద పుత్రీవ్రతను తగ్గించి, వ్యక్తులకు కాపురముండుట కిల్లును సిత్యావశ్యకమైన వస్తుప్రులును స్వంతహక్కుగా నుండవచ్చునని కుటుంబమునకు తగినట్లు ఆ యాయ్యక్తులకు స్వంతవ్యవసాయములు జీవనము కవసరమైన చిన్నచిన్న దుకాణములవ్యాపారము నుండవచ్చునని, వ్యక్తులు తమతము మతాచార ములను స్వేచ్ఛతోననుష్ఠింపవచ్చునని, ఇట్టిమార్పులుచేసెను; సోవియటు రాజ్యాంగమును పార్లమెంటరీఎన్నికలపద్ధతిబెట్టి సామ్యముగ నుండునట్లు మార్పించెను కాని, అంతకుపూర్వమే దౌర్జన్యపద్ధతి జనుల కెక్కిపోయి

నది. స్టాలిను ఇతరదేశాలలో విప్లవముగల్గించు ప్రవృత్తిని మానెను. అంతట కొంత శాంతిగల్గినది. అతడు స్వదేశంలోను జాతీయతత్వమును పెంపొందించుచున్నాడు. పుంజీపతిప్రాబల్యముగల నానాజాతిసమితిలోసభ్యత్వమునుగ్రహింసుతో మైత్రినిరష్యనులు కొంతకాలమేర్పర్చుకొన్నారు. అది నిలువలేదు మరియు విదేశములతో రష్యాకెట్లునుసంఘర్షముతప్పటలేదు. ఆర్థికంగా ఆధునికయంత్రములదెప్పించి సోవియటులు మిల్లులు పెద్దకార్ఖానాలుస్థాపించి యాంత్రికపరిశ్రమలద్వారా బహుళోత్పత్తిజరిగించినారు; ఆత్మరక్షణకని ఆయుధసామగ్రులనుగూడ విపరీతంగావృద్ధిజేసినారు. గోధుమలు ప్రత్తివగైరా పంటవస్తువులకుగూడ ఊళ్ళులు కోతలు వగైరాలకు 'ట్రాక్టర్లు'వగైరామహాయంత్రములుపయోగించి, అమ్మిసొమ్ములు రాబట్టుచున్నారు. బహుళోత్పత్తిచేసినారు. సరఫరాలలో చాలచిక్కులుకల్గినను, తమదేశావసరములకే ఈఉత్పత్తి జరుగుచున్నంతవరకు రష్యాలో (ఇప్పుడు సంఘర్షము వచ్చినది) యాంత్రికపద్ధతి యుపయోగించినది. అట్టిలాభము కొంతకాలమైనను పొందుటకు మనమును ఫాక్టరీలపద్ధతి పెట్టుట మంచిదని కొందరనుచున్నారు. కాని యాంత్రికసంస్కృతి తుదకు హానికరమగును. మరియు ఈరెండుదేశాలకు కొంతభేదమున్నది. సోవియటు రష్యాదేశము మన దేశముకన్న వైశాల్యంలో రెండురెట్లు పైగా పెద్దది; అక్కడి జనసంఖ్యమాత్రం మనదానిలోసగమే అక్కడి ప్రకృతి సంపదను పరిశ్రమలను ప్రజావశ్యకతకు తగినట్లు వేగంగా వృద్ధిజేయుటకు (జనశక్తిచాలక) గొప్పయంత్రములుపయోగించినవి. అక్కడి పూర్వసంస్కృతిలో ధార్మికబలమును చేతి శిల్పప్రజ్ఞయు చాలతక్కువ. మనదేశమందట్లుకాదు. ఇక్కడి పూర్వసంస్కృతిలో అహింసాతత్వమును శిల్పశక్తియు చాలహెచ్చు, అనిచూచియున్నాము; జనసంఖ్యయు హెచ్చు; ఇప్పుడు కోట్లకొలది ఈదేశీయులు వృత్తిహీనులై అల్లాడుచున్నారు. ఇట్టిస్థితిలోరష్యాలోవలె యాంత్రికపరిశ్రమలే పెట్టుటవల్ల సామాన్యజనులకు సుఖముకన్న దుఃఖము హెచ్చును. మనదేశము కవసరమగు అన్ని

వస్తువులను ఈదేశమందే గొప్పయంత్రములద్వారా తయారుచేసినను, ఆయంత్రము లన్నిటిద్వారా ఒక్కకోటి కన్న హెచ్చుమందికి పనికలుగదని తేలినది, అప్పుడు సుమారు అధమం 20 కోట్లజనులు వ్యర్థంగా నిరుద్యోగులై యుండవలెను. కనుక పాశ్చాత్యపు సామ్యవాద మీదేశమునకు సరిపడదు. మరియు యాంత్రికవృద్ధివల్ల బస్తీలలో కార్మికులు హెచ్చియున్నచోట్లనే సామ్యవాదము సాగును. 1917 నాటికిని రష్యాలో మనదేశంలోకన్న యాంత్రికపరిశ్రమలు హెచ్చుగనుండినవి; ఆప్రజలు సాయుధులు, మనవలె నిరాయుధులు, ఈదేశీయులంతనిరక్షరులు కారు. అక్కడ కార్మికులసంఖ్య దామాషాగా ఈదేశంలోకంటే చాలహెచ్చు. మన దేశంలో పరిశ్రమలు ఇంకా బాల్యస్థితిలోనున్నవి. మనదేశీయపరిశ్రమలు చాలపోటీలోనున్నవి. ఇక్కడ కార్మికోద్యమము బలీయమగుటకు పరిస్థితులు వీలుగాలేవు. రష్యాలో చల్లదనమువల్ల యంత్రోష్ణమిక్కడియంత బాధకరమునుగాదు. ఆప్రాంతీయుల శరీరదార్ఢ్యమిక్కడివారికంటె హెచ్చు.

రష్యాలో ధార్మికత అనగా మతదృష్టిలేదు. కేవలం భౌతికదృష్టితో వారు సంస్కృతిని నిర్మించుచున్నారు. అది యీదేశీయులకు సరిపడదు. మరియు రష్యాలో నిష్లవసమయంలో చక్రవర్తి దుర్బలుడు నిస్సహాయుడునై నాడు. అక్కడ క్రాంతిపరులు విదేశమునుండి పాలించు బలీయమగు సామ్రాజ్యమును లొంగదీయుసమస్యకలుగలేదు. జనులకు ఆధ్యాత్మికత వ్యక్తి స్వేచ్ఛ ఇష్టమైన వృత్తి నెన్నుకొనుట ఇష్టములేదు. భావస్వాతంత్ర్యమును తగ్గినది. వ్యక్తి లాభపద్ధతి రష్యాలో లేకున్నను యాంత్రిక పద్ధతిలో సహజముగనే హింసా తత్వమున్నది. బహుళోత్పత్తిని దేశసంపత్తు నింకను హెచ్చించి తమ రాజ్యము నింకను బలీయముగను ధనికముగను చేయుటకు, విదేశాలనుండి యంత్రాముల దిగుమతికిని తమ సరుకులనుగూడ విదేశముల కెగుమతిచేయ దొడంగిరి. అప్పు డితరదేశముల వ్యాపారముతో రష్యాకు పోటీ యూరం

భించినది. ఒకవైపు ఇంగ్లండు జర్మనీలతోను రెండవవైపు జపానుతోను స్పర్ధ దినదినమును వృద్ధియైనది. జాతులన్నియు రష్యా తమలోనెప్పటికైన వర్గసంఘర్షముగల్గించునని అది హానికరమని భయపడియున్నారు. ఆయుధసామగ్రిని క్రొత్తరకపు విషవాయుప్రయోగాదిగా మారణసాధనములను రహస్యముగ నిలవజేసినారు. రష్యాయు వారితో పోరొనవచ్చును. ఈరీతిగ రష్యను బాల్షివిజములోను హింసాతత్వమున్నది. అందువల్లను మారణహోమములు జరిగి, మరల ఆయా రాజ్యములమధ్య మహాయుద్ధములుసాగి, లోకము కనర్థము వాటిల్లవచ్చును.

రష్యాకు తూర్పున జపానుతోను యుద్ధము తటస్థించునట్లుండినది. అయితే చీనాయుద్ధంలో జపాను మగ్నమైనందున ప్రస్తుతం రష్యాకా బాధ తప్పినది. ఇట్లే రష్యాజర్మనీల ప్రభుత్వములు తీవ్రంగాదూషణ సాగించిరి; ఈరెండు రాజ్యములకుయుద్ధముజరుగునట్లుండెను. హింసాధోరణి ప్రకోపించినది. అయితే, సమయముకు పోలండు బ్రిటిషు ఫ్రెంచి సర్కారుల రాజనీతి వక్రమార్గము పట్టినది. అంతట జర్మనులు రష్యాతో సంధిచేసుకొని, బ్రిటిషు ఫ్రెంచివారలతోనే యుద్ధము సాగించుచున్నారు కాని రష్యనుప్రభుత్వమును తూర్పుపోలండు నాక్రమించి, ప్రక్కనున్న బాల్టికురాజ్యముల గలుపుకొని సైనిక సన్నాహముచేసి ఫిన్లండును ముట్టడించినాను ఈయుద్ధం త్వరలో సమాప్తమైనను, జర్మను బ్రిటిషువారైరా రాజ్యములు కలసిపోయి పిమ్మట తమపైకి యుద్ధమకు వత్తురని రష్యా కనుమానమున్నది. కనుక రష్యను లిపుడును తమసరిహద్దులలో సైనికశక్తిని ఆయుధాలను తీవ్రంగా హెచ్చించుచున్నారు. యూరపు దేశములన్నిటిమధ్యను హింసాభావము హెచ్చుచున్నది. కనుక రష్యాపద్ధతివల్లను తుదకనర్థముగలుగును. ఇట్లు సామ్యవాదపు అసలుసూత్రములు మంచివేయైనను, భౌతికప్రధానమగు హింసాతత్వపు దృక్పథము సరికాదు. మరియు మనదేశపు పరిస్థితినిబట్టియే సామ్యసూత్రము లమలులోనుంచవలె. గురుపథులు దేశకాలపరిస్థితులను

బట్టి తమ సిద్ధాంతప్రణాళిక నేర్పర్చుకోవలె. వివిధమతములు, మూఢ భక్తి, సాంఘికవిభేదములు ప్రాంతీయతత్వములు చిరకాలంనుండి నాటి, మన ఆర్థికవ్యవహారాజకీయస్థానములన్నియు ప్రబలురగు విదేశీలయులచే జరుపబడుచు, వట్టినిరాయుధులమైయున్న మనకురవ్యనుసామ్యవాది పద్ధతి అమలుకుపనికిరాదు అక్కడివిల్లులకంటెమనబాటములువేరై రాలుచాల హెచ్చుమందికి పనిచ్చును, గ్రామములలో నవి గృహలక్ష్మివలె మం గళప్రదమగును, అవి అజ్ఞానులకును అందబాటైనవిసులభగ్రాహ్యములు; పుంజీకతులతో జమీందార్లతో, సంస్థానాధిపులతో, వ్యాపారివర్గము తోగూడ సామ్యవాదముకుండు సంఘర్షముండదు. ద్వేషభావము హింసాతత్వము శత్రువులతోనేగాక మనలో వివిధపక్షాలమధ్యను చెల రేగితే బాధకముకాకతప్పదు. మరియు, సామ్యవాద మిక్కడి గ్రామజీవి తమునకసలే సరిపడదు. మధ్యవర్గపుకల్పయితలును సామ్యవాదప్రక్రి యకు వ్యతిరేకించుచున్నారు. కనుకనే, ఈదేశంలో సామ్యవాదులకార్య క్రమము విఫలమైనది. వారు సిద్ధాంతసూత్రముల సరచుచు ఉద్రేకం కల్గించినారు;కానివానికినిర్మాణకరము బీదసాదలకుసహాయకరము ఆయా వర్గములమధ్య సమన్వయకరమునైన కార్యక్రమము లేదు. వారు సాగిం చిన సమ్మెలవల్లను పారిశ్రామికులలో విదేశీయులకన్న మనదేశీయులకే హెచ్చునష్టముకల్గినది. ఆసమ్మెలను ప్రభుత్వంవారును యంత్రయజమా నులును సులభంగా విడగొట్టుటవల్ల సమ్మెదార్లకు నిర్వేదమేగాక అవిధే యతవల్ల కార్మికోద్యమముకును తుదకు నష్టమేగల్గినది. కొందరు తీవ్ర సామ్యవాదులు (అంతర్జాతీయతవేర) జాతీయతకు గాంధివాదముకువ్యతి రేకులై విభేదకారకులైనారు. 1930-32 ల తీవ్రసత్యాగ్రహమందును కాంగ్రెసుమంత్రుల నిర్మాణకార్యసమయములోను తీవ్రసామ్యవాదులు అంకుకు వ్యతిరేకులై ఆటంకముచేసినారు సామ్యవాదిసూత్రములను ఈదేశపు పరిసరములను జనుల మనస్తత్వమును మనసంస్కృతి స్వరూప మును అనుసరించి క్రియారూపంలో పెట్టుటవల్ల గాంధిమహాత్ముడు వివ రించిన నిర్మాణకార్యక్రమ మేర్పడుచున్నది.

వర్గసంఘర్షము.

2. సంస్థానాదులు.

మనజాతీయసమస్యలలో నొకటి దేశీయరాజ్యములది. ఇంగ్లండు జర్మనీ వగైరాలలోని పూర్వపుసామంతరాజ్యపద్ధతి (మధ్యవర్గపు ధనికులాధాటికి) నశించినది. అది అమెరికావంటి నవ్యరాజ్యములలోను లేదు. జపానులో 'సామ్యురై' అను సామంతులుండిరి. చక్రవర్తి 1867 నుండి నవ్యపాలనమారంభించినప్పుడు వారు తమదేశక్షేమముకై తమ ఆనువంశికపు హక్కులన్నిటిని వదులుకొని, త్యాగముచూపిరి. చీనాలో సామంతపద్ధతి యుండుటవల్ల కేంద్రబలము క్షీణించి అంతర్యుద్ధములు జరిగినవి;

ఇక మనస్థితి: ఈదేశంలో బ్రిటిషువారధికారముకు వచ్చునప్పటి కాయాప్రాంతములను వేర్వేరురాజులు పాలించుచుండిరిగదా! వీటిలో కొన్నిటిని బ్రిటిషువారు పూర్తిగ వశపర్చుకొన్నారు. మిగిలినవి ఆయా దేశీయరాజులక్రింద మిగిలినవి. డల్హౌజీప్రభువువంటి కొందరు బ్రిటిషు పాలకులు సాకుదొరికినప్పుడెల్ల ఒక్కొకటిగ రాజ్యములను తమ పాలనలో చేర్పబూనిరి; ఇట్లు ఆరాజ్యములు తగ్గగా బ్రిటిషువారు రాజనీతిమార్చుకొని, మిగిలిన రాజ్యములను నిలువబెట్టి వాటిపైన అజమాయిషీని పెట్టుకొన్నారు. ఇప్పుడున్నవి 562 రాజ్యములు; వీటిలో కొన్ని బొత్తిగాచిన్నవి. ఇప్పుడివియన్నియు బ్రిటిషువారితో వ్యవహారసంధులు కల్గియున్నవి. కాని వాటికి బ్రిటిషువారుచెప్పుఅర్థమే ఖాయము. ఈరాజ్యములలోనేవియు మరియేయితరరాజ్యములతోను స్వతంత్రముగ వ్యవహరించకూడదట. *పై అధికారమంతయు బ్రిటిషువారిదే. ఆరాజ్యాలలో పాలనసరిగ చేయవలెనని మరతులుండును. కాని ఆచరణలో ప్రజలకుపీడ గల్గుచున్నను, బ్రిటిషు ఉద్యోగుల ప్రీతియున్నంతవర కేబా

---

* ఒక నేపాళముమాత్రము స్వతంత్రమనబడును.

భయము ఈరాజులకుండను; అఉద్యోగులకాగ్రహముగల్గితే, బ్రిటిషుప్రభుత్వమువా రీరాజుల నెట్టినేరపుగుజువు అక్కరలేకనే తీసివేయవచ్చును. (ఉ॥ ఇందోరు, ఆల్వారు, నాభా వగైరాల రాజులు మన ప్రభుత్వంవల్ల తొలగింపబడిరి.) వాడికిబ్రిటిషుప్రభుత్వంవారు పేరుకుమాత్రం 'మిత్రులు', క్రియలో యజమానులు. ఈరాజులు తమప్రజల విషయంలో మాత్రం కేవలం నిరంకుశంగా వర్తింతురు. వీటిలో ప్రజాయత్తతగంధమైనను లేదు. కనుక, దేశీయరాజ్యములనిపేరేగాని, అక్కడిప్రజలకుబదులు ఆరాజులకు (వాడిపై సధికారం చలాయించు బ్రిటిషుప్రతినిధులకును) అక్కడ సర్వాధికారము. వీరిద్వారా బ్రిటిషుమిషనరీలు వ్యాపారస్థులుకూడ ప్రాబల్యమును సంపాదించి, తమవృత్తులయధేష్టంగా సాగించుచున్నారు. అక్కడి రాజులనేకులు భోగపరులై తరుచుఆంగ్ల 'మిత్రు'లసలహాతో ఏయింగ్లండులోనో వసింతురు. వీరిదుబారాఖర్చులు విపరీతములు. సంస్థానాలలో పన్నులు చాల హెచ్చు; సరియగు చట్టములు, న్యాయపరిపాలన, విద్య, ఆరోగ్య సౌకర్యము వగైరాలు మనప్రాంతాలలో కంటెను తరుచు హీనములు. జనులకు వ్యక్తిస్వాతంత్ర్యములేదు. ఉద్యోగులెంత బాధించినను, ప్రజలకు ముక్తిలేదు. ఆర్థిక నైతికశోషణలును హెచ్చినవి. ఈగీతిగ ఈదేశీయరాజ్యము లిప్పుడు హింసాభూయిష్ఠమైయున్నవి.

బ్రిటిషుచక్రవర్తితో తమకు మైత్రిసంధి యేర్పడియున్నదని ఆషరతులమలుజరుపునిమిత్తం తమ రాజ్యంలోసర్వాధికారము కావలెనని, సంస్థాన రాజులనుటకలదు. కాని, బ్రిటిషు చక్రవర్తియు స్వతంత్రుడు కాడు; అతడక్కడిప్రజాసభవారి యాజ్ఞప్రకారమే నడుచుకోకతప్పదు. ఇక ఈమైత్రిసంధులనేవి యీస్టిండియా కంపెనీతో నేర్పడినవి. ఆయా సంధులషరతు లేకరీతిగలేదు. మరియు సంధిషరతు లెట్లున్నను, బ్రిటిషు ప్రభుత్వము కీరాజులపైన సామ్రాజ్యాధికారమున్నదట! ఇకతమప్రజల విషయంలోనే వీరికి సంధి ద్వారా నిరంకుశత్వ. ఈసంధులలోను సంస్థానాలలో ప్రజాయత్తపాలనపెట్టకూడదని షరతులేదు. మరియు రాజ్యపు

ప్రజాయత్తత ఆప్రజల జన్మహక్కు. బ్రిటిషు ప్రజలహక్కువంటిదే ఇక్కడిప్రజలది. ఈసంధిషరతులకు సంస్థానప్రజల అనుమతిని పొందను లేదు. (సంస్థానాలలో ప్రజాయత్తపాలనకు రాజులిష్టపడితే బ్రిటిషుప్రభుత్వము కభ్యంతరము లేదని బ్రిటిషుప్రతినిధులిటీవల సూచించినారు) మరియు సంధిషరతులు శాశ్వతముకావు; సందర్భానుసారము సంప్రతింపులు మార్పు జరుగుచుండును.

ఈరాజులు బ్రిటిషు ఉద్యోగులకు బెదురుచుండుటకు దుష్టపరిపాలనయుతమకు ప్రజలనుండినిజమైనప్రేమయు తోడ్పాటును లేకుండుటయు కారణములు బలమైనప్రజాభిప్రాయము సంస్థానజనులలో సంఘటనము రాజుకు ప్రజలకు పరస్పరమైత్రియున్నప్పుడు పరదేశీయులగు బ్రిటిషు ఉద్యోగులేమిచేయుగురు? ఇప్పుడుప్రజలు పిరికివారై నిరాశులైనారు. ఇటీవల వారిలోకొంతపరిజ్ఞానముకల్గి వ్యక్తిస్వేచ్ఛకొరకును ప్రజాయత్తపాలనకొరకును కృషిచేయుచున్నారు. శ్రీ పట్టాభి, నెహ్రూ, పటేలు మున్నగు కొందరు కాంగ్రెసునాయకులును వారిసమస్యలగూర్చి శ్రద్ధవహించుచున్నారు. ఇప్పటిసంక్షుభితస్థితి మారవలసియున్నది. అయితే అది ఎట్లని ప్రశ్న. ఈరాజత్వపద్ధతినే తొలగించుడని అనగా రాజవంశములన్నిటిని సీవాగాతొలగించి తక్కినప్రాంతములతో కలుపవలెనని సామ్యవాదులసూచన. అందుకు రాజపక్షీయులును బ్రిటిషువారును విరోధింతురు. దౌర్జన్యమును చెలరేగును. మరియు చిరకాలపువంశపరంపరపద్ధతి నొక్కసారిగతొలగించుటసబబుకాదు. అప్రాంతీయులింతవరకురాజత్వపద్ధతి కలవడియున్నారు ఇంతేకాకకొన్నిరాజ్యాలలోసాంఘికసమస్యలుండును. హైదరాబాదు భోపాలు ప్రజలలో హెచ్చుమంది హిందువులు. అక్కడి నైజామును నబాబును తొలగించితే ముస్లిములలో చాలమంది తిరుగబడి,సాంఘికద్వేషము పెరుగును,రక్తపాతము జరుగును. ఇట్లే కాశ్మీరంలో మహారాజును తీసివేసిన అక్కడి హిందువులు విరోధింతురు; అధికారము ప్రజాయత్తముకావలె; కాని రాజవంశపు హోదా గౌరవము పోకూడదందురు.

ముఖ్యరాజ్యాలమధ్య కొంత దేశీయసేనలున్నవి; వాటిపైన పరిశీలన బ్రిటిషువారిది. మన బ్రిటిషుప్రభుత్వమువా రీప్రజలనగణచియుంచుట కీరాజులకు మద్దతుచేతురు. ఇట్లారాజులు దౌర్జన్యముతోనైన 'శాంతి'ని కాపాడి, అధికారమును నిల్పుదురు. కనుక ఇప్పుడీరాజత్వము పోవలెనంటే, బ్రిటిషుసామ్రాజ్యముతో పోరును సాంఘికసంఘర్షమును కల్లోలమును కలుగును. అట్టి హింసాపద్ధతి అసలు సమస్యను మరింత గహనము చేయును. రాజపక్షీయుల హృదయము కరగించియు ప్రజలు నిర్మాణశక్తిగల్గి న్యాయమగు ఒత్తిడిచేసియు, బ్రిటిషుప్రభుత్వపు ప్రాబల్యముతగ్గించియు ప్రజాయత్తపాలన పెట్టించవచ్చునని గాంధిమహాత్ముడు ఇత్యాదుల భావము. ఈరీతిగా కొంతప్రచారము జరిగినది. ఈపద్ధతియింతవరకు అంతగా ఫలించలేదు. 'ఔంధ్' సంస్థానపురాజుమాత్రం ప్రజాయత్తపాలన నిటీవలపెట్టినారు. మరికొందరప్పుడిప్పుడే చిన్నసంస్కరణలను పరిశ్రమలను సాగించుచున్నారు. మనబ్రిటిషు ప్రభుత్వమువారు గట్టిగాతలచుకొంటే ప్రజాయత్తపాలన సులభమే. కాని, వారేదో కారణంచెప్పి తప్పించుకొనుచున్నారు. ఇప్పటిసంస్థానపద్ధతివల్ల బ్రిటిషువారినిరంకుశతకు బలము కల్గుచున్నది. ఈసంస్థానములు మొత్తం భారతదేశంలో పరిమితిలో $\frac{1}{3}$ వ వంతు, జనసంఖ్యలో $\frac{1}{4}$ వ వంతుగ నున్నవి. ఈరాజులందరు బ్రిటిషుపాలకులకనుసన్నలప్రకారమే నడుచుకొందురు. ఇటీవల 1935 సంవత్సరం చట్టంలో మనదేశము కేర్పర్చిన సమిష్టిపాలన (ఫిడరేషను) రాజ్యాంగంలో చేరుట కీరాజులు తగుమనమ్మాయని సిద్ధపడినారు. దానిసభలలో సంస్థానరాజులకు ప్రాధాన్యమిచ్చినారు. అక్కడి ప్రజలకు మాత్రం అసెంబ్లీలోగాని, కౌంసిలులోగాని ఒక్కప్రతినిధిస్థానమైన నీయలేదు. ప్రతినిధుల నియమించుటరాజుల యిష్టమేనట! క్రియలో వారి బోధకుడగుబ్రిటిషురెసిడెంటుయిష్టమేఖాయమగును. తమనిరంకుశపాలనలోఫెడరల్ ప్రభుత్వము కల్పించుకోకూడదట. తాముమాత్ర మఖిలభారతపాలనలో పాల్గొందురట. నిరంకుశభాగముకుప్రజాయత్తముకు కత్తుకలియదు; కనుక దేశీయ

రాజ్యాలనుండి ప్రజాసమ్మతప్రతినిధులే రావలె. అక్కడ ప్రజాయత్తత కావలె. భారతమొకేదేశము; కనుక, ప్రజాతంత్రకమును, సంస్థానరాజ్యమును రెంటిని కలిపే న్యాయమైన ఫెడరేషనుద్వారా సమిష్టిరాజ్య మేర్పడుటకు అహింసావాదు లొప్పుకోతగినదే. కాని సంస్థానరాజులు తమ రాజ్యపాలనలోను ప్రతినిధుల యేర్పాటులోను ప్రజలకధికారములేని పద్ధతినే ఫెడరేషను కొప్పుకొను చున్నారు. ఫెడరల్ ప్రభుత్వములోని సంస్థానప్రతినిధులు ప్రజలప్రతినిధులే అయితే అదినిజముగ ఫెడరేషనగును.

ప్రజాయత్తపాలన అనుశ్రుతమగు రాజ్యపాలనకు వ్యతిరేకమని కొందరన్నారు. కాని, మనప్రాచీనశాస్త్రములలో వేటిలోను రాజు యధేష్టముగ ప్రజల బాధింపవచ్చునని చెప్పలేదు. పూర్వము చాలప్రాంతములలో గణరాజ్యములు వగైరా ప్రజాతంత్రకములుండినవి. రాజత్వమున్నచోట్లను రాజు విద్వాంసులవల్ల న్యాయనిర్ణయము తెలుసుకొని ఆధర్మముప్రకారమే పాలించేవారు. ధర్మగ్రంథములను లోకశ్రేయపరులగు ఋషులు రచించేవారు దేశకాలానుసారముగ ఆ నిబంధనలు అనుభవశాలురగు లోకధర్మజ్ఞులు మార్చేవారు రాజులు ముఖ్యకార్యములు మంత్రిమండలి సలహాప్రకారమే చేసేవారు. ప్రజారంజనమే రాజధర్మము.† హానిలేకుండ ప్రజలను రక్షించుటే నిజమైన క్షాత్రము‡(ఇప్పటివలె) స్వసుఖముకొరకా, లోకులనిమిత్తము రాజుశ్రమపడుచుండినట్లు (దుష్యంతునిగూర్చి)కాళిదాసు వివరించినాడు*రాజ్యపాల

† రాజా ప్రకృతిరంజనాత్. (కాళిదాసుఃరఘువంశము.)
ప్రజాఃప్రజాఃస్వా ఇవ పాలయితా. ,, శాకుంతలం)

‡ క్షతాత్కిల త్రాయత ఇత్యుదగ్రఃక్షత్రస్యశబ్దో భువనేషురూఢఃక్షత్రస్యశబ్దో భువనేషురూఢఃక్షత్రస్యశబ్దో భువనేషురూఢ

నమునొక ధర్మమే కనుక రాజులు తమప్రజలకు ధర్మకర్తలుగనే పాలింపవలె. రాజులు ప్రజాప్రతినిధు లేర్పర్చు చట్టములు ప్రకారం ప్రజాసభల నాయకులద్వారానే వ్యవహారముల జరుపవలెను. ఈ రాజులందరు ఏ బ్రిటిషురాజుకు 'రాజభక్తి' చూపుచున్నారో ఆయనయు పైరీతిగనే పాలించుచున్నాడు కనుకను, ఇక్కడిరాజులు తమ 'సమ్రాట్టు'అగు బ్రిటిషురాజుకన్న యెక్కువహక్కులుకోరుట సబబుకాదు. 'రాజావిష్ణ్వంశికుడు, ఆయన అధికారము తగ్గింపకూడద'ని ఒకవాదము. 'నావిష్ణుః పృథివీపతిః' అనువాక్యము వీరికి ప్రమాణము కాని, ఇది పూర్వపు ధర్మశాస్త్రపుది కాదు, ఎక్కడను ప్రతిరాజుకుదైవాంశ యున్నదనుటకన్న విష్ణ్వంశ కలవాడే పృథివీపతి కాదగుననుటే దీనికి న్యాయమగు అర్థము (లేనియెడల జారుడు, కైజరు, హిట్లరును విష్ణ్వంశావారని తేలును) అనగ కేవలం ధర్మాత్ముడు లోకసంగ్రహపరుడునే రాజుగనుండవలెనని భావము. మరియు విష్ణువు ప్రజలందరిలో అంతర్యామిగనున్నందున, అట్టిప్రజాప్రతినిధియగువానిలోవిష్ణ్వంశముండును, కనుక అట్టివాడు రాజుకావలెనని యు భావన. వర్గసంఘర్షములవల్ల కాక ప్రచారము ఆందోళన నిర్మాణములవల్లనే సంస్థానముల ప్రభుత్వపద్ధతిని మార్చు నుద్దేశముతో ఇటీవల ముఖ్యరాజ్యములన్నిటిలో స్టేటు కాంగ్రెసు ప్రజామండలి బయలుదేరి పనిచేయుచున్నవి. ప్రజలలో అహింసాతత్వమును సంఘటనమును కల్గించుమని, ఈసంస్థలకు గాంధిమహాత్ముడు కాంగ్రెసు ప్రముఖులు సూచించగా, వారు అట్లే అహింసాప్రవృత్తిని నిర్మాణకార్యక్రమమును అవలంబించినారు.

ఈదేశీయరాజ్యములన్నిటిలో ప్రధానము (ఆంధ్రులకెక్కువ సంబంధించినదియు) నిజాంరాజ్యము. కనుక ఇందలి ప్రత్యేకసమస్యలు తెలియుట అవసరము. ఈ సంస్థానపు పరిమితి 82,698 చ॥ మైళ్ళు; జనసంఖ్య సుమారు 16 కోట్లు. దీనిపాలకులు 'నిజాం' అనబడు నబాబుగారు; పేరిసంస్థానపు సాలీనా ఆదాయము సుమారు 8½ కోట్ల రూపా

యలు. ఇదిగాక ప్రజలనుండి 'నజరానా' ఇతరభూములు వగైరాల ద్వారా ఇంకను చాల ఆదాయమువచ్చునట. మన నిజాంగారిప్పుడు ప్రపంచపుప్రధాన కోటీశ్వరులలో నొకరని ప్రతీతి. అయితే ఆసంస్థానపు సామాన్యప్రజలు మాత్రం దుర్భరదారిద్ర్యంలో మునిగియున్నారు.

వీరికి మైసూరు తిరువాన్కూరు బరోడా వగైరాలలోనున్న రాజకీయ పరిజ్ఞానము, విద్య, నాగరికత, వృత్తులు, లేవు. ఇట్లో 'ప్రధాన' రాజ్యము వెనుకబడియుండుట, అధికారులు కేవలం నిరంకుశంగా పాలించుట విచారకరము. ఆప్రజలలో రమారమి సగముమంది ఆంధ్రులు; తక్కినవారు కన్నడులు, మహారాష్ట్రులు, హిందూస్థానీలు వగైరాలు. వీరికందరికి సామాన్యభాష విద్యసంఘటనము లేక, ప్రజోద్యమము వెనుకబడినది. ప్రజలలో నూటికి 88 మంది హిందువులు; అయితే, నిజాముగారు ముస్లిముల విద్యావ్యాప్తివగైరాలకు ప్రత్యేకశ్రద్ధ వహించినారు; కనుక దామాషాను హిందువులకన్న ముస్లిములెక్కువ విద్యావంతులు, హిందూసంఘపుడిన్నతికి తగుప్రోత్సాహమియ్యలేదు. వారికి పెద్దయుద్యోగము లుండుట అరుదు. చిరకాలమిట్లు పాలించుటవల్ల జనులలో మూఢత్వము, మాంద్యము, నిరాశయు మూర్తీభవించియున్నవి. ఇటీవల కొంతఆందోళన చైతన్యము కలిగినవి.

ఇట్టిస్థితిలో ముస్లిములలో చాలమంది జాతీయతకువ్యతిరేకించిరి, నిజాంరాజ్యము ముస్లిం రాజ్యము అని వాదమారంభించినారు. ఇది 'బ్రిటిషు భారతరాజ్యము క్రైస్తవరాజ్యమను' వాదపుకీర్తిని నున్నది. ఇట్టి వారు సర్కారుపక్షమగుట సహజము. వారు జాతీయవాదులను ప్రతిఘటించగా, సాంఘికసంఘర్షము లారంభించినవి. ప్రస్తుతము సర్కారువారుకొన్ని సంస్కరణలిత్తుమన్నారు; స్టేటు కాంగ్రెసు ఉద్యమమును ఆరంభమందే అణచినారు. సమిష్టినియోజకవర్గము లుండునట, కాని సగంమంది సభ్యులు ముస్లిములేకావలెనట. మరియు, కేవలం ప్రదేశములనుబట్టి కాక, వృత్తులనుబట్టి నియోజకస్థానములట. ఈరీతిగా, వివిధ

మతస్థులు కులములు వృత్తులు వారిమధ్య విభేదము లేర్పడును; క్రైస్తవులు హిందువులు, జైనులు వగైరాలకు అసంతృప్తి కల్గినది. మరియు, సంస్థానంలో సగంమందికి తెలుగు మాతృభాష. అయినను కొద్దిమందికే మాతృభాషయగు ఉర్దూనే రాజకీయములకు వ్యవహార ములకు సర్కారు భాషగ చేసినారు. తెలుగు మహారాష్ట్రం వగైరాలకు తగుప్రోత్సాహము లేదు. ప్రజలకు వాక్స్వాతంత్ర్యము సభాస్వాతంత్ర్యము లేవు. కనుక అసంతృప్తి సంఘర్షము వివిధరూప ములుగ తలయెత్తి తుదకు హింసాతత్వము విజృంభించును. అందువల్ల రాజుకు ప్రజలకు కూడ నష్టమే. ప్రజలలో నిజమైన సాత్వికశక్తియు నిర్మాణకార్యవ్యాప్తియు జాతీయతయు ప్రబలినప్పుడు పాలకులు ప్రజాభి ప్రాయమును మన్నింతురని తోచును. అదిగాక, బ్రిటిషుప్రభుత్వము పైనను అహింసారూపమగు ఒత్తిడి కల్గినప్పు డీసమస్య సామ్యముగనే పరిష్కారమగును. ఇట్లు మనప్రాంతములకు దేశీయరాజ్యసమస్యకును సన్నిహితసంబంధ మున్నది. మరియు, చిన్నవి విడిరాజ్యములుగ నుండు టలో అర్థము లేదు. ఇవి జమీందారీలగుటయే శ్రేయస్కరము.

సంఘములో వర్గసంఘర్షపు మరికొన్ని సమస్యలు నున్నవి. అం దొకటి జమీందారీ సమస్య. జమీందారీలలో రయితులస్థితి కష్టముగ నున్నది. ఈవిషయమందును సామ్యవాదులు నిర్బంధముగ జమీందారీలన్నిటిని తొలగింపవలెనందురు. అట్లుగాక, ఇప్పుడు వారి కున్న అన్యాయపు అధికారములు శాసనరీత్యా తొలగించి, వారి 'భూస్వామి'త్వమును గూడ ధర్మకర్తస్థితికి తేవలెను. ఆదాయములో చాలభాగము ప్రజలనిమిత్తం వినియోగమగునట్లును భూముల నీటివం తులు వగైరాలు రయితులకు క్షేమకరముగను సాగించవలెనని, అట్లైన జమీందార్ల సుఖజీవనమునకును భంగముండదని, వారి దుబారాఖర్చులు దురభ్యాసములు మాత్రం తగ్గునని, అహింసావాదుల అభిప్రాయము. ఇట్లు ఉభయులకు సమన్వయమును మైత్రియు కలుగును.

పరిశ్రమలలో కార్మికసమస్యగూర్చియు ఇట్లే. సామ్యవాదులు మహా యంత్రపరిశ్రమలు కావలెనందురు; అయితే అవియన్నియు కార్మిక ప్రభుత్వపు వశమందుండవలెనందురు. రైళ్ళు గొప్పలోహపరిశ్రమలు, గనులు విద్యుచ్ఛక్తివగైరా కొన్ని దేశక్షేమము కవసరమగు గొప్పపరిశ్రమలవ సరమే. అవి వీలైనంతవరకు ప్రభుత్వపు అజమాయిషీక్రిందనే యుండ వలె. వ్యక్తులు సంఘములునడుపుచున్నను, వాటివ్యవహారములు కార్మి కులు వగైరాలకు దేశముకు క్షేమకరమగునట్లును, చేతిపరిశ్రమల నవి బాధించనట్లును కట్టుదిట్టమగు నియమములు విధించి, ఆప్రకారం సాగిం చవలెను. కార్మికులకు న్యాయమగు కనీసపుకూలి, సెలవులు, నిరు ద్యోగపుబీమా, విద్యాదిసౌకర్యములు కాపాడవలెను, అని అహింసావా దులందురు. 1931 లో కాంగ్రెసువారు (కరాచీలో) ప్రాతిపదికహక్కు ల తీర్మానంలో ఈసంగతి స్పష్టపర్చినారు. ఇప్పుడు సాగుచున్న నేషనల్ ప్లాంటింగుకమిటీ రిపోర్టులోను ఈపరిశ్రమలగూర్చిన వివిధసమస్యల శాం తపరిష్కారమునకు సూచనలు చేయబడుచున్నవి.

ఇట్లు వర్గసంఘర్షముకలిగే సమస్యలను శాంతముగా ఉభయ పక్షములకు సమన్వయకరముగ పరిష్కరించుటే అహింసావాదుల మతము. అదేస్థిరము న్యాయపరిష్కారము సగును.

25. వ్యక్తిసాధన

1. ఆహార నియమములు.

జనులు అహింసాపరులగుటకు జాతీయసాధనతోబాటు వ్యక్తులు తమదైనిక జీవితంలోను సాధనచేయవలెను. వ్యక్తుల సమూహమే సంఘము. వ్యక్తులు శ్రద్ధతో నిగ్రహము నలవర్చుకొని అహింసాపరులైనప్పుడే, జాతికంతకు అహింసాతత్వము వ్యాపించును, స్థిరపడును.

పూర్వఋషులు నిరంతరసాధనవల్లనే అహింసాపరులై లోకోత్తరమైన అద్భుతశక్తు లార్జించిరి. ఆయాచరణను గమనించి ఇప్పటిపరిస్థితులకు దగినట్లు మార్పుతో నిగ్రహసాధనకు యత్నింపవలెను. ఇందుకు తగినకృషి జరుగనందునవలనేఅహింసాతత్వమింకను వ్యాపింపలేదు. ఈనిగ్రహసాధనమార్గములలోన్నిటినిపరిశీలింతము. ఇందన్నిటిలో మొదటిది ఆహారనియమము. మనపూర్వకులేగాక, ఇప్పటి ఆయుర్వేదవైద్యులు, వైద్యశాస్త్రజ్ఞులు, మనశాస్త్రజ్ఞులు, నీతిశాస్త్రజ్ఞులు, ధార్మికులుగూడ దీనికి ప్రాముఖ్యమిచ్చినారు. ఆహారనియమమును గాంధిమహాత్ముడు తన దైనిక జీవితంలో చాలశ్రద్ధతో అవలంబించును; ఆయనలఘువగు సాత్వికాహారమును భుజించును. తన ఆచరణానుభవములను ఆయన హరిజన పత్రికలో చాలసార్లు తెలిపి, అట్లు జనులందరు ఆచరింపుమని ఉద్బోధించియున్నారు.

అందరికీ సరిగా ఒక్కేతిఆహారము కుదరదు. వారివారి దేహతత్వము అభ్యాసము అవకాశమునుబట్టి ఆహారములో మార్పులుండును. కాని, కొన్నిముఖ్యసూత్రములుమాత్ర మందరు అనుసరింపవలె.

జిహ్వాచాపల్యము వదలినప్పుడే ఆ యింద్రియముతోపాటు తక్కిన యింద్రియములును వశముకాగలవు. మరియు ఆహారతత్వము మనరక్తమునకు, నాడులకువ్యాపించును; వాటికిమనస్సుతోను హృదయంలోను సన్నిహితసంబంధమున్నది. ఆహారమే రక్తాదులుగమారి, దేహపు

వివిధాంగముల పునర్నిర్మాణముచేయును. వీటినంటియే, మెదడు హృదయము గూడ పరిణామమొందునుగదా. అన్నపుప్రాధాన్యమును వేదములందును ప్రశంసించిది. జ్ఞానసంపాదనకు మోక్షమునకును ఆహారశుద్ధియవసరమని ఉపనిషత్తులలోస్పష్టపర్చినారు †భగవద్గీతలోనుయుక్తాహారవిహారులకు యోగము సిద్ధినుండుననన్నారు*

గీతాకారులు ఆహారము మూడువిధములని విభజించి, అందు సాత్వికాహారమే క్షేమకరమని ఆయురాదివర్ధకమని సుఖకరమని స్పష్టపర్చినారు; స్నిగ్ధమై, పాకువై స్థిరమై హృద్యమైనవే సాత్వికాహారములన్నారు ‡పులుసు కారము ఘాటు, గల్గి ఉద్రేకము శోషణమునిచ్చునవి రాజసములు; అవి దుఃఖము, బాధ రోగము గల్గించును. ఇట్లేమాంద్యము మత్తుగల్గించునవి నిలవయుండిచెడునవి తామసములు, అధమములు. అహింసను వైనిప్రకృతిని కోరువారు సాత్వికాహారమునేగ్రహింపవలెను.

§పులుపులో రక్తమును విరుచుగుణమున్నది. కారము, పొగాకు దేహములోమంటను శోషణమును గల్గించును కనుక, వాటిని మనవైద్య

---

† అన్నం బ్రహ్మేతివ్యజానాత్...(తైత్తి)...
ఆహారశుద్ధౌ సత్వశుద్ధిః సత్వశుద్ధౌ ధ్రువాస్మృతిః
స్మృతిలాభే సర్వగ్రంధీనాం విప్రమోక్షః (ఛాందోగ్యోపనిషత్తు)

* అన్నాద్భవంతి భూతాని.....
యుక్తాహార విహారస్య...యోగోభవతిదుఃఖహా(గీత.....)
అధశ్యస్య నిశ్చత్వాసు విశుద్ధం హృదయం భవేత్
ఆహారశుద్ధౌ చిత్తస్య నిశుద్ధిర్భవతి స్వతః. (పాశుపతబ్రహ్మోపనిషత్)

‡ ఆయుస్సత్వ బలారోగ్య సుఖప్రీతి వివర్ధనాః
రస్యాః స్నిగ్ధాః స్థిరాహృద్యా ఆహారాస్సాత్వికప్రియాః.

§ కట్వామ్లలవణాత్యుష్ణ తీక్ష్ణ రూక్ష విదాహినః
ఆహారారాజసస్యేష్టాః దుఃఖశోకామయప్రదాః
యాతయామం గతరసం పూతిపర్యుషితంచ యత్
ఉచ్ఛిష్టమపి చామేధ్యం ఆహారం తామసప్రియం. (గీత.)

శాస్త్రజ్ఞులు యోగాభ్యాసపరులు గూడ నిషేధించినారు. ఇంతకన్నవిశేషము పులుపు కారము లెక్కువ తినుటవల్ల నాడులం దుద్రేకమేర్పడును; అంతట మనస్సుకునిదానమును హృదయపు నిర్మలత్వమును చెడును. ఉద్రేకము కోపము హింసాబుద్ధి పరస్పరద్వేషము నేర్పడును. రాజస తామసాహారములవల్ల దేహాంగములలో సంఘర్షముగల్గి, అందలి ఫలితముగ కామక్రోధమదమాత్సర్యాదులు వృద్ధియగును. ఇట్లువ్యక్తులకైన క్లేశ, హెచ్చుమంది రాజసతామసాహారము తినేయెడల, ఈదుర్గుణముం డే సంఘములో పరస్పరద్వేషము హింసాతత్వము రూపముగ వ్యక్తమగును. సాత్వికాహారము అలవర్చుకోనివారు అహింసా పరులైనట్లున్నను, దానిని సరిగా ఆచరింపలేరు. కనుకనే ఋషులు యోగులునేగాక, గాంధిమహాత్ముడు ప్రపుల్లచంద్రరాయ్ ఇంకను చాలమంది ప్రసిద్ధమహానీయులు సాత్వికాహారమునే పాటించుచున్నారు.

ఈసిద్ధాంతప్రకారం పరీక్షించితే మనప్రస్తుతపు ఆహారపద్ధతిసిచాల సంస్కరింపవలెనని స్ఫురించకమానము. మిరపకాయ, ఆవ, చింతపండు, గోంగూర వగైరాలు విశేషముగ మనవారు వినియోగించుచున్నారు. మిరపకాయను మనప్రాచీను లసలేవాడలేదని తోచును. *మనలో ఆవకాయ గోంగూర వగైరాపచ్చళ్ళు నిత్యాహారంలోజేరినవి. దక్షిణంలో మిరియమునే హెచ్చుగ వాడుదురు. ఉత్తరమందుకారముకుబదులు తీపినస్తఫలయలవాటు హెచ్చు. బెంగాలులోమాత్రం ఆవభూటును ఇక్లే ఆజనులలోఉద్రేకతత్వమును హెచ్చు. జనులలో హింసాతత్వము వ్యాపించియుండుటకు కొంతవరకు మనఆహారవిహారములలోని లోపములు కారణము కావచ్చు. అహింసాసక్తులందరును వెంటనేమనసంఘపు ఆహారంలోసంస్కరణచేయుట యుక్తము. అన్నము కూర వంటలో గంజినీరు వార్చివేయు

* పూర్వపుసంస్కృతవాఙ్మయంలోను ప్రాచీనద్రవిడ భాషలలోగూడ మిరపకాయ అర్థమిచ్చుపదములులేవు. మిరియపుపేరు మిరపకాయకును వచ్చెను. మరీచి మిళకు అనునదియు మిరియమునకే ఉద్దేశించినవి.

అభ్యాసమును నష్టకరము. అంతశ్శక్తిని ఆరోగ్యమును బాగుపర్చు ఆహారము నేతిని అభ్యాసమును వృద్ధిజేయవలెను. మరియు మనుష్యులదేహములో ద్రవభాగము హెచ్చు; కనుక (ముఖ్యముగ ఉష్ణప్రాంతమందు) ద్రవాహారము నెక్కువవాడిన, దేహాంగములందు సంఘర్షము ఉద్రేకమును లేకుండును. ద్రవాహారము సులభంగాజీర్ణమై త్వరలో రక్తముగ పరిణమించును.

మనయభ్యాసములలో మరికొన్నిటిని కూడ గమనింతము. మాంసాహారమునిజము హానికరమని మనపూర్వికులందరును శాసించినారు. పాశ్చాత్యులలో మాంసమునిను వాడుక యున్నను, దానికన్న శాకాహారమే మంచిదని వారిలోను ఈకాలపుకొందరు వైజ్ఞానికులు ఘన వైద్యులు, బెర్నర్డుషావంటి విద్వాంసులుగూడ స్వానుభవముతో తెల్పి యున్నారు. ముఖ్యముగ మనయుష్ణదేశములో మాంసాహారము హానికరము. మద్యము కేవలం తామసము బాధకమునని అందరికి తెలిసినదే.

పూర్వము కొందరార్యులు యజ్ఞయాగములందును అతిథుల నిమిత్తమును జంతుమాంస మర్పించినట్లున్నది. కాని త్వరలోనే మరల మద్యమాంసములు అయోగ్యములని స్మృతికారులు నిర్ణయించినారు. మాంసాశనంవల్ల జీవహింస హెచ్చుటేగాక మాంస పోషితమగు దేహమనస్సులందుజంతుతత్వముండుటయు నిజము యథార్థముసకు నరజాతి అసలు జీవపరిణామములో 'పైరేమేటు' (ప్రథమశాఖది.) ఇది సౌమ్య జాతి. ఈశాఖలోని కోతులు వగైరాలు నేటికిని శాకాహారులే మరియునరులదంతములు ఫలశాకములభోజనముకే తగినవి. పులులు, కుక్కలు వగైరాలకున్నట్లు మాంసము కొరుకుటకు చీల్చుటకు పెద్దకోరలు గొప్పగోళ్ళు లేకుండుటనుబట్టియు, నరులు మాంసాహారుల గుట సృష్టిసంకల్పము కాదనియు, పండ్లను, ధాన్యాదులు, అన్నమున, దుంపలు, కాయగూరలను దినుటే సహజమనియు, ప్రసిద్ధజీవశాస్త్రజ్ఞులు

తేల్చినారు. మరియు మొత్తంమీద శాకాహారులధీశక్తి హృదయము మాంసాహారుల వాటికన్న ఉత్తమములు.

ఆహారము మంచిదేగాక మితముగ నుండవలె. దేహపోషణకవసరమైనదానికంటె హెచ్చుగ కేవలం రుచికని తినుట దురభ్యాసము. అందువల్ల అన్నకోశము బలువెక్కి ఆయాసమై నాడులకును శ్రమ కల్గును; మరియు తిన్నదానిలో కొంత జీర్ణముకాక తిత్తులలో చిక్కుకొని, దేహంలో మంటను ఉద్రేకమును వ్యాధులను గల్గించును; జీర్ణమైనను హెచ్చు కండపెరుగుటయు ప్రశస్తముకాదు.

అహింసాదృష్టినేగాక, ఆరోగ్యమునకును మితభోజనమే మంచిదని వైద్యశాస్త్రజ్ఞులు ఆరోగ్యవిజ్ఞులును తెల్పియున్నారు†అన్నకోశములో నగముకుసరిపడు భోజ్యములే తిని, $\frac{1}{4}$ వ వంతుకు నీరుత్రాగవలెనని, శేషించిన $\frac{1}{4}$ వ వంతు వాయుసంచారమునకువదలవలెనని, వైద్యాచార్యుల మతము. †అతిభోజనమును అభోజనమువలె హానికరమని, దుఃఖకరము పాపకార్యమనియు శాస్త్రవచనములున్నవి* నరులు 'కడుపునిండ బాగా తినవలె; జీవించుట తినుటకే' (Live to eat) అని కొందరందురు. కాని యిదివిషయములోలతను వృద్ధిచేయునది, అహింసాతత్వమునకు వ్యతిరిక్తము. దీనికన్న "జీవించుటకే తినుట" (eat to live) అను సిద్ధాంతమే న్యాయసమ్మతము.

అప్పుడప్పుడు ఉపవసించుటయు మంచిది. మితాహారులకును మిత్రులతోసహా పంక్తివిరాలలో అతిభోజనము జరుగుచుండును. కనుక, పక్షముకొకరోజు లేదా వారముకొకపూట ఉపవసించి, అన్న

---

† ఋతేర్భాగద్వయం భోజ్యైః తృతీయే వారిపూరయేత్ ॥ వాయోస్సంచర ణార్థాయ చతుర్థ మవశేషయేత్. (సుశ్రుతం)

* నాత్యశ్నతస్తు యోగోఽస్తి నచైకాంతమనశ్నతః । తుల్యాహారవిహారస్య యోగో భవతి దుఃఖహా (గీత).

అనారోగ్య మనాయుష్య మస్వర్గ్యం చాతిభోజనం । అపుణ్యం లోకవిద్విష్టం తస్మాత్తత్ పరివర్జయేత్ (మనుస్మృతి)

కోశముకు మనస్సుకుగూడ విశ్రాంతినిచ్చుట, అప్పుడీశ్వరుని భజించుట, భౌతికముగ, మానసికముగ, (ఆధ్యాత్మికముగను) మంచిది. ఏకాదశి, శనివార వ్రతము మాసశివరాత్రి, ఇత్యాదులం దీసూత్రమిమిడియున్నది. ఉపవాసము చికిత్సకమని, 'లంఘనం పరమౌషధం' అనియు, వైద్యశాస్త్రజ్ఞులు చెప్పినారు. మితభోజనములోను కొంత అట్టి సుగుణమున్నది. హృదయశాంతికి పరిశుద్ధికిగూడ ఉపవాసముమంచిది. దేశమందు సాంఘికహింస రాజకీయప్రమాదము. ఇట్టివితటస్థించినప్పుడు హింసాభావము చెలరేగకుండ హృదయశాంతి సంపాదించుటకై గాంధిమహాత్ముడు అప్పుడప్పుడు దీర్ఘోపవాస మొనర్చుటకలదు†

మనదేశము చాలబీదది. చాలమందికన్నము దొరుకుటే కష్టము; కనుక పాలు వెలగలపండ్లు ఆరోగ్యదములైనను, చాలమందికవి దొరకవు. బీదలకును దొరకు ఆరోగ్యవస్తువులనుగూర్చి ఇటీవల గాంధిమహాత్ముడు దీర్ఘంగా పరిశోధించి కొన్నిసంగతులు కనిపెట్టినారు. కొన్ని చౌకరకపు నారింజ కమలాలవంటి పళ్లును చిక్కుళ్ళవంటి కూరగాయలును కొబ్బరి వేరుసెనగకూడ హెచ్చుకిమ్మతు వస్తువులకన్నను చాల పుష్టిని ఆరోగ్యమును గల్గించును. అయితే, వాటినుడికించి నీరువార్చియు కాల్చియు తయారుచేయుటలో పాడుచేయుచున్నామని ఆయన కనిపెట్టినారు. మరియు, తోటకూర బచ్చలకూరవంటి ప్రతిగ్రామంలో సులభంగాదొరుకు వాటిని, హెచ్చు పులుసు కారం చేర్చకయు, వాటి ఉడుకు నీరువార్చకయు, అవసరమైతే పరిమళవస్తువులతో చేర్చి చాల రుచ్యముగ చేయవచ్చును. అవి దేహమునకు చాలమంచివి. ఇట్లు గ్రామస్థులు చౌకగనే ఆరోగ్యకరము సౌమ్యమునగు భోజనము చేయవచ్చును. ఇట్టి యాహారము అహింసా వర్ధకము నగును.

---

† 1922, 1924 లలో సాంఘికహింసగర్జితమప్పుడు 1932లో బ్రిటిషుప్రధాని వారిజన సంఖ్యమును వేరుచేయజూచి నప్పుడు 1938 లో మరల ఆయనజరిగించిన యుపవాసములట్టివే.

ఇట్లే మరబియ్యము ఫాక్టరీపంచదార వగైరాలపద్ధతివల్ల, ఆవస్తువుల జీవశక్తిచెడును; వాటిని తినువారు పైకిపుష్టిగ కనుబడినను రోగయుతులగుట చూచుచున్నాము దంపుడుబియ్యముబెల్లము ఇత్యాదులు దేహపు జవసత్వములను సౌమ్యతను హెచ్చించును. తామసాభ్యాసమువల్ల యహంకారమును వానిద్వారా దౌర్బల్యమును అశక్తతయు ముక్కోపితనమును హెచ్చును. చుట్టగాల్చి నప్పుడు వచ్చుపొగ చుట్టునున్న మంచిగాలిని చెరుపును; దాని దుర్గంధమును వాయువులో చేరును; కనుకనే చుట్టవాసనను ఆఘ్రాయువును కాల్చువాఁతోపాటు చుట్టుపట్లనున్నవారును అనుభవించవలె. అభ్యాసమైనవాఁకి తెలియకున్నను, ఇది నిజంగా బాధకమే పొడుముపీల్చుటలో ఇట్టి బాధలు లేవు. కాని పొడుమును పొగాకుపొడియే నాసారంధ్రముద్వారా లోని కెక్కి మెదడుకుద్రేకముగల్గించును; ముక్కుకు సహజంగాఉండే వాసనశక్తిని చెరుపును; ఇది ఉత్తేజకము కనుక లాభకరమని కొందరెంచుదురు; కాని అదిభ్రమ. నల్లమందు, చుట్ట వలె పొడుము అభ్యాసమును విడువలేక, అది ఉపయోగకారియని జనులనుకొందురు. పొడుము చుట్టకూడ ఇటీవల మనలో శ్రోత్రియులును స్త్రీలు పిల్లలుకూడ వాడుచుండుటవిచారకరము ఇట్టి దురభ్యాసములు తమతోపోక పిల్లలకు వ్యాపించును. కొన్ని యితర సూచనలు:—తలంటుకొనెడు నూనె వగైరాలు మంచివిగ నుండవలెను. కుంకుడుకాయలరసము మంట గల్గించునని తెలిసినదే; అది చర్మముకు నాడులకును హానికరము. చానికన్న శీకాయయు, అంతకన్ననుబావంచాలపిండియు, సున్నిపిండియు, తలఒళ్ళురుద్దుటకు ఎక్కువ మంచివి. కుంకుడురసము తలను శుభ్రపర్చినను మెదడుకు నిర్మలత్వమీయదు. ఇట్లే ఆహారవిహారములన్నిటిని పరిశోధించి, సాత్వికములు క్షేమకరములు అగువానినే వాడుకోవలెను. ఇవి అహింసాతత్వముకు సాధకములు.

26. ఉచిత వ్యాయామము.

అహింసావరులు దేహపరిశ్రమరూపమగు వ్యాయామము చేయ దగునా ? అనుప్రశ్న యిటీవల ప్రాముఖ్యమునకు వచ్చినది. సాంఘిక తత్వమునతో తమమతపువారి ప్రాబల్యము నెమ్మెన కాపాడదలచువారు ప్రత్యేకపు వ్యాయామశాల లేర్పర్చి, కసరత్తు, కర్రతిప్పుట, కత్తిసాము ఇట్టివాటి నభ్యసించుట కలదు. కొన్ని ముస్లింసంఘములు, తాలింఖానాలుపెట్టినారు ('తాలింఖానా' అనగావిద్యాశాల; కాని వాటిలోభౌతికబలవృద్ధికేప్రాముఖ్యమిచ్చుచున్నారు.)ముస్లింలీగువారి సానుభూతితో ఇటీవల దేశమంతట వ్యాపించిన ఖాక్సరుసంఘములు బెల్చాలను తవ్వుకోలలవంటి పొడుగు ఇనుప ఆయుధములు ధరించి పటాలములవలె వీధులలో తిరుగుచు నియంతృపద్ధతి ననుసరించుచు, ముఖ్యమైనమసీదులు వశపర్చుకొని దౌర్జన్యపద్ధతు లారంభించినారు. ఇందువల్ల లాహోరు వంటి కొన్నిముఖ్యపురములలో హింసాచర్యలు రక్తపాతకములును కల్గినవి. వీరి భౌతికబలప్రదర్శనము హింసాధోరణి కొన్నిహిందూ సంఘాలకు భీతిని గల్గించినది. దౌర్జన్యముతో హిందువులను ముస్లిములుగ జేయుటకు 'ముస్లింపునరూపాంతు'ను వ్యాపింపజేయుటకు గూఢయత్నముల జేయుచున్నారని సూచనలు వచ్చినవి. అంతట కొన్నిచోట్ల హిందువులును 'శక్తిదళ'ములు 'వానరసేనలు' స్థాపించి, భౌతికబలములోను కవాయతులోను యువకులను తయారుచేసినారు. ఇట్లు పరస్పరం అనుమానపడి ఒకరినొకరు డీకొనుధోరణిలో దిగినారు. ఇటీవల పంజాబు. ఢాకా, బొంబాయి, అహమ్మదాబాదు వగైరాలలో 'హిందూ ముస్లిముల అల్లరులు', కూనీలు, దోపిడులు జరిగినవి. వీటిలో గుండాలే హింసాచర్యలు చేయుచున్నను, వీరికెనుక సంధానము చేయువారున్నారని సూచనలు కల్గినవి.

ఇట్టి స్థితిజూచి, సాంఘికతత్వపు వ్యాయామశాలలలో అహింసావరులు కాంగ్రెసువాదులు పాల్గొనకూడదని గాంధిమహాత్ముడు సూచిం

చినారు. మరియు, రాజకీయమోక్షముకై భౌతికబల ముపయోగించుటకు కొందరి కుద్దేశ మిదివరలో కలిగినది. అయితే ప్రభుత్వంవారు భారత జాతినంతను (మొత్తంమీద)నిరాయుధులుగ జేసియున్నారు. ఆయుధము లను జనులు తెచ్చుకోకుండగను వాడకుండను చట్టంద్వారా కట్టు దిట్టములు చేసినారు. కనుక యీయువకులు రహస్యంగా పిస్తోలులు వగైరాలు సంపాదించి వాటి ప్రయోగము కల్గించిరి; ఆయుద్యమము విఫలమైనదని చూచియున్నాము.

ఇట్టి స్థితిలో మనదేశపు అహింసాపరుల కర్తవ్యమేమి ? అహిం సాపరు లందరును నియమితముగ వ్యాయామము చేయదగు నని యే తోచును. ఆరోగ్యమును ధైర్యమును అహింసా వృద్ధికి అత్యా వశ్యకములు గదా ! అట్టిని సామాన్యశక్తియు నీరోగతయు నున్న ప్పుడే కల్గును. ధర్మసాధనకు కర్మయోగముకు శరీరారోగ్యపురక్షణ ముఖ్యము. అహింసాసాధన కవసరమగు నిగ్రహమును నాశల స్థైర్య మును వశీకరణమును వ్యాయామంద్వారా సాధింపగలము. సకాలంలో ప్రతిరోజు వ్యాయామముచేయుటవల్లనే ఆరోగ్యము నిగ్రహధైర్యము లును సులభసాధ్యములు. సరియైన వ్యాయామమువల్ల దేహకాంతి, ఆకలి, చురుకుదనము, స్థైర్యము ఓపిక, సహనశీలత, మంచి ఆరోగ్యము ను కల్గునని శాస్త్రజ్ఞులును చెప్పినారు.* అనగా అట్టిగుణము లిచ్చునదే సరియైన వ్యాయామము. వ్యాయామపద్ధతులలో చాలరకములు కలవు. పాశ్చాత్యసంప్రదాయపు డంబెల్సు వగైరా పద్ధతులు కేవలం భౌతిక శక్తిని కండను పెంచి హింసాపరత్వమును తీవ్రతను గల్గించును; అందు వల్ల భౌతికంగా అధికారం చలాయించు వాంఛయు హెచ్చును. అట్లుగాక

* శరీరోపచయః కాంతిః గాత్రాణాం సువిభక్తతా ।
దీప్తాగ్నిత్వ మనాలస్యం స్థిరత్వం లాఘవం మృజా ।
శ్రమక్లమ పిపాసోష్ణ శీతాదీనాం సహిష్ణుతా ।
ఆరోగ్యంచాపిపరమం వ్యాయామా దుపజాయతే. (చరకసంహిత.)

మితముగ దేహపరిశ్రమ గల్గించి నిగ్రహమును ఇంద్రియవశీకరణమును పరోపకారబుద్ధిని మనస్సామ్యతను ఆంతరిక తేజస్సును గల్గించునవే ప్రశస్తములు. రాటముపైన సంధ్యవేళలందు రోజును నూలు దీయుట మొదలగు గృహపరిశ్రమలు స్త్రీపురుషులందరికి ఆరోగ్యము కవసర మగు పరిశ్రమ నిచ్చును; అవి హృదయరంజకములు, నిగ్రహశక్తి గల్గించునవి, సమత్వబుద్ధిని జనింపజేయునవి, అనగా త్రికరణములకు కృషినిచ్చి సమన్వయించునవి.

అట్టి పరిశ్రమ పాశ్చాత్యుల వ్యాయామమువలె కాక, ఆర్థికముగను ఉత్పాదకము, ఉపయోగకరము, ఆత్మవికాసకరము. కనుక, అహింసాపరు లిట్టిసమన్వయకరమగు పరిశ్రమను సాగించదగును. ప్రతిదినమును (ముఖ్యంగా ఉదయవేళ) నడచుటయు ఆరోగ్యకరము. ఆయా జనుల ఆవశ్యకతనుబట్టి దూరము నిర్ణయించుకోవచ్చు; అందువల్ల పరిశ్రమగల్గును; ఊరిబయట ప్రశాంతస్థితిలో సూర్యకిరణములు తగులు నట్లు నడచుట గాంధిగారి కభ్యాసము. ఆయన ప్రతిరోజును నూలు వడుకును; ఆయన 'దుర్బలు'డైనను మంచి ఆరోగ్యముగల్గి ఇంగ్లండులో అతిశీతమును ఇక్కడి మండువేసవిలో అత్యుష్ణమును సహించుచు, ఎల్లప్పుడు నిరంతరదీక్షతో ప్రజలకై పనిచేయగల్గినారు.

సూర్యకిరణములు మంచిఆరోగ్య మిచ్చును. భూమిమీదనున్న శక్తియు జీవకళ అంతయు ప్రత్యక్షంగానో పరోక్షంగానో సూర్యకిరణములనుండియే కల్గును. అట్టిసూర్యకాంతి ఉదయమే దేహంపైన స్వీకరించి దాని ననుభవించుట లాభకరము. భగవంతుని త్రిమూర్తిత్వము అనగా సృష్టిస్థితి లయశక్తి సూర్యబింబములో నిబడియున్నది. కనుక ప్రతిరోజును సంధ్యావందనము సూర్యనమస్కారములు చేయుటలో ఆధ్యాత్మికతతోబాటు దేహపరిశ్రమయు చేయుచున్నదని పెద్దలభావము.

పూర్వు లేర్పర్చిన మరొక దేహపరిశ్రమ యోగాభ్యాసము; ఇది మూడు విధములది; హఠయోగము భౌతికము; వివిధమైన ఆసనముల వల్ల దేహంలోని వివిధాంగములకు చెమటపట్టి పరిశ్రమ గల్గుటేగాక,

అవి యన్నియు వశమై, హృదయముకు ఆత్మకు పీటిపైన క్రియాత్మకమైన ఆధిపత్యము చేకూరును, నాసారంధ్రాములద్వారా జలముగ్దాదులు పీల్చుటవల్ల ఇంద్రియములును శుభ్రపడి వశమగును; ఇట్లు జ్ఞానకర్మేంద్రియములన్నియు శుద్ధమై, లోపల సంఘర్షము ఉద్రేకము పోవును.

మరియు, దేహంలో ఆయూనాడులకు కూడలియగు కేంద్రస్థానములున్నవి. కుండలినీయోగాదులవల్ల ఇట్టికేంద్రములద్వారామనోహృదయములును దేహికి వశమగును. అట్టి మహాయోగులకు అతీంద్రియ శక్తులునుగల్గునని, వారుభూమినుండి తమంతటపైకిలేచి, భౌతికాధారము లేకుండ గాలిలో సంచరించగల్గుదురని, చెప్పుదురు. జ్ఞానయోగము బుద్ధికి ఆధ్యాత్మికతకు సంబంధించినది. ఈశ్వరతత్వము జీవాత్మ వీటికి ప్రకృతికినుండు సంబంధము జ్ఞానసంపాదనము వీటివివరణము జ్ఞానయోగములో కల్గును.

ఇక మూడవదగు రాజయోగము పైరెంటికి సమన్వయమునది గును. ఇందులో యమనియమాసన ప్రాణాయామాది అష్టాంగముల ద్వారా దేహము మనస్సు హృదయము కూడ నిగ్రహముకు లోబడి, అన్నమయము, మనోమయము, ఆనందమయము ఈమూడు కోశములకు పూర్తియగు సమ్మేళనము జరుగును. అప్పుడు ప్రకృతి రహస్యములు తెలిసి దివ్యజ్ఞానము లభించును. ఈశ్వరప్రణిధానము జీవన్ముక్తిగూడ కలుగును. ఈరాజయోగపు మొదటి మెట్లులోనే అహింసాభావముకు ప్రత్యేకస్థాన మిచ్చినారని యిదివరలో చూచియున్నాము * కాని ఈయోగశాస్త్రపు ప్రక్రియమొతయు అహింసాసిద్ధాంతముపైనే నిర్ణీతమైనవి. త్యాగులు, దయాళుప్రభువులు, లోకహితపరులు అగు వారికి యోగముద్వారా అతీంద్రియశక్తులు బాగుగ లభించును. స్వార్థపరులకు ఆసురతత్వపరులకు ఇవి ఒకవేళతాత్కాలికబలమున అబ్బినను స్వలాభోద్దేశముకు హింసాకార్యముకు వినియోగింపదలపగనే, ఆతపశ్శక్తి యంతయు హరించిపోవునని యీ శాస్త్రములో విధించినారు.

* 1 వ భాగం. 149 వ పుట చూడుము.

27. బ్రహ్మచర్యము.

అహింసాసాధనకు బ్రహ్మచర్యమును ముఖ్యాధారము. భారతీయ సంస్కృతిలో పూర్వము బ్రహ్మచర్యముకు ప్రాముఖ్యమిచ్చి నారు.

సంస్కృతంలో 'బ్రహ్మ'శబ్దముకు ('చర' ధాతువుకుగూడ) చాల అర్థములున్నవి. 'బ్రహ్మచర్య'పదమును ముఖ్యంగా 3 అర్థము లలో వాడినారు. 1 ఈశ్వరప్రార్థన 2 వేదసారమగు ఉన్నతవిజ్ఞాన మభ్యసించుట 3 స్త్రీసంగమపు విసర్జన. అహింసాసిద్ధాంతప్రకారం ఈ మూటికిని పరస్పరసంబంధమున్నది. కాని, ఈకాలమందు ఈమూడవ అర్థంలోనే ఈపదము రూఢమైనది. అనగా త్రికరణశుద్ధితో స్త్రీపురుష సంయోగమును నిగ్రహించి వీర్యరక్షణచేయుటే బ్రహ్మచర్యము.†

అయితే, బ్రహ్మచర్యపుఉద్దేశము సంయోగమెవరికిని అసలే కూడ దని కాదు. ప్రకృతిలో జీవజాతులవృద్ధికి స్త్రీపురుషసంయోగమవసర ము. ధర్మముకై సాధకమగు కామమునుమంచిదే. అది అవసరమైన సంతా నము లభించుటకే ఉద్దేశింపబడినది. సాధారణంగా జంతువులును కొన్ని నియతకాలములందే సంయోగమొందును; గర్భోత్పత్తికాగనే మానివే యును. ఇంద్రియలోలతకు వ్యసనముకు సంగమము చేయుట తప్పని శాస్త్రోద్దేశము.

సంతానముకును మితము తప్పకూడదు. భూమిపైన జంతుజాతు లకు, ముఖ్యంగా నరజాతికి లభించుస్థలమును ఆహారాదులును మితములు. అన్నిప్రాంతాలలో వివిధమగు నరజాతులు వృద్ధియగుట యీశ్వరసంక ల్పము. అట్టిస్థితిలో మితిలేకుండ సంతానవృద్ధియగుటవల్ల జనసంఖ్య వివ రీతముగ హెచ్చున్నది. ఇప్పుడు భూమిమీద సుమారు 200 కోట్ల నరు

---

† బ్రహ్మచర్యప్రతిష్ఠాయాం వీర్యలాభః (యోగదర్శనం)
కాయేన మనసావాచా సర్వావస్థాసు సర్వదా
సర్వత్ర మైథునత్యాగం బ్రహ్మచర్యం ప్రచక్షతే (యాజ్ఞవల్క్యస్మృతి)

లున్నారు. జనులసంఖ్య దినదినమును పెరుగుచున్నది. కొన్నిప్రాంతాలలో జనాభా దట్టమగుటవల్ల ఆప్రాంతంలో వృత్తులు ఆహారము అందరికి చాలక జనులకు నిరుద్యోగబాధ కల్గినది.

ఇట్లు జనసంఖ్య వృద్ధికి మితిలేకపోటవల్ల కొన్ని క్లిష్టసమస్య లేర్పడినవి. కొన్నిప్రాంతాలలోని క్షామమునకును ఆయానాగరికజాతులమధ్య సంఘర్షమునకును ముఖ్యంగా యూరపులో సాగుచున్న ఘోరయుద్ధములకును యూరపుదేశాలలో శ్వేతజాతుల జనసంఖ్య విపరీతముగ వృద్ధియగుట ముఖ్యకారణమని కొందరి అభిప్రాయము. ఇప్పుడు 'ఆక్సిసు'వర్గమనబడుజర్మనీ, ఇటలీ, జపాను ఈమూడుదేశాలలోను గత 40 ఏండ్లలో జనసంఖ్య విపరీతముగ పెరిగినది. అందువల్ల స్వదేశములోని స్థలమును ముడివస్తువులను ద్రవ్యమును చాలవనియు వలసదేశములు వ్యాపారస్థలములు గావలెననియు వాదించుచు, ఆజాతులవారు లోకువయైన ప్రక్కదేశాల నాక్రమించుటకు యత్నించి, ఆపనిని దౌర్జన్యముతో సాధించుటకు యుద్ధసన్నద్ధులైనారు. బ్రిటిషు వారిదివరకే కొద్దిజనసంఖ్యగల ఉత్తరఅమెరికాను దక్షిణాఫ్రికాను ఆస్ట్రేలియా ఇత్యాదులును ఆక్రమించి, వాటిని వలసరాజ్యాలుగ చేసుకొన్నారు. బ్రిటనులోని పెచ్చుజనాభా ఆయావలసరాజ్యాలలో సరుకుకొనుచు, అచటి ఆదిమనివాసులను చిరకాలమునుండియున్న భారత దేశీయులను అణచి, బాధించుచున్నారు; మరియు భారతదేశానులనుండి వస్తువులదెచ్చుకొని, తమయాంత్రికపుసరుకు లక్కడదింపి, ఆదేశములసంపత్తు లాగి, బాగుపడుచున్నారు. చీనావిషయంలో జపానును ఇట్లే చేయుచున్నది. ఇట్లెల్ల కాలము సాగదు. ఇప్పుడు జ్ఞానముకలిగి, సంతానము తగ్గించవలెనను భావము యూరపీయుల కేర్పడినది.

అయితే సంతాననిగ్రహముకని సంయోగనిగ్రహముకు బదులువారు కృత్రిమసాధనము లారంభించినారు. స్వేచ్ఛాసంయోగముచేయుచునే కొన్నిపరికరము లుపయోగించి వాటిమూలమున గర్భోత్పత్తిని తప్పించు

మార్గములు కనిపెట్టినారు. ఈయంత్రసాధనము లిప్పుడు ఫ్రాంసు అమెరికా కాలలో, కొంతవరకు బ్రిటనులోను, మరికొన్ని దేశాలలోను, నవనాగరికతతోబాటు వ్యాపించుచున్నవి. ఈసాధనములున్నను సకృత్తుగ గర్భోత్పత్తి కావచ్చును. అదిగాక, ఈపద్ధతి పాశ్చాత్యసంస్కృతికే తగియున్నది. ఇందువల్ల అక్కడిస్త్రీపురుషులలో పశుతత్వము విషయలోలత విచ్చలవిడివిహారము హెచ్చినవి, రాజసధోరణి ప్రబలినది. ఈపద్ధతివల్ల జననేంద్రియములకు నాడులకు ఉద్రేకము హెచ్చును. ఇది ప్రకృతికిని విరుద్ధమని తెలిసినదే. మనదేశంలోను జనసంఖ్య పెరుగుచున్నది మన దేశము విశాలమైనను, ఇప్పుడున్న జనులకును కడుపునిండ తిండియు ఒంటికిబట్టయు త్రాగనీరును లేక కోట్లకొలదిజనులు బాధపడుచున్నారు. ముఖ్యంగా బీదజనులలో జనసంఖ్య వేగముగ హెచ్చుచున్నది. మరియు యూరపులోకంటె మనదేశంలో దామాషాను జననములు మరణములు కూడ చాలహెచ్చు. అందువల్ల జనులఆరోగ్యము త్వరలో క్షీణించును.

సంతానసంఖ్య మితముగ జేయుటకు సహజమార్గము బ్రహ్మచర్యము. సంగమంమానితే గర్భోత్పత్తియుండదు. మనపూర్వికులు సంతానముకావలసినప్పుడే సంగమము జరుగవలెనన్నారు. విషయలోలతతోను కామావేశంతోను సంగమించుటవల్ల ఇంకొక యనర్థము నుండును. తల్లిదండ్రుల రూపరేఖలవలె వారిగుణగణములును సంతానముకు కల్గుట సహజము; కనుక కామోద్రేకము పిల్లలకును సంక్రమించును.

బ్రహ్మచర్య మలవడుటమంచిదైనను సంస్కారము భావము సామాన్యముగ వ్యాపించియున్నది. ఈసమస్యను కేవలం భౌతికదృష్టితోగాక, నైతికదృష్టితో పరిశీలించవలెను. మత్తతకు ఉద్రేకమును గల్గించు ఆహారవిహారములు విడువవలెనని, నితమగు వ్యాయామము చేయవలెనని, భక్తిగల్గియుండవలెనని, యోగనిగ్రహము లభ్యసించవలెనని, బ్రహ్మచర్యమునకు ఇట్టిసాధనములు మనపూర్వులు నిర్ణయించినారు, వీటిని వీలైనంతవర కాచరణలో బెట్టవలెను. మరియు మనస్సునకు ఇం

ద్రియములకు అత్యంతసంబంధమున్నది. మనసులోని తలపులప్రకారమే భావములు, ఇచ్ఛ, అందునుబట్టిమాటలు, ప్రయత్నములు, కార్యములు జరుగునుగదా! మనస్సులో పరిశుద్ధి నిర్మలభావము నభ్యసించితే బ్రహ్మచర్యమబ్బుట సులభము. *కేవలం కామోద్దీపనగల్గించు కథలు కావ్యములు చదువుటను తగ్గించవలెను. మరియు స్త్రీలు తమ ఇంద్రియవాంఛల దీర్చుటకే ఏర్పడినారనియెంచివారిని తమయిష్టప్రకారం వినియోగించుట అనేక పురుషులకుండు అలవాటు. అది పోవలెను. స్త్రీలకు మన స్వాతంత్ర్యము నీయవలెను.

బ్రహ్మచర్యమువలన కలుగు ఉపయోగములు పూర్వగ్రంథాలలో చెప్పబడినవి. దానివల్ల జనులతేజస్సును జ్ఞానమును నీతియు ఆరోగ్యమును హెచ్చి సంఘమంతయు బాగుపడును. †వ్యభిచారాది దురాచారములు, అందువల్ల కలుగు ఆధివ్యాధులు సాంఘికారిష్టములును పోవును. ఊర్ధ్వరేతస్కులగు పూర్వపు ఋషులకు లోకోత్తరమగు జ్ఞానశక్తులు తేజస్సును గల్గుటకు వారి బ్రహ్మచర్యము ముఖ్యకారణము. మరియు బ్రహ్మచర్యపద్ధతిని సరిగా అమలుజరిపినయెడల ఇప్పుడు ఈదేశములోజరుగు అతిబాల్యవివాహములు, వృద్ధవివాహములు అనేకభార్యాత్వము ఇట్టివిపరీతప్రవృత్తులుండవు. పూర్వసిద్ధాంతప్రకారం ఆశ్రమధర్మములకుబ్రహ్మచర్యసూత్రమే పునాది. పురుషుడు 25 ఏండ్ల వయస్సువరకు

---

* యన్మనసామనుతే తద్వాచావదతి, యద్వాచావదతి తత్కర్మణాకరోతి, యత్కర్మణాకరోతి తదభిసంపద్యతే॥ (యజుర్వేదబ్రాహ్మణం)
ధ్యాయతో విషయాన్పుంసఃసంగస్తేషూపజాయతే.....(గీత)

† కాంతింకాంతిం స్మృతింజ్ఞానం, ఆరోగ్యం చాపిసంతతం।
యో యిచ్ఛతి మహాద్ధర్మం బ్రహ్మచర్యం చరేదినా॥ (ధన్వంతరి)
ఏకత శ్చతుర్వేదాః బ్రహ్మచర్యం తథైకతః (ఛాందోగ్యోపనిషత్తు)

బ్రహ్మచారిగనే యుండవలెను. పిమ్మట గృహస్థుడైనను యుక్తకాల మందు నియమితముగసంగమించవలెను. అంతట, పౌత్రుడు జనించిదో, తలనెరిసిదో కాలమురాగనే, వానప్రస్థుడై, బ్రహ్మచర్యమునే తుదివ రకవలంబించవలెను † బ్రహ్మచారి హింసాదుల సనలే చేయకూడదు. ‡

ఇట్లు ఆచరించువారికి అహింసాతత్వ మలవడుట సులభసాధ్యము. బ్రహ్మచర్యపు ప్రాముఖ్యమును గమనించియే గాంధిమహాత్ముడును అహింసాసాధనలో బ్రహ్మచర్యావలంబమునకు ముఖ్యస్థాన మిచ్చినారు; తాను స్వయముగ 30 ఏండ్లవయస్సునుండి బ్రహ్మచర్యమాచరించుచున్నారు. బ్రహ్మచర్యములోనున్నప్పుడు స్త్రీసంబంధమసలే మానుకోసక్కరలేదు. పరస్పరము కామభావము లేకుండ సంఘసేవాపరులై విశ్వప్రేమతో వర్తింపవలెను. కొందరు భీష్మకర్ణ హనుమదాదులు యావజ్జీవము బ్రహ్మచారులయి, చిరాయువులై లోకసేవజేసిరి; కొందరు (శంకరాదులు) బ్రహ్మచర్యమునుండియే సన్యసించిరి. కనుక, ప్రతివాడును గృహస్థుడుకావలెనను నియమము పూర్వం ఆచరణలో లేదు. కొందరు స్త్రీలును బ్రహ్మచారిణులై యుండిరి.

బ్రహ్మచర్యమును అహింసయు శరీరముకు తపశ్శక్తి గల్గించు

---

† చతుర్థ మాయుషోభాగం ఉషిత్వాద్యం గురౌ ద్విజః। ద్వితీయ మాయుషో భాగం కృతదారో గృహే వసేత్ ।
అవిప్లుత బ్రహ్మచర్యో గృహస్థాశ్రమ మావసేత్ ।
గృహస్థస్తు యదాపశ్యేత్ వలీపలిత మాత్మనః। అపత్యస్యైవచాపత్యం, తదారణ్యం సమాశ్రయేత్॥ (మను) ఋతు కాలాభిగమనం బ్రహ్మచర్యమివోచ్యతే.

‡ వర్జయేన్మధు మాంసంచ.....ప్రాణినాంచైవ హింసనం. (మను)

నని గీతలోను చెప్పబడినది †బ్రహ్మచర్యము మతధర్మములలో నొకటిగ మనపూర్వికులు గమనించుటయు వారియుద్దేశ్యప్రకారము నరుల జీవితములో దానిప్రాముఖ్యమును మనకు సూచించుచున్నది. యోగ శాస్త్రమందును యమనియమాస నాదులలో మొదటి అంచెయగు 'యమ'ములోనే అహింసాబ్రహ్మచర్యముల జేర్చినారు. తపో అధ్యయన దేవప్రార్థనాదులను రెండవ యంచెయగు 'నియమ'ములలో జేర్చినారు. ఈరెంటిమధ్య యమమే నిత్యాచరణీయమని ముఖ్యమని మనుస్మృతి లోను విధించినారు. *కామోద్రేకం కల్గించునవలలు కథలు సినిమాలు సైన్యవిజీవితము వ్యాపించిన అధునికకాలంలో ముఖ్యంగా యువకులు బ్రహ్మచర్యపు ఆవశ్యకతను గ్రహించి దానినాచరింపవలెను. విద్యార్థి దశలో నెవరును పెండ్లిచేసుకొనకూడదను నియమముండదగును. ఇల్లే ఉద్యోగకాలము పూర్తియైన పెన్షనుదారులు 30 ఏండ్లు వృత్తిగడిపిన వారును కుటుంబము విడిచి ఏదో సంఘసేవ కార్యము చేయుచుండవలెనను నియముండుటయు మంచిది.

---

† బ్రహ్మచర్య మహింసాచ శారీరంతప ఉచ్యతే ॥
మామూలుతపస్సుకన్న బ్రహ్మచర్యంలోనే హెచ్చు తపశ్శక్తికలదని తంత్ర శాస్త్రవచనము.
నతప స్తపయిత్యాహుః బ్రహ్మచర్యం తపోత్తమం॥
అహింసా సత్యాస్తేయ బ్రహ్మచర్యాపరిగ్రహా యమాః॥ శౌచసంతోష తప స్స్వాధ్యా యేశ్వరప్రణిధానానిని యమాః (యోగదర్శనం)

*యమాన్ సేవేతసతతం నిత్యంనియమాన్ బుధః । యమాన్ పతత్యకుర్వాణః నియమాన్ కేవలాన్ భజన్॥ (మనుస్మృతి)

28. నీతిప్రవర్తనము; సత్యము.

అహింసావృద్ధికి జనుల మనఃపరిశుద్ధి యవసరమని గమనించి యున్నాము. అనగా భావములు ప్రవర్తన నైతికములైనప్పుడే అహింసాతత్వమును జనులకు స్థిరపడగలదు. సత్యము, అస్తేయము, సౌమ్యత, నిగ్రహము ఇట్టివన్నియు నీతిలక్షణములే.

కాని నీతిప్రవర్తనవిషయములో తరుచుసందేహముగల్గుటయు కలదు. ప్రతివారును సాధారణముగ తాము సత్పురుషులుగ వర్తించుటకే యుద్దేశింతురు. అయితే క్రియలో ధర్మజిజ్ఞాస యేర్పడును. అప్పుడు నిజమైనభక్తుల కీశ్వరుడే హృదయములో మంచి చోదనగల్గించును.

అయితే ఈకాలములో నిరీశ్వరవాదము, సందిగ్ధతయు ముఖ్యముగ యువకవర్గములో వ్యాపించియున్నది. వారికి నిర్మలమగు కర్తవ్యజ్ఞాన మెట్లేర్పడును? వారీక్రింది స్వర్ణసూత్ర మవలంబింపదగును. అది యే మార్గదర్శకము.

ఏవిషయమందైనను ఇతరులు మన కెట్లు చేయవలెనని మనలగూర్చి యెట్లు వర్తించవలెనని మనము కోరుదుమో, మన మితరుల విషయమున నట్లే చేయవలె, వర్తింపవలె. ఈసూత్రము సన్మతగ్రంథములు తత్వశాస్త్రములు నుపపాదించినవి.† పాశ్చాత్యవిద్వాంసులును ఈసిద్ధాంతము సర్వాంగీకార్యమన్నారు. మన ప్రాచీనగ్రంథములలోను ఇట్టిభావము చాలచోట్లచక్కగచెప్పబడినది. అట్లు అందరినితనతోపోల్చుకొని యితరులగూర్చి వర్తించుచు సుఖదుఃఖముల గ్రహించువాడే సరియైన యోగియని గీతలో చెప్పినారు.* 'తనకు బాధకమని తోచువాని

† సతత్వరస్యకుర్వీత స్యాదనిష్టం యదాత్మనః ।
యద్యదాత్మనిచేచ్ఛేత తత్పరస్యాపి చింతయేత్ (మనుస్మృతి)
Do to others as you would they should do unto you (The Bible)

* ఆత్మౌపమ్యేన సర్వత్రసమంపశ్యతియోర్జున । సుఖంవాయదివా దుఃఖం
సయోగీ పరమోమతః ।

నితరులకును చేయకూడదు; తనకు మంచిదని కోరువాటినే యితరులకు ను నరుడుచేయదగునని భారతమున చెప్పియున్నారు* ఏపనిని ఇతరులకు తెల్పుటకు తాను చేయుటకు కుతూహలముండునో ఎట్టిదిహృదయశాంతి నిచ్చునో అట్టిది సాత్వికమని స్మృతిలోచెప్పినాను.† సత్ఫలముగోరువారు సత్కర్మపరులు కాదలచువారునుముందుగా ఉత్తమమగు మనస్సంకల్పము నభ్యసించవలెను. సత్యపరత అహింసవలె ముఖ్యావశ్యకము. సత్యమన గా యథార్థత. కాని ఇందును సందేహము లుండును. అత్యధికతమాని మధ్యవృత్తిలో నుండుచు సాధ్యమైనంతవరకు లోకహితముకు యన్నిం చుటే సత్యపరతయని యొకనిర్వచనము.‡

అల్పవాచికనియమమును అహింసకు సాధకము. అతిభాషణవల్ల తరుచు వక్తకు శ్రోతలకుగూడ మనస్సులో కలవరము ఉద్రేకము గల్గును. అందువలన పరులమనస్సు నొచ్చును. తరుచు సంఘర్షము ద్వారా హింసాచర్యలు జరుగును. హింసాత్మకమైన దుర్భాషలవల్ల వ్యక్తులమధ్య సంఘములమధ్యగూడ తీవ్రద్వేషము కొట్లాటలుగూడ సంభవించి రక్తపాతమును గల్గుచున్నది. సామ్యత్వమునకును మితభాషణ ముపయోగకరము. §మితభాషణ సాధనకై కొందరుజ్ఞానులు మౌనము నభ్యసింతురు. పూర్వపుఋషులు మహాతపస్సు చేయునప్పుడు మౌనులై ప్రకృతిశక్తులను తమలోకి గ్రహించుకొని ఆత్మబలము గల్గి, దివ్యదృష్టి

---

* ఆత్మనః ప్రతికూలాని పరేషాం నసమాచరేత్ । (మహాభారతం)

† యత్సాయ్వేనేచ్ఛతిజ్ఞాతం యన్నలజ్జతిచాచరత్ । యేనతుష్యతిచాత్మాపితత్ సత్వగుణలక్షణం. (మనుస్మృతి)

‡ సత్యాన్నాస్తి పరోధర్మః (మ. భా. శాంతిపర్వం 160)
ఆశ్రీయేన్మధ్యమాంవృత్తిం అతిసర్వత్ర వర్జయేత్ । యల్లోకహితమత్యంతం తత్సత్యమితి నశ్రుతిః॥

§ యస్యవాఙ్మనసీశుద్ధే సమ్యగ్గుప్తేవసర్వదా। సవైసర్వమవాప్నోతి వేదాంతో పగతం ఫలం (మనుస్మృతి)

సంపాదించుచుండిన ట్లితిహాసపురాణములు తెల్పుచున్నవి. ఇటీవలగూడ కొందరు మహాత్ములు లిట్టిసాధనను కొద్దిగ జేయుచున్నారు. గాంధిమహాత్ముడు వారముకొకరోజున ఎట్టి సంభాషణనుచేయక కేవలం మౌనము వహించియుండును. ఇట్టి యభ్యాసమువల్ల నిగ్రహశక్తి హెచ్చునని, బాగుగ ఆలోచించియే మాటాడుట యలవడునని, అహింసాబుద్ధియు వృద్ధి యగునని, ఆయన స్వానుభవముతో తెల్పుచున్నారు. వాచాలత హానికరమని గ్రహించుటకు నిది యుపయోగించును. వాక్శుద్ధియు, మనశ్శుద్ధియు గుప్తవాక్కునను నిశ్రేయసమునకును సాధకములని మనువుచెప్పియున్నాడు. ప్రాణులకు హితబోధయు శిక్షయుగూడ అహింసాపూర్వమగు మధురవాక్కులద్వారా జరిగించుటే యుక్తమనియు శాసించినాడు *

మరియు వాజ్నియమంతో సిద్ధించు భావశుద్ధిలేకుండ, జలమృత్తికాదులతో వట్టి బాహ్యశుద్ధినే చేయువారు సదాత్మకులుకారు, దురాత్మకులు అపరిశుద్ధులుగ నుందురనియు స్మృతులు తెల్పినవి.†

---

* అహింసయైవ భూతానాం కార్యంశ్రేయోనుశాసనం।
వాక్చైవమధురా శ్లక్ష్ణా ప్రయోజ్యా ధర్మమిచ్ఛతా॥ (మను)

† మృత్తోయానాం స్వనాస్నైశ్శోధకా మంభసైరపి
నశుధ్యంతి దురాత్మానః యేషాంభావోనిర్మలః (దక్షస్మృతి)

29. త్రికరణపరిశుద్ధి.

సంఘర్షమువల్లనే హింసకలుగును. వ్యతిరేకుల సాంకర్యము మలినసంపర్కమును సంఘర్షమునకు కారణము. వాని స్పర్శింపులగించుటే పరిశుద్ధి. దీనినే శౌచమనియు పూర్వులనుచుండిరి శౌచము అహింసాపోషకము సాత్వికలక్షణమునని వచించి, ఋషులు శౌచమును శ్రద్ధతోనవలంభించి, ముందుతరములవారికి అందుగూర్చి దీర్ఘనిబంధన లేర్పర్చినారు; పరిశుద్ధినొనర్చుకాయము లనుత్రికరణములందు నుండవలెను. స్నానాదులతోను, పరిశుద్ధాహారములను శుభ్రవాయువును స్వీకరించియు, దేహశౌచమును కాపాడుకోవలెను. అట్లు పరిశుద్ధమైనప్పుడే మనదేహము ఆత్మకును అందలోనున్న అంతర్యామియగు భగవంతునితేజస్సునకును వాసయోగ్యమై ప్రేమస్వరూపముగ నుండగల్గును. కనుకపరిశుద్ధత అహింసాతత్వము వృద్ధినొందుటకవసరము. అయితే, దేహవాక్కులలోను మనస్సులోను పరిశుద్ధతగల్గి యుండవలెను. ఈ మూటిని నిగ్రహములోనుంచుటే త్రిదండిత్వము.† దుష్టవాక్కు వచింపకుండుట, ఇతరులపైన ద్వేషమును దురాశను మనస్సులో సంకల్పించకుండుటయు, అవసరము. వాఙ్మనఃకాయము లన్నిటిలోను శౌచము సమభావమునున్నప్పుడే పూర్తియైన శౌచముగల్గి మహాత్ములు కాగలరు. అట్లుకాక మనస్సులోనొకటిచేయునదొకటియునై, బాహ్యశౌచమునవలంబించియు, దురాలోచనలుగల్గి పరులబీడించువారు నిజముగా దురాత్ములగుదురు*

శౌచమును రక్షించుటకే స్మృతులలో ననేక నిబంధనలు ఆచారములు చెప్పబడినవి. కాని, కాలము గడచినకొలది ఆటి ఆయా

---

† వాగ్దండోఽథ మనోదండః కాయదండస్తథైవచ
యస్యైతే నిహితాలోకే త్రిదండీతి సఉచ్యతే (మను)

* మనస్యేకం వచస్యేకం కర్మణ్యేకం మహాత్మనాం॥
మనస్యన్యద్ వచస్యన్యత్ కర్మణ్యన్యద్ దురాత్మనాం (మహాభారతం)

యుద్దేశములు మరపుకువచ్చి, పై కిపినియమములను మాత్ర మిప్పుడర్థము లేకుండనే అనుసరించు చున్నాము. అపరిశుద్ధులు మద్యమాంసాదిలో లురు మహాపాతకులు మున్నగు వారితో సంపర్కము కూడదని పూర్వ శాస్త్రములందు చెప్పిరి. కాని ఇప్పుడని కొన్నికులముల బహిష్కార ముకే వినియోగమగుచున్నవి; బహిష్కరించవలసిన మద్యాదిపాత కములు దురాచారములు 'శిష్ట' జాతులనబడు వారిలోను వ్యాపించుట, అట్టివారు శిష్టులుగనే యెంచబడుటయు, జరుగుచున్నది. శౌచము కాపా డుటకని ప్రతిమతమువారు నేర్పర్చుకొన్న నిబంధనలు (అప్పటి ముద్దేశము జనులకు మరపుకు వచ్చి), అత్యావేశమువల్ల ఆయాశాఖలమధ్య ఎడ తెగని విభేదములకు స్పర్ధలకు కారణమగుట శోచనీయము. త్రికరణము లందు నిజమైన పరిశుద్ధి గలవారందరును సంఘసంపర్కము కన్నివిధ ములను తగినవారే. ఈ సిద్ధాంతమును ప్రతిముఖ్యమతమును గౌరవిం చుచున్నది. ఆచరణలో ప్రతిమతమువారు స్వమతస్థులే పరిశుద్ధులని యెంచుట జరుగుచున్నది. ఇందు హిందుపులెక్కువ కఠినమగు నియమ ములు గల్గి, అన్యమతస్థులందేగాక స్వమతమందును స్వశాఖతప్ప ఇత రత్ర అపరిశుద్ధతనెంచి, వారితో భోజన వివాహాదుల మానుట ఆచార మైనది. ప్రవర్తనవల్లకాక జన్మవల్లనే శౌచము సిద్ధించునని యెంచి శౌచ విహితమగు ఆచారనియమముల బాహ్యరూపము సహంకారముతో విచక్షణలేకుండ అమలుజరుపు విపరీతపద్ధతివల్ల పరస్పర విభేదములును ద్వేషములును హెచ్చి, పరస్పరప్రేమక్షీణించుచున్నది. దేహపరిశుద్ధికన్న మనఃపరిశుద్ధికి, అందులోను అర్థశుద్ధికి (అనగా ద్రవ్యాశ లేకుండుటకు), శాస్త్రజ్ఞు లెక్కువ ప్రాధాన్యమిచ్చినారు.*

---

* సర్వేషామేవ శౌచానా మర్థశౌ: ం విశిష్యతే
యోర్థేశుచి స్సహిశుచిః నమృద్వారిశుచి శ్శుచిః (మనుస్మృతి)

30. శస్త్రవిసర్జన యత్నము.

1914-18 సం॥ యుద్ధంవల్ల ఆయోధజేశాలకేగాక లోకమంత కును చాల నష్టముగల్గినదిగదా! అదే తుదియుద్ధమని, అంతటితో లోకంలో యుద్ధంసాగించే అవసరము లేకుండ పోవునని, మిత్రమండలిప్రముఖులు లోకులకు చెప్పినారు. దానికి The war to end wars అని పేరుపెట్టినారు. ఆయుద్ధాంతమున ఉభయపక్షములు సామ్మసిల్లినట్లయి, ఇక యుద్ధములుండకూడదన్నారు. కాని జరిగినదేమి?

అప్పటి అమెరికా అధ్యక్షుడగు విల్సనుపండితుడు సంధికిపూర్వం ప్రచురించిన శాంతిసూత్రములు నిరాక్షేపణీయమైనవి. వాటిని నమ్మి జర్మనులు యుద్ధముచాలించి, సంధినికోరిరి. 'అన్నిరాజ్యములు ఆయుధములు తగ్గించవలె, అన్నిజాతులకు స్వయం నిర్ణయవర్తి వర్తింపవలె, నానాజాతిసమితి యేర్పడి, ఆసమితిద్వారా లోకవ్యవహారములకు న్యాయమైన శాంతపరిష్కారముకావలె' అనుసూత్రములకందరు అంగీకరించిరి. అయితే 'వర్సాలే' సంధిలో జర్మనీపైన బ్రిటిషు ఫ్రెంచిరాజ్యములు కసితీర్చుకొన్నవి; దుర్భరమైననష్టపరిహారము, జర్మనునౌకావినాశము ఇత్యాదులేగాక, జర్మనీనికేవలం నిరాయుధముగ చేసిరి. బ్రిటిషు ఫ్రెంచివారు తమఆయుధసామగ్రులు నౌకావిమానాదులు నేమియుతగ్గించలేదు. మాండేటులపేరకొన్నిశత్రురాజ్యాలను వీరు పశపర్చుకొన్నారు. పరస్పరదూషణ సాగినది. జర్మనుల ఆర్థికస్థితి భగ్నమైనది. పరాధీనులకు న్యాయముకల్గలేదు. అంతర్జాతీయసీతి న్యాయదృష్టి క్షీణించినవి. 1919-39 ఈయిర వై యేండ్లలో మరల 20 పెద్దయుద్ధములు సాగినవి. వాటివివరము:—

1919, 1. పోలండు సోవియటు రష్యాపైన యుద్ధము సాగించెను.

,, 2. తెల్లరష్యనులు బ్రిటను ఫ్రాంసు జపానులసాయముతో సోవియటు రష్యాపైన దండయాత్ర చేసి, అన్నిప్రాంతాలలోను ఓడిరి.

1921, 3. పోలండు అన్యాయముగ రష్యాపైన యుద్ధము చేసి, కొంత ఉక్రేనియాను కొంత గలీషియాను తన రాజ్యంలో కలుపు కొనెను. (అందు కిప్పుడు పోలండుకు ప్రాయశ్చిత్తమయినది.)

,, 4. ఐరిషు బ్రిటిషువారిమధ్య తీవ్రముగా అంతర్యుద్ధము, తుదకు అమెరికావారి తొందరమీద సంధి (జరిగి) ఐరిషు ఫ్రీస్టేటు యేర్పడినది.

1819-22, 5 మొరాకోలో అక్కడిదేశీయులకు స్పెయినుసేనకు పెద్ద యుద్ధము, అపారనష్టము.

1919-26, 6. అరేబియాలో బ్రిటిషు పోషితుడగు 'హుస్సేను' రాజుతో దీర్ఘయుద్ధంచేసి, ఇబిన్సాను అరేబియాలో చాలభాగము విడగొట్టి, మెక్కా ప్రాంతమును స్వతంత్రముగ చేసి, దాని రా జయ్యెను.

1920, 7. బ్రిటిషువారి మద్దతుగలఆర్మీనియాతో టర్కీకి యుద్ధము, జయము. మరల రష్యా పోలండు యుద్ధము; పోలండు గెలుపు.

1920-26, 8. చీనాలో ఉత్తరదక్షిణ రాజ్యాలమధ్య తీవ్రయుద్ధము, విశేషజననష్టము.

1922, 9. గ్రీకులు ఆసియామైనరులో దిగి దాడిచేసి, టర్కీ చే నోడిపోయిరి.

,, 10. ఆస్ట్రేనుస్థానంలో అంతర్యుద్ధము. అమానుల్లా పదభ్రష్టత.

1925, 11. సిరియాలో జనులు ఫ్రెంచివారితో పోరుట; డమాస్కసుకు మహానష్టము.

1925-35, 12. దక్షిణఅమెరికాలో బొలీవియా ఉగ్వేలమధ్య దీర్ఘ యుద్ధము; ఉభయులు నీరసించుట.

1926-28, 13. చీనాలో జాతీయపక్షమునకు కమ్యూనిస్టులకు ఘోర యుద్ధము.

,, 14. జపానీయులు అక్రమంగా మంచూరియాలో చీనాసేనల నోడించుట.

,, 15. జపాను జహోలురాష్ట్రమునపైన గూడ దండయాత్ర చేసి దానినిగూడ కలుపుకొని, మంచూకోరాజ్యమును స్థాపించుట.

,, 16. షాంహైప్రాంతంలో చీనా జపానులకు ఘోరయుద్ధము.

1935, 17. ఇటలీ అబిసీనియాపైన దాడిచేసి విషవాయుప్రయోగంతో అబిసీనియనులనోడించి, ఆదేశమునువశపర్చుకొనుట.

1936-38, 18. స్పెయినులో తీవ్రమగు అంతర్యుద్ధము. ఇటలీ జర్మనుల సాయాతోను, ఇంగ్లండు ఫ్రాంసుల 'తటస్థత'తోను నియాతృపక్షపు 'ఫ్రాంకో' జయించుట.

1939, 19. ఇటలీ ఆల్బేనియాపైన దాడిచేసి దానిని కబళించినది.

1937-41, 20. చీనా-జపాను యుద్ధము: ఉత్తరచీనాపైన దాడిచేసి జపాను క్రమంగా దానిని తూర్పుచీనానంతను ఆక్రమించుట (ఇంకనుసాగుచున్నది.)

(ఇంకను కొన్నిచిల్లరయుద్ధములు సాగినవి.) ఆయాజాతులమధ్య ద్వేషమును వెనుకటికన్నను హెచ్చినది. వెద్దరాజ్యాలమధ్య ద్వేషము పెరిగియే మరల మహాయుద్ధ మేర్పడినది. ఈసారి యుద్ధాలలో క్రౌర్యమును వినాశకతయు హెచ్చినవి. క్రిందటి మహాయుద్ధములో జర్మనులు బెల్జియంలోకోటలు పట్టటలోను ఉత్తరఫ్రాంసులో నదులుదాటి ముట్టడి సాగించికందకపుయుద్ధములు సాగించుటలోనుఅమ్ముకప్రజ్ఞ కనపర్చినారు. పరిశ్రమలపోటీలో శాస్త్రజ్ఞానావిష్కారములద్వారా నిరంతరకృషిచేసి బ్రిటిషు వారికన్న పై చేయుయైనట్లే, ఆయుధనిర్మాణంలోను వాటియుపయోగంలోను జర్మనులు ప్రముఖులై నారని తేలినది. ఆయుద్ధమునకు జర్మనీవారే

బాధ్యులని నిర్ణయించి, జర్మనీని చాల బాధలపాలుచేసినారు. యథార్థముకు ఉభయపక్షములవారి లోపములవల్లను, దురాశవల్లను, యాంత్రిక పద్ధతిలోని సహజసంఘర్షమునను, ఆమహాయుద్ధము కలిగినది. ఆద్వేషాగ్ని తరువాత రగులుచునేయుండెను. జర్మనులవశంలోని అల్ససులో రైనును క్రొంచివారు రాబట్టిరి. సాలీనా కోట్లకొలది కాసులనష్టపరిహారంలాగిరి. జర్మనులుజీవించుటకక్కడ పరిశ్రమలపునరుద్ధరణయుబలమగు ప్రజాయత్తరాజ్యమునవసరమైనది కాని అందుకై వీమరు, స్ట్రెస్మను బ్రూనింగు మొదలగు రాజనీతిజ్ఞులతోడ్పాటుతో హిండెన్బర్గు (అధ్యక్షుడు) చేసినసాధుయత్నములన్నిటిని కొందరుక్రొంచి బ్రిటిషుప్రముఖులు ప్రతిఘటించిరి. వాయుదాసామ్యాలు బకాయిపడినవని క్రొంచిసేనలు జర్మనులకు పారిశ్రామికంగా ఆయువపట్టువగు రుహ్ర్ప్రాంతము నాక్రమించిరి. అంతట జర్మనురాజ్యము దివాలాతీసినది

'మాకు సామ్యమ్మక్కడిది, ఆ సామ్యప్రాప్తికి మేము తయారుచేయు సరుకు లిత్తుమ'ని జర్మనులనిరి ఆ సరుకుల వాడుకవల్ల తమ సరుకులకు గిరాకి తగ్గి, వ్యాపారనష్టము కల్గునని క్రొంచి బ్రిటిషులభయము.

ఈలోగా విజేతృరాజ్యములమధ్యను కొంత కలతలు కల్గినవి. బ్రిటిషుక్రొంచివారలకు అమెరికనులపైన (యుద్ధఋణములగూర్చి) అసూయ గల్గినది అమెరికనులుజర్మనులకు పెట్టుబడిపెట్టి జర్మనులనుద్ధరింపబోయిరి. ఆ విషయంలోను భేదభావములు కల్గెను. ఆయుధవిసర్జనపద్ధతి నందరు నమలుజరుపవలెనన్నను, రష్యామాత్రం అందుకుసిద్ధపడినది. తక్కినవారొప్పుకోలేదు. ఆయుధాలు తగ్గించుట కమెరికా అధ్యక్షుడుజరిగించిన సభలలోను ఆయారాజ్యప్రతినిధులు స్వలాభపరతనేవహించిరి. ఆసభలు తుదకు పరిహాసాస్పదమైనవి. ప్రతివారును తమయోధశక్తి తగ్గకుండ తక్కినవారికి నష్టముకల్గుటీతి నాలోచించిరి. విమానములనుండి నిరాయుధశాంత జనులపైన బాంబులు వేయకూడదని కొన్నిరాజ్యాలవారు సూచించిరి. బ్రిటిషువారు తమ సామ్రాజ్యపు మార్గమూలను వాటినువయోగించుటకు మినహాయింపుకోరిరి.

నౌకాయుద్ధపద్ధతులగూర్చియు, ఏదో దేశము వ్యతిరేకించుచుం డెను. ఇప్పు డన్ని రాజ్యాలవారును ఆ చెడుఫల మనుభవించుచున్నారు. ఇట్లు 'డిజార్మమెంటు'(=శస్త్రవిసర్జన) సభలు భగ్నమై ద్వేషాసూయలు మరింత పెరుగుటే ఫలమైనది. క్రిమ్రులో ఒక్కరికన్న నొకరు పోటీగ యుద్ధనౌకలను, జలాంతర్గాములను, విమానములను టాంకులు వగైరా లను రహస్యముగ పెంచుటవల్ల భద్రత అడుగంటినది. ప్రతిదేశములోను కోట్లకొలది సవరనుల పెట్టుబడితో ఆయుధాల ఫాక్టరీలు పెట్టిరి. వీటియ ధమానము హెచ్చుధరకు నవ్యాయుధము లమ్మబోడగిది. వైజ్ఞానికపరి శోధనలనూ చాలవరకు వినాశకచర్యలకే వినియోగించిరి. అందుకా యా ప్రభుత్వములును ప్రోత్సాహమిచ్చినవి. తమదేశము పెద్దది గనుక తమకెక్కువ సేనాబలము కావలెనని అమెరికనులు, తమకందరికన్న విశాలసామ్రాజ్య మున్నందున దాని రక్షణ కందరికన్న పెద్ద నౌకా విమానదళాలు కావలెనని బ్రిటిషువారు, వీరితో సమానమగు నౌకా బలము తమ ద్వీపరక్షణ కవసరమని జపానీయులు, ఇట్లు తగవులాడిరి.

ఈ పుంజపతిరాజ్యాలన్నియు కమ్యూనిస్టు అగు తమ్మును లొంగ దీయుటకై నిరీక్షించుచున్నవని చెప్పుచు, రష్యారాజ్యము మహాప్రబల మగు ఆయుధసామగ్రిని తయారుచేసియున్నది. అన్ని దేశాలును తమ తగవులను నానాజాతిసమితిద్వారా పరిష్కరించుకోవలెనని తీర్మానము న్నను తమకు లాభించునంతవరకే ఆతీర్మాన మములుచేసినారు. జాతిసమి తియు మహారాజ్యముల ప్రాబల్యముకే యుపయోగించినది.

ఈ ఆయుధవృద్ధిపోటీలో ధనికదేశముల కెక్కువ సౌకర్యము న్నది. ఆయుధములకు సేనలకు విమానాదుల నడుపు పెట్రోలును మహా నౌకలకు కోట్లకొలది కాసులును కావలె. ధనముకు Sinews of war అని పేరువచ్చినది. సామ్రాజ్యదేశములు తమ వశమగు దేశముల ఆదా యములో నర్ధభాగమువరకు యుద్ధావసరములకు ఖర్చుచేయుచు, ఆదేశ ముల ధనమునుగూడ కొంత తమదేశముకు చేర్చి, తద్వారాను తమ ఆయుధబల మింకను హెచ్చించిరి. ఈ పెరిసోటీని మాన్పవలెనని ధీమం తులు గ్రహించిరి. కాని, సామ్రాజ్యతత్వము హింసాధోరణియు పెరుగు చున్నందున, ఆ ప్రయత్నము సాగక పరిహాసాస్పద మైనది.

ఆయుధవృద్ధిద్వారా హింసాతత్వమును, హింసాతత్వమువల్ల ఆయుధవృద్ధియు, ఇట్లు అన్యోన్యాశ్రయ మేర్పడినది.

బ్రిటిషు పాలితమగు మన దేశంలోను కేంద్రప్రభుత్వపు ఆదాయంలో రమారమి సగము ఏదో పేరున సైనికయత్నములకు ఖర్చగుచున్నది. ఐనను దాదాపు ఇక్కడి ప్రజలందరు వట్టి నిరాయుధులు.

ఇక్కడి ప్రజల విద్యారోగ్యాదుల వృద్ధికి తగు ద్రవ్యము లేదు. జనుల కాధివ్యాధులు మెండు. అట్టిస్థితిలో ప్రజలు బ్రిటిషువారిపైనను తమలో పరస్పరమును హింసాఘోరణి గల్గియుండుట సహజము.

ఈ ఆయుధప్రాబల్యంలో బ్రిటిషుపాలనలో మనరాజ్యస్థితి యెట్లున్నదో చూడుడు.

ఆధునికయుద్ధాలలో దేశరక్షణకు యుద్ధవిమానములు, యుద్ధనౌకలు, జలాంతర్గాములు, ప్రేలుమగనులవేయు నౌకలు, అట్టి విమానములు, సూనెతెచ్చు నౌకలు, బాంబర్లనుండి రక్షించు ఒలీయమగు తుపాకులును విశేషముగ కావలె. కాని, అట్టివి మనదేశమందు అరుదైనవి. వాటినిర్మాణము కేర్పాటులు లేవు.

మరియు ఈ కాలపు వర్తకనౌకలను యుద్ధనావలను నిర్మించి మరమ్మతుచేయు గొప్ప నౌకాశ్రయము లుండవలెను. అందుకును చాలసొమ్ముకు ప్రభుత్వసహాయమును కావలె. వీటికిని సర్కారువారు తగు ప్రోత్సాహ మిచ్చుటలేదు.

మహాయుద్ధము తటస్థించినను, ఇక్కడి ప్రజలేగాక, ప్రభుత్వమును కొంతి అసహాయస్థితిలో నున్నారని తోచును.

ఈ దుస్థితిలో ఇతర నాగరికదేశాలతో సమంగా నవ్యాయుధముల నిర్మాణమునకు సంపాదనకు మన దేశము పోటీచేయుటయు దుస్సాధ్యము. అందు కవసరమగు సొమ్ము, అవకాశముగూడ మనకు లేదు. మన సంస్కృతితత్వమునుబట్టి అసౌకర్యములవల్లగూడ మనకట్టి మోహతత్వ మలవడలేదు. కనుక ఏవిధముగ జూచినను యుద్ధశస్త్రముల విసర్జనము లోకమునకు ముఖ్యంగా మన దేశమునకు శ్రేయస్కరము.

31. యూరపియనుల శాంతియత్నము.

విల్సనుగారు 1918 లో ప్రపంచశాంతి సూత్రములు ప్రచురించినారు, అన్నిజాతులకు స్వయంనిర్ణయమును జరుపుదుమన్నారు కాని ఆప్రకారం అమలుకై యూరపులోచేసిన శాంతి సభలన్నియు వ్యర్థమైనవి. తమసామ్రాజ్యాలలోని రంగుజాతులకు స్వయంనిర్ణయ సూత్రమును బ్రిటిషు ప్రెంచివారలమలుజరుపక, ఇక్కడగూడ డొమిని యను పద్ధతి యమలులో నున్నదని (Dominion status in action) కొందరు రాజనీతిజ్ఞులు ప్రచారమారంభించిరి; కొద్దిమందికి కొన్ని యుద్యోగములు అంతర్జాతీయ సమితులలో కొంచెం స్థానమును ఇచ్చి కొన్నిదేశాలలో హైకమిషనరులనుపేర భారతీయపు ప్రతినిధులను స్థాపించినమాట నిజమే. కాని, ఇందువలన ప్రపంచమునకు భ్రమయే గల్గెను. ఆయుద్యోగులు జాతీయప్రతినిధులుకాక, బ్రిటిషుసర్కారు కనుచరులే. భారతజాతిస్వాతంత్ర్యము స్వదేశంలోనే లేదు, ఇతరత్ర సమాన స్థానమెట్లు గల్గును ? అయినను ఇవియు శాంతిస్థాపన సభలును తుదకు నాటకములయినవి.

ప్రపంచమంతయు ఒకేమహాశరీరమువంటిది. ఇతరుల నణచివేసి తాముబాగుపడ యత్నించుటవల్ల తత్కాలముకు లాభించినను, తుదకందరకు నష్టముగల్గును. యూరపుదేశాల ఆర్థికదుస్థితి ఫలితంగా అమెరికాకు బాకీఉనసూలుకాకయు వ్యాపారనష్టముగల్గియు, 1929 సం॥ లో అమెరికాలో చాలబాంకులు దివాలాతీసినవి. అయినను, అమెరికనులు స్వార్థపరులై తమలాభమే ముఖ్యముగ జూచుకొన్నారు. బ్రిటిషువారును తను ఆర్థికప్రాబల్యము కాపాడుకొనుటకని 1931సం॥లో బంగారుప్రమాణము వదలుకొన్నారు. భారతదేశపుహాపాయ మారకమును తమకేలాభకరంగామార్చినారు. తమసామ్రాజ్యపు భారతదేశంవల్ల తమకు రాజకీయంగానే గాక ఆర్థికంగాను, లాభకరంగా నుండునట్లు 'ఇంపీరియల్ ప్రిఫరెన్సు' పద్ధతులవలంబించినారు. దీనివల్ల భారతీయులకు విదే

శీయులకును నష్టము కల్గినది. 1931 సం॥లో జరిగిన యెన్నికలలో బ్రిటిషు పార్లమెంటులో కరడుగట్టిన కాంసర్వటివ్రులు ప్రబలులైనారు. అంతట అక్కడ సామ్రాజ్యతత్వధోరణి స్వజాతిపక్షపాతమును మరింతబలపడినవి; జాతీయపక్షమనుపేర కాంసర్వటివ్రులే పాలనసూత్రములునిర్ణయించినారు. ఇందు కనుగుణంగా జర్మనీలోను తమ స్వలాభమునే కోరు నాజీలధికారు లైనారు. ఇట్లే గ్రీసు, హోలండు, జపాను, స్పెయిను వగైరాలలో నిరంకుశులు స్వజాతిలాభపరులనగు నియంతలే అధికారులైనారు. కొద్ది తారతమ్యమున్నను, ఈ అన్నిరాజ్యాలలోగూడ, అన్యాయంగా ప్రబలులై తామునస్వలాభమొందు తత్వమే పెరిగినది. ఇట్టి తత్వముతో ప్రభుత్వములుండగ శాంతిసభ లెట్లు కార్యకారులగును? జాతి సమితి లోను సామ్రాజ్యాలమాటయే చలామణి యయినది. అంతట జర్మనీ యిటలీలు వానినుండి తప్పుకొన్నవి.

ఈస్థితిలో చీనాలో అంతర్యుద్ధము గల్గినది. అక్కడ సామ్యవాది తత్వము వ్యాపించుచున్నదని యెంచి బ్రిటను అమెరికాలు సామ్యవాదుల నణచుటకు చీనా అధ్యక్షుడగు చయంగు కైషకును ప్రోత్సహించినవి. తీవ్రయుద్ధముజరిగి కమ్యూనిస్టుల నణచగల్గినను, ఇందువల్ల చీనాప్రభుత్వము చాలదుర్బలమైనది. ఇదేసమయమని జపానీయులు చీనాసామ్రాజ్యంలో మంచూరియాను జెహోలురాష్ట్రమును ఆక్రమించిరి. చీనా జపానులు రెండును జాతిసమితిలోసభ్యులే, కాని జపాను దౌర్జన్యమును జాతిసమితివారాపలేదు; పైపెచ్చు, బ్రిటిషుప్రతినిధి జపానును కొంత సమర్థించెను. ఇట్లే 1935 లో అబిసీనియాను ఇటలీఆక్రమించినప్పుడును జాతిసమితి ఇటలిపైన తగుచర్యతీసుకోలేదు. పిమ్మట హిట్లరు జర్మనును నేనతో ఆస్ట్రియాను, జెకోస్లవేకియాను వరుసగ నాక్రమించినప్పుడును, జాతిసమితి ఆశాంతిసభలయత్నములు వట్టి వ్యర్థములని తేలిపోయినది. శాంతి పద్ధతిని సంధియేర్పడుటకు పరస్పరమైత్రి సహృదయత కావలెను. తామెట్లో యితరులునట్లే యను సమభావముండవలె. మరియు, కొన్ని శ్వేతజాతులు తమవశంలోని భారతీయులవంటి రంగుజాతులను శోషిం

పజేసి, అసారంతో తాము బలీయులగుచుండగా, తక్కినవారు భీతులై అలాభములలో తమకును వాటాగోరినారు. భారతదేశాదులకు స్వతంత్రత వచ్చినప్పుడు, అన్నిదేశాలును వాటితో వ్యాపారాదులు చేయుటకు సమానావకాశములుండును. సామ్రాజ్యంవల్ల అన్యాయము జరుగుటేగాక, హింసాభావమేర్పడి, శ్వేతజాతులలోను పరస్పర ద్వేషము పెరిగెను. ఇప్పుడు సామ్రాజ్యపాలకులలో ఉదారభావము సమదృష్టి చూపులేదు. శాంతిస్థాపనసభలు ఆలోచనలు ఇట్టిస్థితిలో వ్యర్థమగుట సహజమే. వ్యక్తితత్వమేగాక, జాతీయతత్వమును మారవలెను. అందుకు గాంధిమహాత్ముడారంభించిన అహింసా ప్రచారమే సాధకమగును.

గాంధిమహాత్ముడీ దేశమందు అహింసాపద్ధతిని రాజకీయముల కమలు చేయగనే దానివాసన ఇంగ్లండువగైరాలకు వ్యాపించకుండ అక్కడ ఆటంకములు కల్గినవి; కాని కొంచముగ అది యూరపులోను సోకినది. యుద్ధనివారణకు అహింసయే సాధనమను సిద్ధాంతముతో ఇంగ్లండులో 'శాంతివ్రతసంఘము' (పీస్ ప్లెడ్జి యూనియన్) ఏర్పడినది. హింసాతత్వముకూడదని క్రైస్తవులలో 'క్వేకరు' శాఖవారును నమ్మి చున్నారు. ఆయుధసామగ్రులు పెంచి, వైరములుగోపి యుద్ధములారంభించుట ప్రజలకు హానికరమని, శాంతికే అందరూ ప్రయత్నించవలెనని, యుద్ధపరత్వము కూడదని, వారుబోధింతురు. ఇట్టి సంఘములు నాగరికదేశములన్నిటిలోను ఏర్పడి కొంతపనిచేసినవి. ఇది లోకమంతటికి సంబంధించినది. కనుక 1921లో War Resisters International (=యుద్ధనిరోధకవిశ్వసంస్థ) ఏర్పడినది. ఇది అంతర్జాతీయము. అన్నిదేశముల 'శాంతివ్రతసంఘము'లు దీనికిశాఖలుగజేరిరి. ఈసంఘమువారును Fellowship of Faiths అనుపేర మతసామరస్య సంఘమును శాంతి బోధించినారు. కాని, వారికి పలుకుబడిలేదు. హింసా వాతావరణము ప్రబలినది. ప్రతి 'నాగరిక' దేశంలోను ప్రభుత్వము వారి

శాంతియుద్యమమునకు వ్యతిరేకులైనారు. ఈయుద్ధకాలమందు దీనిసభ్యులగొందరిని సర్కారుజయిలులోనుంచినారు. అది సహజమే. యుద్ధవ్యతిరేక ప్రచారమిప్పుడు యోధ దేశములలో పాపము 'దేశద్రోహ' పు నేరముకదా! ఈశాంతివాదమునకు పాశ్చాత్య దేశాలలో Pacifism అని పేరువచ్చినది. తమవశంలోని దేశాలకు సామ్రాజ్యప్రభుత్వములు వెంటనే స్వాతంత్ర్య మీయవలెనని, జాతిద్వేషముకూడదని, ఆయుధ నిర్మాణము తగ్గింపవలెనని, అవసరమైన నిర్మాణము వ్యక్తులుకాక ప్రభుత్వములే చేసుకోవలెనని కూడ, శాంతివ్రతులు బోధింతురు †

పాశ్చాత్యపు శాంతివాదులను ఆర్థికరాజకీయములలో సామ్యవాదులలో నొకశాఖగనెంచుటకలదు. అయితే రష్యాలోజరుగు హింసాచర్యలను వీరుహర్షించరు. ఈశాంతివాదులింకను పారిశ్రామికరంగములో పీడనమును యాంత్రికపద్ధతిని గట్టిగ నిరసించుటలేదు; కనుక వారికక్కడ జయము కల్గలేదు. ఇటీవల జనులలో నైతికత్వ వృద్ధికై కృషి చేయుటకు Moral rearmament movement అను నుద్యమమును బయలుదేరినది. నీతిన్యాయములబోధించి పరస్పరమైత్రి కల్గింపజేయుట ఈయుద్యమపు ముఖ్యోద్దేశము. ఇది ఆధ్యాత్మికముగ ప్రశస్తమేకాని, ఆచరణలో దీనిరాజకీయధోరణిస్పష్టీకరంగాలేదు. ఇట్లీవిధి ప్రస్తుతము ఫలించకున్నను, అహింసాసిద్ధాంతమే ఎప్పటికో నాగరికలోకమంతటను వ్యాపించుట కవకాశమున్నదని మాత్ర మీచిహ్నములు సూచించుచున్నవి.

బ్రిటిషుచరిత్రలో ఒకప్పుడు శాంతపద్ధతులద్వారాను అధికారమునంపాదించిన పరిస్థితులుకలవు. అక్రమపుపన్నులు నిరాకరించియు కార్మికులు తమకష్టములు తీరునిమిత్తం ఐకమత్యముతో సమ్మెకట్టియు రాజకీయభావముతో ప్రజానాయకులాందోళన జరిగించి శాసనసభ

† వ్యక్తుల కాయుధనిర్మాణపుహక్కు ఉండుటవల్ల వారు స్వలాభముకై, ఆ యాదేశములమధ్య ద్రోహప్రచారముచేసి వైరముపెంచి, యుద్ధకారకులైనట్లు స్పష్టసిద్ధనములు దొరకినవి.

లందును బయటను శాంతముగ ఒత్తిడిచేసియు, చాల పరిహారములను ప్రజలుపొందినారు. కొన్నియూరపు రాజ్యాలలోనుకొంతవరకిట్లుజరిగినది. దక్షిణాఫ్రికాలో బోయరులను తమసేనాబలముతో బ్రిటిషుప్రభుత్వము వారణచినంతకాలమును అక్కడ బ్రిటిషువారిపైన విరోధమే చెలరేగి నది. 1907 లో వారికి బ్రిటిషుప్రభుత్వము వారు స్వపరిపాలనమిచ్చి నారు. ఇట్లుబ్రిటిషువారు ప్రేమతత్వముచూపగనే బోయరులును బ్రిటిషు వారియందాదరగౌరవములుగల్గి, బ్రిటిషుసామ్రాజ్యమునజేరి అనుకూ లులై నారు,

ఐర్లండులో స్వాతంత్ర్యపుపోరాటము క్లిష్టమై రక్తమయమైనది. బ్రిటిషువారు దౌర్జన్యముచూపినంతకాలము ఆ సమస్య పరిష్కారముకా లేదు. విశేషించిబాధ అప్రతిష్ఠ హెచ్చినవి. అంతట 1921 లో బ్రిటిషు ప్రభుత్వము వారు దక్షిణ ఐర్లండుకు స్వపరిపాలన నిచ్చి 'డొమిని యను'గ చేసినారు అప్పటినుండి ఐరిషువారికి బ్రిటిషువారిపైన ద్వేషము పోయినది.

ఒకసారి జపానువారును, మరొకసారి బ్రిటిషువారును, చీనులను బాధించి, దౌర్జన్యముచేసినప్పుడు చీనులు అహింసాపద్ధతిని పోరుసాగిం చిరి; తీవ్రముగ జపాను, ఇంగ్లండుల సరుకులను బహిష్కరించిరి. బ్రిటి షు జపనీసుల వర్తక కార్యాలయములందుండు చీనాకార్మికులు సమ్మె కట్టిరి. అప్పుడు తుదకు జపానీయులు, బ్రిటిషువారుగూడ న్యాయపరి ష్కారమునకు వచ్చిరి. అహింసాయుద్ధము శాంతమగు పోరు సాధ్యము లని, ఈ యుదాహరణలును, దక్షిణాఫ్రికాలోను మన దేశములోను గాంధిమహాత్ముడు సాగించిన సత్యాగ్రహములును సూచించుచున్నవి.

32. అహింసాయుద్ధము.

మనసంస్కృతివృద్ధికి అంతర్జాతీయక్షేమముకు రాజకీయస్వాతంత్ర్యమవసరమనియు, ఆయారంగములం దభివృద్ధి గల్గించి, భారత జాతి అంతశ్శక్తి బలపర్చుటకు నిర్మాణకార్యక్రమపు వివిధాంశములు సహకారులనియు, గమనించినాము. వీటిశక్తిశక్తి నమలుజరిపినప్పుడు జాతీయజీవితమంతయు బాగుపడును. నిర్మాణకార్యక్రమము శ్రద్ధతో సాగించుచు అహింసాపద్ధతిచే స్వరాజ్యము సంపాదించుట కొకయుద్ధ ప్రక్రియయున్నది; ఇదే 'సత్యాగ్రహము' అనే అహింసాయుద్ధము. 'సత్యాగ్రహ'అనగా సత్యంనిమిత్తం పట్టుదలచూపుట; ఎట్టిబాధలనైనను సహించి వీరులై సత్యమను అహింసాపద్ధతినే కాపాడుట.

ఇట్టికొన్నియుద్ధములు:—దక్షిణాఫ్రికాలో గాంధిగారుజరిపినసత్యాగ్రహము పాసివ్ రెసిస్టెంసు(=శాంతనిరోధము)అనబడినది. అక్కడి భారతీయులందరు కలసి లక్షమందిమాత్రముందురు; అక్కడి పాలకజాతియగు తెల్లవారిసంఖ్య వారిద్రవ్యము భుజశక్తివగైరాలు మనవాటికన్న చాల హెచ్చు. ఆయుధములు అధికారము తెల్లవారివే. మరియు సాంఘికంగాను వారికున్నకట్టు, ఏకీభావము ఆత్మవిశ్వాసము భారతీయులకు లేవు. అయినను గాంధిగారికక్కడి భారతీయులకు అన్యోన్యత ఆత్మగౌరవము కార్యదీక్ష, అహింసాతత్వము గల్గించెను. ఆశ్వేతరాజ్యపు అన్యాయశాసనముల నెదిర్చి, వేలముద్రవేసి లైసెన్సులు తీసుకొనుట, తలపన్ను నిచ్చుట ఇట్టి కార్యములుచేయ నిరాకరింపజేసిరి. అయన అనుచరుల కాయనయందు నమ్మిక, పూజ్యభావము, ఉత్సాహమును ఏర్పడినవి. నాయకు లరెస్టుఅయి కోర్టులువిధించినశిక్షలతో జైలులో జేరుచుండిరి. జనుల కార్యదీక్ష శాంతత హెచ్చినవి. దౌర్జన్యము పురికొల్పుట కితరులు చేసినయత్నములు వ్యర్థమైనవి, తరువాత వేలకొలది అరెస్టుఅయినను, అభారతీయులు తమ వ్రతమువదలలేదు. పైపెచ్చు కొందరు చీను

లును వీరికిత్రోడైరి. ఎన్ని ఆశలు సర్కారువారుపెట్టినను, సాధారణంగా భారతీయులు తమవ్రతము వీడలేరు. సర్కారు ఆజ్ఞలకొప్పుకోలేదు; ప్రభుత్వమువారు రాజీకివచ్చి, తమ అక్రమశాసనము లాపుచేసిరి.

తరువాత గాంధిగారి దేశంలోను జనులచే చాల సత్యాగ్రహములు సాగించిరి. వీటిలో మొదటిది బిహారులోని చంపారణులో జరిగినది. ఈజిల్లాలోని కొన్నిచు భూములు యూరపీయులవి. వారీనుంచిభూములు తమప్రాబల్యముతో చౌకగ సంపాదించి, బీదరయితులద్వారా పంటలుపండించి, హెచ్చుశిస్తులు పెచ్చు లాభములు రాబట్టుచుండిరి. ఇదిగాక, అప్పటి హెచ్చుచేటుకు నీలిరంగు ఎగుమతివల్లను వారికి మంచిరాబడియుండెను. అంతకవసరమయే నీలియాకు నారయితులనుండిబలవంతముగ ఈనాందార్లగుతెల్లదొరలు రాబట్టుచుండిరి. వారు, నోరులేనిరయితులనుండి చిత్రవిచిత్రపు అన్యాయపు రుసుములును వసూలుచేయుచుండిరి. ఆజిల్లాఉద్యోగులందరు (ప్రజానాయకులును) వారితో కల్సిచుకొన్న తమకేమి ముప్పువచ్చునోయని జంకిరి. ఈస్థితినంతను నారయితులతరపునొకరు గాంధిగారితో చెప్పగా ఆయన (1917 సంలో) ఆజిల్లాకువెళ్ళి స్వయంగా రయితులనడిగి యథాస్థితినిగూర్చి వాఙ్మూలములుతీసికొనిరి. గాంధిగారాజిల్లాను తక్షణం విడువవలెనని వెంటనే అక్కడి మేజస్ట్రేటు ఆజ్ఞబంపెను. కాని, గాంధిగారు చలించక, అక్కడి అక్రమములను వైస్రాయికి పత్రికలకును తంతిద్వారా తెల్పిరి; అంతట గొప్ప ఆందోళనలేచినది. గాంధిగారి ధైర్యసాహసము లాశ్చర్యమొంది, శ్రీ రాజేంద్రప్రసాదు ఇత్యాదులాయనకండగైరి. ఇట్లు ఇరవైవేల రయితుల వాఙ్మూలములు తయారైనవి. ఈవార్తలు పత్రికలకెక్కినవి. ప్రభుత్వ మప్రతిష్ఠపాలైనది. 'గాంధిగారు పట్టుబిగువు' అనగహించి, అంతట సర్కారువారొక విచారణసంఘము పెట్టిరి. అందులో గాంధిగారు నొకసభ్యుడు. రయితుల కన్యాయము జరిగినదని ఆసంఘము విచారణపైన నిర్ణయించినది.

అంతట సర్కారువారు చట్టముద్వారా ఆ అక్రమచర్యలను అన్యాయరుసుములను రద్దుచేయించిరి. అప్పటినుండి శ్రీ రాజేంద్రప్రసాదుగారు గాంధిగారి సహచరులైరి.

ఆసాలాఖరున గుజరాతులోని అహమ్మదాబాదులో గాంధిగారు కార్మికులనిమిత్తంసాగించినది యీదేశపు రెండవసత్యాగ్రహము. అక్కడ చాల బట్టలమిల్లులున్నవి. వాటియజమానులు ధనాఢ్యులు. వారప్పటి యుద్ధకాలంలో మంచి లాభంతీసిరి; కాని వారిపనివాండ్రజీతములు తగురీతిని హెచ్చించలేదు. గింజలధరవరలు పెరిగినవి. కార్మికులమొర వ్యర్థమైనది. గాంధిగారిసూచనను ఆమిల్లుదార్లు పెడచెవినిబెట్టిరి. అంతట ఆయన కార్మికులచేత సమ్మెచేయించిరి; వారికి నీతిని కట్టును బోధించి, సమ్మెకాలపు నిరుద్యోగసమయమందు వారిచేత రాట్నములమీద నూలు వడికించి, వారికి స్వయంసహాయమును నేర్పిరి. కాని ఆకార్మికులకు చమువు, ఐకమత్యము, తగినంతజ్ఞానమును లేవు. కనుక మిల్లుదార్లు వారిలో కొందరిని భ్రమపర్చి, భేదంకల్గించి, వారిని పనిలోకి రప్పించిరి; అంతట తక్కిన కార్మికులు నిరుత్సాహులై జంకిరి.

ఈఅన్యాయమువల్ల కార్మికుల కట్టుచెడెను. అపుడు గాంధిగారు దీర్ఘోపవాసమారంభించిరి. తమకై గాంధిగారు ప్రాణమర్పించుచుండుట జూచి, లోగడ పనిలోజేరిన కార్మికులు నిగ్రహం వహించి,మరల సమ్మె దార్లతో కలిసిరి. అంతట మిల్లుదార్లను గాంధిగారిత్యాగముకు విభ్రాంతులై, లొంగిరి; పంచాయితీకొప్పుకొని ఆప్రకారం జీతములు న్యాయంగాహెచ్చించిరి. ఈఅహింసాయుద్ధమువల్ల అప్పటినుండి అక్కడి మిల్లు యజమానులు కార్మికులు మైత్రితోనున్నారు. తరువాత ఎప్పుడైనను తగువు వచ్చినను గాంధిగారు సూచించుప్రకార ముభయపక్షములును పరిష్కరించుకొనుటమామూలు. శ్రీమంతుల కప్పటిహృదయపరివర్తనపు ఫలితముగ సౌమ్యతత్వమేర్పడి, అది నేటికిని నిల్చియున్నది.

1918 లో గుజరాతులోని 'ఖైరా' జిల్లాలో మతోపద్రవము జరిగినది. ఆక్కడి పంటలుపోయి గొప్పక్షామము వచ్చినది. కనుక సర్కారువారు శిస్తులుపరిహారం ఆసాలుకు పన్నులు రద్దుచేయవలెను. కాని, ప్రభుత్వోద్యోగులు పంటలంతగా పోలేదని చెప్పి, 'కమిషన్' నీయక నిరాకరించిరి. అంతట గాంధిగారు స్వయముగా ఆజిల్లాలో తిరిగివచ్చి, పంటలు బొత్తిగా పోయినట్లు తగునిదర్శనములు చూపిరి. కాని ప్రభుత్వము లక్ష్యపెట్టలేదు; అంతట గాంధిగారు రయితులచేత ఆభూములకుమామూలు పన్నుల చెల్లింపునుకూడ సీదాగా మాన్పించిరి. అప్పుడు సర్కారువారు భూముల కిస్తీసొమ్ముల వసూలునిమిత్తము జప్తులు సాగించిరి. ఈలోగా గాంధిగారు పత్రికలద్వారా ప్రభుత్వోద్యోగుల అన్యాయమును వెల్లడించుచు తీవ్రవిచారం జరిగించిరి; అహమ్మదాబాదులోని బారిష్టర్లలో ముఖ్యుడగు వల్లభభాయిపటేలు మున్నగు పరిముఖులపుడు గాంధిగారి ధైర్యమునకు మెచ్చుకొని, ఆయనకు తోడ్పడిరి; బొంబాయివర్తకులు ద్రవ్యమిచ్చి సాయముచేసిరి. సర్కారువారు ఆస్తులు వేలంవేసినను, వాటిని పాడుటకెవ్వరును రాలేదు. సర్కారుదే తప్పని వెల్లడియైనది. అంతట, సర్కారు పూర్తిగ బీదరయితులందరికి బకాయికొట్టివేసి, రాజీపడిరి.

1919-23 ల మధ్య జరిగిన 'నాన్‌కోఆపరేషను' (=అసహకారము) రాజకీయము, మనదేశమంతటికి సంబంధించినది. దీనిని మొదట ప్రభుత్వమువారు చేయబూనిన రౌలటుచట్టమును ఖిలాఫతుఅన్యాయమునుఆక్షేపించుచు సత్యాగ్రహముగా ఆరంభించిరి.

జర్మను యుద్ధానంతరం పరిభుత్వము కొత్తనిర్బంధముల బెట్టిరి; టర్కీలో ముస్లిమురాజ్యముకపకారముచేసిరి; ఇక్కడిజనులలో స్వరాజ్యముకు ఆందోళనము జరిగినది. అప్పుడు గాంధిమహాత్ముడు అసహకారముసాగించెను. "ఆంగ్లపాఠశాలలవల్లను కోర్టులద్వారాను కచేరీలద్వారా

ను శాసనసభలవల్లను బ్రిటిషుప్రభుత్వప్రాబల్యముస్థిరపడుచున్నది. వాటి వల్ల మనభావదాస్యము హెచ్చినది. అది పోయినప్పుడే మన జనులకు స్వతంత్రిభావ మేర్పడును. కనుక, జాతీయవాదు లాసంస్థలను బహిష్కరింపవలె"నని కాంగ్రెసుసభ తీర్మానించి, ఈయుద్యమపు నియంతగ గాంధిగారి నేర్పర్చిరి. ఇందుకు చాల త్యాగము ధైర్యము అవసరము. విశాలదేశంలో వివిధశాఖలమధ్య ఐకమత్యము చాల కష్టసాధ్యము. కొందరు న్యాయవాదులు కోర్టులను, ఉపాధ్యాయులు విద్యార్థులు పాఠశాలలను, కాంగ్రెసుసభ్యులందరు శాసనసభ్యత్వములను, వదలిరి. కొద్ది మందిమాత్రం ప్రిభుత్వోద్యోగము కూడ విడచిరి. ఇందువల్ల ఆప్రిభుత్వ సంస్థల నిజస్థితి వెల్లడియై వాటిమీద జనుల వ్యామోహము తగ్గినది. నాయకులు మంచి పద్ధతులతో కొన్నిచోట్ల జాతీయవిద్యాలయముల స్థాపించిరి; కొన్నిచోట్లపంచాయతీసంఘములేర్పరిచి, కోర్టువ్యవహారముల బరిష్కరించిరి. అప్పుడు ప్రభుత్వసంస్థల వదలినవారును ప్రజాసేవాపరులై జాతీయోద్యమ పరులైనారు. ఈదేశీయుల వృత్తిహీనుల జేయు విదేశవస్త్రములను, నిర్వీర్యులుగజేయు మద్యపానమును బహిష్కరించుటకై వాటిమకాణములవద్ద శాంతముగ కాంగ్రెసుయునకులు నిరోధము సాగించిరి. దీనిని 'పికెటింగు' అందురు.

అప్పుడు (1921) బ్రిటిషుప్రభుత్వపు పరపతిని నిలువబెట్టుటకు సర్కారువారు బ్రిటిషు యువరాజుకీదేశమందు సంచారము జెట్టిరి. దానిని జాతీయవాదులు బహిష్కరించిరి. వేలకొలది పికెటర్లను సర్కారువారు జయిలులో నుంచిరి. చరమాస్థిమగు పన్నులసత్యాగ్రహమునకు దేశములో పూర్తిగ శాంతియునిగ్రహమునుకావలె. కొన్నిప్రాంతాలలో కొందరుపోలీసులను హింసించిరి; హిందూముస్లిములు కొన్నిచోట్ల పరస్పరం కొట్టుకొనిరి. కనుక, గాంధిగారు అసహాకారోద్యమమును నిల్పివేసిరి. అంతట నిర్మాణకార్యక్రమమునే సాగించుటకు గాంధిగారు తమ శక్తిని వినియోగించిరి.

1921-23 సం॥లలో పంజాబులో మరొక సత్యాగ్రహము జరిగినది. ఇది మతాచారములకు సంబంధించినది; సిక్కులమఠములను ఆలయములను 'గురుద్వార'ములందురు. ఇవి 'మహంతు'ల పాలనలో నుండును. వీటిలో కొన్ని గొప్పవి; వాటికివిశేషాదాయములునున్నవి. అయితే (ఇప్పటి హిందూమతస్థుల దేవాలయములలోవలె) ఆధర్మకర్తలలో చాలమంది తమధార్మికబాధ్యతను మరచి, విషయలోలురైరి. వీటిలో జరుగు దురాచారముల మాన్పి సంస్కరించుటకు కొందరు సిక్కు యువకులు ప్రతిజ్ఞపట్టిరి. వారే అకాలీలు. సామపద్ధతిచే ప్రయోజనములేక, ప్రభుత్వమువారు మహంతుల కండయైరి; అంతట వేరుదారిలేక, అకాలీలు కాంగ్రెసు సిద్ధాంతమనుసరించి సత్యాగ్రహం సాగించిరి అకాలీలుగురుద్వారములలో తమ గురుగ్రంథమును సమిష్టి భజనతో పారాయణచేయుచుండిరి. వారట్లు చేయకుండ, 'గురుకాబాగు'అను మతపు మహంతు మరికొందరు నిషేధించిరి. అయినను అకాలీలు చిన్నజట్లుగనేర్పడి, దానిలో గ్రంథము చదువుచుండిరి. వారిని వెంటనే పట్టుకొని పోలీసువారశిక్షచేసిరి. ఈ అకాలీలలోకొందరు లోగడ సైనికులైపెన్షనుదారులైయుండిరి. ఈ వీరులపుచూపిన అహింస అద్భుతము. తమ కన్నదుర్బలులైన పోలీసులు కొట్టినను, అకాలీ లోపికతో సహించిరి. దీక్షమాత్రం మానలేదు. ప్రభుత్వమువారంతట ఆగురుద్వారముల సంస్కరణకు చట్టముచేసి, కొన్ని దురాచారముల బోగొట్టిరి.

బెంగాలులో తారకేశ్వరదేవాలయముగూర్చి చాలయేండ్లొక సత్యాగ్రహము జరిగెను. ఇందులోను ఎందరో జైలుననుభవించిరి.తుదకు దాని దుష్టమహంతు తొలగెను; ఇదియు ధార్మికయుద్ధమే.

1922 సం॥పు బొర్సాను సత్యాగ్రహము విచిత్రమైనది. 'బొర్సాదు' గుజరాతులో చిన్నతాలూకా. ఇక్కడ 'దేవరబాబా' అను గొప్ప బందిపోటుదొంగ యుండెను. అతనిని పోలీసులు పట్టలేకపోయిరి. ఇంత

లో నొకతురక యతనికి పోటీగలూటీలారంభించెనట. పోలీసువారితనితో స్నేహముచేసి ఇతనిసాయముతో 'దేవర బాబా'ను పట్టజూచిరి. కాని క్రియలో ఆముస్లిము పోలీసుల తుపాకులతో తూటాలతో తనదోపిడిని సాగించుచుండెను. పోలీసులప్రవృత్తి జనులకపకారముగ పరిణమించినది; అంతట వల్లభాయిపటేలుగారి నాయకత్వమున జనులు సత్యాగ్రహమారంభించిరి; అంతట దేవర బాబా జట్టు అదృశ్యమైపోయినది కాని పోలీసులు ఆయిండ్లలో తిరుగుచుండిరి. వాటిఫోటోలు, వారి ఆయుధములు, గుండ్లు వగైరాల చిత్రములును పత్రికలలో ప్రచురితమైనవి. కాని సర్కారువారుశిక్షార్థపుపోలీసులనుపెట్టి, అదనపుపన్నును జనులనుండి వసూలు చేయబోయిరి. ప్రజలు కట్టుగట్టిరి. వారి ఆస్తులు జప్తుచేసినను కొనుటకెవ్వరునులేరు. తుదకు సర్కారువారా పోలీసు దళములను తీసివేసి ఆచర్యలను రద్దుచేసుకొనిరి.

దానిప్రక్క తాలూకాయగు 'బార్డోలి' లో 1927 లో మరొక సత్యాగ్రహము జరిగినది. అప్పుడక్కడిభూముల 'సెటిల్మెంటు' జరిగినది. అందులో సర్కారువా రాభూములకు రూపాయకు పావులాచొప్పున పన్ను హెచ్చించిరి. పరిస్థితులనుబట్టి ఆహెచ్చింపుకు సబబులేదు. ఈ సంగతిని రయితులు సర్కారుతో మొరపెట్టుకొన్నను నిష్ఫలమైనది. "న్యాయశాస్త్రపద్ధతిని చేయుచో న్యాయమనితేలితే ఆప్రకారమొప్పుకొందుము" అని రయితులప్రతినిధులనిరి. కాని సర్కారందుకొప్పుకోక, లోపాయికారిని పరీక్షించితిమనిరి. అంతట ఆపన్ను అన్యాయమని నిశ్చయించి, గాంధిమహాత్ముని సమ్మతితో, వల్లభభాయిపటేలు ఆరయితుల చేత సత్యాగ్రహము సాగించెను. సర్కారిట్లు విధించిన జాస్తిపన్నును కొట్టివేయువరకు ఆభూములపైన మామూలు పన్నునుగూడ రయితులిచ్చుటమానిరి. అంతట పోలీసులను పఠానులనుపెట్టి సర్కారువారు రయితుల ఆస్తులనుజప్తు చేసిరి; కాని జనులందరు కట్టుకట్టిరి; ఉద్యోగులు వేయించు వేలంలో కొనువారులేరు. సర్కారు తమ ఉద్యోగులచేతనే

పాడించిరి. పోలీసులు సైనికులు పెట్టు బాధ దుర్భరమైనది. అయినను రయితులు లొంగక పైసాలకు వ్యవసాయములు మానుకొని, ప్రక్కనున్న బరోడా రాజ్యమునకు ప్రస్థానము చేసిరి. సర్కారువారి కాభూములు దున్ను వారుదొరకలేదు. ఈలోగా దేశమందాందోళన హెచ్చెను. తుదకు ప్రభుత్వము రాజీకివచ్చి, బహిరంగవిచారణ చేయించిరి. రయితులవాదమే న్యాయమని తేలినది. ఆజాస్తిపన్నులు రద్దుచేయబడినవి.

ఈ అహింసాయుద్ధములన్నిటిలోను గొప్పది 1930, 1932 సంలలో జరిగినది. ఇది దేశస్వాతంత్ర్యంనిమిత్తమని జరిగినది కొందరిసూచన పైన భారతదేశపు రాజ్యాంగప్రణాళికను 1928 లో అన్ని పక్షముల వారుకలిసి 'నెహ్రూరిపోర్టు' అనుపేర తయారుచేసిరి; దీనిలో మితమైన బాధ్యతాయుత ప్రభుత్వమును మాత్రం కోరిరి. అయితే అట్టి దానినికూడ ప్రసాదించుటకు ప్రభుత్వ మిష్టపడలేదు; కనుక సంపూర్ణ స్వాతంత్ర్యమే మనలక్ష్యమని 1929 సం॥ ఆఖరున తీర్మానించి సత్యాగ్రహమునకు కాంగ్రెసువారు గాంధిమహాత్ముని నియంతగా ఏర్పర్చిరి. అయన నిర్ణయించినప్రకారము 1930 ఏప్రిలు నుండి దేశమంతట నిది సాగినది. ప్రభుత్వంవారి కొన్ని అన్యాయపు శాసనములను శాంతంగా ఉల్లంఘించుటే యీసత్యాగ్రహము. ఉప్పుపన్ను అన్యాయమని చాలసార్లు భారతశాసన సభవారు తీర్మానించినారు. దీనిని ఉప్పు ఉత్పత్తియగు మళ్ళలో ముంచుగనే చెల్లింపజేసి ఈపన్ను వ్యాపారస్థులనుండి వసూలు చేయుచుండిరి. ప్రజలు ఉప్పును స్వయంగానే తయారుచేయుట గనులనుండితీయుట అట్టి ఉప్పునువాడుట సరఫరా చేయుటయు ఉప్పుసత్యాగ్రహమగును. ప్రకృతిలో సమృద్ధిగనుండు ఉప్పు ఈపన్నువల్లనే ప్రియంగా అమ్ముచున్నది. ఏపన్నును యివ్వలేని బీదలును ఉప్పుకొనివాడుచుండిరి. కనుక ఈపన్ను బీదలకు తలపన్నువంటిది. ఈపన్నువల్ల సర్కారుకులాభమేగాక, బ్రిటిషువర్తకు లింగ్లండునుండి నౌకలలోఉప్పు తెచ్చి యిక్కడ అమ్మిసొమ్ముచేసుకొనుటకును వీలైనది.

అప్పుడు దండీ, గుజరాతు, కాకినాడ వేదారణ్యం మొదలగు వేవుస్థలములలో సత్యాగ్రహంద్వారా కొందరుఉప్పుతయారుచేసిరి. దీని నారంభించిన గాంధిమహాత్ముని, తక్కిన కాంగ్రెసుప్రముఖులను సర్కారువారుపట్టి, ఉప్పుచట్టపు ప్రకారం ఖైదులోపెట్టిరి. విదేశీబట్టలకొట్లకు కల్లుగళ్ళకు పికెటింగు నారంభించిరి. ఖద్దరుబట్టలకు ప్రబోధముజరిగి నిలవఖద్దరంతయు ఖర్చైనది. జనులయుత్సాహ మతిశయించినది. కల్లు ఖర్చుతగ్గి జనులస్థితి బాగుపడినది. కాని ప్రభుత్వముకు బ్రిటిషువ్యాపారస్థులకును అబాధతు ఆదాయముతగ్గినది. వేలకొలదిగ సత్యాగ్రహము చేయుచుండిరి. అంతట పోలీసులు సత్యాగ్రహులను చెదరదీయుటకని లాటీలతోకొట్టిరి. కొన్నిచోట్ల తుపాకులుపేల్చిరి. ఇక్లెన్ని బాధల పాలైనను ఆస్తులుపోయినను జాతీయవాదులు అహింసామార్గము తప్పలేదు. సుమారు రెండులక్షలమంది కప్పుడు శాంతంగానే ఏదోరీతి శాసనోల్లంఘనమును సాగించియుందురు. కొందరు పన్నులీయరు నిరాకరించిరి. అందువల్ల బ్రిటిషు ప్రభుత్వపుపునాది కదలును. అంతట సర్కారువారు రాజీకివచ్చిరి, (1931 మార్చి). ఇదే గాంధిఇర్వినుసమాఖ్య. ఈప్రకారం మనదేశముకు వెంటనే ప్రజాయత్త రాజ్యమిచ్చుటకు సర్కారు సమ్మతించిరి. కాని భారతదేశక్షేమమును కవసరమయే కొన్నిమినహాయింపులుండవలె ననాగు ఈసమాఖ్య ప్రకారం ఆసత్యాగ్రహము నిల్చిపోయినది.

ఇట్లు కొన్ని నెలలు గడచినవి. లండనులో అప్పుడు రాజ్యాంగసంస్కరణసభకు సర్కారువారి యాహ్వానమున కాంగ్రెసు తరపున గాంధిమహాత్ముడు వెళ్ళెను. భారతీయులకు స్వాతంత్ర్య మిచ్చుట న్యాయము, లోకముకుక్షేమకరము. అని ఆయన విశదపర్చెను. కాని, వట్టి సామ్రాజ్యతత్వపువారు ప్రభుత్వపాలకులైరి. ప్రభుత్వ నియమితులైన జమిందార్లలో కులతత్వపువారిలో సాంఘికసమస్య ప్రాముఖ్యముకు వచ్చెను.

బ్రిటిషువారు భారతీయులకు కేంద్రాధికార మొప్పగింతుమని ముందుగా ప్రకటించితే, అంతట సాంఘికసమస్య సులభముగ పరిష్కార మగును. కాని ప్రభుత్వ మట్లు చేయలేదు. మనలో సాంఘికంగా పర స్పరమున్న విభేదమునకు హెచ్చు ప్రాముఖ్య మిచ్చి, అధికారులు తమ స్వార్థపరతను హింసాతత్వపు మాయతోకమ్ముకొనిరి. రాజీ చెడి మరల సంఘర్ష మారంభమైనది. అంతట గాంధిమహాత్ము డీదేశమునకు మరలి రాగనే కాంగ్రెసుకార్యవర్గసభ జరిగి సత్యాగ్రహము నిశ్చయమైనది. ఆయనను తక్కిన కాంగ్రెసుప్రముఖులనుగూడ వెంటనే ప్రభుత్వము వారు జైలులో నుంచిరి. వేలకొలదిజనులు మరల సత్యాగ్రహంచేసిరి. సర్కారువారు భేదతంత్రమును పూర్తిగ ప్రయోగించిరి; దౌర్జన్యము జరిగినది. అప్పుడు ప్రజలలో ధైర్యము ఐక్యము త్యాగభావము క్షీణించినవి.

ఈలోగా సాంఘికసంఘర్ష ము ప్రకోపించినది. సర్కారువారేర్పర్చుకొత్తరాజ్యాంగములో హరిజనస్థానపు అభ్యర్థులను కేవలంహరిజనులే యెన్నుకోవలెనని, వారినిభిన్నమతస్థులవలె విడదీసిరి. ఇది సవర్ణులకునారి జనులకుమధ్య కలతలకు కారణమై, హరిజనుల అస్పృశ్యతనుశాశ్వతంచే యును. రెండుపక్షములనాయకులు అంగీకరించిననే ఈపద్ధతినిమార్తుమని సర్కారువా రనిరి. ఈసంఘనాయకుల హృదయములు కరగించుటకై గాంధీగారు జైలులో దీర్ఘోపవాస మారంభించిరి. అంతట ఉభయపక్ష నాయకులును ఈసమస్య ప్రాముఖ్యమును గుర్తించిరి. శాసనసభలలో హరిజనస్థానముల సంఖ్య హెచ్చించిరి; ఒకరీతి సమిష్టినియోజనపద్ధతిని నిర్ణయించిరి. అంతట ప్రభుత్వమువారా రీతిని రాజ్యాంగమును సవరించిరి. అప్పటినుండి గాంధీగారును కొంద రితరనాయకులును కేవలం హరిజనోద్ధరణకార్యమే చేయుచుండిరి. ఈకారణము లన్నిటివల్ల ఆరాజకీయ సత్యాగ్రహము క్రమంగా క్షీణించినది.

ఇవిగాక మరికొన్ని చిల్లరసత్యాగ్రహములను అక్కడక్కడ జరిగినవి. జాతీయపతాకము నిలువబెట్టుటకు కాకినాడలో జరిగినది, వర్కలై గురువాయూరులలో హరిజనుల దేవాలయప్రవేశంనిమిత్తం కొందరు సాగించినవి, ఇందు వేరొక్కనదగినవి.

ఇట్లే వ్యక్తిగతంగా కుటుంబజీవనంలోను భార్యా పుత్రాదుల పైన మిత్రులమీదకూడ నైతికసూత్రముల విషయంలో గాంధిగారు వ్యక్తిసత్యాగ్రహము లాచరించియున్నారు. గృహమందలి స్వకీయులకు మిత్రులకుగూడ నిగ్రహము నైతికత సత్యాగ్రహ తత్వము తెలిసి అభ్యస్తమగువరకు వారితోప్రవర్తన సత్యాగ్రహి కొంతభావభేదముకు అందువల్ల భిన్నప్రవర్తనకును సిద్ధపడవలెను. అట్లు గాంధిగారికిని తటస్థించినది. అటిసితిలో వారితో సత్యాగ్రహము అవసరమయినది. తరువాత అట్టి అవసరము పోయినది. ఇప్పుడు గాంధి మహాత్ముడు సాగించుచున్న యుద్ధసత్యాగ్రహమునుగూర్చి తరువాత చర్చింతము.

33. సత్యాగ్రహ సూత్రములు.

లోగడచెప్పిన అహింసాయుద్ధముల వివరమునుబట్టి తేలు ముఖ్య సూత్రముల నిప్పుడు గమనింతము.

ఏయుద్ధముగాని జయప్రదముగ సాగింపవలెనంటే ఐకమత్య మవసరము. ఇప్పటి హింసాయుద్ధము నాయూజాతు లెంత యేకాగ్రత తో జరుపుచున్నవో చూడుడు. చిన్నప్రాంతములోనో ఒకశాఖలోనో ఏకీభావ మేర్పర్చుట కొంతసులభము. కాని, 35 కోట్ల భారతజాతి కంతకు సంబంధించు మహోద్యమును కెంతదీక్ష ఏకీభావము నుండ వలెను! వేర్వేరు కులములు మతములు వర్ణములు గల మనజాతిలో భేదభావము లేర్పడుటసులభము. వాటిని పోగొట్టి ఏకోద్దేశముతోకృషి జేయుటకు జనులలోత్యాగము కార్యదీక్ష పరస్పరప్రేమ సహనబుద్ధియు కావలెను. నిరాయుధులు శాంతులు వేర్వేరు మతములు కులములు కలసియున్నవారు హింసాయుద్ధము సాగింపబూనుట ప్రమాదకరము. ఒకసారి శత్రుపుపైన రేగిన హింసాభావము పరస్పరహింసగను పరిణమింపవచ్చు. మనప్రత్యర్థి అట్లు మరల్పయత్నించుట, అట్లు సాధించుట యుసహజము. కనుక మనమోధులుహృదయంలోకేవలం అహింసాపరులుకావలె. శత్రుపక్షీయులుఅహింసామోధులను బాధించియు, దూషించియు వీరిలో కలతలు పోరు కలిగించియు హింసలోకి దింపవచ్చు. అయినను సత్యాగ్రహు లెంతమాత్రమును హింసకు పూనకూడదు. మనస్సులోను హృదయములోను ఆంగ్లేయులపైన గూడ ద్వేషము హింసాభావము లేకుండవలెను. చుట్టుపట్లగూడ అహింసావాతావరణము నిలుపవలెను. అహింసాయుద్ధము జరుగుచున్నప్పుడు హింసాచర్యలుండుట అనర్థకము. కనుక ఈదేశపు విప్లవకారులు తమ హింసాచర్య లన్నిటిని కట్టిపెట్టిననే సత్యాగ్రహయుద్ధము సాగింప వీలగునని లోగడ గాంధిగారుస్పష్టపర్చిరి. అంతటవిప్లవకారులు హింసాచర్యల మానివేసిరి. దీర్ఘ

శిక్షలొంది అండమానులకు పరివాసితులై నయువకులును గాంధీబోధను హర్షించి, హింసాత్మకయుద్ధమందు నమ్మకమదలి అహింసాపథులై, ఆసంగతిని ప్రకటించిరి. అంతట వారిని గాంధీగారి సూచనప్రకారం ఆయారాష్ట్రప్రభుత్వములు చాలవరకు విడుదలచేసినవి.

అహింసాయుద్ధమును కేవలం నైతికంగాను న్యాయమగు ఆశయముల నిమిత్తమునే సాగింపవలెనని యీ పైవివరణవల్ల తేలినది. ప్రజాక్షేమముకు వ్యతిరేకముగా దానిని బాధించుటకు సత్యాగ్రహము నెప్పుడును చేయ గూడదు. ఇది భౌతికశక్తితో ఆత్మశక్తికి జరుగు పోరు; నైతికాశయములకే ఆత్మబలము చేకూరును. సద్భావముతో దీనిని సాగించినప్పుడే జరులకు హృదయపరిణామము కల్గును. సత్యాగ్రహము ఆర్థికరాజకీయములకు ధార్మికములకు గూడ పనికివచ్చును; ఇది పై ఉదాహరణలవల్లస్పష్టమే.

అహింసాపరులు ముందుగా సామరూపంగా అనగా ప్రతిపక్షికిలోకులకు నచ్చజెప్పి కార్యసాధనచేయుటకు మనస్ఫూర్తిగా యత్నింపవలెను. ప్రత్యర్థిహితముకు కేవలము లౌకికమూర్ఖతవహించినప్పుడేసత్యాగ్రహమారంభించవలెను, అందువల్ల ఆలస్యమైననుసరే, ఉద్యమముకు బలమేర్పడును. అది చరమాస్త్రము. దాని యుద్దేశమును, ఆశయమును, యుద్ధపద్ధతిని ప్రజలందరికి తెలియునట్లు ముందుగా బోధించి, అది న్యాయమని కనపర్చుచు, ప్రచారము చేయవలెను. అప్పుడే దాని సారమును అందలి నైతికభావమును జనులకు తెలియును. ఉత్సాహమును పూనికయు జనులకు కల్గును. ఆ యుద్ధమారంభించుముందు, యుద్ధమధ్యమందుగూడ, ప్రత్యర్థి రాజీకి వచ్చేయెడల, అందుకు సిద్ధులై న్యాయమగు రాజీ కంగీకరించవలెను. అహింసాయుద్ధము చాలవరకు సరిగా సాగినమీదట శత్రువు న్యాయమైన రాజీకి రాకతప్పదు. అట్టి సమయములకు ప్రజలు అంగీకరింపవలె; స్వల్పములనిమిత్తం పట్టుదలలు కూడదు.

అహింసాయుద్ధము ఆధ్యాత్మికము; కనుక, ఆ యోధులు సత్యపరులై ఈశ్వరభక్తి కలిగియుండవలెను. ఈశ్వరేచ్ఛ మనకు తెలియదు. మనుష్యుడు కేవలం అల్పజ్ఞుడు. యుద్ధసమయములో మనము గ్రహింపలేని కొత్తసందర్భములును అవరోధములును రావచ్చు. అప్పుడీశ్వరుడే మనకు మార్గము తోపింపవలె. కనుక ఈశ్వరుని నమ్ముకొని పరిశుద్ధులమైధ్యానింపవలె. అప్పుడే ఈశ్వరచోదన కలుగును.కనుక నిజమగు ప్రపత్తిగలవారే ఈ యుద్ధపు ముఖ్యనాయకులు కాగలరు. సమిష్టిసత్యాగ్రహము జరిగించునప్పుడు ఆయాసంఘములలో జనులలో అహింసను పరస్పరమైత్రిని దృఢపర్చవలెను. జనులు అన్నవస్త్రములకు పరాధీనులు కాకుండునట్లు చేయవలెను. లేనియెడల అహింసాయుద్ధము తీవ్రంగా సాగుచుండగా, ఆర్థికంగా వస్త్రాదులకు ప్రత్యర్థియైన సర్కారుపైనో వారికి లోబడు మిల్లుయజమానులపైనో ఆధారపడితే, ఆ పుంజీపతులు తత్కాలముకు కొంత సహాయకులైనను, కొద్దికాలంలోనే ఉద్యమము దుర్బలమై చెడిపోవును. 1932 లో అట్లే జరిగినది. కనుక నిత్యావశ్యకములకు స్వావలంబమును మైత్రియు గల్గియుండవలెను. మొత్తముమీద నిర్మాణకార్యక్రమము జనులలో బాగుగ వ్యాపించినప్పుడే అట్టి పరిస్థితి కల్గును. కనుకనే నిర్మాణకార్యక్రమం పూర్తిగ సాగించితే, ఏడాదిలోనే స్వరాజ్యము వచ్చునని, గాంధిమహాత్ముడు 1921 సం॥రంలో చెప్పెను. కాని ప్రజలట్లు సాగించలేదు.

హింసాయుద్ధముల ప్రయత్నములు కార్యకలాపము గూఢముగ మోసముగ జరుగుచుండును. కాని, సత్యాగ్రహములో రహస్యధోరణి, గూఢచర్యలు, కూడదు. అంతయు బహిరంగముగనే సాగించవలెను. రహస్యతవలన భయము పిరికితనము హింసాతత్వము నేర్పడును. వాటి వల్ల తుదకు అహింసాయుద్ధము విఫలమగును.

34. అహింసాపాలనపు పరీక్ష.

1934 సం॥లో సత్యాగ్రహము నిల్చిపోయినప్పుడు, కొందరు జాతీయనాయకులు, కేంద్రశాసనసభలో ప్రవేశించిరి. గాంధీయులును గాంధిమహాత్ముడు అందుకనుమతించిరి.

1923 లో దాసు మోతీలాలువంటి గొప్పనాయకులు శాసనసభా ప్రవేశమాశించినప్పు డందుకు గాంధిపక్షీయులు వ్యతిరేకించిరికదా! 'స్వరాజిస్టు'లు అప్పటి 'కౌన్సిళ్ళు' హానికరములని యెంచియు, అందు లోనుండియే సర్కారువారి దుష్టచర్యలను ప్రతిఘటింపుచు అప్పటి ద్వంద్వప్రభుత్వమును భంగపరుపబోయిరి. అది ఒకరీతి విధ్వంసకచర్య. ఇట్టిచర్య పూర్తి అహింసావాదుల కిష్టముకాదు. అప్పటిప్రభుత్వపు మంత్రులు భారతీయులే. వారికి నిజమైన అధికారములేదు; స్వరాజిస్టులకు వారికికాలుష్యము గల్గినవి. నిర్మాణకార్యపుదృష్టివెలుకబడినది.

1937 సంవరపు కొత్తరాష్ట్రపాలనలో మంత్రులకు కొంతయధికారమేర్పడినది. దేశీయులలో అహింసా ధైర్యములను తత్సానకమగు నిర్మాణకార్యమును బాగుగ విస్తరింపజేయు వీలుకల్గినది.

కాంగ్రెసువారు సభలలో జేరియెడల, అందుండి ఆయారాష్ట్రాలలో ఈపనులుచేసి వృద్ధిచేసి, తద్వారా కాంగ్రెసును బలపర్చవలెనని గాంధీగారుకోరిరి. అస్పుడు రాష్ట్రాలలోజరిగిన యెన్నికలలో కాంగ్రెసువారు పాల్గొనిరి. అప్పటికి దేశంలో జాతీయభావమును తమ భౌతిక బలంతోను హింసాశక్తితోను నశింపజేసితిమని బ్రిటిషు ప్రభుత్వముతలచిరి; కాని అట్లు కాలేదు.

సర్కారు హింసాబలంవల్ల తత్కాలముకు అణగినట్లుండినను, నైతికబలంవల్ల జనుల అంతశ్శక్తి పెచ్చునేగాని తగ్గదు. ఇది అహింసా ప్రభావము; కనుక ఆ ఎన్నికలలో 7 రాష్ట్రములప్రజాసభలలో కాంగ్రెసుపక్షమునకే ప్రాబల్యము కలిగినది. అక్కడను ప్రతిష్టంభనమే చేయ

వలెనని సామ్యవాదు లుద్దేశించిరి. కానిఅట్టిది హింసాప్రవృత్తికిదింపును. ఆక్టుషరతులకులోబడి మంత్రులు జరుపు మామూలుపాలనలోగవర్నర్లు కల్పించుకోమని మాట యిచ్చేయెడల, వీలైనచోట్ల కాంగ్రెసుపక్షీయులు మంత్రిత్వం వహింపదగునని గాంధీగారు సూచించిరి. ఆప్రకారం వా రేడు రాష్ట్రాలలో మంత్రులైరి. 'సామ్రాజ్యతత్వముతో పోరుము మన్న కాంగ్రెసువా రిప్పుడు దానికిలోబడి రాజ్యముసడపుట సామ్రాజ్య సహకార మగు' నని కొంద రాక్షేపించినారు. ఇది పై కల్లోలోచును. కాంగ్రెసు మంత్రులు వెంటనే గవర్నరుతో ప్రతిఘటించి 'డెడ్లాకు' (ప్రతిష్టంభన) కల్గించుట సులభమే. కాని అది విధ్వంసకమే; అహింసా వర్ధకంకాదు. కాంగ్రెసును బలపర్చి జాతీయశక్తిని హెచ్చించవలె; అందుకు దేశంలోనిర్మాణకార్యమును వృద్ధిచేయుటకే ప్రభుత్వబలమును బ్రజాశక్తినిగూడ కాంగ్రెసు వినియోగించినది. పూర్వపుప్రభుత్వోద్యోగులు ఖదరు జూచి కంటకించుకొనిరి, సాంఘికతత్వమును హెచ్చించిరి. ఆప్రభుత్వము మద్యపానము ప్రోత్సహించిరి. కనుక నిర్మాణ కార్యమన్న ప్రజలును జంకిరి. ఇప్పుడు కాంగ్రెసువారుద్యోగంవహించగనే మంత్రులు ఖదరు ప్రోత్సహించిరి; చర్కా-సంఘములబోషించిరి. కొన్ని రాష్ట్రములందు కొందరు సర్కారు నౌకరులు ఖదరు చుస్తులే ధరించు నట్లాజ్ఞవచ్చినది. ఇట్లే మద్యనిషేధమునుగూడ కొన్నిజిల్లాలలో సాగించిరి. ఇంపువల్ల తగ్గిన సర్కారు ఆదాయమును వేరుపన్నుల వల్లను కొన్నిఖర్చుల తగ్గింపుద్వారాను పూడ్చుట కారంభించిరి. అహింసా వ్యాప్తికై మంత్రులు ప్రచారము చేసిరి. అహింస కవసరమగు హరిజనోద్ధరణకు కృషిని అస్పృశ్యతానివారణకు చట్టమునుచేసిరి. కొన్ని ప్రాంతములందు నిమ్నజాతులకు సౌమ్యంగా దేవాలయప్రవేశ మిప్పింపదగు చట్టముల జేసిరి. సాంఘికమైత్రికై అల్పసంఖ్యాకుల కుద్యోగాదులందు ప్రత్యేకసౌకర్యము నిచ్చిరి. సామాన్యభాషయైన హిందూస్తానీని 1, 2, 3 వ ఫారములలో తప్పక బోధించుటజేసిరి. దొరికినంతవరకు స్వదేశీ

వస్తువులనే సర్కారుకచేరీలలో వాడుటట్లు నిర్ణయించిరి. ఈనిర్మాణ కార్యము వేగంగాబలపడితే అహింసాభావము ప్రజలలో నాటుకొనేది. అప్పుడు దేశపు ఆర్థికనైతికస్థితితో బాటు రాజకీయంగా మంత్రుల బలమును హెచ్చి యుండేది. అవసరమైతే బ్రిటిషు సర్కారుతో అహింసా యుద్ధము సాగించుటకును ప్రజలు సిద్ధమైయుండియుందురు.

కాని, నిర్మాణ కార్యపునిర్వాహము సరిగా జరుగలేదు. మంత్రిత్వము వచ్చిన 27 నెలలకే రాష్ట్రములలో కాంగ్రెసు మంత్రులు తమ ఉద్యోగముల వదలుకోవలసి వచ్చినది. 1939 సం॥ సెప్టెంబరులో మహాయుద్ధము రాగనే, రాష్ట్రప్రభుత్వముల సమ్మతిలేకుండా కేంద్ర ప్రభుత్వమువారే రాష్ట్రములందును యుద్ధావసరమునకని తమకుతోచే పనులు చేయనారంభించినారు. నిరంకుశతహెచ్చింప ఆర్డినెన్సులను దేశమంతటను మంత్రుల సమ్మతిలేకుండ జారీచేసినారు. కొన్నిపన్ను లకు రాష్ట్రీయప్రభుత్వములుండే అధికారమునుగూడా తగ్గించుచు 1940 లో పార్లమెంటులో మరొక సవరణచట్టము చేసినారు. ఈదేశపు సేనా ద్రవ్యసంపత్తులను యుద్ధకార్యములకె వినియోగించుటకు కేంద్రం లోరాష్ట్రాలలోగూడ ప్రయత్నమారంభించినారు; ఈకాలపు యుద్ధ మనేది అన్నిప్రక్కలను మహాహింసకు పోషకము. మంత్రులిక ఉద్యోగాలలోనుండి అహింసాతత్వమును నిర్మాణకార్యమును పోషింప వీలు లేదు. ప్రజాస్వాతంత్ర్యపు హక్కును ప్రచురింప బ్రిటిషు ప్రభుత్వము నిరాకరించిరి. ఈసున్ని సందర్భాలవల్ల కాంగ్రెసువారు మంత్రిత్వము వదరి; కనుక పాలనాధికారంద్వారా నిర్మాణకార్యమును వృద్ధిజేయు యత్నము సగంలో నిల్చిపోయినది.

కాంగ్రెసుమంత్రిత్వపు అనుభవములగూడ ఇప్పుడు పరిశీలింతము. కాంగ్రెసుమంత్రుల తోడ్పాటుతో ప్రజలందరూ అహింసను స్థాపించి నిర్మాణకార్యక్రమము నుత్సాహంతో అమలుజరిపితే మరల సత్యాగ్రహయుద్ధ మవసరముకాదు. ప్రజాశక్తి హెచ్చి స్వాతంత్ర్యము

లభించవచ్చును. స్వాతంత్ర్యయుద్ధ మవసరమైనను దానిని సాగించుట కును ముందుగా నిర్మాణకార్యం సాగించుట అవసరము, కనుక ఈతరు ణంలో ఆపని పూర్తిచేయదగును' అని గాంధీమహాత్ముడు 1937 జూలై లో సూచించిరి. తరువాతనూడ అందునుగూర్చి అయన చాలసార్లు హెచ్చరించినారు. ఈవిషయంలో మంత్రులు ఇంకను బాగుగాపనిచే యుట కవకాశముండినది. ప్రభుత్వం పోలీసు, అబ్కారీ వగైరా ఆయా ఉద్యోగులకిచ్చు దుస్తులన్నిటిని ఖదరులోనే తయారు చేయించవచ్చును. గ్రామాలలో ఖదరుఉత్పత్తికింకను ప్రోత్సాహమిమ్మాయవచ్చును. హరిజ నులకు చెరువులు బావులు వగైరాలందైనను అస్పృశ్యతా నివారణ నెక్కువ చురుకుగ జరిపియుండవలసినది. దేవాలయ ప్రవేశముగూర్చిన చట్టము నింకను విశాలముగ సులభాచరణీయముగజేసి యుండవలెను. ఆమందపు చట్టమునైన మలబారుకేసెట్టిరి. అది వ్యర్థమైనది. దేవాల యాల అజమాయిషీచేయు ఎండోమెంటు బోర్డుఅధికారుల కీకార్యక్రమ మందు తగు శ్రద్ధఉత్సాహములేవు మదరాష్ట్రంలో జమీందారీభూ ములకు కొత్తశాసనము చేయ కృషిజరిగినది. కాని, అది చట్టముకాక రయితుల బాధలట్లేయున్నవి మొత్తంమీద కాంగ్రెసు మంత్రులు తమ కుండిన కొలది అవకాశంలో బాగుగనేపనిచేసిరి. అయితే, ఈవిషయం లో ప్రజలు తమ బాధ్యతను సరిగానెరవేర్చలేదు; వారు మంత్రులకింకను సర్వాధికారములేదని గ్రహించలేదు. అహింసాపాలనలో మంత్రులకుం టుబాధ్యతలను కనిపెట్టక కొందరు మంత్రులకు బాధకల్గించిరి.

యజమానులకు కార్మికులకు, జమీందార్లకు, రయితులకు హరిజనులకు, సవర్ణులకు, హిందువులకు, ముస్లిములకు, జాతీయతకు, ప్రాంతీయతకు ఇట్లు ఆయాసంఘములమధ్య సమన్వయమును మంత్రు లుచేయుచుంటే, ఇందుకు వ్యతిరేకంగా కొందరు యుక్తనాయకులు ఆందోళన, అల్లరులు లేవదీసి, మంత్రులకుక్లిష్టసమస్యలు తెచ్చిపెట్టిరి. కొందరు వరుసగా సమ్మెలుసాగించిరి. వీటిని పరిష్కరించుటకు మంత్రు

లకాలము వ్యయమైపోయినది. వీటివల్ల సంఘర్షము పెరిగి, మన ప్రాంతంలో ఉభయ తారకమైన కాన్స్ట్రక్టివ్ శాసనము చేయుటకు కాన్స్ట్రక్టివ్ యగు గిట్టుబాటుకినితగు అవకాశము లేకపోయినది. కొన్ని జమీందారీలలో కల్లోలము కల్గినది.

కొందరు తీవ్రంగా సామ్యవాదోపన్యాసాలలో హింసాతత్వపు సూచనలజేసిరి. అందుకు వారిపైన చర్యజరిగినది. దీనివల్ల పౌరస్వేచ్ఛకు కాంగ్రెసుమంత్రులు భంగముగల్గించిరని ఆందోళన గల్గినది. కొందరు సామ్యవాదులు 'ఫార్వర్డ్‌బ్లాకు' వారును వర్గసమన్వయముకు వ్యతిరిక్తంగా వర్గసంఘర్షమునుసాగించినారు. అసలుముఖ్యసమస్యల అధికారము చాలవరకు కేంద్రప్రభుత్వపు చేతిలోనున్నది. అందులో కాంగ్రెసువారికెట్టి సాక్ష్యమును ఇంకనుకలుగలేదు. రాష్ట్రాలలోను ఆర్థికాధికారము సంకుచితము, కార్యనిర్వాహము ఐ.సి.ఎస్. వారిది. అదిబ్రిటిష్‌ప్రభుత్వముక్రింద ఉన్నది. ఆపెద్దయుద్యోగులపైన నిజమైన అధికారము మంత్రులకులేదు. అయినను యావత్తు బాధ్యతలను కాంగ్రెసుమంత్రులే నిర్వహింతురన్నట్లు చాలమంది నమ్ముచుకొనిరి. మంత్రుల సానుభూతితో జనులు వేగంతో నిర్మాణకార్యక్రమమును సాగించియుండలేరు. కాని జనులువిశేషంగా ఖద్దరుధరింపలేదు; ఉత్సాహులైన చాలయువకులును (గాంధీయులకన్న తీవ్రవాదులైనను) నిజమగుస్వదేశీ నాచరింపలేదు. మద్యనిషేధం, అస్పృశ్యతానివారణ, హిందూ ముస్లిం మైత్రి, ఇత్యాదుల ప్రచారమును దీక్షతో జరిగింపభారంవహించలేదు ఈయువకులకు ఇంకాక్రమశిక్షణకావలెను, ఉద్యోగులు విద్యార్థులు సామాన్యప్రజలుగూడ చాలవరకుమిల్లుబట్టలు పంచదార ఇట్టి యాంత్రికవస్తువులనే (నేటికిని) హెచ్చుగావాడుచున్నారు. చాలచోట్ల హరిజనులు చెరువులు, బావులుబడులు వగైరాలలను ముట్టుటకుగూడ అనేకులుసవర్ణులు వ్యతిరేకించియున్నారు. అట్టిప్రయత్నములు జరిగినచోట్ల కొట్లాట అల్లరులును జరుగుచున్నవి. గ్రామజీవితము బాగుపడలేదు. 'వృద్ధనాయకులు మంత్రిత్వాలలోజేరి జాతీయ యుద్ధమును

వెరచుచున్నారని వారిని విద్యార్థులు యువకులు నిందించినారు కాని, ఇప్పుడు సత్యాగ్రహము మితంగా నైనను తప్పిచగా, అందుకు అవసరమైన అంతశ్శక్తిము అహింసాబలమును దేశములోచాలవని నిదానంతో చూచుటాకి స్పష్టమైనది కాంగ్రెసుమంత్రివర్గమునుండిపూర్తి ఫలమును జనులు పొందలేదు. అహింసాశక్తి యింకను జనులలో బాగుగ వ్యాపించలేదు.స్వయంకృషి సంఘీభావము కావలెను. ఎన్నిశాసనము లేర్పడినను ప్రజాభావము వాటినిసద్భావనతోను సంఘప్రేమతోను అమలుజరిపి, జనులలో అహింసాభావము వ్యాపించినప్పుడే, అవిజయప్రదంగా అమలు జరుగును. అహింసకు ప్రత్యక్షసాధకమగు నిర్మాణకార్యక్రమమునిప్పటికైన భారత భావిభాగ్యముకోరుప్రతివారును, యావచ్ఛక్తితో సాగించవలెనని సత్యాగ్రహప్రభు హెచ్చరించినారు.*

---

* The constructive work prescribed by the Congress is the best preparation ... ... Those therefore who wish to see India realise her destiny through non-violance should devote every ounce of their energy towards fulfilment of the Constructive Programme in right earnest without any thought of Civil Disobediance.

(1-6-1940 తేదీని హరిజనపత్రికలో గాంధిమహాత్ముని వ్యాసము.)

35. జాతిద్వేషపు ప్రాబల్యము.

పశ్చిమ యూరపురాజ్యముల ఆక్రమణవల్ల ఆఫ్రికా అమెరికా (లలో) భారతదేశాదులలోనురంగుజాతుల ఆర్థికస్థితితో బాటు మానవత్వమును క్షీణించినది. ఈజాతులు వట్టి అనాగరికులని, వారికి తామే మానవత్వము గల్గించి యుద్ధరించుచున్నామని, ఈపాలకవర్గములు తరుచు ప్రచురింతురు. శ్వేతవర్ణకులను తాము సాగించునది శోషణగాదు, పోషణయన్నారు. ఇట్లు హింసాచర్యలకు అసత్యప్రచారము తోడగుట సహజమే. క్రీస్తు ధర్మప్రచారముకని బయలుదేరిన మిషనరీలలో హెచ్చు మందియు భారతీయులలోని విగ్రహారాధనను జాతరలను నిమ్నజాతులకు జరుగు అన్యాయములను పురాణగాథలలో కొన్నికథలను విపరీతముగచిత్రించి, ఉన్నతనాగరికతగల హైందవులును వట్టి అనాగరికులేయని స్వాతంత్ర్య మెరుగనివారని, వారినట్టి హీనస్థితినుండి ఉద్ధరించి శాంతిని రక్షించుటకు బ్రిటిషుపాలన మవసరమని ప్రచురించినారు. శ్వేతజాతులే ఘనులని, వారే తక్కినజాతుల పాలించుటలో బాధకోర్చి భూభారము మోయుచున్నారనియు యూరపులో ప్రజలకుభావమేర్పడినది. మొత్తం మీదవారిమోత బంగారుమోత. అయినను, 'ఇతరులు తెల్లజాతులకు దాస్యమ చేయుటకే తగుదురు' అని యూరపియనుల యహంకృతి. ఆర్థికంగాను రాజకీయంగాను పరాధీనులు తమస్వాతంత్ర్యముకు ఆత్మరక్షణకు యత్నింపగా, 'వీరు కృతఘ్నులు దుష్టులు వీరి నణచి యుంచవలసినదే' అని వారుద్వేషప్రచారము సాగించినారు. ఇట్లు యూరపియనులకు అహంకారము, రంగుజాతులపైన ద్వేషమును హెచ్చినది.

ఈలోగా ఒకవిచిత్రపరిణామము. "ఈశోషణచర్యలోను అందుచే గల్గు లాభంలోను శ్వేతజాతులందరికీ సమభాగముండవలెను బ్రిటిషు క్రైంచివారలే విశేషలాభ మొందుచున్నారు. మాకు లేకున్నది". అని జర్మను లసూయపడినారు. అయితే నౌకాబలముగలవారికే సామ్రాజ్య లాభముకల్గుచున్నది. ముఖ్యంగా ఈదేశాంతరాలలో తమ యాంత్రిక వస్తువుల వ్యాపారప్రాబల్యము కై జర్మనులు బ్రిటిషు క్రైంచివారితోపోరిరి.

ఆయుద్ధపు ఫలంగా జర్మనులకుండిన కొద్దికాలనీలుగూడ విజేతలు వశపర్చుకొన్నారు. ఇటలీవారు బ్రిటిషుపక్షమందుంటే తమకు లాభించునని ఆశపడి ఆయుద్ధంలో నటు చేరిరి. అయినను యుద్ధాంతమున వారను కొన్నట్లు లాభించలేదని ఇటాలియనులకును ద్వేషము గల్గినది.

వీటి దుష్ఫలితముగ ధర్మమే బలమగుటకుబదులు పశుబలమే ధర్మమను సిద్ధాంత మీనాగరికజాతుల కాదర్శమైనది. వర్సాలే సంధి షరతు లన్యాయమైనను యుద్ధంలో మిత్రమండలియే గెల్చెను గనుక ఆషరతు లొప్పుకొని దేశమును పునరుద్ధరించుటకు జర్మనునాయకులు యత్నించిరి, కాని విఫలులైరి. ఇటలీయు దాదాపు ఈస్థితికి వచ్చెను. రష్యాలోవలె సామ్యవాదమే కావలెనను భావ మేర్పడి యూరపుప్రజ లనేకులు దాని నభిమానించసాగిరి.

ఈస్థితిలో ఇటలీలో ముస్సోలినీనాయకత్వమున ఫాసిస్టుపక్షము ప్రబలినది, సామ్యవాదుల నణచి నియంతృ పద్ధతిని పాలించుటే ఫాసిజము. ఇట్లే జర్మనీలో లేచిన నాజీపక్షమును ప్రబలమయినది. సామ్యవాదముపైన ద్వేషము, పుంజీపతులసాయము, పారిశ్రామికుల ప్రాబల్యము, విజాతీయులపైన ద్వేషమూలమైన జాతీయతత్వము, నిరంకుశనియంతృపాలనయు, ఈరెంటిలో నున్నవి. ఇటలీలో ముస్సోలినీవలె కొంతకాలమునకు జర్మనీలో హిట్లరు నాయకుడైనాడు.

యూరపులో సామ్యవాదము ప్రబలకుండుటకై పాశ్చాత్యపుం జీపతులు యంత్రయజమానులు తమపలుకుబడిద్వారా బ్రిటిషు ఫ్రెంచి ప్రభుత్వములు హిట్లరుకే కొంతసుముఖులగునట్లు చేసిరి. హిట్లరుపక్షీ యులు సామ్యవాదుల దూషించుచు పుంజీపతితత్వమును స్తుతించుచు ధనికసహాయముతో జర్మనీలో పాలకులైరి. అంతట హిట్లరు యుక్తితో బ్రిటిషుపాలకులమైత్రిని సంపాదించి బలపడినాడు. ఫ్రాంసులో స్థిరపాలన లేకుండెను. ఫ్రెంచివారు బ్రిటిషుప్రభుత్వముతో మైత్రితో నుండుచుండిరి. ఒకసారి ఫ్రెంచిప్రజాసభలో సామ్యవాదులు (కొంచెపు)

మెజార్టీ సంపాదించి రష్యాతో మైత్రిసంధిచేయించిరి. వెంటనే బ్రిటిషు ప్రభుత్వము హిట్లరుతో సాకాసంధిచేసుకొని అతనిని బలపర్చిరి. అంతట బ్రిటిషు సానుభూతితో ఫ్రెంచి పుంజీపతులు ఫ్రాంసులో ప్రబలులై, తమప్రభుత్వంచేత రష్యాతోజరిగినమైత్రినిరర్థము చేయించిరి. ఈనాలుగైదు రాజ్యములేకీభవించి రష్యాను సామ్యవాదితత్వమును ప్రతిష్ఠటింపసాగిరి. అయితే యాంత్రిక ధనార్జనలోను ఆయుధ ప్రాబల్యంలోను తమకు పోటీయై నిరోధకులైన బ్రిటిషుసామ్రాజ్యముతోపోరి, అందులో జర్మనీకి ఆధిక్యం సంపాదింపదలచి, జర్మనులు లోలోపల తమ సైనికబలము హెచ్చింపసాగిరి; గొప్పవైమానిక బలమును తయారుచేసిరి. ఈనాజీ నాయకుని అసలుసిద్ధాంతము జాతిద్వేషము. ఇతడు తనదేశంలోని యూదులనణచెను; శ్వేతజాతీయులే లోకపాలకులు కాదగునని బోధించెను. అయితే, జర్మనులే ఉత్తమ జాతీయులని, వారే లోకనాయకులు కాదగునని, క్రిందటి ప్రపంచయుద్ధంలో సామ్యవాదులకుట్రవల్లను ఆహారసామగ్రిలేకయు సైనికులు భయపడిరని, సరిగాతయారైతే జర్మనులు బ్రిటిషు ఫ్రెంచివారల నోడింతురని, ప్రచురించెను. లోకంలో జాతిసంఘర్షము తప్పదని, కనుక ప్రతిజాతియు యుద్ధప్రయత్నము చేయవలెనని జీవాభివృద్ధికి యుద్ధముసాగుట యవసరము (War is a biological necessity) అనియు, నాజీలవాదము. హెచ్చు ఆయుధబలమునుయోధశక్తిని సంపాదించుటే మోక్షమార్గమని జర్మనులందరు నమ్మిరి. హిట్లరు అధికారములో నున్న అయిదేండ్లలోను నిరంకుశాధికారం వహించి దేశంలో యావత్తు రాజ్యాంగమును సాంఘికసంస్థలను భౌతికసంపదను యోధబలవృద్ధికి వినియోగించెను పరస్పరం మోసము ద్వేషప్రచారము సాగినవి. అయినను సామ్యవాదము నశింపజేయుటకు ధనాఢ్యుల సంస్థలును తమశక్తులుహింసాతత్వపువృద్ధికే వినియోగించినవి. భారతదేశాదులనుండి బ్రిటిషువారు ప్రబలులైనందున హిట్లరుకు కన్నెర్రయైనది. తమకును ఈదేశాలలో సమానసౌకర్యముండవలెనని ప్రచారమారంభించినది.

36. నేటి ప్రపంచ యుద్ధము.

ఇట్లు లోకమంతటను అశాంతి, ద్వేషభావము గూఢచర్యలు మరింతి హెచ్చి, ఇప్పుడు యుద్ధప్రళయము సాగుచున్నది. తూర్పున 1937 సం॥ జూలైలో జపానువారు యుద్ధప్రకటనగూడ లేకుండనే ఉత్తరచీనాలో జొరబడి, 4 ఏండ్లనుండి మహాయుద్ధము సాగించుచున్నారు. ఇప్పటికిచీనాలో తూర్పుదక్షిణజిల్లాలును ఉత్తరపు ముఖ్యనగరాలను జపానీయు లాక్రమించినారు. చీనులు పడమటనున్న 'చంకింగు' అను గిరిపురముకు తమ రాజధానిని మార్చుకొన్నారు. లక్షలకొలది జపానీయులు అంతకన్న హెచ్చుగ చీనులు నిప్పటికి హతులైనారు. చీనుల ఆస్తినష్టముకు మితియే లేదు. ఈ పోరులో పాశ్చాత్యులు చూపిన నీతివిచిత్రము. చీనా కన్యాయము జరుగుచు ధర్మసూత్రములు నశించుచున్నందు కీనాగరిక రాజ్యాలకేమియు బాధకలుగ లేదు. వారు చీనులకన్న హెచ్చుగ జపానీ యులకును మొదట యుద్ధసామగ్రులమ్మి లాభమొందు చుండిరి. కాని జపానువల్ల బ్రిటిషు అమెరికనుల లాభవ్యాపారముకును అడ్డమేర్పడెను. ఈశ్వేతజాతుల అన్యాయార్జితమైన ప్రత్యేకపు హక్కులను జపా నీయులు రద్దుచేసినారు. అంతట మాత్రం బ్రిటిషులు అమెరికనులు ఆగ్రహపడి జపానును బెదరించినారు. అయితే వారిప్పుడు యూరపు యుద్ధంలో చిక్కుకొన్నారు. కనుక, (వారి హక్కులకు భంగంచేయమని చెప్పుచునే) క్రియలో అక్కడి అన్నిహక్కులు జపానీయులు తమవశం చేసుకొను చున్నారు చీనులు కుటీరపరిశ్రమలు వృద్ధిజేయుచు, ధీరతతో జపానీయులను ప్రతిఘటించి అచ్చెరువొందు ధైర్యముతో పోరుచున్నారు. విశా లముప్రకృతిసంపన్నము, జనసంకులము, సంస్కృతియుతమునగు చీనాను పూర్తిగ నోడించుట దుస్సాధ్యమని బోధపడియు ప్రతిష్ఠను లాభాశను విడువలేక జపానీయు లింకనుక్రూరయుద్ధము సాగించుచున్నారు. ఇది ఈ మంగోలియను రాజ్యముల అంతర్వినాశముకు కారణమగుచున్నది. ఉత్తర

చీనాను జపానీయులు ప్రత్యేక రాజ్యమన్నారు; కాని, క్రియలో దానికి ప్రజాసహాయ మెంతమాత్రమును లేకున్నది.

ఇక పశ్చిమంలో జరుగుయుద్ధమింకను ఘోరము దీనికినితలతోక లేకున్నవి జెకోస్లవేకియా స్వాతంత్ర్యమును అన్యాయముగ జర్మనులు హరించినను స్పెయినునువారు బాధించిననుమిత్రమండలి యూరకొన్నది. పిమ్మట జర్మనుల సంఖ్య చాలహెచ్చుగనున్న డాంజిగును పోలండులో చిన్నభాగమును స్వభాషికమగు తమలో (అక్రమంగానే) కలుపు కొన్నప్పుడు బ్రిటిషు వారడ్డు కొన్నారు స్పెయిను, అబిసీనియా, జెకోస్లవేకియాల విషయంలో బ్రిటిషువా రవలంబించిన కూటనీతికి స్టాలిను అనుమానపడి బ్రిటిషుపాలకులు తమ దందహ్యపద్ధతినింకను మాన లేదనియొచెను. రష్యాను, జర్మనీని వెంటనేడీకొనజేయుట బ్రిటిషుపాల కుల యుద్దేశమని తోచి, దానిని వీలైనంతవరకు తప్పించుటకు స్టాలిను జర్మనీతో అనిరోధపుసంధి (Non-aggression pact) చేసుకొనెను. (22-8-39). జర్మనులు డాంజిగును కలుపుకొని పోలండుతో యుద్ధ మారంభించిరి. అంతట 3-9-39 నుండి పోలండురక్షణకని బ్రిటిషు, ఫ్రెంచిరాజ్యములు జర్మనీపైన యుద్ధమారంభించినవి. ఈ మహాయుద్ధ మిట్లు పశ్చిమ దక్షిణ రంగములకును వ్యాపించినది.

పోలండు రెండువారములలో నోడి పరాధీనమైనది. పశ్చిమ రంగంలో బ్రిటిషు, ఫ్రెంచిసేనలు మాగినోపంక్తినుండి జర్మనుల 'సీగ్ఫ్రీడు' కోటలపంక్తిని భేదించి జర్మనీలో ప్రవేశింపవలె. కాని ఆప్రయత్న మింకను సాగుచుండగనే (1940 ఏప్రిలు) జర్మనులు డెన్మార్కునుదాటి బ్రిటిషువారిమిత్రులగు నార్వేపై దాడిచేసిరి. ఘోరమగు విమానాదియుద్ధము సాగి, నార్వే జర్మనుల వశమైనది. మే నెలలో ఇక్లో హాలండు బెల్జియములు, ఆజూనులో ఫ్రాంసుకూడ, జర్మనులకోడి నవి. బాల్కనులు అనగా హంగరీ, రుమేనియా, బల్గేరియాలు బ్రిటిషు ప్రాబల్యమునుండి జారి, క్రమంగా జర్మనుల యధికారంక్రింద చేసినవి.

ప్రతిఘటించిన యుగోస్లావియా గ్రీసులను 1941 ఏప్రిలు, మే నెలలలో జర్మనులసేనలు వశపర్చుకొనుటేగాక, ఇటాలియనులనుండి గ్రీకులు జయించిన ఆల్బేనియాను గూడ మరల యిటాలియనులకు వశపర్చినారు, ఆఫ్రికాలోని ఇటలీసామ్రాజ్యము నోడించి ఎరెట్రియా, అబిసీనియా సోమాలీ లాండులను బ్రిటిషువారు వశపర్చుకొన్నారు. తటస్థ దేశాలను తమవైపు చేర్చుకొనుట కుభయ పక్షములును చతుర్విధోపాయములు కూటనీతిరహస్యసంసులను ప్రయోగించి, విశ్వప్రయత్నముల జేయుచున్నారు. అనత్యతపెచ్చినది అమెరికా బ్రిటిషువారికి సాయపడుచున్నది. బ్రిటిషుమిత్రులగు ఈజిప్టు టర్కీలు తటస్థమయినవి. ఇరాకు ఒకపూర్తి పల్టీకొట్టినది. మిత్రమండలిపక్షమునకొన్నరష్యాను అనిరోధసంధిద్వారా ముందేతటస్థపర్చి జర్మనీయుద్ధమారంభించినదిగదా! అప్పటినుండి రష్యా ధోరణి యతిగూఢముగ నుండెను. రష్యా జర్మనీలు, టర్కీ, బాల్కను, ఫిన్లండులలో తమతమ ప్రాబల్యము పెచ్చించుకొనుయత్నంలో సంఘర్షపడుచుండిరి. ఇదిలోలోనరగిలి ఇప్పుడుభగ్గుమన్నది. రష్యావారియుద్ధంలో తటస్థులుగ నుండుచునే బాల్కను రాజ్యములను సోవియటు సమితిలో చేర్చుకొన్నారు; సేనావ్యూహాలతో తమపలుకుబడి పెచ్చించుకొన్నారు; వారిసైనికచర్యలు కొన్ని సంధులు జర్మనీవిజృంభణకు కంటకమైనవి. ఆర్థికంగానుజర్మనులు కోరినసాయము రష్యానుండి లభించలేదు. బ్రిటిషు ప్రభుత్వపుయుక్తివల్ల రష్యను లావైపుకు మొగ్గుట తనకు వ్యతిరేకులైనారని నిశ్చయించి, జర్మనునియంతహిట్లరు 22-6-1941 తేదీనిరష్యాపైన అద్భుతమగు మహాయుద్ధ మారంభించినాడు. లక్షలకొలది జనులు చచ్చుచున్నారు. కనుక, ముందెప్పుడో జరుగునని లోగడమన మూహించిన యుద్ధము రష్యా కిప్పుడే తటస్థించినది. ఈమహాయుద్ధజ్వాల యింకనెన్నివంకరలు తిరిగి యెన్నిదేశాల నాహుతిచేయునో తెలియదు. ఇదికటిమహాయుద్ధంలో కందకపుయుద్ధాలలో ఒక్కొక్కనెలలో లక్షల కొలది హతులైరి. ఇప్పుడు రేడియోవల్ల విమానాలనుండి రక్షణ

సులభమయినది. కాని, చాల అనర్థమును కల్గించది. అసత్యప్రచారము క్రౌర్యము మోసము చాల హెచ్చినవి. వ్యక్తిస్వాతంత్ర్య మసలే క్షీణించినది.

తమ పక్షమే న్యాయమైనదని, ధర్మయుతమని, ఉభయపక్షములును వాదించుచున్నారు. శత్రుపక్షీయులను భ్రమపెట్టుటకునుకొందరిని తిప్పుకొనుటకు లేక అడలగొట్టుటకు చిత్రవిచిత్రపద్ధతులవలంబించుచున్నారు. జర్మనులు హూన్నులు రాక్షసులునని బ్రిటిషుపక్షీయులును, బ్రిటివారు దుష్టపిశాచులని జర్మనులును దూషించుచున్నారు. యథార్థమునకు ఉభయులును ట్యూటనుజాతి సోదరవర్గీయులు. కాని, ఇప్పుడు యుద్ధంలో భ్రాతృత్వమునకు మానవత్వమునకు స్వస్తిచెప్పి, పశుతత్వమవలంబించుట శోచనీయము. నాజీలు బాల్షివిక్కులు ఇటీవల పరస్పరం చేయుదూషణల కసలే మితిలేదు.

ఇట్లుమానసికవాచికహింసయేగాక, యుద్ధంలో కాయికహింసయు చాలహెచ్చినది. ఈ 20 ఏండ్లలో వైజ్ఞానికావిష్కారములింకను హెచ్చినవి. కనుకకొత్తరీతిసాధనములు వినాశకపద్ధతులు అమలుకు వచ్చినవి. అన్నిటిలోముఖ్యము విమానపుదాడి. 1918 లోని వాటికిప్పటివాటితో పోలికయేలేదు. గంటకు 300 మైళ్ళవేగముతో బాంబర్లు, ఫైటర్లు వగైరాలు శత్రుదేశంపైకివెళ్ళి ఇరవైవేల అడుగుల యెత్తునుండియు బాంబులు విడుచును. ఎంతమంచిగురితో వేసినను అవి నేలచేరునప్పటికి మైళ్ళకొలది దూరము గురిభేదించును ఒక్కొకబాంబు 500 టన్నులబరువుండును. వీటిలోకొన్ని ఆగ్నేయములు, కొన్ని గుండ్లగలవి, కొన్ని విషరసాయనమయములు, కొన్ని పిశుగులవంటివి. వీటినల్ల రాతికోటలును, ఉక్కుమేడలుగూడ ధ్వంసమగును. ఆకాశంలోపోరు విమానములు తుపాకులగుండ్లు తగిలి నష్టమగును. ఆత్మరక్షణకును ఫిరంగులు సొరంగములు మంటచల్లార్పు కొత్తయంత్రములు బాంబువినాశికలు ఇట్టి కొత్తసాధనములును వచ్చినవి. చాలమంది పురములువిడచి గ్రామములకుపోయినారు. లండను బెర్లినువంటి అబ్భుతమగు మహానగరములును బాంబులదెబ్బలవల్ల కూలి చాలవీధులు భస్మావశేషమగుచున్నవి.

ఈయుద్ధంలో రణరంగము శాంత్రప్రాంతాలు అనుభేదమే లేదు. భూసైన్యారంగములకన్న జలాకాశములుముఖ్యమగుచున్నవి. మరియు అతిదూర రంగంలో ఏకకాలమే యుద్ధమగుచున్నది. 1940 సం॥ జూనులో ఫ్రాంసు యుద్ధము 250 మైళ్ళ వెడల్పునను, 1941 జూనునుండి రష్యాలో 1500 మైళ్ళ వెడల్పునను జరిగిన విమానాదియుతయుద్ధమిదివరలో నెన్నడు కని విని యెరుగనిది! ఊహాతీతము. అట్లాంటికుమహాసముద్రపు జలయుద్ధము నిట్టిదే. వాటితో ఉభయపక్షాలలోను యోధులుకాని శాంతపౌరులును స్త్రీ శిశువులుకూడ ఎందరో చావ తప్పదు. కూలెము ప్రతివిమానముతో ప్రజ్ఞావంతులగు శూరులు అయిదారుగురు యువకులును పడుచుందురు. ఇట్లు వైమానికనష్టము హెచ్చుచున్నది. పూర్వపుయుద్ధసూత్రములు తారుమారైనవి డైవుబాంబర్లలో శత్రుపులు వచ్చి మరతుపాకులతో జనసమూహమును చంపి చేయవచ్చును. కొత్తరకపు వ్యూహపద్ధతులును వచ్చినవి. యాంత్రికశక్తి హెచ్చినది. యంత్రబలంవల్ల వ్యూహ శక్తివల్ల మూడు లక్షల జనుల జర్మనుసేన 15 లక్షల ఫ్రెంచి యోధులను జయించి ఖైదీలుగ పట్టుకొన్నారు; 7 లక్షల మందిని చంపిరట. అసమాన బలము గలదనుకొన్న ఫ్రాంసు రాజ్యమొక్క నెలలో భగ్నమైనది. విమానములపైన చత్రధారులు రహస్యముగదిగి శత్రు సేనలవెనుక చీకాకుపర్చియు, విమానాశ్రయముల వశపర్చుకొనియు, జలాశయములనరికట్టియు, శత్రువ్యూహములకు అపారనష్టము కల్గింప వచ్చు. రేడియోద్వారా అక్కడి యోధరహస్యములను తమదూరసేన లకు తెలుపవచ్చు. ఉక్కుకవచములతోవచ్చు తమటాంకులకు పైనుండి రహస్యములదెల్చుచును, ఎనుట శత్రుపులపై నాగ్నేయాస్త్రముల గురి పించుచును, తోడ్పడవచ్చు. మరియు తమనౌకాబలముచాల కున్నను, విమానప్రాబల్యముంటే శత్రునౌకల భంగపర్చుచు గొడుగుపట్టాలము లతో ద్వీపముల నాక్రమింపవచ్చు జర్మనులుక్రీటు నిట్లువశపర్చుకొనిరి.

ఇప్పటి ఒక్కొక పెద్ద విమానమును యుద్ధనౌకను కట్టుటకు వెచ్చు కటికన్న నాల్గురెట్ల సొమ్మగును; యుద్ధముకిప్పుడు మొత్తంమీద అన్ని విధములనుఖర్చు పెరిగినది. నౌకావిమానాదులనడుపుటకవసరము పెట్రో

లు; దాని నిమిత్తం ఉభయపక్షములు ఎంతసొమ్మైన ఖర్చు చేయుచున్నారు. బొగ్గునుండియు చాలఖర్చుతో పెట్రోలు తయారు చేయుచున్నారు బ్రిటిషువారమెరికాలోకొనుసరుకులకు ఆయుధాలకుమితిలేదు. మొత్తంమీద రోజుకు 20 కోట్ల రూపాయలిచ్చును ప్రతిరోజు బ్రిటిషువారియుద్ధమునకు ఖర్చుచేయుచున్నారట. ఇట్టిఆర్థికవినాశము లోకముకెంతహానికరమో ముందుగాని తెలియదు. బ్రిటిషువారి నౌకాబల మసమ్మతమైనది. కాని ఈకాలపుసముద్రయుద్ధమును పూర్వమునకన్న చాల ఘోరమైనది, నేటి విమానములు నౌకలజాడలు సులభముగ తెలుసుకొని తమజలాంతర్గాములకు తెలుపవచ్చు. ఇప్పటికి రెండుపక్షములకు లక్షలకొలది టన్నుల నౌకలు, కోట్లకొలది సవరనులవిలువ అహారము మందుగుండు వగైరాలు ఆజనులతోసహా వరుణునిపాలైనవి. జర్మనీలోని యంత్రపద్ధతివల్ల యావత్తు అంగములును నియంతృవశమై వారికి యుద్ధకౌశము హెచ్చినదని, బ్రిటిషువారును తమజాతీయ మంత్రిమండలికి సర్వాధికారమిచ్చినారు; అందరును యుద్ధయత్నముతప్ప తక్కినకార్యములన్నిటిని కట్టిపెట్టినారు. ఈయోధదేశాలలో విమానాలదాడివల్ల జనులకు రాత్రింబవళ్ళు నిద్రాహారములు విశ్రాంతిలేకయు, యుద్ధజ్వరపు తీవ్రతతో తపించి నరులుదివ్వగ్నులైనారు. ధర్మము, దాక్షిణ్యము, అదృశ్యమగుచున్నవి. ఏదో రీతిగ జయించుటే ఆశయ మగున్నది. ఇప్పటి మహాయుద్ధంలో శత్రుసేనలకేగాక శత్రుప్రాబల్యపు దేశాల ప్రజలందరికిని సముద్రము పైన ఆహారాదులందనిచ్చుటలేదు. ఆదేశాలలో జనులు అవశులైవిప్లవ ముగల్గించి తమప్రభుత్వముచే యుద్ధము మాన్పింతురనిభావన. బ్రిటిషువారు యూరపుకాహారాది సామగ్రులు వెళ్ళకుండజేసినారు. ఇందుకు జవాబుగ బ్రిటనుకువచ్చు మందుగుండు నౌకలనేగాక ఆహారాది నౌకలనుగూడ జలాంతర్గాములతోను విమానాలతోను ముంచివేయుటకు జర్మనులు యత్నించుచున్నారు ఇట్టిక్రూరచర్యలు (పూర్వకాలయుద్ధాలతోపోల్చిన) రాక్షసకృత్యపుకోవిలున్నవి. విమానపుదాడులవల్ల అడవులు

గనులు తగులబడినవి. ఓడలు గుడలు ఆసుపత్రులు కూడ భగ్నమగుచున్నవి. ఈఘోరయుద్ధములుచేయుటమంచిదికాదని శాంతపరిష్కారమే యుక్తమని నోటనుచ్చరించినంతమాత్రమే అది నేరమై దండనార్హమగుచున్నది. మన దేశంలోను ఆర్థికబాధలెంతో పెరిగినవి. రాజ్యాంగము స్తంభించినది. వాక్ స్వాతంత్ర్యము క్షీణించినది. స్వతంత్రభావనయు తగ్గినది. ఇక్కడి ప్రజాక్షేమకార్యములకు వలయుద్రవ్యము అవకాశము లభించుటలేదు; కాని ఈ బీదదేశంలోను యుద్ధనిధిమాత్రం కోట్లకొలది రూపాయలు వసూలై విదేశాలలో ఖర్చగుచున్నది.

రష్యాతో జరుగు పోరులో జర్మనీ తుదకు గెల్చినను, దుర్బలమగును. ఈయుద్ధాశయము లెట్టివో ఇప్పటికిని స్పష్టపడలేదు. అమెరికా సహాయంతో తుదకు బ్రిటిషువారే గెలువవచ్చు, కాని రెండుపక్షములకు నష్టమును లోకమంతటికిని అనర్థమునుకలుగును. మాయు 'వర్సాలే'రీతి సంధికలిగితే మరల అశాంతి హింసావ్యాప్తి తప్పదు.

ఇప్పటి యుద్ధాలలో పూర్వమునకన్న నెక్కువ విజ్ఞానానుభవములు, శిల్పశక్తి, సాంకేతికజ్ఞానమునేగాక, ఎక్కువ సాహసము, కౌశలము, స్థైర్యము, త్యాగశక్తి, ఆత్మార్పణముకూడ కావలెను. ఇవి గొప్పగుణములే. ముఖ్యంగా ప్రిమానికులు సబ్‌మెరైనులయోధులు పరాచూటిస్టులు ప్రాణములకు తెగించకతప్పదు. మనపూర్వపు ఇతిహాస పురాణాలలోను రణరంగపు శౌర్యము వీరత్వము స్తుతింపబడినవి. కాని, ఈనాటి యుద్ధాలలో పాల్గొనుదేశీయులు పూర్వపువారికన్న చాల దయాశూన్యులు, దాక్షిణ్యహీనులునయి, ప్రేమతత్వమును చంపుకొందురు. జర్మనులు కేవలం రాక్షసులవలె క్రూరమృగములవలె వర్తించిరని బ్రిటిషువార్తలు తెల్పినవి. బ్రిటిషువారి కొన్నిచర్యలు జర్మనులకునట్లు కన్పడక మానవు. రెండుపక్షముల వారును నెనుకటికన్న చాలక్రూరులై నారని తోచును. అందుకువ్యక్తిదోషములు కాక, ఇప్పటి స్వార్థనాగరికతలోను ద్వేషవాతావరణములోను యాంత్రికాశలోను సామ్రాజ్యతత్వములోను చేరియున్న హింసాపరత్వమే మూలకారణము.

37. ఇప్పటి సత్యాగ్రహము.

ఇప్పు డీదేశంలో సత్యాగ్రహము సాగుచున్నది. అది యీ మహాయుద్ధమునకు సంబంధించినది. జర్మనీపైన యీ యుద్ధమును ప్రభుత్వంవారు కెనడా దక్షిణాఫ్రికా ఆస్ట్రేలియా వగైరా డొమినియనుల ప్రభుత్వములతో సంప్రతించి, వారిసమ్మతితోదిగిరి. ఐర్లండు మాత్రం తటస్థమైనది, తక్కినవి బ్రిటనుకు సాయపడ నిశ్చయించినవి. (మొత్తంమీద బ్రిటిషుజయంవల్ల ఈరాజ్యములన్నిటికి అమెరికాకును చాల లాభమున్నది). రక్తసంబంధులగు బ్రిటిషు వలస రాజ్యములట్లు తీర్మానించుటసహజమే. ప్రపంచమంతటిలో ప్రాబల్యముకై ఆంగ్ల భాషిక జాతులమధ్యను జర్మనులమధ్యను పోటీకల్గినది. బ్రిటిషు సామ్రాజ్య మంతటిలో జనసంఖ్యలోను భౌతికసంపత్తులోను మనదేశమే నాయకమణి యని చెలిసినదే. (ఈ సామ్రాజ్యంలో $\frac{4}{5}$ వంతు ఈదేశీయులే) అయినను, ఇందులో వీరికి పలుకుబడిలేదు. దీనిని దింపుటకుముందు ఇక్కడి ప్రజాప్రతినిధుల యభిప్రాయమునుగూడ తీసుకొనుట న్యాయముగదా! తుదకు, తామే యిక్కడ నేర్పర్చిన రాజ్యాంగపు ప్రభుత్వములతోను బ్రిటిషు అధికారులాలోచించక ఈదేశమునుగూడ బ్రిటను వైపున యీమహాయుద్ధములోదింపి ఇక్కడిసేనలను యుద్ధపరికరములను జన ధనసంపదను స్వేచ్ఛతోయుద్ధమునకు వినియోగించుచున్నారు. ఆధునికయుద్ధంలో దిగుటవల్ల వేనవేలు జనులు హతులగుట కోట్లకొలది రూపాయలసామ్ము వస్తుపులు యుద్ధంలో నష్టమగుట తప్పదు. అదిగాక, ఆర్థికనైతిక స్థితి రాజకీయస్థితిగూడ మారును.

ఈ దేశపు ప్రభుత్వమువారు బ్రిటిషు మంత్రివర్గపు తాబేదారులే, కనుక వారు నోరెత్తకుండుట సహజము. యుద్ధారంభమునకు (సెప్టెంబరు 1939) అన్ని రాష్ట్రాలలో మంత్రివర్గములుండెనుకదా. వారితోనైన ఆలోచించు మర్యాదచూపకుండుట చాల యన్యాయము. మరియు, కాంగ్రెసువారి యధికారము వహించగోరినప్పుడు అప్పటి రాజ్యాంగప్ర

కారం మంత్రివర్గము జరుపు రాష్ట్రపాలనలో సాధారణంగా తాము కల్పించుకోమని వైస్రాయిగూడ మాటయిచ్చెను. కాని, యుద్ధమారంభించగనే, భారతదేశరుణకని నిబంధనలు తెచ్చి, రాష్ట్రీయ స్వాతంత్ర్యము తగ్గించివేసిరి. ఈవిషయంలోను ఈమంత్రులతో సంప్రతించలేదు. యుద్ధకార్యములకని, అయారాష్ట్రములంసను చాలవరులు తమయిష్ట ప్రకారం చేయుటకు కేంద్రప్రభుత్వ మధికారముపుచ్చుకొని అట్లు పనులారంభించినారు. ప్రభుత్వశాఖ యుద్ధకార్యసహాయములు చేయునట్లు ఫర్మాయించినారు. పోనీ, యూరపుప్రజలస్వాతంత్ర్యముకని యుద్ధావశ్యకతకట్లుచేసినను, భారతదేశపుస్వాతంత్ర్యపుహక్కునిప్పుడుగుర్తించిరా? లేదు; అట్టి రాజ్యాంగమును యుద్ధాంతమం దమలుకు తెత్తుమనియైన చెప్పలేదు. అంతట కాంగ్రెసుమంత్రు లందరును తమ ఉద్యోగసంబంధము మానుకొన్నారు ఇకముందు చర్యనుగూర్చి కాంగ్రెసులో భేదాభిప్రాయము కల్గినది. ఆధునికయుద్ధప్రక్రియ యంతయు కేవలం హింసామయము. ప్రత్యర్థిది తప్పైనను వట్టి హింసాపద్ధతి ద్వారానే శత్రువు సణచి జయముపొంది ఆరీతిగ న్యాయము శాంతి స్థాపింపబూనుట సవ్యమార్గముకాదని, అహింసాపద్ధతితో శత్రుహృదయంలో పరిణామము గల్గించియు శత్రువ్రుల ముట్టడిని శాంతరీతినే తీవ్రముగ నిరోధించవచ్చుననియు, స్వచ్ఛమైపూర్ణమైన అహింసాతత్వముకట్టి అద్భుతశక్తికలదనియు, అహింసాత్మకుడగు గాంధిగారిభావము. "యూరపులో జరుగుచున్న ఘోరయుద్ధముకు భారతీయులు సహాయముచేయుట హింసకు ప్రతిహింసచేయుటలో తోడ్పడుటే. అట్టి హింసాప్రకోపంవల్ల లోకమందలి హింసాప్రవృత్తి మరింత హెచ్చునేగాని తగ్గదు. మరియు, బ్రిటిషుప్రభుత్వమీదేశమునకు స్వాతంత్ర్యమిత్తుమనిచెప్పి దానిని యుద్ధానంతర మాచరణకు తేవలెను; ఈ యుద్ధకాలంలో తమకు వీలైనంతవరకు ప్రజాయత్తపద్ధతి పెట్టవలెను" అని కాంగ్రెసువారు తీర్మానించిరి.

అందుకు బ్రిటిషుదొరతన మొప్పుకొన్నను, యూరపులోని యీ వినాశక యుద్ధంలో భారతీయులు ప్రత్యక్షంగా పాల్గొనకూడదనియు, మరియు బ్రిటిషు వారంగీకరించక విసటించినను, జర్మనుల ముట్టడివల్ల బ్రిటను ప్రమాదస్థితిలో నున్నప్పుడు ఈదేశంలో సర్కారుపైన సత్యాగ్రహం చేయకూడదనియు,ఆయన తేల్చినాడు. అట్లుకాక, సదరు కాంగ్రెసు తీర్మానమును బ్రిటిషువారు మన్నించేయెడల బ్రిటిషువారి యుద్ధప్రయత్నంలో భారతీయులు సాయపడుదురని, బ్రిటిషువారందుకు నిరాకరించితేనే గాంధిగారి నాయకత్వంక్రింద సత్యాగ్రహం సాగించవలెనని, కాంగ్రెసునిర్ణయించినది. కాంగ్రెసు కోరినహక్కుల తీర్మానమును బ్రిటిషు ప్రభుత్వము మన్నించనేలేదు. యుద్ధయత్నం హెచ్చించిరి; ఇక సత్యాగ్రహము తప్పలేదు.

అయితే 1940 సం॥ మే మొదలు అక్టోబరు వరకు జర్మనీ తన పడమటివైపు ముట్టడించి ఇంగ్లండుపైన ఘోరముగ ఏమానపుదాడి సాగించుచు ఇంగ్లండులోనికి దిగుయత్నములో నుండెను. ప్రత్యర్థి యిట్టి క్లిష్టస్థితిలో నున్నందున గాంధిగారప్పుడు సత్యాగ్రహము చేయలేదు. ఆప్రమాదము తప్పినదని, అమెరికను సాయమునువచ్చుచున్నందున ఇక బ్రిటనురక్షణకు ఢోకా లేదని, బ్రిటిషు అధికారులు రాజనీతిజ్ఞులు నిర్ణయించి ప్రకటించినారు అతరువాతనే మనదేశంలో మితంగా సత్యాగ్రహమారంభించినది. అప్పుడైననుస్వాతంత్ర్యమివ్వనికాదు. ఈ మహాయుద్ధములో భారతీయులుద్రవ్యాదులనిచ్చిపూర్తిసాయము చేయవలెనని ప్రభుత్వోద్యోగు లందరుదీక్షతో తీవ్రప్రచారము చేయుచున్నారు; తమంతట ప్రజలిచ్చు సొమ్మునే యుద్ధసహాయముకు వసూలు చేయుచున్నామని బ్రిటిషుప్రభుత్వులు ప్రకటించిరి, కాని దానిని సర్కారు ఉద్యోగు లందరి ద్వారా తీవ్రంగా చేయించుటవల్ల ప్రజలకుభీతి యుండకతప్పదు. ఒత్తిడి నిర్బంధపు వసూలు జరుగుచున్నవని ఆక్షేపణలు వచ్చినవి. సర్కారు ఉద్యోగు లధికారపుహోదాతో గ్రామములకువెళ్ళి

పోలీసుల సహాయము తీసుకొని యుద్ధనిధిని పూనికతో వసూలుచేయు నప్పుడల్లేయుండును. వారికి ప్రజలిచ్చునది భయముపై నా, భక్తి పై నా, చెప్పగలమా? ఇచ్చికమనిచెప్పి అధికారులు అనియమితంగా వసూలు చేయుటకు బలులు సర్కారుకు తోచినట్లు పన్నువిధించుటే నయము పన్నుల ఆదాయంనుండియు యుద్ధపుకార్యములకు ఖర్చుచున్నది. బ్రిటిషువారితరపున తీవ్రంగా ప్రచార మన్నివిధములను జరుగుచున్నది; రేడియోనుగూడ ఇందు కుపయోగించుచున్నారు. ఈసహాయము ప్రజలు తమంతటనే యిచ్చినారని, ఇందునుబట్టి భారతీయులందరు బ్రిటిషు యుద్ధము కనుకూలురై బ్రిటిషుపాలనకు తృప్తిజెందినట్లు స్పష్టమనియు, కొందరధికారులు ప్రకటించినారు స్వతంత్రాభిప్రాయము తెల్పుటకు స్వేచ్ఛయున్నప్పుడే ఈవాదము కర్థమున్నది. వ్యతిరేకభావము తెల్పుట నేరమయి వాగ్బంధనము జరిగినదని గాంధిగారునిర్ణయించి, వాక్స్వాతంత్ర్యరక్షణకే సత్యాగ్రహము సాగించుచున్నారు. ఆయనసిద్ధాంత ప్రకారం 'బ్రిటిషువారిహింసాయుద్ధమునకు తోడ్పాటయు హింసాచర్యయగును. అహింసాపద్ధతితో నిరోధించుటే సవ్యపద్ధతి' ఈభావముగల మాటల నుచ్చరించుటే ఆయన యేర్పర్చిన సత్యాగ్రహపద్ధతి. ఆప్రకారం మాటలుచ్చరించు వారిని వెంటనే ఉద్యోగు లరెస్టుచేసి జైలులో నుంచినారు. వాక్స్వాతంత్ర్యము నిల్పి భారతీయులను అందరిని రక్షించుటకే యీసత్యాగ్రహము సాగించుచున్నానని గాంధిగారు స్పష్టపర్చినారు.* మరియు ప్రభుత్వమువా రింకను జర్మనులతో తీవ్రయుద్ధము సాగించు

* The immediate issue is the right to exist, that is the right of self-expression, which broadly put means free speach. This the Congress wants not for itself, but for all.....

(5-10-40 తేదీ గాంధీగారి ప్రకటన)

చున్నారు. కనుక, వారి కిబ్బంది లేకుండుటకు అతిమితంగానే సత్యాగ్రహం చేయుచున్నారు.*

ఈరీతిగా మాజీమంత్రులు, సభాధ్యక్షులు, శాసనసభ్యులు, బోర్డులసభ్యులు, కాంగ్రెసునాయకులు ఇట్టి వేలకొలదిప్రజాప్రతినిధులు సత్యాగ్రహులై జైలులో నిర్బంధితులుగ నున్నారు. యుద్ధనిరోధకమైనచర్య లేమియు చేయకున్నను భేదభావము తెలిపినంతమాత్రమున సహించక తమమాజీమంత్రులను సభాధ్యక్షులనుగూడ తీవ్రశిక్షలపాలు చేసినారు. వారిని యుద్ధపు శ్వేతవర్ణులగు జర్మను ఇటాలియను ఖైదీలకన్న హీనముగ నుంచుచున్నారు. అంచను బట్టియు ప్రస్తుతపు ప్రభుత్వపద్ధతిలో హింసాతత్వము కలదనుసంగతి లోకమంతటికిని బాగుగ వెల్లడియైనది. మంత్రిత్వకాలంలో కాంగ్రెసుమంత్రులారంభించిన అహింసాసాధకమగు నిర్మాణకార్యమునను చాల నిరోధము గల్గినది.

* Care is being taken as far as possible to avoid all embarassment. The merit, as also the strength, of the struggle consists in reducing embarassment to the minimum, whilst the British are engaged in a deadly life and death war.

38. సమన్వయము.

ఇట్లు మనసంస్కృతి ప్రారంభస్థితిని ప్రాచ్యపాశ్చాత్యముల క్రమపరిణామమును వాటి సంఘర్షపుఫలితములను చూచియున్నాము. మనకు తెలిసినంతవరకు ఈభూమి అసలు సూర్యుని తేజోబింబమునుండి యేర్పడి చల్లబడుటలో ద్రవమై, క్రమంగా ఘనీభవించి శిల లేర్పడినది. ఇ ట్లెన్ని యో యుగములు గడచినగా. అజీవమనుకొన్నప్రకృతిలో మంచి క్రమసృష్టి గల్గినది. సృష్టిలో చిదచిత్తులకుండు సంబంధము అద్భుతము. కేవలం నిర్జీవమనుకొను వస్తువులు నిజంగా శక్తిపుంజములే కాని, అంత కికంగా కఠినములుకావు. ఈ శక్తిపుంజములును తేజఃఫలితములు. ఈ మహాప్రపంచమంతటను విశ్వశక్తి (Cosmic enerjy) యు విశ్వకిరణములును (Cosmic rays) వ్యాపించియే యున్నవి. ఆకాశంలో చూపట్టు గోళములు మహాలోకములు. అవి తమ నిర్ణీతమార్గాలలో అతివేగమున పోవుచు తేజస్సు వెదజల్లును. అవి మనకు తెలియని గమ్యముకుపోవుచున్నవి. ఇంతవరకు వైజ్ఞానికుల పరిశోధనాదులవల్ల కల్గిన జ్ఞానమల్పము. 'ఈమహావిశ్వమంతను సృజించి పరిణమింపజేయుచు'నియమితస్థానాలలో కొన్నిసూత్రములతో నడిపించుచు, యుక్తఫలము లిచ్చు విశ్వాత్మ కలడను. మన భౌతికదేహాముల నియమించి నడుపు ఆత్మ కీవిశ్వాత్మతో అవినాభావపుసంబంధమున్నది' అని క్రమంగా విశదమైనది.

భూమిపైన జీవజాతుల పరిణామంలోను భౌతికబలంకంటె జ్ఞానబలముకును, అంతకన్న నైతికశక్తిని అనగా ధర్మముకు, క్రమంగా ప్రాముఖ్యము కల్గినదని సూచితము. మొదటి మత్స్యసర్పాదులకన్న మామలు (=సస్తన) జాతులలో, ఇందులోను భీకరక్రూరమృగముల కన్న అశ్వగోజాతులలోను, వాటికన్న తుదకు నరజాతిలోను క్రమంగా సాత్వికశక్తి సాంఘికత హెచ్చినవి. మానవులలోను నరాశనులై పచ్చి మాంసమునుదిని నిరంతరం మద్యపానంచేయుచు శిలాపూజకులైన క్రూరు

లకన్న తరువాత వ్యాపించిన నీతిభక్తిపరులు జెంది యితరులకు మార్గదర్శకులైనారు. మన దేశ చరిత్రలో ప్రహ్లాద నారద వసిష్ఠ విశ్వామిత్ర యాజ్ఞవల్క్యాదులు సాత్వికతేజస్కులై ఆదర్శజీవనులై, లోకకల్యాణము జరిగించినారు. పిమ్మట బుద్ధుడు అశోకుడు అహింసాధర్మవ్యాప్తికై జీవిత మర్పించి, భారతీయుల నుద్ధరించినారు. ఖండాంతరాలలోనువారి ధార్మిక సామ్రాజ్యము స్థాపితమైనది. ధర్మాచరణ చెడినమీదటనే హింసకు రాజకీయంగాను పతనముకల్గినది. మొగలుల కాలంలోను పరస్పరం ప్రేమవ్యాప్తి ధార్మికౌదార్యము రాజాదర్శమైనప్పుడు ప్రజాస్థితి బాగుండెను. మతవిరోధములు సాంఘికవిభేదములు వృద్ధియైనమీదట జాతీయ క్షీణత సులభమైనది.

ముఖ్యమైన అన్నిమతములకు అహింసాసత్యశౌచాది రూపమగు ధర్మమే మూలసూత్రము; ఈశ్వరభక్తియే వాటిప్రాణము. వీటిపైన నిర్మితమైన సంస్కృతులలో పరిసరములబట్టియు దేశకాలానుసారంగాను కొన్ని భేదము లేర్పడినవి. శ్రుతులు స్మృతులు, ఇతిహాసములు, పురాణములు, కావ్యాలంకార వాఙ్మయమునుగూడ అహింసాతత్వమే ఉత్తమధర్మమని తేల్చుచు, విశ్వప్రేమకు ప్రాముఖ్యమిచ్చినవి. మన ఆయుర్వేదము అమరావతి అజంతాఎల్లోరాదులలోనిప్రాచీనకళలు శిల్పములును అహింసాప్రబోధకములే. మనపూర్వపు సాంఘికపద్ధతిలోను, ఆయాభిన్న జాతుల వ్యక్తిస్వేచ్ఛకునుజాతైక్యముకును సమన్వయము చేయుటకే యత్నించిరి. ఇట్లీగ్రామజీవితముకు వ్యక్తుల జీవితముతోను రాజ్యాంగపు పరిపాలనతోను సంఘర్షము లేకుండునట్లు గ్రామపంచాయతీపద్ధతి యమలులోనుండినది. అప్పటి వర్ణాశ్రమపద్ధతి, సాత్వికాహారము, వ్యాయామము, బ్రహ్మచర్యము ఇత్యాదులు అహింసాశక్తిని పెంపొందించినవి. ఆర్థికముగను వ్యక్తులకృషిపరత్వము కళాశిల్పముల నైపుణ్యము వృద్ధిచేయుచునే సంఘక్షేమముకల్గునట్లు వ్యాపారనియమము లేర్పర్చబడినవి. ఈ నిబంధనలు వారివారి హక్కులుగకాక బాధ్యతలుగను, ధర్మముగను వివరించి,

జనైక్యమకు నీతిశరతకు ప్రాముఖ్యమిచ్చిరి. మరియు, ఆధ్యాత్మికరంగ మున్నిటికిని పునాదిగజేసి సర్వజీవులు ఈశ్వరమయములు. ఈశ్వరునిదేహ ములు, కనుక ప్రాణిరక్షణయు మానవసోదరత్వము ప్రజాసేవయునే ఈశ్వరసేవ యగునని నిర్ణయించి, మానవప్రేమను మన ధర్మముగ నిర్ణయించిరి; 24 ఏండ్లవయస్సు వరకు బ్రహ్మచర్యముపాలించి జ్ఞానము సంపాదింపవలెననిరి; అతిథిసత్కారము భూతబలి ప్రతిరోజును ప్రతిగృహ స్థుచును జరిగించవలసిన నిత్యయజ్ఞములని విశదపర్చిరి. కొంతవయస్సుమీ రినంతట దంపతులు వానప్రస్థులై, 60 ఏండ్ల వయస్సు తరువాత సన్యా సులుకావలెను. ప్రజాసేవలోజీవితము గడుపవలెను† మనదేశీయులందరి పండుగలువగైరాలసూత్రములును అహింసాధారములే. కనుక తక్కినదే శములసంగతి యెట్లున్నను, మనదేశపు ప్రాచీనసంస్కృతికి అహింసా తత్వమే పునాది. మరియు మనదేశీయులపైన అన్నివిషయాలలోను బ్రిటి షువారిసామ్రాజ్యపుప్రాభవము వ్యాపించియున్నది. రాజకీయస్వాతంత్ర్య ముగల్గినమీదటగానిఆర్థికసాంఘికవిషయాలలోను స్వాతంత్ర్యవికాసము లుండవు. మనలో మతభాషాదిభేదములు కలహములు హెచ్చియున్నవి. కనుక సౌకర్యమునుబట్టియు అహింసాతత్వమే మనకన్నివిధముల సాధకము.

రెండు భిన్నసంస్కృతులకు సంపర్కముకల్గినప్పుడు ఆరెంటిలోని మంచిగుణములే వృద్ధిపొగుట శ్రేయస్కరము. కాని, సంఘట్టనము గల్గినప్పు డింకకు బదులు విభేదము హెచ్చును. ముస్లిములు విజేతలుగ ఈదే శముకువచ్చినప్పుడు ఉభయులకు విరోధమువల్ల సంఘర్షము ద్వేషము కల్గినవి. కనుక పరస్పరం దోషములే గమనించిరి. రెంటిలోను పరిశుద్ధత తగ్గి వికృతియేర్పడినది. తరువాత అక్బరు కబీరు నానకువంటి కొద్దిమంది రెంటిలోని సుగుణములకు ప్రాముఖ్యమిచ్చి సమన్వయింపజూచినారు.

---

† కామ్యానాం కర్మణాం న్యాసం సన్న్యాసం కవయోవిదుః
సర్వకర్మఫలత్యాగం ప్రాహు స్త్యాగం మనీషిణః. (భ. గీ. 18-2)

అనుకూల దృక్పథమేర్పడినప్పుడే రెంటిలోని సుగుణముల నుభయులును గ్రహింపగల్గుదురు.

ఇల్లే ప్రాచ్యపాశ్చాత్య సంస్కృతుల విషయంలోను. పాశ్చాత్యులిక్కడి ప్రకృతి సంపత్తును రాజ్యమునవశపర్చుకొను ధృష్టతలోను విభేదయుతులగు భారతీయులాశోషణచర్యను భీతిద్వేషాలతో నిరోధించుటలోను సంఘర్షమేకల్గినది. పైపెచ్చు, ఇప్పటిపాలకులగు ఆంగ్లేయులు వట్టివిదేశీయులు. కనుక, ఈదేశంలో ఈరెండుసంస్కృతులలోని దోషములే ప్రకోపించుచున్నవి. ఉభయులకు ఆత్మీయులను భావము లేకుండ ద్వేషదృక్పథమున్నప్పు డట్లుజరుగుట సహజమే.

పాశ్చాత్యసంస్కృతి ముఖ్యంగా ప్రవృత్తిపరము, రాజసము. అది భౌతికవృద్ధికి, ఇంద్రియతృప్తికి, బాహ్యజ్ఞానందావారా బుద్ధివికాసముకు, యాంత్రికబలముకును ప్రాముఖ్యమిచ్చును. పూర్వపు ప్రాచ్యసంస్కృతి ముఖ్యంగా ఆంతరికము, సాత్వికము; అది నైతికవృద్ధికి, ఇంద్రియనిగ్రహముకు హృదయవికాసముకు ఆత్మశక్తికి, హస్తశిల్పముకును ప్రాముఖ్యమిచ్చినది.

ఈరెంటిలోను మానవకల్యాణముకు పోషకమగు కొంత సామాన్యధర్మ మున్నది. ఇప్పటి రవీంద్ర ప్రఫుల్లచంద్ర రాధాకృష్ణాముల జీవితంలో (గాంధిమహాత్మునిలోను) ఈరెంటి సమన్వయము కలదు. ప్రాచ్యసాత్వికతవికృతినొంది ఇప్పుడు తామసప్రధానమైనది. పీడితనము, మూఢత్వము, మాంద్యము, నిరాశ వ్యాపించియున్నవి. పాశ్చాత్యుల లోనున్న కార్యపరత, దీక్ష, సకాలత, సాంఘికసఖ్యము, దేశభక్తి, జ్ఞానపిపాస, జాతీయప్రేమ మన కలవడవలెను. మనలోని త్యాగశీలత ధార్మికత ప్రేమతత్వమును రక్షించి వృద్ధిజేసి, ఈయన్నిటికి సమన్వయము జరుపవలెను.

యుద్ధములిట్లు సాగుచుండుటబట్టియు లోకంలో హింసాభావము హెచ్చినదని స్పష్టము. అధికారులు నీతివిడిచి స్వదేశలాభమే చూచు

కొనుటవల్ల రాజ్యములకు భయము, సందిగ్ధత యేర్పడినవి, నమ్మిక పోయినది. బ్రిటిషు క్రైంచి సామ్రాజ్యము లితరులకు చెప్పు నీతిని తమ వళంలోని మన దేశాలకు క్రియలో నిరాకరించుచున్నారు. ఈ సామ్రాజ్యతవల్ల బ్రిటిషు ధనికులకు లాభము మనకుజర్మనీ వగైరాలకు నష్టముకల్గినది. అనీతి హెచ్చినది. బ్రిటిషు క్రైంచినారికన్న తాము బలీయులైవారని లొంగదీయవలెనని, నాజీఫాసిస్టులకు దుర్బుద్ధి పుట్టినది. సామ్యవాదియగు రష్యాకు జర్మనీతో జరుగు యుద్ధములో లక్షలకొలది చచ్చుచున్నారు. సంహారదేవత విజృంభించినది. ఎన్నడు నెరుగని క్రూరతతో నీ ఘోరయుద్ధములు సాగుచున్నవి. లోకమంతటను హింసాతత్వము ప్రబలుచున్నది. పత్రికలలోను రేడియోద్వారా నానుపరస్పరదూషణఅసత్యములు, మాయాచర్యలుచాలరెట్లు హెచ్చుచున్నవి. ఇక్కడి బ్రిటిషుఅధికారుల ధోరణియు అహింసావ్యాప్తికి వ్యతిరిక్తమే. ఈఅన్నిటిప్రభావము మనదేశీయులకు తగులుటసహజము. అందువల్ల ఇక్కడను హింసాతత్వమునకే ప్రాముఖ్యముకల్గుచున్నది. పాలకులు శ్వేతసంస్కృతియేగొప్పదని, వారి ప్రభుత్వమును మనము తొలగింప జూచుట గొప్పనేరమని మనకు తెల్పుటమామూలయినది, ఇక్కడ దేశద్రోహమెంతయో జరుగుచున్నను అది మాత్రం నేరమనివారెంచలేదు.

పాశ్చాత్యులు ఘనులు, కనుక వారిహింసాతత్వము ఘనమని మనవారెంచి, దాని ననుకరింపనెంచుట సహజమే. ఈఘోరయుద్ధాలలో తమదేశపు జయముగోరి తోడ్పడు కోట్లకొలది పౌరులందరును శత్రుజను లెట్లైన నశించవలెనని కోరుదురు. ఇది హత్యాతత్వము. ఇది సామాన్య జీవితంలోనికిని వ్యాపించినది. సాంఘికద్వేషంవల్లను వ్యక్తిద్వేషంవల్లను హత్యలు జరుగుచున్నవి. నీగ్రోలను పట్టపగలు వీధులలో అమెరికనులు మోది చంపుటగలదని తెలిసినదే. ఇవిగాక, పాశ్చాత్యసంఘంలో రహస్యహత్యలెన్నియో జరుగుచుండును. ఇంచుకు సాంఘికవ్యత్యాసపుక్రోధ

మోస్త్రీ పురుషుల కామక్రోధములోమూలకారణములు. 'ప్రమాదము' లమరణములును విదేశాలలో హెచ్చు, అమెరికాలో పాశ్చాత్యసంస్కృతికి ప్రత్యక్షచిహ్నములగు మోటారుల క్రిందబడియు, ఫాక్టరీయంత్రాలలో చిక్కుకొనియు సాలీనా లక్షలకొలది జనులు మరణిస్తారు. ఇది మానవత్వంకన్న యాంత్రికతకే ప్రాధాన్యమిచ్చుట వలనిమష్పలితాలలో నొకటి ఈసంస్కృతిసంపర్కంవల్లనటీవలమనదేశంలోను దుర్మరణములు చాలహెచ్చినవి. సాంఘికకలహపు హత్యలగూర్చి గమనించియున్నాము. బీదలు ధనాశవల్లను, కొందరు స్త్రీపురుషులు కామక్రోధాలవల్లను, త్రాగిన మత్తులోను, చేయు హత్య లీదేశంలోను హెచ్చుచున్నవి. కొంతవరకు దుర్భరమైన (ఆర్థికవ్యత్యాసముండి) బీదల విషయంలో శ్రీమంతులు దాక్షిణ్యాహీనులగుటయు, తీవ్రమగు సాంఘికవ్యత్యాసం వల్ల మాలమాదిగలను సవర్ణులు కఠినంగా చూచుటవల్లను, కొందరు స్త్రీలను పురుషులు అణచియుంచి సంస్కరణకు వ్యతిరేకించుటవల్లను హృదయంలోజనించు నిరాశక్రోధాగ్ని మనదేశంలోని చాలహత్యలకు మూలకారణ మగుచున్నది. అట్టి వ్యత్యాసములను అన్యాయములను తొలగించినప్పుడే ద్వేషమును తద్వారాహత్యాప్రవృత్తియు తొలగును.

హంతకులకు కోర్టువిచారణపైన మరణదండనవిధించుట ప్రభుత్వములకు మామూలైనది. కాని యిదిఅహింసాసిద్ధాంతమునకు వ్యతిరిక్తము. ఈవిచారణలలో యథార్థంగా హంతకుడెవడో సరిగా తెలియుట కష్టము. ఏదో అన్యాయము జరిగినప్పుడుగాని సాధారణంగా ఎవడును హత్యకు సిద్ధపడడు. అట్టి సాంఘికాన్యాయములను జనులును ప్రభుత్వమును తొలగించుటే ముఖ్యకార్యము దండనద్వారా దోషికి బుద్ధిచెప్పుటయు అవసరమనుకొన్నను, ఖైదుకు బదులు చంపుటవల్ల దోషికి సంస్కరణ గల్గింపజాలదు. అందువల్ల యితరులకు బుద్ధివచ్చుననుటయు పొరబాటే. తరుచు మొండితనము సాహసము మరింత హెచ్చును. హత్యలసందర్భంలో ఆత్మహత్యయు చర్చింపదగినదే. ఆత్మహత్యయు క్రౌర్యఫలితమే.

యాంత్రిక నాగరికతనే యాచరించు పాశ్చాత్యులలో ఆత్మహత్యజరుగు వార్తలు తరుచువచ్చును † ఇటీవల, ఈదేశంలోను ఆత్మహత్యలెచ్చు చున్నది. ముఖ్యంగా పీడితులై కుటుంబపోషణజేయలేనివారును సాంఘిక హింసపడలేనివితంతువులుఆడపిల్లలును ఆత్మహత్యచేసుకొన్నట్లు దుర్వార్తలు తరుచు తెలియుచున్నవి. వీరికి సంఘముతమ్ము రక్షించుటలేదని నిరాశయు దిగులునుకల్గియే అట్లుచేయుచుందురు. వీరిలో చాలమంది హిందువులు. ఇది హిందూసంఘమునకు గొప్పకళంకము. ఇట్టి బాధలు తొలగి అహింసాబుద్ధి సంఘంలో వ్యాపించినప్పుడే అట్టి ఆత్మహత్యలుపోవును. ఆత్మహత్య మహాపాపము అనర్థకరము అని మన శాస్త్రములు చెప్పుచున్నవి. ఈ యన్నివిధముల హత్యలవార్తలు అహింసావ్యాప్తి జనులలో వెంటనే జరుగుట చాలఅవసరమని మనకు ఉద్బోధకములు కావలెను.

అహింసాతత్వపువ్యాప్తియే ఈలోకపుకష్టముల బోగొట్టి ప్రజాక్షేమము గల్గించునని కనిపెట్టిన ప్రవక్త లందరిలో ముఖ్యుడు మహాత్మా గాంధి. బుద్ధాదులవలె గాంధిగారును లోకకల్యాణమునే సాధించుటకై తనజీవితమంతను ధారబోయుచున్నాడు. అయితే హిట్లరు స్టాలిను చర్చిలు రూస్వెల్టు వగైరాలు నిప్పుడు ప్రపంచక్షేమము కోరుచున్నట్లు చెప్పుచున్నారు. వీరు గాంధికన్న భౌతికంగా బలీయులై, ఇప్పుడు తమ ప్రజలకు గౌరవపాత్రులయినమాట నిజము. వీరి యందరిలోను బాల్షివిజం స్థాపకుడైన కీ. శే. లెనినులోను వ్యక్తివిశేషమును కలదు. కాని వీ రందరును ప్రఖ్యాతిని కోరువారే. మరియు వీ రందరును స్వజాతి యాధిక్యముకే యత్నించుచున్నారు. జర్మనీ కెక్లోసను లోకమంతటను ప్రాబల్యము సంపాదించుటే హిట్లరు సంకల్పము. భౌతికాధిక్యము తన జనులకు సంపాదించుటయు రష్యారాజ్యమంతను రక్షించి దాని నెక్లోస

† అమెరికా సంయుక్తరాష్ట్రంలో సగటున రోజుకరువదియు బ్రిటనులో రాజుకిరువదియు ఆత్మహత్యలు జరుగుచున్నట.

బలీయముగ జేయుటయునే స్టాలిను సంకల్పము. ఇట్లే బ్రిటిషు సామ్రాజ్యలాభమే చర్చిలు ఆశయము. ఇక రూస్వెల్టును అన్నిదేశాలనుండి ద్రవ్యములాగి పశ్చిమార్ధగోళములో యూరపురాజ్యములన్నిటి ఆయువు పట్టుపులను వశపర్చుకొని, అమెరికాలోను బయటను స్వదేశమగు సంయుక్తరాజ్యపు ప్రాబల్యమును హెచ్చించుచున్నాడు. వారందరు తమ ప్రత్యర్ధుల పతనమునుకోరుచు ద్వేషముతోఅంచుకు తీవ్రహింసాచర్యల జేయించుచున్నారు. మరియు వారందరు ఈయుద్ధముకని జాతీయైక్యము గోరుచున్నను, తమ దేశంలోను అసలు స్వపక్షమునే బలపర్చువారు: స్టాలిను అకించనులనే యుద్ధరించి, ధనికుల నణపజూచును. హిట్లరు చర్చిలు రూస్వెల్టులకు ధనికవర్గపు క్షేమము ప్రధానము, సమత్వదృష్టి లేదు. వారి ఆర్థికరాజనీతులవల్ల వర్గసంఘర్షము ఆర్థికవ్యత్యాసము పెరుగుచున్నవి. యుద్ధజ్వాల లంతటను వ్యాపించి ప్రపంచము తల్లడిల్లుచున్నది. తటస్థదేశాలకును భద్రత సౌఖ్యము లేవు. 'సర్వేజనా సుఖినో భవంతు' అను సర్వోదయదృష్టిని గాంధిమహాత్ముడే యేర్పర్చినాడు. అట్టిశాంతివాక్యము నిష్ఫలు పరులు బూతుగ నెంచవచ్చు; కాని, ఈయుద్ధాగ్నులపిమ్మటను ప్రపంచమిప్పటిద్వేషనీతినే అవలంబించితే మరల హింసాప్రకోపపు యుద్ధజ్వాలలు వ్యాపించును. బ్రిటనుఅమెరికాలవారు కార్మికులను రంగుజాతులలను అణచినట్లే, హిట్లరు జర్మనీలోను అణచినాడు. ఇట్లే స్టాలిను తన శత్రుల జంపించి దేశమును భీభత్సంగాచేసి దుర్బలపర్చినాడు. అంచుల ఫల మిప్పుడు రష్యాకును కనబడుచున్నది.

ఇందులో బ్రిటిషులు అమెరికనులుచేయు శోషణము రక్తపాతములేనిది. హిట్లరు వగైరాల హింస ప్రత్యక్షము, హత్యాయుతము. కాని, అన్నిసామ్రాజ్యాలలోను పరాధీనులకు పీడనము తప్పలేదు. ఇట్లు విభేదము పరపీడాపద్ధతి లేనిమహాత్ముడగు గాంధియట్టివాడే దేవునికిష్టుడు.†

† పరపీడాకరంకర్మ యస్యనాస్తి మహాత్మనః।
సంవిభాగశ్చ భూతానాం తస్య తుష్యతి కేశవః॥ (శంకరగీత)

అహింసాపద్ధతి నిదివరలో రష్యాలో టాల్స్టాయి, ఇంగ్లండులో రస్కిను, ఫ్రాంసులో రోమేంరోలండును, బోధించినారు. గాంధిగారు వీరి బోధనలు సిద్ధాంతములు యువకదశలో నేర్చుకొన్నారు, పిమ్మట రోలండుకు మిత్రులైనారు. అయితే, టాల్స్టాయి రస్కినులు కేవలం గ్రంథరచయితలు, సిద్ధాంతబోధకులుమాత్రమే. ఇట్లే రోలండును తత్వవేత్తగనే జీవితము గడపి వృద్ధుడైనాడు. వారివలెగాక, గాంధిమహాత్ముడు తనదేశపు జాతీయోద్యమాలలో ప్రత్యక్షముగాపాల్గొని, అహింసాసిద్ధాంతప్రకారం ఆయాసమస్యల ప్రత్యక్ష పరిష్కారముకు అంతర్జాతీయమైత్రికి వీలగు పూర్తియైన నిర్మాణకార్యక్రమ మములుజరుపుచు, బలిష్ఠసామ్రాజ్యంపైన అహింసాయుద్ధమును నాయకుడుగ సాగించుచున్నాడు. జ్ఞానియగుటేగాక, ఆత్మానుభవం కలిగి గాంధిమహాత్ముడు క్రియాశీలకంగా ఆదర్శవాదియైన (Practical idealist) కర్మవీరుడు. కనుక ఆయనయే ఇప్పటి మహనీయులందరిలోను ఉత్తమపురుషుడనియు ఆయన చూపించు అహింసామార్గమువల్లనే లోకక్షేమము గల్గునని యు ధీమంతులగు కొందరు పాశ్చాత్యులు నంగీకరించినారు.

లోకమంతటివలె భారతీయు లిట్లు హింసాతరంగాలలో మునిగియున్నను, జనులు శాంతంగా కనబడుచున్నందున అహింసాతత్వ మీదేశంలో వ్యాపించియేయున్నదని అనేకులు భ్రమపడుచున్నారు. ఇప్పుడీదేశంలో నున్నది సరియైన అహింసాతత్వముకాదు. అహింసలో ధీరత సర్వమానవ భ్రాతృత్వము చేరియున్నవి. నరులందరి హృదయాలలోను ఈశ్వరాంశయున్నది. కనుక వారందరిహృదయము దేవాలయంవంటిది. నరులపై ప్రేమ యీశ్వరప్రేమయే; జనుల బాధించుట ఈశ్వరుపై నపరాధమే. నిజమైన అహింస సాత్వికము, బలీయము. అట్లుకాక, ప్రత్యర్థిపైన ద్వేషముంచి భయము, పీకికిదనము అజ్ఞానమువల్లనే రక్తపాతంచేయకుండుట నిజమైన అహింసకాదు. అది తామసము దుర్బలలక్షణము. విశ్వప్రేమగల్గి అంతరికంగా మహాతేజస్కులగువారు నిర్భీకులైవీరులై మహా

త్యాగులై పరోపకారులై యుందురు. త్యాగము, ధైర్యము, ఆత్మవిశ్వాసము భక్తిలేకుండ స్వాతంత్ర్యము సాంఘికసామరస్యము లభింపవు.*

నిజమగు అహింసతో రాజసము జనించి సాత్వికులగుటకు బదులు, మనవారు హింస నెదిరించలేక మందులై భీరువులై తామసత్వములో నున్నారు. ఇది జీవశక్తిక్షీణతకు సూచన. ఇట్లు తమోగుణపరిభూతులై జంకుటకన్న ధైర్యముతో దుష్టహింసనుప్రతిహింసతోనైన నెదుర్కొని న్యాయరక్షణచేయుటే ప్రశస్తము.† అట్టి హింసాపరులు ధీరులు ఉత్సాహులు సాహసులునై హింసాఫలమునను భవించి ముందైనను అహింసాపరులై సాత్వికశక్తిగల్గి నిశ్రేయసము సంపాదింతురు. అట్లుగాక, భయోద్వేగమున నిరోధముమాని అన్యాయమునకు హింసాచారమునకు లొంగి నిర్వీర్యులగువారికసలే మోక్షముండదు.‡ అనగా రాజసమునుండి సాత్వికత గలుగుట సులభము, తామసమునుండిసాత్వికత కెక్కుట చాలకష్టము. లోపలికామక్రోధాదులనచి ప్రేమపరులగువారు సర్వత్ర నిల్చియున్న విశ్వశక్తిని సమన్వయించుకొని ఆత్మానుభవ మొందుదురు.

---

* Neither independance nor communal unity is possible without ample sacrifice bravery and self- confidence which is but another name for faith.

(గాంధిగారి 4-5-1941 తేదీ ప్రచురణం)

† ..... I advocate training in arms for those who believe in the method of violance. I would rather have India resort to arms in order to defend her honour than that she should in a cowardly manner become or remain a helpless witness to her own dis-honour.

(యంగు ఇండియా 6-8-20)

‡ There is hope for a violant man to be some day non-violant; but there is none for a coward. Ahimsa is the extreme limit of for give-ness. But forgiveness is the quality of the brave. Ahimsa is impossible without fearlessness.

(యంగు ఇండియా 21-10-26.)

ఈశక్తిని భౌతికులు ,Cosmic energy' అందురు. ఇదిమహనీయుల దేహములోనుండి ఆత్మశక్తిని పరమానందమును గల్గించు సాత్వికతేజ మనబడును. పరిపూర్ణమగు సాత్వికతేజపు బలము దుర్నివారము.

స్వీయమోక్షమునేకోరక ప్రజాక్షేమముకోరి అందుకై అహింసా ధర్మమును మనదేశీయులలో వ్యాపింపజేయుకృషిలో గాంధిమహాత్ముడు రాజకీయములకు దిగవలసివచ్చినది. జాతీయైక్యము దేశస్వాతంత్ర్యముగల్గినప్పుడే, జనులకున్నతిసాధ్యము. ఐననురాజకీయస్వాతంత్ర్యముజాతీయోన్నతికుపకరణమాత్రమే. అదేఆదర్శము కాదు. కనుక రాజకీయకృషితోపాటు సంపూర్ణమగు జాతీయాభివృద్ధికై ఆయన గొప్పఅహింసా ప్రక్రియ నాలోచించి అమలుచేయుచున్నాడు. ఇదే 5 శాఖలుగ నిర్మాణ కార్యక్రమమను పేరుతో జాతీయసభవారియామోదమొందినది. దీనిని గాంధిగారటీవల 13 గ విభజించినాడు. 1. సాంఘికమైత్రి 2. అస్పృశ్యతా నివారణ 3. మద్యనిషేధం 4 ఖదరు 5. తక్కిన గ్రామపరిశ్రమలు 6. గ్రామ పరిశుద్ధి 7. నవ్యవిద్యాధానం 8. వయోజనవిద్య 9. స్త్రీలయుద్ధరణ 10. ఆరోగ్యాభివృద్ధి 11. సామాన్యభాష (హిందీ) 12. మాతృభాషాసేవ 13. ఆర్థికసమత్వము (వర్గసమన్వయం). ఈమొత్తపుప్రణాళిక సర్వతోముఖము. ఇందులో ఖదరుకు గ్రామపరిశ్రమలకు ఆర్థికంలోను మధ్యనిషేధముకు నైతికంలోను సామాన్యభాషకు వాఙ్మయన్యాపారాలలోను అస్పృశ్యతానివారణాదులకు సాంఘికంలోను ప్రాధాన్యమున్నది. కాని ఈకార్యక్రమము జాతీయజీవితమంతకుసంబంధించి సర్వాంగసుందరముగనున్నది. జాతీయనాదులు కాకున్ననుసంఘక్షేమపరు లందరు ఈప్రక్రియ నాచరింపదగును. రుచిభేదమునుబట్టి ఒక్కొక్కదానికి ప్రాధాన్యమీయవచ్చు. కాని, అన్నిటియందును ఆదరముండుట అవసరము. కొన్నిటికి వ్యతిరేకులై తక్కినవాటి నభిమానించినను అట్టివారు పూర్తియగు అహింసాపరులు కాలేరు. ఇవియన్నియు ఒకే అహింసావృక్షపు శాఖలు, ఒకే ప్రేమదేహపు అంగములు, అనదగును. మరియు, ఈ నిర్మాణకార్యము సంఘజీవితముకు వ్యక్తిజీవితముకుగూడ సంబంధించినది.

ఈకార్యక్రమమునకున్న పరస్పరసంబంధము గాఢము. ఖదరు గ్రామపరిశ్రమలవల్ల ఆర్థికక్షేమమేగాక, బస్తీలలో కిక్కిరిసి జీవించుట పరాధీనత పోయి, సాంఘికస్వేచ్ఛ లభించును; నైతికంగా సౌజన్యము ప్రేమభావము నేర్పడును. మరియు ఆరోగ్యము బాగుపడును, యాంత్రికశ్రమమద్యాసక్తియు పోవును.

ఇట్లే హరిజనోద్ధరణ సాంఘికద్వేషము పోగొట్టి అహింసావ్యాప్తి గల్గించుటేగాక, వారికార్మికశక్తినివినియోగించివడికించుట నేయించుటవల్ల చౌకగ ప్రశస్తమగు మూలనూలుఖదరు తయారగును. ఇట్లు గ్రామపరిశ్రమల ఆర్థికజయము వీరి శిల్పకృషినుపయోగించినచే సాధ్యమగును. హరిజనులలోనేమద్యపానమిప్పుడు హెచ్చు. హరిజనులనుద్ధరించినమీదనే మద్యనిషేధము సరిగా అమలు జరుగును; మరియు అంటువ్యాధులు తరుచు స్నానపానాదుల కవకాశము అభ్యాసములేని మూలమాదిగల గూడెములలో పుట్టి సవర్ణులపేటలకు వ్యాపించును. కనుక వారి అస్పృశ్యత పోయిపరిశుభ్రతయేర్పడుట, విద్యవచ్చి మూఢాచారములునశించుట, గ్రామాభివృద్ధికినిఅవసరము. కార్మికులగుహరిజనులుమూఢులు దుర్బలులు గనుంచి, పునాదిచెడిన భవనమువలె భారతజాతియంతయు క్షీణించును. అస్పృశ్యత పోయినప్పుడే హరిజనోద్ధరణ జరుగును. ఇదినిజంగా మానవత్వమురక్షించుధార్మికయుద్ధము†. వారికిదేవాలయాదుల ప్రవేశముండుట ధార్మికతకు హిందూమతదృఢత్వమునకు మద్యనిషేధవ్యాప్తికి అయామత స్థులమధ్య మైత్రికిని పోషకమనియు గమనించినాము. ఇట్లేమద్యనిషేధము నైతికమేగాక బీదజనుల కార్థికంగాను ఆరోగ్యవిషయంలోను సాంఘికమైత్రి విషయంలోను ఉపకారకము. సాంఘికమైత్రిగల్గుట జాతీయంగానేగాక, ధార్మికంగాను, అన్యోన్యసహాయంవల్ల ఆర్థికంగాను లాభకరము, జాతీయవ్యాపారమునకు సహాయకరము.

---

† The fight against untouchability is a religious fight ; it is a fight for the recognition of human dignity.

(యంగు ఇండియాలో 5-2-25 తేదీ గాంధిగారి వ్యాసము.)

స్త్రీలు మూర్ఖస్థితిలోను అనారోగ్యంలోను ఉన్నంతకాలం మన జాతి ఏరీతిగను బాగుపడదు. వారి సహకారము లేకుండ ఖదరు, స్వదేశీ, సాంఘికమైత్రి, హరిజనోన్నతి, ఆరోగ్యము ఇట్టివి సరిగా సాగవు. ఇట్లే మన మాతృభాషలో జ్ఞానము వ్యాపించి, నవోత్సాహమును నీతి పరతను అహింస దీక్షను, నిర్మాణకార్యపరతను ప్రేరేపించు సులభరచన లేర్పడవలె. వార్ధావిద్యావిధానము గ్రామపరిశ్రమలకు (ముఖ్యంగా ఖదరుకు) సహాయకరము. ఆర్థికమనుకొను వర్గసమన్వయము అహింసకు, సాంఘికమైత్రికి గ్రామాభివృద్ధికిని తోడ్పడును. ఇట్లీ కార్యక్రమమంతయు పరస్పరం సంబంధించినది.

నిర్మాణ కార్యక్రమంలో ఆంధ్రులదే అగ్ర(=మొదటి)స్థానమని కొంతకాలము మంచిపేరుండేది. ఖదరు, సాంఘికమైత్రి, హిందీవ్యాప్తి ఇట్టివాటివిషయంలో తక్కినదాక్షిణాత్యులకన్న మనకెక్కువ సహజ సౌకర్యమున్నది. కాని, ఇటీవల మనము నిర్మాణకార్యంలో బొత్తిగా వెనుకబడుచున్నామని ఒప్పుకోకతప్పదు. దక్షిణభారతసభవారి హిందీ ప్రచారపరీక్షల యంకెలను చూడగా, ఆంధ్రులు మొదటిస్థానమునుండి కివస్థానములోకి జారినట్లు స్పష్టము. కన్నడులు, కేరళులు జనాభాలో మనకన్న చాలతక్కువయైనను వారిలోనే ఇప్పుడెక్కువమంది హిందీపరీక్షార్థులున్నారు. ఇట్లే, ఖదరులో వెనుకబడియుండినతమిళనాడు, సంయుక్త ప్రాంతము బెంగాలుగూడ ఖదరు ఉత్పత్తివిక్రయములలో చర్కాసంఘ సభ్యతలోను మనకన్న చాలముందంజ వేసినారని అఖిలభారత చర్కాసంఘపునివేదికయంకెలువిశదపర్చుచున్నవి. హరిజనోద్ధరణ దేవాలయప్రవేశము ఆంధ్రప్రాంతాలలో బొత్తిగా వెనుకబడియున్నవని హరిజనసేవకసంఘపునివేదికవల్ల అనుభవంవల్ల సూచితము. ఆంధ్రజిల్లాల ప్రసిద్ధదేవాలయాలలో నొక్కటియు హరిజనులను రానిచ్చుటలేదు. అందుకు తగు కృషియులేదు. మద్యపానము నల్లమందుపొగాకుఖర్చు హెచ్చుచుగనున్నది. ఇక్కడ పొగాకు మిర్చిపంట హెచ్చుచుండుటయు శోకకరము; మంచి

పత్తియుత్పత్తి తక్కువ. ఆంధ్రంలో నవ్యవాఙ్మయము ప్రజాక్షేమకరమగు రీతిని కావలెను. ఆహారవిహారములలోను తీక్ష్ణబుద్ధి విచారములనువదలి దేహంలో సంఘర్షము లేకుండ సాత్వికతను ఆరోగ్యమును వృద్ధిచేయు మార్పులు చేసుకోవలెనని లోగడ అధ్యాయాలలో చెప్పిన దాంధ్రుల కెక్కువ వర్తించును. రాజకీయంలో ప్రాంతీయతత్వమును హెచ్చుగ నున్నది. ఆంధ్రరాష్ట్రమందు మనకభిమానముండుట అవసరమే. అది స్వయంకృషిగ క్రియారూపమై, స్వాభివృద్ధికరమై యుండవలె. అట్లుగాక ఇతరులతోను మనలో ఆయా ప్రాంతాలమధ్యను ద్వేషజనకంగా సాగించుట విచారకరము. ఇట్లేసహకారవ్యాపారంలోఆంధ్రులపరస్పరకలహాంవల్ల, ఆంధ్రులముఖ్యపరిశ్రమలు, వ్యాపారములు స్తంభించి యుండుట, వాఙ్మయవిషయంలో గ్రాంథిక వ్యావహారిక సంఘర్షమును నిరాదర్శత, అశ్లీలత, విద్వాంసులలోను పరస్పరదూషణలు, ఇట్టివిపోవలె; జాతీయోన్నతినీతిపరత ప్రోత్సహించు వాఙ్మయమును మాతృభాషలో రచింప వలెను. ఆంధ్రులలో వేలకొలది యిప్పటిసత్యాగ్రహముకు సిద్ధపడి యున్నను, తగు శోధరాలేదు. నిర్మాణకార్యక్రమము జయప్రదంగా సాగించినప్పుడే సత్యాగ్రహము జయప్రదమైన క్లైంచవలెను.*

ఆంధ్ర ప్రాంతపు నిర్మాణకార్యసంఘములిప్పుడు తగు ద్రవ్యసహాయము కార్యదీక్ష లేక మందముగనున్నవి; వాటికి ప్రజాసహాయమును చాలఅవసరము. వాచాలత ఉద్రేకము ద్వేషముమాని, గుజరాతీలుతమిళులు ఇత్యాదులనుండి మనమునిదానమును స్వయంకృషినిదీక్షను కార్యపరతను నేర్చుకొని వృద్ధికావలెను; మనగ్రామజనులు సోమరితనమువ్వలా

---

* The success of civil resistance can be measured by the success of the constructive effort.

(గాంధిమహాత్ముని ప్రమురణ 21-8-41)

One who has completely devoted himself to constructive work will be doing more valuable work than a Satyagrahi merely courting imprisonment.

(గాంధిగారి 30-4-41 తేది ప్రమురణ)

భపరతమాని సంఘక్షేమముకై కృషిచేయుట కెంతేని అవకాశమున్నది. జనులలో పరస్పరప్రేమ ఉత్సాహమువల్ల నిర్మాణకార్యమును, నిర్మాణకార్యపరతవల్ల పరస్పరప్రేమయు ఉత్సాహమును, వృద్ధియగును.

ఇట్లు నిర్మాణపరత వెనుకబడినందున ఆంధ్రప్రాంతము హీనస్థితి లోనుండుట సహజమే. నిర్మాణ కార్యక్రమమును భాగుగసాగించితేనే ఆంధ్రులకన్నివిధాలను ప్రాంతాభివృద్ధియు, జాతీయతయు సిద్ధించును; మనలో త్యాగబుద్ధి సంఘసేవాసక్తి వృద్ధికావలెను. పాశ్చాత్యులలోను విషయలోలురై త్యాగహీనులైనవారు నశించినారు. 1918 సంఁపు జయము తరువాత త్యాగమునశించి విలాసిత్వము దురభ్యాసములు హెచ్చుట 1940సంఁరంలో ప్రవేశించిచారి పతనమునకు కారణమైనది † స్వయంకృషి ద్వారా సర్వభూతసేవచేయుటవల్లనేసర్వభూతాత్మకుడగు ఈశ్వరునిసేవించితద్వారా మానవుడు సిద్ధిపొందగల్గును* విశ్వవికాసమునకు ప్రేమఅవసరము, కనుక ప్రేమజనకమగు అహింస అవశ్యం ఆచరణీయము. నిజముగ, జీవాభివృద్ధికంతకు అహింసాప్రేమములే మూలాధారములు. మానవతత్వములో ప్రేమయే ముఖ్యనిశేషము. విజ్ఞానపరిశోధనలవల్ల భౌతికముగ నెన్నిటినోసాధించినాము. కాని,ఇందులోఆత్మకజయములేదు, ప్రేమతత్వముద్వారా పరిశుద్ధులై నిగ్రహులై సత్కర్మపరులైతే, అంతకన్న నెక్కువజయము సాధ్యమగును. అందువల్ల ప్రాణికోటి యున్నతస్థితి

† Since the victory of 1918, the spirit of pleasure has prevailed over the spirit of sacrifice. People have demanded more than they have given. They have wanted to spare themselves effort.

Statement of Marshall Petain (20-6-1940) on the fall of France.

* యతః ప్రవృత్తిర్భూతానాం యేన సర్వమిదంతతం ।
స్వకర్మణా తమభ్యర్చ్య సిద్ధిం విందతి మానవః (గీత)

నొందును. ప్రేమ తత్వపుబలము త్యాగముద్వారానే తెలియును†

అహింస అత్యున్నతాదర్శము; దానినాచరింపలేకపోవుటకు మన దౌర్బల్యము కారణము. నిరంతరపరిశ్రమకావలె. తేళ్ళు పాములు, దుష్టులగు దొంగలు, ఆతతాయులు కనబడినప్పుడు మనస్సులో భయము హింసాబుద్ధి కలుగుచుండును. అందుకు చాలవరకు మనపూర్వసంస్కారము కారణము. అహింస ఆచరణలో సాధ్యముకాదనుకొని,హింసాప్రవృత్తినే పెట్టుకొనుట తప్పు అహింసవల్ల క్రమముగవినాశముతగ్గి, జీవశక్తిప్రేమము హెచ్చును. హింసాప్రవృత్తివల్ల నష్టము ద్వేషమును లోకములో వ్యాపించును *

అయితే, సంపూర్ణమగు అహింసాతత్వమలవడువరకు, ఆచరణలో కొన్ని మినహాయింపులు పెట్టుకోవలసియున్నది. ఇంటిలోకటి పాములేలు పులులుప్లేగుఎలుకలు పిచ్చికుక్కలు మొదలగు జంతుప్రజంపుట. ఇప్పటిస్థితిలో మానవరక్షణకై ఈహింస తప్పదు. ఇట్లే చికిత్సవల్లను కుదరక తీవ్రవ్యాధిచే మరణబాధబడు పశువును చంపుటకు గాంధిగారంగీకరించినారు. మరియు ఆయుధహస్తులగు బందిపోట్లువచ్చి ప్రాణ

† But the victories of physical science would be nothing against the victory of the science of life which is of our being. ... .It shall be proved by persons living it in their lives in utter disregard of consequences to themselves. There is no real gain without sacrifice And since the demonstration of the law of love is the realest gain, sacrifice for it must be the greatest required.

(హరిజనపత్రికలో గాంధిగారివ్యాసం 26-9-1936)

* The ideal must not be lowered because of our weaknesses or imperfections.....I own my fear of snakes, scorpions, lions ..... murderers. ... ... One who hooks his fortunes to Ahimsa, the law of love, daily lessens the circle of destruction and to that extent promotes life and love ; he who swears by Himsa, the law of hatred daily widens the circle of destruction and to that extent promotes death and hate. ... ... Though I may fail to carry it (ahimsa) out to the full in this life, my faith in it shall abide. Every failure brings me nearer the realisation. (హరిజన్ 22-6-1938)

ములుతీయుటకు స్త్రీలమానమువారించుటకు సిద్ధమైనప్పుడు, రక్షణకై ఆకష్టుల హింసించుట తప్పనిసరియగును.*

జాతీయప్రభుత్వములు అహింసాస్థితిలో ఆయుధసామగ్రిలేకుండ, ఆత్మార్పణచేయు శాంతిసైనికులద్వారాను, నిగ్రహముద్వారాను, దేశ రక్షణచేయవచ్చునని గాంధిమహాత్మునిభావము. కాని అట్టిఆదర్శస్థితి యిప్పుడు రాలేదు. ఇప్పుడన్న హింసావ్యాప్తిలో స్వదేశస్వాతంత్ర్యము రక్షించుటకై యుద్ధపద్ధతులు నేర్చుకొని శత్రువులతోపోరి వారినిచంపు టయు తప్పనిసరియగును. లోకములో నెక్కడనుసంపూర్ణమగు అహింస యింకను వ్యాపించలేదు. హింసాశూరులకన్న అహింసావీరులకే హెచ్చు ఆత్మశక్తి సాహసముకావలెను. అట్టిగుండెబలము క్రమశిక్షచాలనప్పుడు, భీరులమై హింసకు లొంగుటకన్న ధీరులమై ఆయుధములతో పోరి రక్షించుకోవలసినదే. †

ఈ నిర్మాణకార్యక్రమమే మనదేశంలో అహింసాసత్యముల వ్యాప్తికి తగినది; సమన్వయశక్తిగలది. అది పాశ్చాత్యుల తీవ్రయాంత్రిక తకు ఆదిమజనుల ప్రాకృతస్థితికిమధ్యగ సహనన్యాయకరము; ఇట్లే అది బ్రిటను అమెరికాలలోనుండిన వ్యక్తి స్వాతంత్ర్యపద్ధతికి జర్మనీ రష్యా ఇత్యాదులనియంతృపద్ధతికి మధ్యరకముగానున్నది; మరియు కిక్కిరిసిన మహానగరములకు ఏకాంతవనవాసముకుమధ్య సమన్వయించి, గ్రామా భివృద్ధి గల్గించును. అది అన్నిప్రాంతములకులాభకరమై, ప్రాంతీయజాతీ

*I do not say "Eschew violance in your dealings with robbers or thieves or with nations that invade India. (యంగు ఇండియా 29-9-1924.)

They ought to possess the capacity of resisting Goonda-shahi violantly or non-violantly (23-5-41 తేదీని గాంధిగారి ప్రకరణ.)

† If there was national government, while I should not take direct part in any war, I conceive occasions when it is my duty to vote for the military training of those who wish to take it. For I know that all its members do not believe in non-violance to the extent that I do. It is not possible to make a person or society non-violant by compulsion. (యంగు ఇండియా 18-7-1928)

యతలను, ఇల్లే జాతీయతను అంతర్జాతీయతను, మేళవించి సంఘర్షము పోగొట్టును; జడశక్తికేవలపు ఆత్మపరతకుమధ్యను, తార్కికరూపమగు జ్ఞానయోగముకు కార్యపరమగు కర్మయోగముకుమధ్యను, అన్యోన్యతను కల్గించును; ప్రకృతిప్రధానమగు భౌతికతకు పురుషతత్వరూపమగునట్టి ఆధ్యాత్మికతకును సమ్మేళనమిచ్చును. ఇల్లే వ్యవసాయికతకు పరిశ్రామికతకు మధ్యను, కర్షకకార్మికుల మధ్యను, స్త్రీ పురుషజాతుల మధ్యను, ఆయా వర్ణములమధ్యను, కులముల మతముల మధ్యనుగూడ, పరస్పర మైత్రిని ఏకీభావమునుగల్గించును; ఇది మహాసమన్వయకరము. మనజాతీయ నిర్మాణకార్యము అంతర్జాతీయశాంతికి క్షేమముకును సహాయకము.

ఈ అహింసాకార్యక్రమము వ్యక్తిజీవనముకేకాక, జనసంఘమంతటికి నుపయోగించునని, ధార్మికముకు ఆర్థికసాంఘికములకు రాజకీయములకుగూడ నుపయోగించి కార్యసాధనచేయవచ్చునని, ఈకాలమందు గాంధిమహాత్ముడు నిదర్శనపూర్వకముగను చూపియున్నాడు.

అహింస నిజముగబలీయమైనను, అది నిదానముమీదనే అలవడవలెను. అందుకునిరంతరకృషిఅవసరము. ఇంద్రియనిగ్రహము ఆత్మబలమునే దీనిముఖ్యసూత్రములు; అన్నియింద్రియములవశముకు యత్నించినప్పుడే సాధకులునిగ్రహమును సులభముగ నలవర్చుకోగలరు. మన అహింసావాదులును ఏదో ఒకటి రెండు ఇంద్రియముల నిగ్రహముకే శ్రద్ధవహించుటవల్ల వారి అహింసదృష్టము సర్వతోముఖముకాకయున్నది. ఇంద్రియనిగ్రహములలో జననేంద్రియపు నిగ్రహము ముఖ్యము; అందువల్లరక్షిత మగువీర్యశక్తిని నిర్మాణకరమగు సాంఘికసేవకు వినియోగించదగును.* ఇందులో దృష్టినిగ్రహము భావనిగ్రహము లేకుండ వట్టి క్రియానిగ్రహము ఫలప్రదముకాదు; త్రికరణశుద్ధి కావలెను. ఆహారనియమము, (జిహ్వ

* If the vitality is husbanded instead of being dissipated it is transmuted into creative energy of the highest order.

(హరిజన్‌లో గాంధీగారివ్యాసము-28-7-1933)

నిగ్రహము) మితభాషిత్వము, సత్యపరత (వాఙ్నిగ్రహము) వగైరాలును అలవడవలెను. సౌమ్యము మితమునగు ఇంద్రియ పోషణమంచిదే, కానిఅనియమితము అనవసరము కాకూడదు. ఈనిగ్రహములకు అన్నిటికిని పరస్పరసంబంధమున్నదనియు గ్రహింపవలెను. ఆహారవిహారముల నిగ్రహము లేనిదే తక్కిననిగ్రహములును అంతశ్శక్తి సంపాదనయు సాధ్యము కావు. వీటి అన్నిటికిని మూలము మనోనిగ్రహము ఆత్మపరిశుద్ధి అనియు మరువ కూడదు. ‡

ఇట్లు వ్యక్తులవలె సంఘమంతయు సమిష్టిగను అహింసాసాధన చేయవలెను. వ్యక్తిసాధనవల్ల సంఘసాధనయు, సమిష్టిసాధనవల్ల వ్యక్తి సాధనయు సులభమై అన్యోన్యసహాయకమగును; ప్రేమతత్వముద్వారా జనుల అంతశ్శక్తి వృద్ధిచై, ఉత్పాదకతభాగపడి, సంఘపునర్నిర్మాణమునకు ఉపయోగించును; వీటిఅన్నిటికుండు అనోన్యతనుబట్టి వీటిలో ప్రతిఅంశమును అహింసవ్యాప్తికిజాతీయజీవితములో అన్నివిషయముల నిర్మాణమునకు నుపయోగించునదే. కనుకవీటిలన్నిటినాచరించునప్పుడేమనము నిర్మాణకార్యపథులము కాగలము. ఈకార్యక్రమమును సరిగ సంఘములో హెచ్చుమంది ఆచరించినప్పుడే క్రియాకారియగు అహింసయేర్పడును. *

అవియెట్లు అహింసాసాధకములో లోగడ ఆయా అధ్యాయములచర్చలోచూచియున్నాము. జాతీయస్వాతంత్ర్యరక్షణకును నిర్మాణకార్యపు జయమే సూచకము. ఇట్లు ఖదసవగైరాలద్వారా గ్రామపరిశ్రమలను బాగుగ వృద్ధిజేసి వీటిని ప్రోత్సహించితిమా, ప్రభుత్వముతో సంఘ

‡ He therefore who is resolved to control the one must be likewise determined to control the rest. I have always felt that much harm has been done by the narrow definition of Brahmacharya. If we practise simultaneous self-control in all directions, the attempt is scientific and easy of success. (From Yerravada Mandir P. 19.)

* Widening and working of the Constructive Programme is the only way in which active non-violance can express itself.

(గాంధిమహాత్ముని ఉద్బోధన 21-8-1941 తేదీ)

ర్షము లేకుండనే మనకు స్వరాజ్యము లభించవచ్చును. † అట్లు రాదను కొన్నను, నిర్మాణకార్యపు బలముగల్గితే సత్యాగ్రహము జయప్రదమై స్వాతంత్ర్యము సంపాదిత మగును. దానిజయముకు క్రమశిక్షణయు అన్నివిధముల త్యాగమును విశ్వాసమును కావలెను; అవిలేకనే అశ్రద్ధ ప్రబలినది. ‡ లోకమోక్షముకును చేతిపనులే ఇంకనాధారంకావలెన్గే.

ఒకవేళ ప్రభుత్వమువారు జబర్దస్తితో సత్యాగ్రహుల ఆస్తులను వ్యక్తి స్వాతంత్ర్యమును పోగొట్టవచ్చును. ప్రాణాపాయము గల్గినను సత్యాగ్రహులు అట్టి సంపూర్ణ త్యాగముకును సిద్ధపడవలెను. అయితే త్యాగమును ధైర్యముతోను తనకు సంఘముకుసాధ్యమైనంతవరకు అంతశ్శక్తిని హెచ్చించుటకునే చేయవలెను. వ్యర్థత్యాగము ఆత్మహింసయగును. అట్టి ఆత్మహింసాచర్య నిరాశాఫలము, నిష్ప్రయోజనము. పరహింస వలె ఆత్మహింసయు దోషమే. మన దేహేంద్రియాదులను లోకోపకారముకే దేవుడు ప్రసాదించినాడు. వాటిత్రో పరహింసను ఆత్మహింసనిచేసుకొనుటయు సరులదే తప్పు, అయినను వారుదేవుని నిందించుచున్నారు.* కనుక త్యాగము సమగ్రశ్రేయస్సుత్రో లోకక్షేమముకై చేయునప్పుడే సాహా

† 'The key to complete independance is in our own hands in the revival of village Industries.'

(15.3.1940 రామగుండము కార్మికుల ఖద్దరు ప్రదర్శనములో గాంధిమహాత్ముని యుపన్యాసము.)

‡ The apathy about the constructive programme i. e. spinning khadi, etc. I take to be positive sign of unbelief. (హరిజన 9-3-1940)

§ There is no deliverance for the world groaning under a gignantic war except through an enlightened and voluntary return to the handicrafts with the Charka in the centre.

('భారతజాతి'పత్రికలో గాంధిగారి 26-7-1941 తేదీ వ్యాసము)

* క్షేశత్యాగకృతేర్పితేన కరణవ్యూహేన దేహేన చ,
స్వార్థం బత జంతురాజ్జయతిచేత్ మంతుర్నియంతుః కుతః।
శస్త్రే శత్రుజయాయ నైజగురుణా దత్తేఽధ తేనైవ చేత్
పుత్రోహంతి నిజం వపుః కథయరే శత్రాపరాధీతుకః॥ (విశ్వగుణాదర్శం.)

సము ఫలప్రదమగును. నిజమైన ఈశ్వరభక్తిగల్గిన వారికి విచక్షణ సులభమే.

అహింసాయుద్ధపు సూత్రముల నిదివరలో గమనించినాము. ముఖ్యముగా, శత్రునినాశముకాక మనప్రేమద్వారాశత్రుహృదయము కరగించుటే ఈసిద్ధాంతపు ఉద్దేశము. తుదకు ఉభయులకు క్షేమకరమైన రాజీపరిష్కారము జరుగునట్లు చేయుటే అహింసాయుద్ధపు మూల సంకల్పము. కనుక శాంతవాతావరణము అవసరము; మరియు శత్రువు చాలకష్టపరిస్థితిలో నున్నప్పుడు అతనిపైన తీవ్రయుద్ధము సాగించి బాధ పెట్టి లొంగదీసి సాధింపజూచుట అహింసాసిద్ధాంతమునకు వ్యతిరేక మనియుగ్రహించవలె.*

ఇప్పటి యుద్ధసత్యాగ్రహమును కేవలం నైతికంగాను, లోకులకు హానిలేకుండను మానవత్వరక్షణకు సాగించినట్లు ఈయుద్ధానంతరం లోకమునకు స్తిమితమేర్పడినప్పుడు తెలియగలదు †

అహింసాతత్వపుసూత్రములు సాధకబద్ధతులును గాంధిమహాత్ముడొకసారి యిట్లువివరించెను ‡

(1) మానవజాతికంతకు అహింసయే మూలధర్మము ఇదిభౌతిక బలముకన్న నెంతయో అధికము, బలీయము.

---

* The end of non-violant war is always an agreement, never dictation, much less humiliation of the opponent. There can be no question of the Congress asking or expecting Britain to dishonour just obligations or treaties .....

(హరిజన్‌లో ఒక ఆంగ్లేయుని లేఖకు 22-8-40 తేదీని గాంధిమహాత్ముని జవాబు.)

† When the clash of arms has ceased and we have settled down to peace, permanant or impermanent, history will record that the congress fight, in its totality, was a supremedy moral fight and free from any injury to man's dignity.

(21-4-41 తేదీని గాంధిమహాత్ముని ప్రచురణ)

‡ It may not therefore be presumptious on my part, if I set down without argument the implications; here they are :—

(1) Non-violance is the law of the human race, and is infinitey greater than and superior to brute force.

(2) ఇందుకు ప్రేమమయుడగు భగవంతునియందు ప్రపత్తికావలె. అట్టి భక్తిలేకుండ క్లిష్టసమయమందు అహింసాసాధన చేయ వీలుకాదు.

(3) మర్యాదను ఆత్మగౌరవమును పూర్తిగ రక్షించుకొనుటకు అహింస ఉపయోగించును; భూములను చరాస్తిని రక్షించుట కొకప్పుడది యుపయోగింపకపోవచ్చు; అయితే వాటిరక్షణకును ఆయుధధారుల కంటె నిత్యకృత్యముగ అహింసాభ్యాసముగలవారికే ఎక్కువ యుపయోగించుచుండును. అన్యాయార్జితమగు లాభములను అవినీతిచర్యలను కాపాడుటకు అహింస యెన్నడును ఉపయోగించదు; ఇది సహజమే.

(4) అహింసారాధకులగు వ్యక్తులు జాతులుగూడ గౌరవము తప్ప తక్కిన తమ సొత్తులన్నిటిని త్యజించుటకు సిద్ధపడవలెను. (జాతిలో నరులందరు నిట్టి త్యాగము చూపవలె.) కనుక ఇతరులదేశములను వశమందుంచుకొనుట అహింసాపద్ధతిలో పొసగదు. అసగా భౌతికబలముతో అధికారము నిల్పుకొను ఇప్పటి సామ్రాజ్యతత్వము అహింసకు వ్యతిరిక్తము.

---

(2) In the last resort it does not avail those who do not possess a living faith in the God of Love.

(3) Non-violance affords the fullest protection to one's self respect and service of honour, but not always to possession of land or movable property, though its habitual practice does prove a greater bulwark than the possession of armed men to defend them. Non-violance in the very nature of things is of no assistance in the defence of ill-gotten gains and immoral acts.

(4) Individuals or nations who would practise non-violance must be prepared to sacrifice (nations to the last man)their all except honour. It is therefore inconsistant with the possession of other people's countries, i. e. modern imperialism which is frankly based on force for its defence.

(5) అహింసకు ప్రేమమయుడగు నీశ్వరునందు నిజమైన భక్తి యు కనుక మానవజాతిపైన పూర్ణప్రేమయు కావలె. అట్టిప్రేమగల అందరు పిల్లలు, యువకులగు, స్త్రీలు పురుషులు పెద్దలుగూడ అహింసాశక్తి నుపయోగింపవచ్చు.

అహింసను జీవితధర్మముగ అంగీకరించువాడు దానిని జీవితమంతటికి వర్తింపజేయవలె. కొన్నికార్యములకుమాత్ర మవలంబించితే లాభములేదు.

(6) వ్యక్తిజీవితముకే అహింస మంచిదనుకొనుట పట్టి పోరబాటు; అది మానవజాతిలోని జనసంఘములంతటికి నుపయోగకరమే.

లోకుల సుఖదుఃఖములు తమవిగ భావించుకొని అట్లు నడుచుకొనుటే అహింస; అదే 'సనాతనధర్మము' అని భాగవతములో నిట్లు నిర్వచించినారు.

'ఏతావా నవ్యయో ధర్మః
సద్భి ర్నిత్యం అనుస్మితః
యల్లోక శోక హర్షాభ్యాం
ఆత్మా శోచతి హృష్యతి'

---

(5) Non-violance is a power that can be wielded equally by all — children, young men and women, or grown up people — provided they have a living faith in the God of Love and have therefore equal love for all mankind. When non-violance is accepted as the law of life, it must provide the whole being and not be applied to isolated acts.

(6) It is a profound error to suppose that while the law is good enough for individuals it is not for masses of mankind.

(హరిజన్ 5-9-1936)

రెండవభాగము.

సవరణపట్టిక.

పుట.	పంక్తి.	ఉన్నది.	ఉండవలసినది.
6	3	ఆంతకు	అంతకు
7	23	1098	1908
10	26	940	1940
15	17	హట్టుబడి	పెట్టుబడి
12	10	గల్గి	గల్గిన
16	13	తగ్గింపు	తగ్గించు
47	5	చుంటిరి	చుండిరి
67	23	కోట్ల	కోట్ల రూపాయల
68	23	టిపేపోటీ	పేటికిపోటీ
78	23	కోట	కాట
79	19	తమిళుకు	తమిళులకు
98	6	ఆందరు	అందరు
	8	తిగుటకు	తిగుగుటకు
118	8	వ్యవతిశేకం	వ్యతిశేకం
	11	విచ్చిన	నిచ్చిన్న
122	14	మనిము	మనియు
132	8	స్వవ్మత్తి	శ్వేన్మత్తి
143	10	ముఖ్య	ప్రాముఖ్య
	24	వివాహంగా	వివాంగా
134	22	పక్షా	పక్షాఃా
		తదతేం	దతం

166	26	పరనుం	పరమం
168	14	ప్రణా	ప్రాణా
170	4	లేర్పు	లేర్పడి
176	6	వక్యక	వశ్యక
177	11	వేశుండ	లేకుండ
181	8	1819	1919
184	15	పుంజపతి	పుంజీపతి
206	22	అస్పృతా	అస్పృశ్యతా
207	22	వదరి	వదలిరి
209	23	వగైరాలలను	వగైరాలను
216	16	వ్యూహా	వ్యూహా
217	20	టన్నుల	వీసెల
219	4	వారి	వారీ
220	11	కాని	కానియుద్ధఫలంగా
225	12	ఆహింసా	అహింసా
227	1	జెంది	వృద్ధిజెంది
236	18	న్యాపారా	వ్యాపారా